సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 310

శుక్రవారం 31-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'





జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో మాట్లాడుతున్న సుధామూర్తి

బాల కథా సుధ

పసితనంతో మురిసిపోదాం

ఉల్లిపాయకు అన్ని పొరలు ఎలా వచ్చాయి?
ఈ ప్రశ్న మీరు వేసుకున్నారా? సుధామూర్తి వేసుకున్నారు.
దాని మీద కథ రాసి మనవరాళ్లకు వినిపించారు కూడా.
'మీలో పసితనం ఉంటే మీ పిల్లల్లోని పసితనాన్ని కాపాడుతారు'
అంటున్నారు ఆమె.
'నా మానసిక వయసు 12 ఏళ్ల లోపే ఉంచుకుంటాను...
అలా ఉంటే పిల్లల్లా ప్రతి చిన్నదానికి సంతోషపడతాం' అన్నారామె.
గురువారం మొదలైన జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌కు
హాజరై ఆమె పిల్లల గురించి తల్లిదండ్రులకు
ఎన్నో పాఠాలు చెప్పారు. వినండి.

'టీచర్‌గా నేను పిల్లలకు 45 నిమిషాలు పాఠం చెప్తే అందులో పదిహేను నిమిషాలు ఆ పాఠానికి సంబంధించిన కథలు చెప్పే దాన్ని. లేదా ఆ సబ్జెక్ట్ చుట్టూ ఏవో కథలు చెప్పేదాన్ని. నా విద్యార్థులందరూ జీవితంలో చక్కగా సెటిల్ అయ్యారు. వారు కనిపించినప్పుడు మీకు జావా, పాస్కల్, సి ప్లస్ చెప్పాను... అవేమైనా జీవితంలో ఉపయోగపడ్డాయా అనడుగుతాను. లేదు టీచర్.. మీరు చెప్పిన కథలే ఉపయోగపడ్డాయి అంటారు. కథల వల్ల అంత ప్రభావితం అవుతారు పిల్లలు' అన్నారు సుధా మూర్తి.

జైపూర్‌లో మొదలైన జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్ తొలిరోజు ఆమె పాల్గొని 'ది చైల్డ్ విత్ ఇన్' అనే అంశం మీద మాట్లాడారు. 'ప్రపంచ దేశాల్లో పిల్లల కథలు ఒక్కో దేశంలో ఒక్కోలా ఉంటాయి. కాని మన భారతదేశంలోనే అన్ని రకాల పిల్లల కథలు దొరుకుతాయి. కాని ఇప్పుడు పిల్లలకు కథలు చెప్పడం లేదు. అమ్మమ్మ, నానమ్మలు టీవీ సీరియళ్లతో తల్లిదండ్రులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలతో బిజీగా ఉంటున్నారు. నా చిన్నప్పుడు కరెంటు లేకపోవడం వల్ల, వేరే వినోద సాధనాలు లేకపోవడం వల్ల నా ఊహాశక్తి బాగా పెరిగింది. కృష్ణుడి కథలు వింటే ఆ కథ చుట్టూ ఎన్నో ఊహలు చేసేదాన్ని. ఇప్పుడు పిల్లల్ని సోషల్ మీడియా నుంచి తప్పించలేము. అది ఊహను చంపేస్తుంది. అయితే వారికి సోషల్ మీడియాతో గడిపే సమయానికి రేషన్ విధించి కథలు వినిపించాలి' అన్నారామె.

అక్షయపాత్ర బదులు కుకర్

లండన్‌లో ఉండే తన మనుమరాలు అనుష్కకు 'ద్రౌపది–అక్షయపాత్ర' కథ చెప్తే ఆ చిన్నారి దానిని తన పద్ధతిలో తిరగేసి చెప్పడాన్ని నవ్వుల మధ్య వివరించారు సుధామూర్తి. 'మా మనవరాలికి అక్షయపాత్ర కథ చెప్పాను. మరుసటి రోజు తిరిగి చెప్పమన్నాను. అయితే నా మనుమరాలు తన పద్ధతిలో చెప్తానంది. అక్షయపాత్ర బదులు



ఇన్‌స్టాంట్ పాట్ (కుకర్)ను పెట్టింది. అయితే అమ్మమ్మ... మనం దానిని శుభ్రంగా కడక్కుండా వండితే డయారియా వస్తుంది మైండిట్ అని కూడా చెప్పింది' అన్నారు సుధామూర్తి.

'అంటే పిల్లలకి కథ చెప్తే వాళ్లకు తెలిసిన పద్ధతిలో మార్చి తమ క్రియేటివిటీని జోడిస్తారు. పిల్లలకు చిన్న విషయాలు కథలుగా మార్చి సరదా పుట్టించాలి. ఉల్లిపాయకు అన్ని పొరలు ఎందుకుంటాయి, మామిడి తియ్యగా... మిర్చి కారంగా ఎందుకు ఉంటుంది... ఇలాంటి ప్రశ్నలు అడిగి వాటికి కథ అల్లి చెప్తే ఆనందిస్తారు. నాకు తెలిసి పిల్లలకు లావుగా ఉన్న పాత్రలు, పిసినారి పాత్రలు నచ్చుతాయి. పిసినారులకు శాస్తి జరిగితే చాలా సంతోషపడతారు' అన్నారామె.

కష్టమొస్తే ఆంజనేయుడు- సంజీవని

'పిల్లలు పాజిటివ్ కథలు ఇష్టపడతారు. చెడుకు చెడు జరగాల్సిందే. యుక్తి ఇష్టపడతారు. కుండలో రాళ్లు వేసే కాకి కథ సింధు నాగరికత నుంచి ఉంది. ఎందుకు ఆ కథను కాపాడుకున్నామో ఆలోచించాలి. నా వరకు నాకు కష్టమొస్తే స్ఫూర్తినిచ్చేది ఆంజనేయుడు– సంజీవని కథ. లక్ష్మణుడి కోసం సంజీవని తేవడానికి వెళతాడు ఆంజనేయుడు. అయితే ఆ మొక్క ఏదో కనిపెట్టలేడు. అంటే ప్రాబ్లమ్‌లో పడ్డాడు. అప్పుడు ఏం చేశాడు? తన శరీరాన్ని భారీగా పెంచి మొత్తం సంజీవని పర్వతాన్నే అరచేతిలో తీసుకొచ్చాడు. మనం కూడా అలా ఉండాలి. ప్రాబ్లం వస్తే మనం దాని కంటే పెద్దవాళ్లం అయ్యి తల దించి దాని వైపు చూడాలి. దానిని చిన్నగా చేయాలే తప్ప చిన్నగా అయిపోకూడదు. కథలు సమస్యలను ఇలా సులువు చేయమని చెబుతాయి. పిల్లలకు కథలతో ఆ శక్తి ఇవ్వాలి' అన్నారు సుధామూర్తి.

పసితనం కాపాడుకోండి

'మనందరం పసిపిల్లలు ఎవరు కనిపించినా దగ్గర తీస్తాం. నవ్వుతూ కబుర్లు చెబుతాం. మరి మనల్ని ఇప్పుడెందుకు ఎవరూ అంత ప్రేమగా పలకరించి ఇష్టపడరు? అంటే ఆ బాల్య స్వభావం, కల్మషం లేని పసితనం పెద్దయ్యే కొద్దీ పోయిందని అర్థం. నేనైతే చిన్నప్పటి సుధగా ఉండటానికి ఊహల్లోకి వెళ్లిపోతాను. ఈ పెద్ద సుధకు లోకం బాగా అర్థమవుతుంది. చిన్నప్పటి సుధకైతే అందరూ అన్నీ ఇష్టమే. అలా ఉంటే మానసిక, శారీరక ఆరోగ్యం బాగుంటుంది' అని ముగించారామె.

– సాక్షి ప్రత్యేక ప్రతినిధి



వివాహ వేడుక అనగానే ఆ సందడి, ఆ వైభవం
మన కళ్ల ముందు ఇట్టే నిలుస్తుంది.
వేదికపై వధూవరులిద్దరూ ప్రత్యేక అందంతో వెలిగిపోతుంటారు.
అందుకు, వారి డ్రెస్ డిజైన్స్ ప్రధాన ఆకర్షణగా ఉంటాయి.
'ఈ వెడ్డింగ్ సీజన్‌కి కాంట్రాస్ట్ కలర్స్, కాన్సెప్ట్ థీమ్స్‌ని
తమ డ్రెస్సుల్లో ఉండేలా కోరుకుంటున్నారు' అంటూ ప్రస్తుత ట్రెండ్‌ను
పరిచయం చేస్తున్నారు హైదరాబాద్ వాసి సెలబ్రిటీ,
బ్రైడల్ అండ్ గ్రూమ్ ఫ్యాషన్ డిజైనర్ అమూల్య క్రిష్ణ కొచర్.

వివాహ వేడుకలో... కాంట్రాస్ట్... కలర్ ఫుల్!



"వెడ్డింగ్‌తో పాటు ప్రతి ఈవెంట్‌కి స్పెషల్‌గా డ్రెస్సింగ్ ఎలా ఉండాలో రీసెర్చ్ చేస్తుంటాం. ఆ డిజైన్స్ కస్టమర్ల ముందు పెడుతుంటాం. వారు ఏయే స్టైల్స్, కలర్ కాంబినేషన్స్ కోరుకుంటున్నారో దానిని బట్టి ప్రస్తుతం వేటిని ఇష్టపడుతున్నారో అర్థమైపోతుంది.

కాంట్రాస్ట్ కలర్ ట్రెండ్

కిందటేడాది వరకు వధూవరులిద్దరికీ ఒకే కలర్ డ్రెస్సింగ్ ఎంపిక ట్రెండ్‌లో ఉండేది. ఇప్పుడు కాంట్రాస్ట్ కలర్ ట్రెండ్ అయ్యింది. ఉదాహరణకు.. అబ్బాయి గోల్డెన్ కలర్ కుర్తా పైజామా దానికి కాంట్రాస్ట్‌గా అమ్మాయి లావెండర్ లేదా, రెడ్, గ్రీన్‌లో గోల్డెన్ కలర్ కాంబినేషన్ ఉండేలా ఎంచుకుంటున్నారు. అబ్బాయి సూట్‌కి తగినట్టు అమ్మాయి లెహంగా బార్డర్‌లోనో, ఎంబ్రాయిడరీలోనో చిన్న మార్పు కోరుకుంటున్నారు కానీ ఒకే కలర్‌లో కాదు. దీంతో ఇద్దరి డ్రెస్సింగ్ చాలా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ప్రతీ వెడ్డింగ్ సీజన్‌కి కలర్ కాంబినేషన్స్‌లో మార్పులు వస్తుంటాయి.

రీ యూజబుల్ కాన్సెప్ట్

పెళ్లికి చాలా ఖర్చు పెట్టి ఒక డ్రెస్‌ని డిజైన్ చేసుకుంటారు. తిరిగి దానిని మళ్లీ ఎప్పుడూ ధరించరు. ఇది ఓల్డ్ కాన్సెప్ట్. ఇప్పుడు మాత్రం పెళ్లి, సంగీత్, రిసెప్షన్ డ్రెస్సులను చిన్న చిన్న మార్పులతో మళ్లీ మళ్లీ ధరించేలా కాన్సెప్ట్‌ని ఇష్టపడుతున్నారు. దీంతో ఒక ట్రెడిషనల్ డ్రెస్‌ను వెస్ట్రన్ స్టైల్‌తో ఎన్ని విధాలుగా మార్పులు చేసి ధరించవచ్చో స్టైలింగ్ చేసి చూపిస్తాం. పెళ్లికే కాకుండా ఇతర ఫంక్షన్స్‌కు కూడా అదే డ్రెస్‌ను మళ్లీ ధరించవచ్చు. ప్రతిసారి ఆ డ్రెస్ కొత్త స్టైల్‌తో ఆకట్టుకుంటుంది.

సంప్రదాయ చేనేత-ఇంపోర్టెడ్ ఫ్యాబ్రిక్

సాధారణంగా పెళ్లికి మన చేనేతలనే ఇష్టపడతారు. వాటిలో కంచిపట్టుదే ప్రథమ స్థానం. పట్టు బ్లౌజ్‌కే కాదు చీరకూ ఎంబ్రాయిడరీని ఇష్టపడేవారున్నారు. పూర్తి సంప్రదాయబద్ధమైన చీరకట్టు అయినా డ్రేపింగ్‌లో మార్పులు ఉన్నాయి. రిసెప్షన్ ఇతర వెస్ట్రన్ స్టైల్స్‌కి మాత్రం ఇంపోర్టెడ్ ఫ్యాబ్రిక్‌కి ప్రాముఖ్యం ఇస్తున్నారు. ముఖ్యంగా ఇటలీ ఫ్యాబ్రిక్‌ని వెస్ట్రన్‌స్టైల్స్‌కి ఉపయోగిస్తున్నాం.

ఫ్యాషన్

బ్యూటీ





అమూల్య క్రిష్ణ కొచర్

మన డిజైన్స్ ఇంటర్నేషనల్ టెక్నిక్స్

పెళ్లి అనగానే మనదైన సంప్రదాయ కళ ఉట్టిపడేలా ఏనుగులు, మామిడిపిందెలు. పల్లకి.. కాన్సెప్ట్ డిజైన్స్ ఉంటాయి. ఇవి ఎప్పటికీ ఎవర్ గ్రీన్ డిజైన్స్. ఈ డిజైన్స్‌కి ఇంటర్నేషనల్ ఎంబ్రాయిడరీ టెక్నిక్స్ ఉపయోగిస్తుంటాం. వర్క్ నీటుగా, ఆకర్షణీయంగా, కోరుకున్న కాన్సెప్ట్ ఉండటంతో ఈ టెక్నిక్స్‌ను ఇష్టపడుతున్నారు" అని వివరించారు అమూల్య క్రిష్ణ కొచర్.

గోరింటా పూసిందీ..



కోన్‌తో ముచ్చటైన గోరింటాకు డిజైన్లు వేస్తున్న దివ్యాంగురాలైన ఈ యువతి పేరు చిలకమ్మ. ఈమెకు పుట్టుకతోనే రెండు చేతులు లేవు.

పదోతరగతి వరకు చదివిన ఆమె, కుటుంబానికి భారం కాకుండా తన కాళ్లపై తాను నిలబడేందుకు ఈ కళను ఎంచుకుంది. వివాహాది శుభాకార్యాలు, ఎగ్జిబిషన్లలో ఇలా కోన్ పెడుతూ జీవనం సాగిస్తోంది.

విజయవాడ వన్‌టౌన్‌లోని సితార సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో గురువారం సాయంత్రం సందర్శకులకు కోన్ పెడుతున్న దృశ్యాలు సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

ఫొటో: కందుల చక్రపాణి, సాక్షి, విజయవాడ

ఇన్‌స్టంట్ గ్లో @ హోమ్

మామూలుగా చాలా నిరాడంబరంగా ఉండేవారు సైతం ఏదైనా పార్టీ అనగానే ఇన్‌స్టంట్ గ్లో రావాలంటే ఏం చేయాలో అప్పటికప్పుడు ప్లాన్స్ చేసుకునేవారుంటారు. ఇలాంటప్పుడు కొన్ని సమస్యలూ తలెత్తవచ్చు. ముందుగా కొద్ది పాటి అవగాహనతో చర్మ సంరక్షణ పట్ల జాగ్రత్త తీసుకుంటే ఇంట్లోనే ఇన్‌స్టంట్ గ్లో పొందవచ్చు.



ఐసింగ్ ... మేకప్‌కు ముందు చర్మం బిగుతుగా, తాజాగా కనిపించడానికి ఐస్‌క్యూబ్స్‌తో మసాజ్ చేసుకుంటారు. దీంతో పోర్స్ మూసుకుపోయి, మేకప్ తాజాగా కనిపిస్తుంది. అరగంట ముందు రోజ్ వాటర్, గ్లిజరిన్ కలిపి ముఖానికి అప్లై చేస్తారు. పాలతో కూడా చర్మాన్ని మసాజ్ చేసుకోవచ్చు. పాలలో మైల్డ్ లాక్టిక్ యాసిడ్ ఉంటుంది కాబట్టి చర్మానికి హాని కలగదు.

ప్రొడక్ట్స్‌తో జాగ్రత్త... ఇన్‌స్టంట్ గ్లో కోసం కొన్ని ప్రొడక్ట్స్ వాడుతుంటారు. అయితే, సున్నితమైన చర్మం గలవారు, ఎగ్జిమా వంటి సమస్యలు ఉన్నవారు ఆ ప్రొడక్ట్స్ గురించి తెలియక వాడితే మరిన్ని కొత్త సమస్యలు తలెత్తవచ్చు. ఇంట్లో వాడే ప్రొడక్ట్స్ ఏవైనా నిపుణులు సూచనలతో వాడటం మేలు.

ఫేసియల్స్... ఇన్‌స్టంట్ గ్లో కోసం కెమికల్ పీల్, పంప్కిన్ పీల్, హైడ్రా ఫేసియల్స్... వంటివి కొంత తాజాదనాన్ని ఇస్తాయి. అయితే, వీటిని వేడుక ఉన్న రోజే కాకుండా రెండు, మూడు రోజుల ముందు నిపుణుల ఆధ్వర్యంలో ప్రయత్నించాలి. ఫేసియల్స్‌కి వాడే ప్రొడక్ట్స్ మీ చర్మతత్వానికి సరిపడతాయో లేదో ముందస్తుగా చెక్ చేసుకొని వాడటం మంచిది. లేజర్ వంటి ఇతర బ్యూటీ ట్రీట్మెంట్లు అయితే నిపుణుల ఆధ్వర్యంలో వేడుకకు కనీసం 10–15 రోజుల ముందు చేయించుకోవడం వల్ల చర్మం కాంతిమంతంగా కనిపిస్తుంది.



డాక్టర్ స్వప్నప్రియ, క్లినికల్ డెర్మటాలజిస్ట్

● నాగోబా వైభవం

ఆడపడుచులు... కొత్తకోడళ్లు

జాతర మొదలైంది

నాగోబా అంటే మహిళామణుల మహా జాతర
దేశంలో రెండో అతి పెద్ద గిరిజన జాతర 'నాగోబా' మహిళలకు పెద్ద పీట వేస్తుంది.
ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్‌లో జాతర మొదలైంది.
'ఈరోజు కోసమే' అన్నట్లుగా సంవత్సరమంతా ఎదురు చూసిన
ఇంద్రవెల్లి కొండలు, కెస్లాపూర్ పరిసరాలు పండగ కళతో వెలిగిపోతున్నాయి.
ఈ జాతరలో మహిళలది ప్రేక్షక పాత్ర కాదు. అడుగడుగునా ప్రధాన పాత్ర...



కొత్త కుండల్లో కోనేరు నుంచి వరుసక్రమంలో జలాన్ని తీసుకొస్తున్న ఆడపడుచులు



నాగోబా జాతర సందడి మొదలైంది. గిరిజనుల్లోని ఆదివాసీ మెస్రం వంశీయులకు సర్పదేవుడు ఆరాధ్య దైవం. భక్తిశ్రద్ధలతో ప్రతియేడు పుష్య అమావాస్యలో ఆ దేవుడికి మహాపూజలు అందించడం ద్వారా ఈ జాతరకు అంకురార్పణ జరుగుతుంది. ఈ మహాపూజకు ముందు, వెనకాల జరిగే తంతులలో మెస్రం వంశంలోని మహిళల పాత్రే కీలకం. ఇంటి ఆడపడుచులను అందలం ఎక్కిస్తూనే, ఆ ఇంటికి వచ్చిన కోడళ్లకు అంతే ప్రాధాన్యత ఇస్తారు. ఈ క్రతువులో వీరిద్దరి భాగస్వామ్యం మనకు కనిపిస్తుంది

ఆడపడుచులకు ప్రాధాన్యత

మెస్రం వంశీయులు తమ ఇంటి ఆడపడుచుకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తారు. మహాపూజకు ముందు కొత్త పుట్టల తయారీలో ఆడపడుచులే ముందు ఉంటారు. ముందుగా పురుషులు అందరూ కలిసి నాగోబా ప్రతిమను తీసుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటారు. మహిళలు బిందెల్లో నీళ్లు, గుల్లల్లో ఆవుపేడను తీసుకొస్తారు. ఆలయ ప్రవేశం తర్వాత అందరు కలిసి నాగోబా దర్శనం చేసుకుంటారు. ఆ తర్వాత సంప్రదాయ పూజలు మొదలుపెడతారు. ఈ ప్రక్రియలో ఆడపడుచుకు ఎంత విలువ ఇస్తారనేది మన కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. కొత్త కుండలను ఆడపడుచులకు అందజేస్తారు. ఈ కుండలను అందుకున్న ఆడపడుచులు, తమ భర్తతో కలిసి ఒక వరుసలో తలపై కుండలను మోసుకుంటూ ఆలయ ఆవరణలోని మర్రిచెట్టు దగ్గర ఉన్న కోనేరు దగ్గరకు వెళ్తారు. అక్కడ కుండల్లో నీళ్లు తీసుకొని అదే వరుసలో తిరిగి ఆలయానికి చేరుకుంటారు. ఆ తర్వాత మెస్రం అల్లుళ్లు పాత పుట్టలను తొలగిస్తారు. ఆపై ఆడపడుచులు పుట్టమట్టి, ఆవుపేడ, కోనేరు నుంచి తీసుకొచ్చిన జలంతో కలిపి కొత్త పుట్టలను తయారు చేస్తారు.



నాగోబా మహాపూజకు తరలివచ్చిన మెస్రం ఆడపడుచులు, మహిళలు

కొత్త కోడళ్లు వస్తారు

నాగోబా మహాపూజ ముగిసిన తర్వాత అర్ధ రాత్రి మరో ముఖ్యమైన ఘట్టం ఈ క్రతువులో ఆవిష్కృతం అవుతుంది. ఇంటి ఆడపడుచును ఏవిధంగా ఆరాధిస్తారో ఆ ఇంటి గడపకు వచ్చిన కోడళ్లకు కూడా అంతే విలువ ఇస్తారు అనడానికి ఈ ప్రక్రియ నిదర్శనంగా నిలుస్తుంది. నాగోబా సన్నిధికి వచ్చే కొత్త కోడళ్లు మొదట సతీ దేవతకు పూజలు చేస్తారు. తరువాత మెస్రం పెద్దల ఆశీర్వాదం తీసుకుంటారు. ఆపై నాగోబా దేవుడిని దర్శించుకుంటారు. దీన్ని మెస్రం వంశీయులు 'భేటింగ్'గా సంబోధిస్తారు. అర్ధరాత్రి మొదలయ్యే ఈ తంతు తెల్లవారుజాము వరకు జరుగుతుంది. ఈ భేటింగ్ తర్వాతనే ఆ కొత్త కోడళ్లు నాగోబా దర్శనానికి ఎప్పుడైనా వచ్చేందుకు ఆస్కారం ఏర్పడుతుంది.

ఎప్పుడు వచ్చినా కొత్తగానే..

'కొత్త పుట్టల తయారీలో ఆడపడుచులను, అల్లుళ్లను భాగస్వాములను చేస్తాం. వ్యవస్థలో మహిళలు, పురుషులకు సమప్రాధాన్యత అనేది ఈ ఘట్టం ద్వారా తెలుస్తుంది. కొత్త కోడళ్ల దేవుడి దర్శనం ద్వారా మా సంప్రదాయాలు, కట్టుబాట్లు తెలుసుకుంటారనేదే ఈ కార్యం ప్రాధాన్యత' అంటున్నాడు ఉట్నూర్‌కు చెందిన మెస్రం మనోహర్.

'నాగోబా జాతరకు ఎన్నోసార్లు వచ్చాను. విశేషం ఏమిటంటే ఎప్పుడు వచ్చినా కొత్తగా ఉంటుంది. ఎప్పుడూ ఏదో ఒక కొత్త విశేషం తెలుసుకుంటూనే ఉంటాను. నాగోబా జాతర అంటే మహిళలకు ప్రాధాన్యత ఇచ్చే మహా జాతర' అంటుంది హైదరాబాద్‌కు చెందిన గిరిజ.

'నాగోబా' చుట్టూ ఎన్నో నమ్మకాలు ఉన్నాయి. తరగని మౌఖిక కథలు ఉన్నాయి. అన్నింట్లో మహిళ మహారాణిగా, మహిమాన్వితంగా వెలిగిపోతూనే ఉంటుంది. అదే ఈ మహా జాతర ప్రత్యేకత. పవిత్రత.

– గొడిసెల కృష్ణకాంత్, సాక్షి, ఆదిలాబాద్
ఫొటోలు: చింతల అరుణ్ రెడ్డి


'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 310

శుక్రవారం 31-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పసితనంతో మురిసిపోదాం

లిటరేచర్ ఫెస్ట్‌లో పిల్లల గురించి పెద్దలకు సుధామూర్తి పాఠాలు -ఫ్యామిలీలో



కోహ్లి తెచ్చిన కిక్...

రైల్వేస్, ఢిల్లీ రంజీ క్రికెట్ మ్యాచ్‌కు పోటెత్తిన ప్రేక్షకులు -13లో



వలసదారులు గ్వాంటనామోకు..

అక్రమ వలసదారులను గ్వాంటనామో బేలో ఉన్న అమెరికా నిర్బంధ కేంద్రానికి తరలించనున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు.


వివరాలు 6లో ▸



డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ పైలట్‌గా..

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగుపెట్టిన మొట్టమొదటి భారతీయుడిగా శుభాంశు శుక్లా రికార్డులకు ఎక్కబోతున్నాడు.

వివరాలు 6లో ▸



తాత్కాలిక జడ్జీలను నియమించుకోండి

హైకోర్టుల్లో 18 లక్షలకుపైగా క్రిమినల్ కేసులు పోగుబడటంతో వాటి పరిష్కారానికి హైకోర్టులకు సుప్రీంకోర్టు అదనపు అధికారాలిచ్చింది.

వివరాలు 6లో ▸



'సీఈసీ' రాజకీయాలు చేస్తున్నారు

ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ రాజకీయాలు చేస్తున్నారని ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

తెలంగాణకు 'హిమాచల్' విద్యుత్



రాష్ట్ర విద్యుత్ సామర్థ్యాన్ని పెంపొందించడంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. గురువారం ఉప ముఖ్యమంత్రి భట్టి.. ఢిల్లీలో హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్‌సింగ్‌తో సమావేశమై రెండు జలవిద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సంబంధించి ఎంఓయూపై చర్చించారు.

- వివరాలు 2లో▶

కేంద్రం నుంచి రాష్ట్రాలకు 32 శాతమే..



కేంద్ర ప్రభుత్వ ఆదాయంలో పన్నుల వాటా నానాటికీ క్షీణిస్తూ సెస్సులు, సర్‌చార్జీల వాటా గణనీయంగా పెరిగిపోతోందని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు వ్యాఖ్యానించారు. దీన్ని కేంద్రం పునఃపరిశీలించి మరింత పారదర్శకత తీసుకురావాలన్నారు.

- వివరాలు 2లో▶

భుజంగరావు, రాధాకిషన్ రావుకు బెయిల్



రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో నిందితులు మాజీ అడిషనల్ ఎస్పీ భుజంగరావు, మాజీ డీసీపీ రాధాకిషన్‌రావులకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు గురువారం తీర్పు వెలువరించింది.

- వివరాలు 5లో▶

ఆడపడుచులు.. కొత్త కోడళ్లు



దేశంలో రెండో అతిపెద్ద గిరిజన జాతర 'నాగోబా' మహిళలకు పెద్దపీట వేస్తుంది. ఈ జాతరలో మహిళలది ప్రేక్షకపాత్ర కాదు.. అడుగడుగునా ప్రధాన పాత్ర.

- వివరాలు ఫ్యామిలీలో

స్థానిక పోరుకు రెడీ!

ఎన్నికలకు రంగం సిద్ధం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

వచ్చే నెల 2న కులగణన నివేదిక సబ్ కమిటీ చేతికి..

దాన్ని పరిశీలించి 5న జరిగే కేబినెట్ భేటీకి అందజేయనున్న సబ్ కమిటీ

- కేబినెట్‌లో ఈ అంశంపై చర్చించి రిజర్వేషన్ల పెంపుపై నిర్ణయం తీసుకునే చాన్స్
- 6 లేదా 7న అసెంబ్లీ ప్రత్యేక భేటీ నిర్వహించే యోచన
- బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ తీర్మానించి కేంద్రానికి పంపేందుకు ఏర్పాట్లు
- ఎంపీటీసీ స్థానాల డీలిమిటేషన్ కోసం సర్కారు ఆదేశాలు
- ఒక్క స్థానంలో 3 వేల నుంచి 4 వేల మంది జనాభా ఉండేలా పునర్విభజన
- ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఎస్‌ఈసీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఫిబ్రవరి నెలాఖరులోగా లేదా మార్చి మూడో వారంలో ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు తెలిపాయి. మార్చి మొదటివారంలో ఇంటర్ పరీక్షలు, మార్చి 21 నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. దీనితో వచ్చే నెల చివర్లోగానీ, ఆ రెండు పరీక్షల మధ్య సమయంలో (మార్చి 17, 18 నాటికి)గానీ ఎన్నికల ప్రక్రియ ముగించవచ్చని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. వచ్చే నెల 5న కేబినెట్ భేటీ మిగతా 3వ పేజీలో ▶

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో పెంపు సాధ్యమేనా?

బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు చర్యలు చేపట్టింది. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు అన్నీ కలిపి 50శాతం మించరాదని గతంలోనే సుప్రీంకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో.. బీసీ రిజర్వేషన్ల పెంపు సాధ్యమేనా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నేరుగా 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించడం కాకుండా... ఎక్కడికక్కడ పంచాయతీలు, మండలాలు, జిల్లా పరిషత్‌ల పరిధిలోని జనాభా ప్రామాణికంగా వేర్వేరుగా రిజర్వేషన్లు అమలు చేసే యోచన కూడా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. అంటే ఎస్సీ, ఎస్టీల జనాభా అధికంగా ఉన్నచోట బీసీలకు తక్కువగా, బీసీల జనాభా ఎక్కువగా ఉన్నచోట 42 శాతం దాకా రిజర్వేషన్లు ఇచ్చేలా ప్రయత్నం చేయవచ్చని అంటున్నారు. కానీ ఇది ఆచరణ సాధ్యమేనా అన్న సందేహాలు వస్తున్నాయి. మరోవైపు కాంగ్రెస్ పార్టీపరంగా స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం నుంచి 50 శాతం దాకా టికెట్లు ఇవ్వవచ్చనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.



వచ్చే నెల 5 తర్వాత 'స్థానికం'పై స్పష్టత

- కులగణన, రిజర్వేషన్ల పెంపుపై చర్చ తర్వాత నిర్ణయం
- మీడియా చిట్‌చాట్‌లో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్

3లో



'స్థానిక' ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారు?: హైకోర్టు

- వివరాలు 3లో

పోటోమాక్ నదిలో శకలాల కోసం గాలిస్తున్న దృశ్యం



అమెరికా రాజధాని వాషింగ్టన్ డి.సి.లో ఘోర ప్రమాదం

గగనతలంలో మృత్యుకేళి

67 మంది మృతి

28 మంది మృతదేహాల వెలికితీత

ఆర్మీ హెలికాప్టర్‌ను ఢీకొట్టిన ప్రయాణికుల విమానం

పాటోమాక్ నదిలో కూలిన రెండు లోహ విహంగాలు

- గల్లంతైన వారంతా దుర్మరణం పాలై ఉంటారని చెబుతున్న అధికారులు
- ప్రయాణికుల్లో పలువురు ఫిగర్ స్కేటింగ్ క్రీడాకారులు, కోచ్‌లు

- వివరాలు 6లో▶

ప్రొఫెసర్ల రిటైర్మెంట్ వయస్సు 65

- పదవీ విరమణ వయోపరిమితి 60 నుంచి 65 ఏళ్లకు పెంపు
- ఉత్తర్వులు జారీ

14లో

సకల హంగులతో.. ఉస్మానయా ఆస్పత్రి



ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవనం నమూనా

26.30 ఎకరాల్లో గోషామహల్ స్టేడియంలో కొత్త ఆసుపత్రి నిర్మాణం

2,000 పడకల సామర్థ్యం

30 మొత్తం విభాగాలు

- అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించేలా డిజైన్లు
- భవన నిర్మాణానికి నేడు సీఎం రేవంత్ శంకుస్థాపన

2లో



నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు

ఒకటో తేదీన సాధారణ బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న విత్త మంత్రి నిర్మల

- వక్ఫ్ సవరణ బిల్లు సహా 16 బిల్లులు సభలో ప్రవేశపెట్టనున్న కేంద్రం
- అఖిలపక్ష భేటీలో అన్ని పార్టీల సహకారం కోరిన కేంద్రం

6లో



'మండలి' పోటీపై నేడోరేపో బీఆర్‌ఎస్ స్పష్టత

కేసీఆర్‌తో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ

- పట్టభద్రుల కోటాలో పోటీ, ఆశావహుల వినతిపై చర్చ
- ఎస్సీ వర్గీకరణ పోరాట వ్యూహంపై మంతనాలు

3లో

ఇదండీ జగత్



మళ్లీ బడ్జెట్‌లో రేట్లు పెరిగితే కష్టమని ఇప్పుడే అన్నీ కొనుక్కొచ్చా!

రుణబంధం పెరుగుతోంది

ప్రజల జీవన ప్రమాణాల మెరుగుకు బ్యాంకింగ్ రంగం తోడ్పాటు..

నూగూరి మహేందర్



ఒకప్పుడు చేబదులు కావాలంటే బంధువునో, స్నేహితులనో అడగాల్సిందే. లేదంటే తెలిసినవారి నుంచి వడ్డీకి అప్పు తీసుకోవాల్సిందే. వ్యక్తులు, బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిందే. ఇప్పుడు ఒకరి ముందు నిలబడాల్సిన అవసరం లేదు. జస్ట్ ఛాయ్ తాగేలోపు అప్పు పుడుతోంది. డబ్బులు పడ్డాయహో అంటూ ఫోన్ మెసేజ్ మోగుతుంది. ఏదైనా వస్తువు కొనాలన్నా, పేమెంట్స్ చేయాలన్నా ఖాతాలో, జేబులో డబ్బులు ఉండక్కర్లేదు. క్రెడిట్ కార్డు ఉంటే చాలు. అంతే కాదు యూపీఐ యాప్‌ల ద్వారా చేసే మిగతా 2వ పేజీలో ▶

- అవసరానికి సులువుగా అందుతున్న నగదు
- జోరుగా క్రెడిట్ కార్డుల వినియోగం
- రుణాల చెల్లింపును సులభం చేస్తున్న ఈఎంఐలు

‘రుణ’బంధం పెరుగుతోంది

▶ మొదటి పేజీ తరువాయి

లావాదేవీలను బట్టి ఇన్‌స్టంట్ రుణం ఇచ్చేందుకూ బ్యాంకులు క్యూ కడుతున్నాయి. సిబిల్ స్కోర్ లేకున్నా పర్వాలేదంటున్నాయి. అప్పు సరే.. తీర్చేదెలా అన్న సందేహమూ అక్కర్లేదు. సింపుల్‌గా సులభ వాయిదాల్లో (ఈఎంఐ) తీర్చేసే వెసులుబాటూ కల్పిస్తున్నాయి. కొన్నేళ్లుగా భారత్‌లో క్రెడిట్ కార్డులు, రుణాల వృద్ధి చూస్తుంటే ఆశ్చర్యం వేయక మానదు. ఈ రుణాల జోరు అభివృద్ధికి సూచికగా నిపుణులు చెబుతున్నారు.


మెరుగైన జీవితం కోసం..: దిగువ-మధ్యతరగతి వినియోగదారులలో రుణాలు తీసుకునే విధానంలో గణనీయ మార్పు వచ్చింది. గతంలో మనుగడ కోసమైతే ఇప్పుడు ఆకాంక్షలు, వ్యాపారం, దీర్ఘకాలిక పెట్టుబడుల కోసం రుణాలు తీసుకుంటున్నారు. ఈ మార్పు దేశంలో అభివృద్ధి చెందుతున్న సామాజిక-ఆర్థిక వ్యవస్థను ప్రతిబింబిస్తోందని బ్యాంకింగ్ రంగ సంస్థలు అంటున్నాయి. కస్టమర్లు తమ జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవడంపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నాయని చెబుతున్నాయి. రుణ లభ్యత, డిజిటల్ ఆధారిత బ్యాంకింగ్ మారుమూల పల్లెలకూ చొచ్చుకుపోవడం లోన్ పోర్ట్‌ఫోలియో పెరుగుదలకు దోహదం చేస్తోంది.

నడిపిస్తున్న ధోరణులు..: కోవిడ్-19 మహమ్మారి రాక షాపింగ్ తీరుతెన్నులను మార్చేసింది. కన్సూమర్ ఫైనాన్స్ రంగంలో ఉన్న హోమ్ క్రెడిట్ అధ్యయనం ప్రకారం.. ఆన్‌లైన్ షాపింగ్ వాటా 2021లో 69% ఉంటే.. 2023లో ఇది 48%కి, 2024 నాటికి 53%కి చేరింది. మహిళా కస్టమర్లలో 60%, మిలీనియల్స్ 59%, జనరేషన్ జెడ్ 58%, మెట్రోలు, టైర్-2 నగరాల్లో 56% మంది ఆన్‌లైన్ ట్రెండ్‌ను నడిపిస్తున్నారు. యాప్-ఆధారిత బ్యాంకింగ్‌కు మిలీనియల్స్‌లో 69% శాతం పై అంటున్నారు. జెన్ జెడ్ 65%, జెన్ ఎక్స్‌లో 58% యాప్ బేస్డ్ బ్యాంకింగ్ కోరుకుంటున్నారు. దిగువ-మధ్యతరగతి రుణగ్రహీతలలో 43% మందికి ఈఎంఐ కార్డులు అత్యంత ప్రజాదరణ పొందిన క్రెడిట్ సాధనంగా మారాయి. క్రెడిట్ కార్డ్‌లను 24%, డిజిటల్ లెండింగ్ యాప్‌లను 12% మంది ఎంచుకుంటున్నారు.

> **రుణాల వృద్ధి అభివృద్ధికి సూచిక**
>
> రుణాలు పెరుగుతుండటం అభివృద్ధికి సూచిక. బ్యాంకుల మద్దతు ఉంటేనే అభివృద్ధి సాధ్యం. బ్యాంకింగ్ లేకుండా వ్యవస్థ లేదు. వ్యవస్థ తదుపరి స్థాయికి చేరితేనే ప్రభుత్వానికి పన్నుల ఆదాయం పెరుగుతుంది. బ్యాంకులు లాభాల్లో ఉన్నాయంటే అందుకు కారణం అర్హతగల వారికి రుణాలు జారీ చేయడమే. రుణ మార్కెట్లో మొండి బాకీలు సహజం. అయితే సానుకూల ధోరణితోనే రికవరీ చేయాలి. ఆర్థిక స్థోమత చూసి క్రెడిట్ కార్డులు ఇచ్చినంత వరకు ఎటువంటి సమస్య లేదు.
>
> - వి.ఎస్.రాంబాబు, జాతీయ కార్యదర్శి, ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్

వృద్ధిలోనూ ‘క్రెడిట్’ వాటికే..: 2024 డిసెంబర్ నాటికి దేశంలో జారీ అయిన క్రెడిట్ కార్డుల సంఖ్య 10.8 కోట్లు.. రిజర్వ్ బ్యాంక్ గణాంకాల ప్రకారం ఐదేళ్లలో క్రెడిట్ కార్డులు దాదాపు రెండింతలు అయ్యాయి. డెబిట్ కార్డులు ఐదేళ్లలో 80.53 కోట్ల నుంచి 2024 డిసెంబర్ నాటికి 99.09 కోట్లకు చేరాయి. ఏడాదిలో క్రెడిట్ కార్డుల వృద్ధి 10.31 శాతం ఉంటే డెబిట్ కార్డుల విషయంలో ఇది 3.13 శాతమే. క్రెడిట్ కార్డులతో జరిపిన చెల్లింపులు 2024 డిసెంబర్‌లో రూ.1,88,086 కోట్లుగా నమోదయ్యాయి. 2023 డిసెంబర్‌తో పోలిస్తే ఇది 13.9 శాతం ఎక్కువ. 2024 డిసెంబర్‌లో కార్డులతో చేసిన మొత్తం చెల్లింపుల విలువలో క్రెడిట్ కార్డుల వాటా 82.22 శాతం ఉండటం గమనార్హం. 2023 డిసెంబర్‌లో ఇది 77.5 శాతం. క్రెడిట్ కార్డుల విభాగంలో మొత్తం పోర్ట్‌ఫోలియోలో ప్రైవేటు బ్యాంకుల వాటానే 69.8 శాతంగా ఉంది. క్రెడిట్ కార్డు వినియోగదారులు 2024 మార్చి నాటికి చెల్లించాల్సిన మొత్తం 27.7 శాతం పెరిగి రూ.3 లక్షల కోట్లకు చేరింది.

దేశంలో వివిధ రుణాల తీరు.. (రూ.లక్షల కోట్లలో)



దేశంలో క్రెడిట్, డెబిట్ కార్డుల సంఖ్య (కోట్లలో)

కార్డు రకం	2023 డిసెంబర్	2024 డిసెంబర్	వృద్ధి శాతం
క్రెడిట్ కార్డులు	9.79	10.80	10.31
డెబిట్ కార్డులు	96.08	99.09	3.13
మొత్తం కార్డులు	105.87	109.90	3.8

2023 డిసెంబర్‌తో పోలిస్తే 2024 డిసెంబర్‌లో లావాదేవీల విలువ, సంఖ్య

అంశం	విలువ (రూ.కోట్లలో)	వృద్ధి శాతం	సంఖ్య (కోట్లలో)	వృద్ధిశాతం
క్రెడిట్	1,88,086	12.9	43.31	34.7
డెబిట్	40,671	(15)	12.83	(27)
మొత్తం కార్డులు	2,28,757	7.36	56.14	12.66

వినియోగ రుణాలు పెరిగిన తీరు (రూ.లక్షల కోట్లలో)

రుణం తరహా	2024 మార్చినాటికి	వృద్ధి శాతం	2023-24లో నమోదైనవి
హోమ్	36.2	7.9	10.3
పర్సనల్	13.5	25.6	9.0
కార్లు	7.1	20	3.3
టూవీలర్స్	1.4	33.6	0.97
కన్సూమర్ డ్యూరబుల్స్	0.7	34.1	1.4

2024 మార్చి నాటికి రుణాల్లో బ్యాంకుల వాటా

లోన్	ప్రభుత్వ బ్యాంకులు	ప్రైవేట్ బ్యాంకులు	ఎన్‌బీఎఫ్‌సీలు
పర్సనల్ లోన్స్	38.3	34	21.9
అన్‌సెక్యూర్డ్ బిజినెస్ లోన్స్	46.9	15.6	23.7
హోమ్ లోన్స్	40.0	34.5	19.4
టూవీలర్	1.0	27.7	68.6
కార్లు	36.3	33.6	26.5
కన్సూమర్ డ్యూరబుల్స్	0.0	26.8	73.2

పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా..

వ్యాపార రుణాలు
2020లో 5 శాతమైతే.. 2024లో 21% ఎగిశాయి

వాహన రుణాలు
వ్యక్తిగత వాహనాల వినియోగం బాగా పెరుగుతోంది. ఈఎంఐలతో వాహనాలను కొనుగోలు చేసే వారే ఎక్కువ

బంగారంపై రుణం
పెట్టుబడికే కాదు అత్యవసర సమయాల్లో ఆదుకునే సాధనంగా పుత్తడి నిలుస్తోంది. 2024 మార్చి నాటికి బంగారంపై రుణాలు రూ.7.1 లక్షల కోట్లుగా నమోదయ్యాయి

కన్సూమర్ డ్యూరబుల్స్
స్మార్ట్‌ఫోన్స్, గృహోపకరణాల కోసం తీసుకునే రుణాలు 2024లో 37% పెరిగాయి

గృహ రుణాలు
ఈ రుణాలు 2022లో 9% పెరిగితే.. 2024లో 15% దూసుకెళ్లాయి

వివాహాల కోసం రుణాలు
ఇవి 2021లో 3%, 2024లో 5% వృద్ధి చెందాయి

అత్యవసర వైద్యం
ఈ రుణాల వృద్ధి 2020లో 7% నుంచి 2024లో 3%కి తగ్గింది. ఆర్థిక ప్రణాళిక, బీమా పట్ల అవగాహన, అందుబాటు వ్యయాల్లో ఆరోగ్య సంరక్షణను ఇది సూచిస్తోంది

విద్యా రుణాలు
2022 నుంచి 2024 వరకు 4% వృద్ధి కొనసాగింది. పిల్లల విద్యకు ఉన్న నిరంతర ప్రాముఖ్యతను ఇది నొక్కి చెబుతోంది

క్లుప్తంగా...

తెలంగాణ పట్టణ నెలవారీ తలసరి ఖర్చు రూ.8,978

గృహ వినియోగ వ్యయ సర్వే 2023-24లో వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో గ్రామీణ ప్రాంతం కంటే పట్టణ ప్రాంతంలో నెలవారీ తలసరి వినియోగ ఖర్చు ఎక్కువగా ఉన్నట్లు తాజా అధ్యయనంలో వెల్లడైంది. గృహ వినియోగ వ్యయ సర్వే ప్రకారం 2023-24లో తెలంగాణ పట్టణ నెలవారీ తలసరి వినియోగ ఖర్చు రూ. 8,978గా నమోదైంది. మరోవైపు రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఈ ఖర్చుగా కేవలం రూ. 5,435గా ఉంది. అదే సమయంలో ఏపీలో పట్టణ నెలవారీ గృహ తలసరి వినియోగ ఖర్చు రూ. 7,182గా ఉండగా... గ్రామీణ ప్రాంతంలో ఎంపీసీఈ రూ.5,327గా ఉందని గృహ వినియోగ వ్యయ సర్వే 2023-24లో వెల్లడించింది. వినియోగ ఖర్చుల్లో గ్రామీణులు 47%, పట్టణవాసులు 40% ఆహారానికి కేటాయిస్తున్నట్లు సర్వే తెలిపింది. మరోవైపు దేశంలో గ్రామీణ-పట్టణ నెలవారీ తలసరి వినియోగ ఖర్చు అసమానత కేరళలో అత్యల్పంగా 18% ఉండగా జార్ఖండ్‌లో అత్యధికంగా 89% ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. ఈ సర్వే ప్రకారం 2023-24లో గ్రామీణ-పట్టణ వినియోగ వ్యత్యాసం తగ్గుతుండగా మొత్తం గృహ వ్యయం మాత్రం అన్ని విభాగాల్లో పెరుగుతోంది.

గాంధేయవాదం స్ఫూర్తి కావాలి

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్

సాక్షి, హైదరాబాద్: గాంధీ వర్ధంతి సందర్భంగా ఏఐసీసీ ఆదేశాల మేరకు.. గాంధీ సిద్ధాంతాలు, అహింస పద్ధతులను దేశవ్యాప్తంగా తీసుకువెళ్లేందుకు గురువారం టీపీసీసీ చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి బొగ జగదీశ్ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ బ్రోచర్ విడుదల చేశారు. గాంధేయవాదాన్ని నేటితరం యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ కోరారు.

బంజారా గిరిజనులకు మంత్రివర్గంలో చోటివ్వాలి

ఆల్ ఇండియా బంజారా సేవాసంఘ్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర జనాభాలో 7 శాతం ఉన్న బంజారా గిరిజనులకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని.. ఆల్ ఇండియా బంజారా సేవాసంఘ్ డిమాండ్ చేసింది. ఆల్ ఇండియా బంజారా సేవాసంఘ్ 72వ సంస్థాగత దినోత్సవం గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం రాజ్యసభ, ఎమ్మెల్సీ సీట్లు, నామినేటెడ్ పదవుల్లో లంబాడీలకు పదవులు కేటాయించాలని కోరారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మైదాన ప్రాంత గిరిజనులకు ఎక్కువ సీట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంట్లోంచి సీఎం సమీక్షిస్తే తప్పేంటి?

మీడియా కమిటీ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి తన ప్యాలెస్ నుంచి పాలన సాగిస్తూ.. సమీక్షలు నిర్వహిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించడం విడ్డూరమని మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆయన గురువారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి తన నివాసం నుంచి సమీక్ష చేస్తే తప్పేమిటని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ మాట్లాడుతూ.. సీఎం ఎక్కడ కూర్చుంటే.. అదే సచివాలయం అన్న వ్యాఖ్యల్ని హరీశ్ గుర్తుకు తెచ్చుకోవాలని హితవు పలికారు.

సకల హంగులతో ఉస్మానయా

26.30 ఎకరాల్లో కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం

- పూర్తిగా అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించేలా డిజైన్లు
- ఆసుపత్రి భవనానికి నేడు సీఎం రేవంత్ శంకుస్థాపన



> **కొత్త ఉస్మానియా ఆసుపత్రి సంబంధిత వివరాలు..**
>
> కేటాయించిన భూమి: 26.30 ఎకరాలు
>
> మొత్తం బ్లాకులు: 8
>
> ప్రతిపాదిత నిర్మాణ విస్తీర్ణం: 32 లక్షల చదరపు అడుగులు
>
> పడకల సామర్థ్యం: 2000
>
> మొత్తం విభాగాలు: 30
>
> ఓపీ సేవలు: గ్రౌండ్, ఫస్ట్‌ఫ్లోర్
>
> ఆడిటోరియం: 750 సీట్ల సామర్థ్యం
>
> అవయవ మార్పిడి కేంద్రాలు: మూత్రపిండాలు, కాలేయం, చర్మం

సాక్షి, హైదరాబాద్: కొత్త ఉస్మానియా ఆసుపత్రిని పూర్తిగా అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు వీలుగా డిజైన్లు సిద్ధం చేశారు. మొత్తం 2 వేల పడకలతో గోషామహల్ స్టేడియంలో ఏర్పాటు కానున్న ఈ ఆసుపత్రి భవనానికి శుక్రవారం ఉదయం 11.45 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ భవన నిర్మాణం పూర్తయితే ఇప్పటివరకు శిథిలావస్థకు చేరి తరచూ పెచ్చులూడుతున్న పురాతన భవనంలో చికిత్స పొందుతున్న రోగులకు మెరుగైన వైద్యసేవలు అందేందుకు అవకాశం ఏర్పడుతుంది.

మల్టీ లెవల్ పార్కింగ్

మొత్తం 26.30 ఎకరాలకు గాను 15.84 ఎకరాల్లో ‘ఏ’బ్లాకును నిర్మించనున్నారు. అదే విధంగా 7.81 ఎకరాల్లో ‘బీ’బ్లాకు ను నిర్మించనున్నారు. 0.74 ఎకరాల్లో ‘సీ’బ్లాకు, 0.64 ఎకరాల్లో ‘డీ’బ్లాక్, 0.22 ఎకరాల్లో ‘ఈ’బ్లాకును నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. మిగిలిన స్థలంలో మిగతా బ్లాకులు నిర్మిస్తారు. ఇన్‌పేషంట్, అవుట్ పేషంట్ సర్వీసులతో అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, పోస్టు ఆపరేటివ్ వార్డులు ఏర్పాటు చేయనున్నారు. దేశంలోనే అతిపెద్ద మల్టీ లెవల్ పార్కింగ్ సౌకర్యంతోపాటు లాండ్ స్కేపింగ్, గార్డెన్లతో ఆసుపత్రిలో ఆహ్లాదకర వాతావరణం నెలకొననుంది.

సహాయకులకు ధర్మశాల ఉచిత భోజనం

ఓపీ, ఐపీ సేవలతో పాటు క్లిష్టమైన మూత్రపిండాలు, కాలేయం, స్కిన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ యూనిట్లు కూడా ఏర్పాటు కానున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మార్చురీ, ఒకే గొడుగు కింద అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించేలా అత్యాధునిక డయాగ్నొస్టిక్స్ సెంటర్ ఏర్పాటు కానుంది. ఏకకాలంలో 3000-5000 మంది ఒకేచోట కూర్చొనే సామర్థ్యంతో కూడిన వెయిటింగ్ హాల్, నర్సింగ్, ఫిజియోథెరపీ, దంత వైద్య కళాశాల కూడా ఇదే ఆవరణలో ఏర్పాటు చేయనున్నారు. మెడికల్ స్టూడెంట్స్ కోసం ప్రత్యేక వసతి గృహంతో పాటు రోగుల సహాయకులకు ఉచిత భోజనం సరఫరా చేసే ధర్మశాల కూడా ఇక్కడ ఏర్పాటు కానుంది. ఫైర్ స్టేషన్, పోలీసు అవుట్ పోస్టు, ఫ్యాకల్టీ రెసిడెన్సీ సహా బోయ్స్, గర్ల్స్ హాస్టళ్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ కొత్త భవన నిర్మాణంతో రోగుల కష్టాలు పూర్తిగా తీరనున్నాయని తెలంగాణ వైద్యుల సంఘం ఉస్మానియా యూనిట్ ప్రకటించింది. ఈ మేరకు డాక్టర్ బొంగు రమేష్ నేతృత్వంలోని వైద్య బృందం గురువారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి కృతజ్ఞతలు తెలిపింది.

వ్యతిరేకిస్తున్న స్థానికులు!

నిజానికి పురాతన భవనం కూల్చాల్సిన అవసరం లేకుండా ప్రస్తుత ప్రాంగణంలోనే మరో కొత్త భవనం నిర్మించేందుకు అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. కులీకుతుబ్‌షా భవనం నుంచి ధోబీఘాట్ వరకు 8 ఎకరాల విస్తీర్ణం అందుబాటులో ఉందని, ఇక్కడ రెండు భారీ టవర్లు నిర్మించవచ్చని అంటున్నారు. ఇందుకు భిన్నంగా చుట్టూ ప్లైవుడ్ గోదాములు, ఇరుకైన రోడ్లతో భారీ ట్రాఫిక్ రద్దీ ఉండే ప్రాంతంలో ఉస్మానియా కొత్త భవనం నిర్మించడం వల్ల భవిష్యత్తులో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యే అవకా శం లేకపోలేదని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ ఆస్పత్రి నిర్మాణాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. హైకోర్టుకు ప్రభుత్వం రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 104 ఎకరాలు కేటాయించడాన్ని ప్రస్తావిస్తూ.. భవిష్యత్తులో కోర్టు రాజేంద్రనగర్‌కు తరలి వెళ్లే అవకాశం ఉందని అంటున్నారు. అప్పుడు మూసీపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించి ఈ రెండు వైపులా ఉన్న ఈ రెండు చారిత్రక భవనాలను అనుసంధానించడం వల్ల డబ్బు కూడా ఆదా అవుతుందని చెబుతున్నారు.

కేంద్రం నుంచి రాష్ట్రాలకు 32 శాతమే..

కేంద్ర పన్నుల్లోనే రాష్ట్రాలకు వాటా.. సెస్‌లు, సర్‌చార్జీల్లో ఉండదు

- కేంద్ర ఆదాయంలో సెస్‌ల వాటా పెరిగింది.. పన్నుల ఆదాయం తగ్గింది
- దీనిపై కేంద్రం పునఃసమీక్ష చేయాలి.. ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ ఆదాయంలో పన్నుల వాటా నానాటికి క్షీణిస్తూ సెస్సులు, సర్‌చార్జీల వాటా గణనీయంగా పెరిగిపోతోందని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు వ్యాఖ్యానించారు. దీనిపై కేంద్రం పునఃపరిశీలన చేసి మరింత పారదర్శకత తీసుకురావాల్సిన అవసరముందన్నారు. గురువారం ఆయన సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్)లో దివంగత ఐఏఎస్ అధికారి బీపీఆర్ విఠల్ స్మారక ఉపన్యాసం ఇచ్చారు. కేంద్ర పన్నుల్లోనే రాష్ట్రాలకు వాటా ఉంటుందని, సెస్‌లు, సర్‌చార్జీల్లో ఉండదన్నారు. ‘కేంద్రానికి 100 శాతం ఆదాయం పన్నుల ద్వారా వస్తే ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు 60 శాతం ఉంచుకుని మిగిలిన 40శాతాన్ని రాష్ట్రాలకు పంపిణీ చేయాలి. కేంద్రం ఆదాయాన్ని 80 శాతం పన్నులు, 20 శాతం సర్‌చార్జీలుగా విభజించి వసూలు చేస్తుండటంతో, ఆ 80శాతం పన్నుల్లో 60 శాతం వాటా కింద దానికి 48 శాతం వస్తుంది. దీనికి 20 శాతం సర్‌చార్జీలు, సెస్సుల ఆదాయం తోడైతే మొత్తం 68 శాతం ఆదాయం కేంద్రానికే వెళ్తుంది. తుదకు రాష్ట్రాలకు 32 శాతం వాటానే లభిస్తుంది’ అని అన్నారు. దేశం సహకార సమాఖ్య నుంచి ఘర్షణాత్మక సమాఖ్యకు పరిణామం చెందిందని సుబ్బారావు అభిప్రాయపడ్డారు. రాజకీయంగా రాష్ట్రాలు బలపడటంతో ఆర్థిక వ్యవస్థపై వాటి ప్రభావం పెరగగా, కేంద్రానిది తగ్గిందన్నారు. కేంద్ర పన్నుల్లో అధిక వాటా కోసం అధిక సంతానాన్ని కనాలని ఏపీ, తమిళనాడు సీఎంలు చంద్రబాబు, స్టాలిన్ చేసిన వ్యాఖ్యలతో విభేదించారు.

ఉచిత హామీలపై కోడ్ తేవాలి

ఉచితాలపై అత్యవసరంగా ప్రవర్తన నియమావళి రూపొందించాల్సిన అవసరముందని సుబ్బారావు చెప్పారు. ప్రజాకర్షక పథకాల కోసం పార్టీలు పోటీపడి ఉచిత హామీలిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పులు తెచ్చి ఉచితాలు ఇవ్వడం ఆమోదయోగ్యం కాదని, దీంతో రుణాల భారం పెరిగిపోతోందన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడినప్పుడు 2014-15లో రాష్ట్ర ఆదాయ వనరుల్లో 25శాతం ఉన్న కేంద్ర పన్నుల వాటా 2023-24 నాటికి 15శాతానికి పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి వెళ్తున్న ఆదాయంతో పోలిస్తే కేంద్రం నుంచి రాష్ట్రానికి వస్తున్న ఆదాయం ఏటేటా క్షీణిస్తోందన్నారు.

టీపీవోఏ ఎన్నికలపై 5 వారాల్లో నిర్ణయం తీసుకోండి

డీజీపీని ఆదేశించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పోలీస్ అధికారుల అసోసియేషన్ (టీపీవోఏ) ఎన్నికలపై 5 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని డీజీపీని హైకోర్టు ఆదేశించింది. 2016లో ఇదే హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయాలంటూ 2023 మే 10న పిటిషనర్ జనార్దన్ ఇచ్చిన వినతిపత్రాన్ని పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణ ఏప్రిల్ 1కి వాయిదా వేసింది. గత తీర్పును అమలు చేయడం లేదని, జీవో 113ని పాటించడం లేదంటూ సంగారెడ్డి జిల్లాకు చెందిన జనార్దన్ ఈ నెల 27న పిటిషన్ దాఖలు చేశారు. వెంటనే ఎన్నికలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఎన్నికల నిర్వహణపై 5 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశిస్తూ విచారణ వాయిదా వేశారు.

‘టెన్త్ విద్యార్థులకు లాంగ్వేజ్ అభ్యసన దీపికలు ఇవ్వాలి’

సాక్షి, హైదరాబాద్: టెన్త్ విద్యార్థులకు లాంగ్వేజ్ సబ్జెక్టులకు అభ్యాస దీపికలు అందించాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఆర్.రాజగంగారెడ్డి కోరారు. పాఠశాల విద్య డైరెక్టర్ నర్సింహారెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. నాన్-లాంగ్వేజ్ సబ్జెక్టులకు అభ్యాస దీపికలు ఇస్తున్నారని, లాంగ్వేజ్ సబ్జెక్టులకు ఇస్తే మెరుగైన అభ్యసన ఉంటుందని తెలిపారు.

మహాత్ముడికి గవర్నర్, సీఎం నివాళి



బాపూ ఘాట్‌లో గాంధీజీకి నివాళులర్పిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, తుమ్మల, పొన్నం, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు

లంగర్‌హౌస్ (హైదరాబాద్): జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. గురువారం లంగర్‌హౌస్‌లోని బాపూ ఘాట్ వద్ద సమాధిపై గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం బాపూ ధ్యాన మందిరానికి వెళ్లి అక్కడ నిర్వహించిన సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్, సీఎస్ శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాహకులపై మండిపడ్డ సీఎం: గాంధీ వర్ధంతి సందర్భంగా ప్రతి సంవత్సరం ఉదయం సరిగ్గా 11 గంటలకు దేశవ్యాప్తంగా సామూహిక మౌనం పాటించాలని ఐదు సంవత్సరాల క్రితం ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ప్రతి సంవత్సరం కొనసాగుతున్న ఈ ఆనవాయితీని, బాపూఘాట్‌లో జరిగే కార్యక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అధికారులు వివరించలేదు. దీంతో బాపూ విగ్రహం వద్ద సమయానికి 3 నిమిషాల ముందే అంటే 10.57కి కార్యక్రమం ముగించుకొని ముఖ్యమంత్రి అక్కడినుంచి బయల్దేరేందుకు ముందుకు వెళ్లారు. ఆ సమయంలో మైక్‌లో అధికారులు సామూహిక మౌనం పాటించాలని చెప్పారు. దీంతో గాంధీ విగ్రహం వద్ద నుంచి వెళ్లిపోయాక ఈ విషయం చెపుతారా? అంటూ ముఖ్యమంత్రి మండిపడ్డారు.

తెలంగాణకు ‘హిమాచల్’ విద్యుత్

> హిమాచల్‌ప్రదేశ్‌లో రెండు జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణంపై రాష్ట్రం చర్చలు
>
> ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో డిప్యూటీ సీఎం భట్టి సమావేశం
>
> త్వరలో ‘బూట్’ విధానంలో ఎంఓయూ




భట్టి విక్రమార్కకు హిమాచల్ సంప్రదాయ టోపీని అలంకరిస్తున్న సీఎం సుఖ్వీందర్‌సింగ్

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర విద్యుత్ సామర్థ్యాన్ని పెంపొందించడంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచనలతో రాష్ట్ర అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం బూట్ (బిల్డ్ ఓన్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్) విధానంలో 22 హైడ్రో ఎలక్ట్రికల్ (జలవిద్యుత్) ప్రాజెక్టుల ఏర్పాటుపై ప్రతిపాదనలు ఆహ్వానించగా.. రాష్ట్ర విద్యుత్ శాఖ అధికారుల బృందం హిమాచల్‌ప్రదేశ్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా 100 మెగావాట్లకు పైబడిన సామర్థ్యం గల రెండు ప్రాజెక్టుల ఏర్పాటుపై రాష్ట్రం ఆసక్తిని వ్యక్తం చేసింది. ఇందుకు సంబంధించి హిమాచల్ ప్రభుత్వం ఎంఓయూపై సంతకం చేస్తే త్వరితగతిన తగిన తదుపరి చర్యలు తీసుకుంటామని భట్టి విక్రమార్క తెలిపారు. గురువారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, విద్యుత్ శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాతో కలసి ఢిల్లీలో హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్‌సింగ్‌తో సమావేశమయ్యారు. ఇందులో తెలంగాణ ప్రభుత్వం నుంచి సెలి (400 మెగావాట్లు), మియార్ (120 మెగావాట్లు) హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్టుల నిర్మాణంపై ఆసక్తిని వ్యక్తం చేస్తూ ఒక లేఖను సమర్పించారు. ఈ సందర్భంగా ఎంఓయూ గురించి చర్చించారు. త్వరలోనే దీనిపై ఒక నిర్ణయానికి రావాలని హిమాచల్ సీఎం, భట్టి నిర్ణయించారు. ఇదిలా ఉండగా ఈ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే జలవిద్యుత్ రాష్ట్రానికి సరఫరా అవుతుంది. ఈ విద్యుత్ వల్ల రాష్ట్ర అవసరాలు, భవిష్యత్ విద్యుత్ డిమాండ్లను తీర్చేందుకు వీలు ఏర్పడుతుందని అధికార వర్గాలు తెలిపాయి.

ప్రజల్లో శాస్త్రీయ అక్షరాస్యత పెరగాలి

- సైన్స్ పురోగతిలో మానవీయత లేకపోతే ప్రమాదం
- జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో నోబెల్ గ్రహీత వెంకీ రామకృష్ణన్



జైపూర్ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: సైన్స్‌పై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ప్రముఖ శాస్త్రవేత్త, నోబెల్ పురస్కార గ్రహీత వెంకీ రామకృష్ణన్ అన్నారు. విద్యార్థులకు సైన్స్, హ్యూమానిటీస్ జ్ఞానాన్ని సమ్మిళితంగా అందించాల్సి ఉందని పేర్కొన్నారు. గురువారం జైపూర్‌లో ప్రారంభమైన జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన కీలకోపన్యాసం చేశారు. ‘శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అనూహ్య మార్పులు వస్తున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లైమేట్ సైన్స్, జెనెటిక్స్ వంటి రంగాల్లో ఏం జరుగుతుందో.. సైన్స్ ఏ పని ఎందుకు చేస్తుందో ప్రజలకు అవగాహన ఉండాలి. దురదృష్టవశాత్తు మన దేశంలో శాస్త్రీయ అక్షరాస్యత తక్కువ. 16 ఏళ్ల వయసులో విద్యార్థులను సైన్స్ కావాలా? ఆర్ట్స్ కావాలా? తేల్చుకోమంటున్నారు. అప్పటి నుంచి ఆ రెండు విభాగాల మధ్య సంబంధం తెగిపోతోంది. కానీ, అవి రెండూ వేర్వేరు కాదు. పరస్పర పూరకాలు. ఒక వయసు వచ్చేవరకు సైన్స్, హ్యూమానిటీస్ రెండూ పిల్లల చదువులో ఉండాలి. శాస్త్రీయ పురోగతిలో విలువలు, మానవీయత లేకపోతే అది శుష్కమైనదిగా, హానికారకంగా మారుతుంది. ప్రజలకు శాస్త్రీయ అక్షరాస్యత లేకపోతే తప్పుడు సమాచారం వల్ల తప్పుదారి పడతారు’అని రామకృష్ణన్ హెచ్చరించారు. ‘వెలుతురు తెచ్చేది పుస్తకమే’ అనే నినాదంతో ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. కాగా, ఫెస్టివల్‌లో ఈసారి తెలుగు పుస్తకానికి చోటు దక్కింది. రచయిత రవి మంత్రి రాసిన ‘అమ్మ డైరీలో కొన్ని పేజీలు’పుస్తకాన్ని ఈ ఉత్సవాల్లో పరిచయం చేశారు.

క్లుప్తంగా...

పాలన చేతకాదని కాంగ్రెస్ చేతులెత్తేసింది

ఎమ్మెల్సీ మధుసూదనాచారి



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల హామీల అమలు చేతకాదని కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి లోతు తెలియక కాంగ్రెస్ ఎన్నికల హామీలు ఇచ్చిందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు దీనికి అద్దం పడుతున్నాయన్నారు. ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతతో కలిసి మధుసూదనాచారి గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారంటీల అమలుపై సీఎం రేవంత్, మంత్రులు పొంతన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎన్నికల హామీల అమలు కోసం ప్రభుత్వం మెడలు వంచుతామని మధుసూదనాచారి హెచ్చరించారు. డిక్లరేషన్ల పేరిట మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని సునీత విమర్శించారు.

హామీలు అమలు చేయకపోతే దిగిపోండి

బీజేపీ నేత డాక్టర్ లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, లేని పక్షంలో వెంటనే గద్దె దిగాలని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన గ్యారంటీలు, హామీలు కాంగ్రెస్ పార్టీకి ఉరితాళ్లు కాబోతున్నాయని హెచ్చరించారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియక హామీలు ఇచ్చామని స్పీకర్ ప్రసాద్ కుమార్ స్వయంగా చెప్పడంతో కాంగ్రెస్ మోసపూరిత వైఖరి బయటపడిందన్నారు. ఎన్నికల్లో గట్టెక్కడానికి గడ్డి తిన్నారని, హామీలు అమలు చేయమంటే ఆర్థిక స్థితి బాగా లేదని సాకులు చెబుతున్నారని మండిపడ్డారు.

'లక్ష డప్పుల' సభకు సీఎంను ఆహ్వానిస్తున్నాం

మందకృష్ణ మాదిగ



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణే ధ్యేయంగా హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించే 'లక్ష డప్పులు.. వేల గొంతులు' బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రావాలని, ఈ వేదికగా సీఎంను ఆహ్వానిస్తున్నామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డిని గొంతెమ్మ కోరిక కోరడంలేదని.. ఎన్నికల ముందు.. ఎన్నికల తర్వాత ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'లక్ష డప్పులు.. వేల గొంతులు' పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడకపోతే తగిన మూల్యం చెల్లించుకుంటుందని మందకృష్ణ హెచ్చరించారు. కాగా, పద్మశ్రీ అవార్డు పొందిన మందకృష్ణ మాదిగను మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ శాలువాతో సత్కరించారు. పద్మశ్రీ అవార్డు వచ్చినందుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు సీఎం కట్టుబడి ఉన్నారు

ఓయూలో 2న మాదిగ విద్యార్థుల భారీ బహిరంగసభ: పిడమర్తి రవి



ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి పేర్కొన్నారు. బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేశ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న జరగనున్న మాదిగ విద్యార్థి యువగర్జన సభ వాల్ పోస్టర్‌ను గురువారం ఓయూలో పిడమర్తి రవి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, రాష్ట్రంలో వర్గీకరణ చేయాలనే దృఢ సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారని తెలిపారు. కులగణన చేపట్టి అధికారులతో కార్యాచరణ ప్రారంభించిన తర్వాత పోటీ సభలతో ఎమ్మెల్యే వివేక్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అడ్డుపడుతున్నారని రవి ఆరోపించారు. అయినా కాంగ్రెస్ హయాంలోనే ఎస్సీ వర్గీకరణ జరిగి తీరుతుందన్నారు. మాల, మాదిగ నేతల రాజకీయ లబ్ధికోసం రెచ్చగొట్టే ప్రసంగాలతో ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. చావుడప్పు పేరుతో లక్ష డప్పుల నిరసన కార్యక్రమం అర్థరహితమని, పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టని బీజేపీ ప్రకటించిన పద్మశ్రీ అవార్డును మందకృష్ణ తిరస్కరించాలని డిమాండ్ చేశారు.

ఉపాధికి హామీ పెరగాలి

- కేంద్ర బడ్జెట్‌లో నిధులు పెంచాలి
- రోజు కూలిని రూ.600కు పెంచాలి
- పని దినాలు 100 నుంచి 200కు పెంచాలి
- గతంలో మాదిరిగా అలవెన్స్‌లు ఇవ్వాలి
- రాష్ట్రానికి ఈ పథకంలో నిధులు డబుల్ చేయాలి
- కూలీలు, ఇతర వర్గాల నుంచి డిమాండ్లు



సాక్షి, హైదరాబాద్: కొత్త బడ్జెట్‌పై రాష్ట్రంలోని 'ఉపాధి'కూలీలు కోటి ఆశలు పెట్టుకున్నారు. దేశంలోని గ్రామీణ ప్రాంత కూలీలకు ఉపాధి కల్పించేందుకు అమలుచేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి (ఎంజీఎన్ఆర్ఈజీఏ) వచ్చే బడ్జెట్‌లో నిధులు భారీగా పెంచాలని కోరుతున్నారు. వ్యవసాయ పనులు లేని కాలంలో కూలీలను ఆదుకుంటున్న ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలని మేధావులు, ప్రజాసంఘాల నేతలు సైతం అభిప్రాయపడుతున్నారు.

వాస్తవానికి దూరంగా నిధుల కేటాయింపు

దేశంలోని కోట్ల మంది పేద కూలీలకు ఉపాధి కల్పిస్తున్న ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్‌లో ఆశించిన స్థాయిలో నిధుల కేటాయింపు జరగటంలేదనే అభిప్రాయాలున్నాయి. దేశంలోని అర్హులైన కూలీలందరికి (యాక్టివ్ హౌస్‌హోల్డ్స్) పథకంలో పొందుపరిచినట్లుగా ఒక ఆర్థిక సంవత్సరంలో 100 రోజులు ఉపాధి కల్పించాలంటే దాదాపు రూ.3 లక్షల కోట్లు అవసరమని అంచనా. కానీ, కేంద్రం 2024–25 వార్షిక బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం రూ.86,000 కోట్లు మాత్రమే. 2023–24లో మరీ తక్కువగా రూ.60 కోట్లే కేటాయించింది. తర్వాత దానిని రూ.86 వేల కోట్లకు సవరించింది. అయితే, ఆ ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి అయిన మొత్తం వ్యయం రూ.1,05,000 కోట్లుగా తేలింది. బడ్జెట్ కేటాయింపులు తగ్గటంతో ఈ పథకం అమలు పలు రాష్ట్రాల్లో తీవ్రంగా ప్రభావితమైంది. కూలీలందరికి నిర్దేశిత 100 రోజుల పని కల్పించటం సాధ్యం కాలేదు. అయితే తెలంగాణలో మాత్రం లక్ష్యానికి మించి ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లోనే దాదాపు రెండుకోట్ల పనిదినాలు అదనంగా చేశారు. ఈ అధిక డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని వచ్చే బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు పెంచాలని కోరుతున్నారు.

వివిధ వర్గాల నుంచి ఉపాధి పథకంపై ప్రధాన డిమాండ్లు

- బడ్జెట్‌లో నిధులు భారీగా కేటాయించాలి.
- కూలీల పనిదినాలను 100 నుంచి 200కు పెంచాలి.
- ఉపాధి హామీని ఓ హక్కుగా అమలు చేయాలి.
- ఉపాధి జాబ్ కార్డులను తొలగించవద్దు.
- ప్రతి కూలీ కుటుంబానికి పని కల్పించలేని పరిస్థితుల్లో చట్ట ప్రకారం నిరుద్యోగ భృతి చెల్లించాలి.
- ఉపాధి కూలీల కనీస కూలీ రూ.600కు పెంచాలి.

2023–24, 2024–25లో మొదటి ఆరు నెలల్లో (ఏప్రిల్ – సెప్టెంబర్) ఉపాధి పథకంలో కల్పించిన పనిదినాలు (కోట్లలో)

ఆర్థిక సంవత్సరం	తెలంగాణలో పని దినాలు	దేశంలో.. పనిదినాలు
2023-24	8.14	188.02
2024-25	10.35	157.58

సంవత్సరాలవారీగా ఉపాధి పథకానికి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు (రూ.కోట్లలో)

సంవత్సరం	బడ్జెట్ అంచనా	సవరించిన బడ్జెట్ అంచనా
2024-25	86,000	-
2023-24	60,000	86,000
2022-23	73,000	90,806
2021-22	73,000	98,000
2020-21	61,500	1,15,000
2019-20	60,000	71,002
2018-19	60,000	61,084

నిధులు డబుల్ చేయాలి

ఉపాధి పథకంలో రాష్ట్రానికి కేంద్రం రూ.4,416 కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ మొత్తం ఇక్కడున్న పని డిమాండ్‌కు ఏమాత్రం సరిపోదు. చురుకుగా పనిచేస్తున్న కూలీలందరికీ పూర్తిస్థాయిలో ఉపాధి కల్పించాలంటే రూ.9,800 కోట్లు అవసరం. జాతీయ స్థాయిలోని యాక్టివ్ హౌస్ హోల్డ్స్‌కు పూర్తిస్థాయిలో పని కల్పించాలంటే బడ్జెట్‌లో రూ.3 లక్షల కోట్లు కేటాయించాల్సి ఉంటుంది. అందువల్ల 2025–26 కేంద్ర బడ్జెట్‌లో ఈ పథకానికి భారీగా కేటాయించాలి. తెలంగాణకు నిధులు రెండింతలు చేయాలి.

– చక్రధర్ బుద్ధా, డైరెక్టర్, లిబ్‌టెక్ ఇండియా.

పని ప్రదేశంలో వసతులు కల్పించాలి

ఉపాధి పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్‌గా పనులు కల్పించాలి. పనికి దరఖాస్తులు తీసుకోవాలి. కూలీల సంఖ్యకు తగ్గట్టుగా షెల్ఫ్ ఆఫ్ వర్క్స్ క్రియేట్ చేయాలి. పని వద్ద హక్కుగా నీరు, నీడ, మెడికల్ కిట్‌లు ఏర్పాటు చేయాలి. పనిముట్లు పంపిణీ చేయాలి. వేసవి అలవెన్సు, తాగునీటి చార్జీలను గతంలో మాదిరిగా చెల్లించాలి. ప్రతి జిల్లాకు ప్రత్యేక అధికారులను మళ్లీ నియమించాలి. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ప్రతి నెలా ఈ పథకం అమలు తీరును సమీక్షించాలి.

– పి.శంకర్, దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి.

వచ్చే నెల 5 తర్వాత 'స్థానికం'పై స్పష్టత

- కులగణన నివేదిక, రిజర్వేషన్ల పెంపుపై చర్చ తర్వాత నిర్ణయం
- మీడియా చిట్‌చాట్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్
- రాష్ట్రంలో వైఎస్ఆర్‌కు ఉన్నంతమంది అభిమానులు ఎవరికీ లేరని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కులగణన జరగకుండా అడ్డుకోవాలని ప్రతిపక్షాలు ఎన్ని ప్రయత్నాలు చేసినా విజయవంతంగా పూర్తి చేశామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కులగణనపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం తన నివేదికను ఫిబ్రవరి 5న కేబినెట్ ముందు పెడుతుందని తెలిపారు. ఆ నివేదిక ఆధారంగా రిజర్వేషన్ల పెంపుపై మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. దానిని బట్టి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై స్పష్టత వస్తుందని వివరించారు. మహేశ్‌కుమార్‌గౌడ్ గురువారం గాంధీభవన్‌లో మీడియాతో చిట్‌చాట్ చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో దివంగత సీఎం వైఎస్సార్‌కు ఉన్నంత అభిమానులు ఎవరికీ లేరని చెప్పారు.

స్థానిక ఎన్నికల్లో జయకేతనం ఎగరవేస్తాం

కులగణన నివేదిక ఆధారంగా రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తిచేసి స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోందని.. దీనిపై ఫిబ్రవరి 5 తర్వాత స్పష్టత వస్తుందని మహేశ్‌గౌడ్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగరవేస్తుందన్నారు. ''గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి సంబంధించి ఇప్పటికే ముగ్గురు అభ్యర్థుల పేర్లతో అధిష్టానానికి నివేదిక ఇచ్చాం. రెండు మూడు రోజుల్లో కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థిని ప్రకటిస్తాం. హైదరాబాద్‌లో కాంగ్రెస్ బలోపేతం కోసం జీహెచ్ఎంసీపై ప్రత్యేక దృష్టి పెట్టాం. జీహెచ్ఎంసీలో అత్యధిక సీట్లు గెలిచి మేయర్ పీఠం దక్కించుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.''అని చెప్పారు. సమయాభావం వల్ల ముఖ్యమంత్రి కమాండ్ కంట్రోల్ సెంటర్, సీఎం నివాసంలో సమీక్షలు చేస్తున్నారని.. అందులో తప్పేముందని పేర్కొన్నారు.

సూర్యాపేటలో రాహుల్ సభ

ఫిబ్రవరి 2వ వారంలో సూర్యాపేట జిల్లాలో రాహుల్ గాంధీ సభ నిర్వహించబోతున్నామని మహేశ్‌గౌడ్ తెలిపారు. ఎమ్మెల్యేలు, మంత్రులు తమ అధికారిక నివాసంలో సీఎం ఫొటోతోపాటు రాహుల్, సోనియా గాంధీ, ఖర్గే ఫోటోలు పెట్టుకోవాలని సూచిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులుండి అభివృద్ధి కోసం తెచ్చిన నిధులు ఎన్ని అని ప్రశ్నించారు. బీజేపీ కార్పొరేటర్లు భిక్షాటన పేరుతో డ్రామాలు చేస్తుండటం విడ్డూరమని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ హయాంలోనే రియల్ ఎస్టేట్ పడిపోయిందని.. దానిని తమ ప్రభుత్వం గాడిన పెడుతోందని చెప్పారు. ఫాంహౌస్ పాలన కోరుకునేది దొరలు మాత్రమేనని, ప్రజలంతా ప్రజాపాలనే కోరుకుంటారని పేర్కొన్నారు.

'స్థానిక' ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారు?: హైకోర్టు

మూడు వారాల్లో పాజిటివ్‌గా కౌంటర్ వేయాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మూడు వారాల్లో పాజిటివ్‌గా కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. దీనిపై కౌంటర్ రిప్లై ఇచ్చేందుకు పిటిషనర్‌కు రెండు వారాల గడువిచ్చింది. తదుపరి విచారణను మార్చి 5కు వాయిదా వేసింది. ఖాళీగా ఉన్న స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడం లేదంటూ హైకోర్టులో 2023, మార్చిలో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. మొత్తం 220 సర్పంచ్, 94 ఎంపీటీసీ, నాలుగు జెడ్పీటీసీ, 5,364 వార్డులు, 344 ఉపసర్పంచ్ స్థానాలు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్నికలు నిర్వహించకపోతే ఆయా పంచాయతీలు, వార్డులు.. ప్రజాప్రతినిధుల ద్వారా వచ్చే నిధులను కోల్పోతాయన్నారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారాలతో కూడిన ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. ఎన్నికలు ఎప్పటిలోగా నిర్వహిస్తారో తేదీని వెల్లడించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

టెర్రస్ గార్డెన్లకు ప్రభుత్వ ప్రోత్సాహం

గ్రాండ్ నర్సరీ మేళా ప్రారంభోత్సవంలో మంత్రి తుమ్మల



మేళా ప్రారంభోత్సవంలో మంత్రి తుమ్మల

ఖైరతాబాద్ (హైదరాబాద్): పట్టణ ప్రజలు కూడా తమకున్న ఇంటి ఆవరణలు, మిద్దెలపై మొక్కలు, చెట్లు పెంచుకునేలా.. ఈ ఏడాది నుంచి రాయితీ ఇచ్చి టెర్రస్ గార్డెన్లను ప్రోత్సహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజా వేదికగా 17వ గ్రాండ్ నర్సరీ మేళా పేరుతో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా హార్టీకల్చర్ షోను గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హార్టీకల్చర్ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలో పెద్ద ఎత్తున రూఫ్ గార్డెన్స్‌ను ప్రోత్సహిస్తామన్నారు. ప్రజలు ఏ మాత్రం ఖాళీ స్థలం ఉన్నా కూరగాయలు, పచ్చదనం పంచే మొక్కలు పెంచాలని సూచించారు. మానవ జీవితానికి, మనుగడకు పచ్చదనం కావాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మొక్కలు పెంచడం అనివార్యమని మంత్రి అభిప్రాయపడ్డారు. నర్సరీ మేళా ఇన్‌చార్జి ఖాలీద్‌అహ్మద్ మాట్లాడుతూ.. నర్సరీ మేళాలో దేశ విదేశాల నుంచి 150 స్టాళ్లలో అందమైన పూలమొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కిచెన్ గార్డెన్, ఆర్నమెంటల్ ప్లాంట్స్, మెడిసినల్ ప్లాంట్స్, చెట్లను పెంచడానికి కావాల్సిన మెటీరియల్ కూడా ప్రదర్శనలో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో హార్టీకల్చర్ అధికారి బాబు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక పోరుకు రెఢీ!

మొదటి పేజీ తరువాయి

ఉంటుందని, స్థానిక ఎన్నికలపై తుది నిర్ణయం తీసుకుంటారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ కూడా తెలిపారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ మొదలైన నేపథ్యంలో స్థానిక ఎన్నికల ప్రక్రియ చేపట్టవచ్చా అన్న సందేహాలున్నా.. ఆ కోడ్ స్థానిక ఎన్నికలకు అడ్డుకాబోదని ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ ఒకరు అభిప్రాయపడ్డారు.

అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహించి..

స్థానిక ఎన్నికలకు సన్నాహాల్లో భాగంగానే సమగ్ర కుల సర్వే నివేదిక ఫిబ్రవరి 2న మంత్రివర్గ ఉప సంఘానికి చేరనుందని అధికారవర్గాలు తెలిపాయి. ఉప సంఘం ఆ నివేదికపై చర్చించి తగిన ప్రాధాన్యతాంశాలతో మంత్రివర్గానికి నివేదిక అందిస్తుందని వెల్లడించాయి. ఫిబ్రవరి 5న జరిగే కేబినెట్ భేటీలో ఉప సంఘం నివేదిక, బీసీ రిజర్వేషన్ల పెంపు, డెడికేటెడ్ కమిషన్ చేసిన సిఫార్సులపై చర్చించనున్నట్టు తెలిసింది. ఫిబ్రవరి 6 లేదా 7వ తేదీన అసెంబ్లీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ తీర్మానం చేసి, కేంద్రానికి పంపించనున్నట్టు సమాచారం.

ఎంపీటీసీ స్థానాల డీలిమిటేషన్ ప్రక్రియ మొదలు

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ), పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సన్నాహాలు మొదలుపెట్టాయి. రెవెన్యూ మండలాల పరిధి, స్థాయికి తగినట్టుగా మండల ప్రజాపరిషత్ (ఎంపీపీ)ల పునర్విభజన చేపట్టాలని జిల్లా కలెక్టర్లకు గురువారం పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఒక్కో ఎంపీటీసీ స్థానంలో 3వేల నుంచి 4 వేల మధ్య జనాభా ఉండేలా రూపకల్పన (కార్వింగ్) చేయాలని సూచించారు. 2011 జనాభా లెక్కలకు అనుగుణంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను 'కార్వింగ్' చేయాలని ఆదేశించారు. శుక్రవారం వరకు ఎంపీటీసీ స్థానాల ముసాయిదా ప్రచురించి.. శుక్ర, శనివారాల్లో అభ్యంతరాలకు గడువు ఇవ్వాలని.. శని, ఆదివారాల్లో వాటిని పరిష్కరించి 3వ తేదీన తుది ప్రచురణ చేయాలని సూచించారు. కొత్త జిల్లాలకు అనుగుణంగా జెడ్పీటీసీలు, రెవెన్యూ మండలాలకు తగ్గట్టుగా ఎంపీటీసీ స్థానాల పునర్విభజన ఉండాలని స్పష్టం చేశారు. మున్సిపాలిటీల్లో పంచాయతీల విలీనం వల్ల ఎంపీటీసీ స్థానాలు ప్రభావితమైన చోట, నిర్దిష్ట జనాభాకు మించి, లేదా తక్కువగా ఉన్నచోట పక్కనే ఉన్న స్థానాలతో సర్దుబాటు చేయడం, లేక కొత్త స్థానాలు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఎన్నికల ఏర్పాట్లలో ఎస్ఈసీ..

స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వ నిర్ణయం కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఎదురుచూస్తోంది. తేదీలపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి... రెండు, మూడు వారాల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉంది. ఈ మేరకు ఏర్పాట్లు కూడా మొదలపెట్టినట్టు సమాచారం. ఎన్నికల నిర్వహణ కోసం బ్యాలెట్ పత్రాల ప్రింటింగ్‌కు ఏర్పాట్లతోపాటు సర్పంచ్ పదవికి 30దాకా, వార్డు మెంబర్లకు 20 దాకా వివిధ ఫ్రీసింబల్స్ (ఎన్నికల చిహ్నాలను) సిద్ధం చేసినట్టు జిల్లాల్లో అధికారులు చెబుతున్నారు. పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, వివిధ శాఖల నుంచి నోడల్ అధికారుల నియామకం, బ్యాలెట్ బాక్స్‌లను సైతం సిద్ధం చేసుకోవడంలో నిమగ్నమైనట్టు చెబుతున్నారు.

వక్ఫ్ బోర్డు సీఈవోను తక్షణమే తొలగించండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈవో ఎండీ అసదుల్లాను తక్షణమే తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, వక్ఫ్ బోర్డును హైకోర్టు ఆదేశించింది. నాలుగు నెలల్లోగా అర్హుడైన అధికారిని పూర్తి స్థాయి సీఈవోగా నియమించాలని స్పష్టం చేసింది. వక్ఫ్ చట్టం–1995లోని సెక్షన్ 23 ప్రకారం ప్రస్తుత సీఈవో నియామకం జరగలేదని అభిప్రాయపడింది. ఇన్‌చార్జి సీఈవోగా షేక్ లియాకత్ హుస్సేన్‌ను కొనసాగించవచ్చని వెల్లడించింది. కొత్త సీఈవో నియామకం వక్ఫ్ బోర్డు చట్టంలోని సెక్షన్ 23కు లోబడి ఉండాలని చెప్పింది. గోల్కొండ ప్రాంతానికి చెందిన మహ్మద్ అక్బర్ దాఖలు చేసిన కోర్టు ధిక్కార పిటిషన్‌ను జస్టిస్ నగేష్ భీమపాక విచారణ చేపట్టి ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. అడిషనల్ కలెక్టర్ హోదాలో ఉన్న అసదుల్లా వక్ఫ్ బోర్డు సీఈవోగా కొనసాగేందుకు అనర్హుడని పిటిషనర్ వాదించారు. అసదుల్లా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టరని, ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ స్థాయి కంటే తక్కువ హోదాలో ఉన్నారని, ఆయన నియామకం వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 23 మేరకు లేదన్నారు. ముస్లిం అధికారులు తగిన సంఖ్యలో లేనందున 35 ఏళ్లపాటు ప్రభుత్వానికి సేవలందించిన అసదుల్లాను సీఈఓగా నియమించేందుకు ఆమోదం తెలిపినట్లు వక్ఫ్ బోర్డు వాదించింది. ఈ వాదనను న్యాయమూర్తి తోసిపుచ్చారు.

'సుప్రీం' తీర్పుతో తెలంగాణకు నష్టం

- రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ ధర్మాసనాన్ని ఆశ్రయించాలి
- రాజ్యాంగ సవరణకు దక్షిణాది రాష్ట్రాలు ఒత్తిడి తేవాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు సూచన



సాక్షి, హైదరాబాద్: పీజీ మెడికల్ సీట్ల రిజర్వేషన్లలో 50 శాతం స్థానిక కోటా వర్తించదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో తెలంగాణతో పాటు దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ తీర్పుతో మెడికల్ కాలేజీల ఏర్పాటులో అగ్రగామిగా ఉన్న తెలంగాణలో స్థానిక విద్యార్థులు ఉన్నత వైద్య విద్యను చదివే అవకాశం కోల్పోతారని తెలిపారు. సుప్రీం తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ ధర్మాసనాన్ని ఆశ్రయించాలని సూచించారు. కేంద్ర మంత్రులు, రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి తెలంగాణ విద్యార్థులకు న్యాయం చేయాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు. 'తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కేసీఆర్ చొరవతో జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడంతో రాష్ట్రంలో వాటి సంఖ్య 34కు చేరింది. ప్రతి లక్ష జనాభాకు 19 ఎంబీబీఎస్ సీట్లతో పాటు పీజీ సీట్లలో తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో ఉంది. రాష్ట్రంలోని 2,924 పీజీ మెడికల్ సీట్లలో 50 శాతం స్థానిక రిజర్వేషన్ కింద 1,462 సీట్లు తెలంగాణ విద్యార్థులకు దక్కేవి. ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పుతో అన్ని సీట్లు ఆల్ ఇండియా కోటాలోకి వెళ్తాయి. తెలంగాణతో పాటు దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు కూడా ఇదే పరిస్థితి ఎదుర్కోబోతున్నారు. దక్షిణాది రాష్ట్రాలు గడిచిన 77 ఏండ్లుగా ప్రత్యేక దృష్టి సారించి వైద్య విద్యను ప్రోత్సహించాయి'అని హరీశ్‌రావు తెలిపారు.

రిజర్వేషన్లు కూడా దెబ్బతినే ప్రమాదం

సుప్రీంతీర్పు రిజర్వేషన్లను కూడా ప్రభావితం చేస్తుందని హరీశ్‌రావు అన్నారు. 'ఈ తీర్పుతో రాష్ట్రాల్లో అమల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది. పీజీలో ఇన్‌సర్వీస్ కోటా ప్రశ్నార్థకంగా మారి, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలకు విఘాతం కలుగుతుంది. వైద్య సేవలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశం. పీజీ విద్యార్థులకు స్టైఫెండ్ కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఈ తీర్పుతో నష్టం జరుగుతుందని భావించిన తమిళనాడు రాజ్యాంగ ధర్మాసనాన్ని ఆశ్రయించాలని నిర్ణయించింది. తెలంగాణ ప్రభుత్వం కూ డా సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనానికి వెళ్లి స్టే తీసుకురావాలి. అవసరమైతే దక్షిణాది రాష్ట్రాలు కలిసికట్టుగా రాజ్యాంగ సవరణకు పట్టుబట్టాలి'అని హరీశ్ సూచించారు.

'మండలి' పోటీపై నేడోరేపో బీఆర్ఎస్ స్పష్టత

కేసీఆర్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ

- పట్టభద్రుల కోటాలో పోటీ, ఆశావహుల వినతిపై చర్చ
- ఎస్సీ వర్గీకరణ పోరాట వ్యూహంపై మంతనాలు



సాక్షి, హైదరాబాద్: శాసనమండలిలో మూడు స్థానాల ఎన్నికలకు సంబంధించి షెడ్యూలు వెలువడిన నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఆ పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావుతో గురువారం భేటీ అయ్యారు. ఎర్రవల్లి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో మండలి ఎన్నికల్లో పోటీ, ఎస్సీ వర్గీకరణ, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా ఈ సమావేశంలో పాల్గొనాల్సి ఉన్నా.. జ్వరం కారణంగా హాజరు కాలేదని తెలిసింది. మెదక్– కరీంనగర్– నిజామాబాద్– ఆదిలాబాద్, వరంగల్– ఖమ్మం– నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలపై పార్టీ పరంగా ఎలాంటి వ్యూహం అనుసరించాలనే అంశంపై చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఎవరికైనా అధికారికంగా మద్దతు ఇవ్వాలా? లేక తటస్థంగా ఉండాలా? అనే అంశంపై ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాపై స్పష్టత వచ్చిన తర్వాత నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. పట్టభద్రుల కోటాలో 'మెదక్– కరీంనగర్– నిజామాబాద్– ఆదిలాబాద్'స్థానం నుంచి పార్టీ తరఫున పోటీ చేసేందుకు పలువురు ఆసక్తి చూపుతున్న విషయం ఈ భేటీలో ప్రస్తావనకు వచ్చింది. ఆశావహులు కూడా పార్టీ వైఖరిపై స్పష్టత ఇవ్వాలని ఒత్తిడి పెంచుతున్నారు. ఈ నేపథ్యంలో ఒకటి రెండు రోజుల్లో కేటీఆర్ దీనిపై స్పష్టత ఇవ్వనున్నారు.

ఎస్సీ వర్గీకరణ.. స్థానిక ఎన్నికలు

ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలుచేయాలన్న డిమాండ్‌తో ఫిబ్రవరి 7న ఎంఆర్‌పీఎస్ నిర్వహించనున్న బహిరంగ సభపై కూడా ఈ సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం. వర్గీకరణకు అనుకూలంగా అసెంబ్లీలో గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తీర్మానానికి అనుగుణంగా ముందుకు సాగాలని కేసీఆర్ సూచించినట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నివాసంలో జరిగిన పార్టీ మాదిగ సామాజికవర్గం నేతల భేటీలో చర్చించిన అంశాలను కేసీఆర్‌కు కేటీఆర్ వివరించారు. ఉద్యోగాలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేయాలనే డిమాండ్‌ను ప్రభుత్వం ముందు పెట్టాలని నిర్ణయించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ పరంగా సన్నద్ధతను వేగవంతం చేయాలని కేసీఆర్ సూచించారు.

నేడు మున్సిపల్ మాజీ చైర్మన్ల ఆత్మీయ సమావేశం

ఇటీవల పదవీకాలం ముగిసిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లు శుక్రవారం తెలంగాణ భవన్‌లో సమావేశం కానున్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఆత్మీయ భేటీకి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీమంత్రి హరీశ్‌రావు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పార్టీ వర్గాలు తెలిపాయి.

ఆయనకు సంతానం లేదు.
ఆయన కూడా ఎవరి సంతానమూ కాదు.
సర్వ లోకాలలో ఆయనతో పోల్చదగినది ఏదీ లేదు.
– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 31 జనవరి 2025

శతప్రయోగ విజయసీమ

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో మైలురాయిని చేరుకుంది. బుధవారం ఉదయం జరిపిన నూరవ రాకెట్ ప్రయోగంతో చరిత్రలో కొత్త అధ్యాయం లిఖించింది. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం (షార్)లో రెండో లాంచ్ ప్యాడ్ నుంచి నింగిలోకి ఎగసిన భూ సమకాలిక ఉపగ్రహ ప్రయోగవాహక నౌక (జీఎస్ఎల్వీ–ఎఫ్15) ఎన్వీఎస్–02 ఉపగ్రహాన్ని విజయవంతంగా నిర్ణీత కక్ష్య అయిన జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ – జీటీఓలోకి చేర్చింది. ఈ కొత్త ఏడాది చేపట్టిన తొలి ప్రయోగం నిర్విఘ్నంగా సాగడం శాస్త్రవేత్తల్లో ఆనందం పెంచింది. రోదసిలో చేరిన ఈ తాజా శాటిలైట్‌తో మన 'నావిక్' (నావిగేషన్ విత్ ఇండియన్ కాన్‌స్టలేషన్)లో విధులు నిర్వహిస్తున్న ఉపగ్రహాల సంఖ్య 4 నుంచి 5కు పెరిగింది. దీని వల్ల మన దేశంతో పాటు మన పొరుగు దేశాలకూ మొబైల్ ఫోన్లలో జీపీఎస్ సహా అనేక సేవల్లో కచ్చితత్వం పెరగనుంది. ఇతర దేశాలన్నీ అమెరికా తాలూకు జీపీఎస్‌పై ఆధారపడితే, భారత్ ఉపగ్రహ ఆధారిత నావిగేషన్‌లో సొంత కాళ్ళపై నిలబడేందుకు చేస్తున్న ఈ కృషి సగటు భారతీయుడి ఛాతీ ఉప్పొంగే క్షణం.

సైకిళ్ళు, ఎడ్లబండ్లపై రాకెట్ విడిభాగాలను తరలించిన కాలం నుంచి ఇటీవలే అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను అనుసంధానించే (డాకింగ్ చేసే) స్థాయికి ఇస్రో చేరడం చిరకాలం చెప్పుకోవాల్సిన స్ఫూర్తిగాథ. విక్రమ్ సారాభాయ్, సతీశ్ ధవన్ లాంటి దిగ్గజాల తొలి అడుగులతో ఆరంభించి, ఆపైన కలామ్ లాంటి వారి మేధను వినియోగించుకొని అయిదు దశాబ్దాల పైగా సాగించిన ప్రస్థానం చిరస్మరణీయం. 1962లో అణుశక్తి విభాగం కింద ఏర్పాటైన ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రిసెర్చ్ ద్వారా ఇస్రోకు బీజం పడింది. చంద్రుడి మీదకు అమెరికా మానవుణ్ణి పంపిన 1969లోనే ఇప్పుడు మనం చూస్తున్న ఇస్రో స్థాపన జరిగింది. 1972లో ప్రత్యేకంగా అంతరిక్ష శాఖ ఏర్పాటైంది. ఆనాటి నుంచి ఈనాటి వరకు మన అంతరిక్ష పరిశోధనా సంస్థ అనేక రాకెట్లకు పురుడు పోయడమే కాక, ఇతర దేశాల ఉపగ్రహ ప్రయోగాలలోనూ విశ్వసనీయ భాగస్వామిగా ఎదిగింది.


మన ఇస్రో 1979 ఆగస్టు 10న తొలిసారిగా ఉపగ్రహ ప్రయోగ నౌక (ఎస్ఎల్వీ–3 ఈ10) ద్వారా ప్రయోగాత్మకంగా రోహిణీ టెక్నాలజీ పేలోడ్‌ను నింగిలోకి పంపిన క్షణాలు ఆ తరంలో చాలామందికి ఇప్పటికీ గుర్తే. అప్పట్లో ఇస్రోతో పనిచేస్తున్న అబ్దుల్ కలామే ఆ ప్రయోగానికి డైరెక్టర్. సదరు ప్రయోగం పాక్షికంగానే విజయం సాధించింది కానీ, ఆ తర్వాత కాలగతిలో అంతరిక్ష ప్రయోగాల్లో మనం అగ్రరాజ్యాలకు దీటుగా ఆరితేరాం. అంకెల్లో చెప్పాలంటే, ఇప్పటి వరకు ఇస్రో 548 ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. దాదాపు 120 టన్నుల పేలోడ్‌ను నింగిలోకి పంపింది. అందులో 433 విదేశీ ఉపగ్రహాలకు చెందిన 23 టన్నులూ ఉంది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో షార్ కేంద్రం ఎన్నో చరిత్రాత్మక ఘట్టాలకు వేదికైంది. మూడు చంద్రయాన్‌లు, ఒక మార్స్ ఆర్బిటర్ ప్రయోగం, ఆదిత్య ఎల్1 ప్రయోగం లాంటివి గణనీయమైనవి. కక్ష్యలో పరిభ్రమించే వ్యోమనౌకను భూవాతావరణంలోకి ప్రవేశింపజేసి... భూమి పైకి క్షేమంగా తెచ్చి రికవరీ చేసే 'స్పేస్ క్యాప్సూల్ రికవరీ ప్రయోగం' (ఎస్ఆర్ఈ), అలాగే ఒకే రాకెట్‌తో 104 శాటిలైట్లను కక్ష్యలోకి ప్రవేశపెట్టడం వగైరా ప్రత్యేకంగా చెప్పుకోదగ్గవి. ఇస్రో ప్రయోగించినవాటిల్లో కమ్యూనికేషన్ శాటిలైట్లు, భూ పరిశీలన ఉపగ్రహాలు, మార్గనిర్దేశక (నావిగేషనల్), ప్రయోగాత్మక శాటిలైట్లు అనేకం. ఆ వివరాలు సగర్వంగా తోస్తాయి.

రానున్న రోజుల్లోనూ మరిన్ని చారిత్రక ఘట్టాలకు ఇస్రో చోదకశక్తి కానుంది. గగన్‌యాన్‌లో భాగంగా మానవరహిత జీ1 ప్రయోగం తొలిసారి చేయనున్నారు. అలాగే, నెక్స్ట్ జనరేషన్ లాంచ్ వెహికల్ (ఎన్జీఎల్వీ), చంద్రయాన్, శుక్రయాన్ జరగనున్నాయి. ప్రైవేట్ ఉపగ్రహ ప్రయోగాలకు సైతం వేదికగా నిలిచి, అంతరిక్ష వాణిజ్యంలో తగిన వాటా కోసం ప్రయత్నిస్తున్న ఇస్రో మరో రెండేళ్ళలో శ్రీహరికోటలో మూడో లాంచ్ ప్యాడ్‌ను నిర్మించనుండడం విశేషం. అలాగే, తమిళనాడులోని కులశేఖరపట్నంలో రెండో ఉపగ్రహ ప్రయోగ కాంప్లెక్స్ సైతం సిద్ధమవుతోంది. భారీ పేలోడ్‌లను రోదసిలోకి తీసుకెళ్ళగలిగే ఎన్జీఎల్వీల రూపకల్పనకూ, మూడో లాంచ్ ప్యాడ్ నిర్మాణానికీ దాదాపు రూ. 4 వేల కోట్లు ఖర్చవుతుంది. అంత మొత్తం వెచ్చించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం విశేషం. భారత అంతరిక్ష పరిశోధన, ప్రయోగ రంగానికి ఇది పెద్ద ఊతం. ఇవన్నీ ప్రైవేట్ రంగ రోదసీ ప్రయోగాల్లో ఇస్రో సింహభాగం దక్కించుకోవడానికి ఉపకరిస్తాయి.

ఒకప్పుడు అగ్రరాజ్యాలు సాంకేతిక విజ్ఞానాన్ని అందించడానికి నిరాకరించినప్పుడు స్వశక్తితో దేశీయంగా బుడిబుడి అడుగులతో మొదలుపెట్టిన భారత్ దాదాపు అయిదు పదుల ఏళ్ళలో శత రోదసీ ప్రయోగాలు సాగించింది. రానున్న అయిదేళ్ళలోనే రెండో శతం పూర్తి చేసి, మొత్తం 200 ప్రయోగాల మైలురాయికి చేరుకోవడానికి ఉరకలు వేస్తోంది. ఇన్నేళ్ళుగా మన అంతరిక్ష పరిశోధకులు, శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు చూపుతున్న అచంచలమైన నిబద్ధత, అంకితభావానికి మచ్చుతునక ఈ ఇస్రో విజయగీతిక. విశ్వవేదికపై అగ్రరాజ్యాల సరసన అంతరిక్షంలో భారత్ సూపర్ పవర్‌గా ఎదిగిందనడానికీ ఇది ప్రతీక. అనేక ఆర్థిక, సాంకేతిక పరిమితులు ఉన్నప్పటికీ సృజనాత్మకంగా ఆలోచించి, పరిస్థితులకు తగ్గట్లు మనల్ని మనం మలుచుకొంటే గణనీయ విజయాలు సాధ్యమే అనడానికి ఇదే తిరుగులేని రుజువు. 1975లో తొలి ఉపగ్రహం ఆర్యభట్ట ప్రయోగం నుంచి ఆ మధ్య మంగళ్‌యాన్ వరకు ప్రతిసారీ తక్కువ ఖర్చుతో, అంచనాలకు అందని విజయాలు సాధించిన మన శాస్త్రవేత్తల ఘనతకు భవిష్యత్తులోనూ ఆకాశమే హద్దు.

మన బ్రెయిన్ చిప్ లాకైందా?

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

ఈమధ్య నేను మానవ జన్యుశాస్త్రం మీద కొంత అధ్యయనం చేస్తున్నాను. అందులో ముఖ్యంగా ఎపిజెనెటిక్స్, యునిజెనెటిక్స్ మానవ చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించినట్లు నాకర్థమైంది. మానవ మెదడు ఒక తరం నుండి మరో తరానికి మేధా శక్తిని జన్యు మార్పు ద్వారా అందిస్తుందని ఈ సైన్సు చాలా స్పష్టంగా నిరూపించింది. ఈమధ్య కాలంలో ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ విశ్వవిద్యాలయంలో డాక్టర్ ఒడెడ్ రెచావీ అనే జెనెటిసిస్టు మానవ మెదడులోని ఆలోచనా శక్తి పిల్లలకు చాలా తరాల నుండి సంక్రమిస్తుందని తేల్చాడు.

కులం, ఏకవృత్తి మనకేం చేశాయి?

ఈ అధ్యయనంలో ఆయన కనుక్కున్నదేమంటే, తల్లిదండ్రుల డీఎన్ఏ, ఆర్ఎన్ఏతో పాటు వారి ఇరు కుటుంబాల తాతముత్తాతల, అమ్మమ్మల, వారి వెనుక తరాల మెదడు జన్యుశక్తితో పాటు వారి అనుభవాల సమూలశక్తి, క్రియాశీల శక్తి, భావ ప్రకటనా శక్తిని ఇప్పుడు పుడుతున్న పిల్లల మెదళ్లు సంక్ర మించుకుంటాయి. ఈ సంక్రమణ వాళ్ళ కుటుంబాలలోని చాలా తరాల నుండి పిల్లలకు వస్తుందట.

భారతదేశంలో ఒకే కులం పెళ్ళిళ్లు, ఆయా కులాల తరతరాల ఏక వృత్తి వల్ల ఎన్ని వేల ఏండ్లు మన మెదళ్ళు బంధించబడ్డాయో మన సోషల్ సైన్సు అధ్యయనం చెయ్యలేదు. అసలు కులం, కుల వృత్తులపై ఈ మధ్యనే కొద్దిపాటి చర్చ మొదలైంది. ఏక కుల పెళ్ళిళ్లు ఎదుగుదల లేని, రోగభరిత సంతానాన్ని అందిస్తాయని కొద్దిగా చర్చ జరుగుతోంది. కులాంతర పెళ్ళిళ్ళు చేసుకున్న జంటల సభలో ఈ మధ్యనే మాట్లాడుతూ జస్టిస్ రాధారాణి గారు మనం మనుషులుగా బతకడం లేదు, కులాలుగా బతుకు తున్నామన్నారు. అదీ 21 శతాబ్దంలో. అయితే అసలే చర్చకు రాని సమస్య ఏమంటే, మెదడు క్రియాశీల శక్తిని ఒకే కుల వృత్తికి పరిమితి చేసినందువల్ల ఈ తల్లిదండ్రుల సంతానాల మెదళ్ళు పరిమిత అనుభవ, ఆలోచన, క్రియాశీల, కమ్యూనికేషన్ శక్తిని మాత్రమే సొంతం చేసుకోవడం.

ఉదాహరణకు నా కుల కుటుంబ వృత్తినే చూస్తే, నా తల్లిదండ్రుల, అమ్మమ్మ, తాతముత్తాతల కుల జన్యు పరిమితి, వారి ఏక వృత్తి అయిన గొర్రెల కాపరి అనుభవ జ్ఞానం మాత్రమే నా మెదడుకు అందింది. అది ఎన్ని రకాల శక్తిని బంధించిందో తెలియదు. నా ముందు తరాల నిరక్షరాస్యత నా క్రియేటివ్, కమ్యూనికేషన్ శక్తులను ఎంత బంధించిందో తెలియదు. ఒకవేళ నా తల్లి గొర్రెల కాపరి కుటుంబం, తండ్రి వడ్రంగి కుటుంబం నుండి వచ్చి ఉంటే నా మెదడు ఎలా పని చేసేదో తెలియదు. ఇదే అంశం ఒక బ్రాహ్మణ మంత్ర పఠన కుటుంబానికీ, చెప్పులు చేసే మాదిగ కుటుంబానికీ వర్తిస్తుంది. ఈ ప్రక్రియ ఋగ్వేద కాలం నుండి మొదలైందని మనకు ఆ అధ్యయనం చెబుతుంది.

ఒక కుటుంబంలో వివిధ వృత్తులుంటే...

ఈ క్రమంలో మన దేశంలోని మానవ మెదళ్ల చిప్ లాక్ చెయ్యబడిందని నా అభిప్రాయం. దీనిపై చాలా అధ్యయనం జరగాలి. ఈ క్రమంలోనే అమెరికా అధ్యక్షుడిగా పనిచేసి, ఈ మధ్య చనిపోయిన జిమ్మీ కార్టర్ ఆత్మ కథ 'ఎ ఫుల్ లైఫ్' చదివాను. ఆయన తండ్రి వేరుశనక్కాయ బాగా పండించే రైతు, ఇండ్లు కట్టే వడ్రంగి, చెప్పులు చేసే మోచి, ఇంట్లో అన్నీ బాగుచేసే ప్లంబర్, మంచి వ్యాపారి. ఆయన తల్లి నర్సు, మంచి వంట పనివంతురాలు, చేను పనుల్లో దిట్ట. వారి వెనుక తరాలు ఎన్ని రకాల పనులు చేశారో ఆయన రాయలేదు. కానీ వారి పిల్లలు, ముఖ్యంగా జిమ్మీ కార్టర్ విభిన్న మానసిక, శారీరక శక్తులు మనల్ని ఆశ్చర్యపరుస్తాయి. ఆయన అతి చిన్న వయస్సు నుండే వేరుశనగ పంట పని చైతన్యమంతా మెదడుకెక్కించాడు. తండ్రిలా షూ మేకర్ అయ్యాడు. బ్రహ్మాండమైన నేవీ ఎలెక్ట్రికల్ ఇంజినీర్ అయ్యాడు. అన్నిటినీ మించి తన 95వ సంవత్సరం వరకు తాను పెట్టిన స్వచ్ఛంద సంస్థ 'హబిటాట్ ఫర్ హ్యుమానిటీ' తరపున కార్పెంటర్‌గా ఎన్నో దేశాల్లో వేలాది ఇండ్లు కట్టించాడు. స్వయంగా 400కు పైగా ఇండ్లు కట్టాడు. ఈ పనులన్నీ చేస్తూ 22 పుస్తకాలు రాశాడు. 95వ ఏటి వరకు తన ఇంటి సమీపంలోని స్కూళ్లలో పాఠాలు చెప్పేవాడు. గొప్ప ఉపన్యాసకుడు. వీటన్నిటితోపాటు, జార్జియా స్టేట్ గవర్నర్. ఆ తరువాత అమెరికా 39వ అధ్యక్షుడు. ఆ మెదడు బలంతో క్యాన్సర్‌ను గెలిచి 100 సంవత్సరాలు బతికాడు. మానవ మెదడు చిప్ లాక్ చెయ్యబడి ఉండకపోతే ఒక మనిషి ఎన్ని పనులు చెయ్యగలడో జిమ్మీ కార్టర్ నిరూపించాడు.



ఒకే వృత్తి, ఒకే కులం పెళ్ళిళ్లు మన మెదళ్లకు తాళం వేశాయి.

కృత్రిమ మేధ ప్రపంచంలో...

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రపంచాన్ని ఏం చెయ్యబోతున్నదోనని చాలా చర్చ జరుగుతోంది. చాలా పనులు ఏఐ తప్పులు జరక్కుండా మనిషిని మించి చెయ్యగలదు. కనుక మును ముందు మానవులకు పని మాయమై, క్రమంగా మానవాళి జీవనమే ఆగిపోతుందా అనేది సమస్య. ఇజ్రాయెల్‌కు చెందిన యువల్ నోవా హరారీ పదేపదే ఈ విషయమే చెబుతున్నాడు. ఐతే మానవ మెదడుకు ఉన్న కొత్త ఆలోచన సృష్టి ఏఐకి ఉండదు. ఇప్పటివరకు ప్రపంచంలో సృష్టించబడ్డ ఆలోచనలను క్రోడీకరించి ప్రపంచంలో ఏ మూలన జీవిస్తున్న వారికైనా అది అందిస్తుంది. కానీ కొత్త క్రియాశీల ఆలోచనలు, అంచనాలను మానవ మెదడు మాత్రమే చెయ్యగలదు. ఐతే దాదాపు 140 కోట్ల జనాభా ఉన్న మన దేశంలో కుల–ఏకవృత్తి పెళ్ళిళ్ళ వల్ల తరాలు, తరాలు లాక్ చెయ్యబడ్డ మెదళ్ళతో పుట్టాం. అందుకే అతి చిన్న దేశంలోని ఇజ్రాయెలీలు సృష్టించగలిగిన కొత్త ఆలోచనలు మన దేశంలోని మనుషులు చెయ్యలేకపోతున్నారు. మత మూఢ నమ్మకాలు తర తరాల మెదళ్ళను క్రియేటివ్ ఆలోచనలోకి పోనియ్యక పోవడం కూడా మరో ప్రతిబంధకం. ఇది మన దేశంలో జరిగింది. ఇతర దేశాల్లో కూడా జరిగింది. ముస్లిం దేశాల్లోనూ ఈ సమస్య కనిపిస్తుంది.

వేల ఏండ్లు మెదడు చిప్ లాకై ఉన్నప్పుడు అలా ఉన్నదని సమాజం కనుక్కోడానికే చాలా కాలం పడుతుంది. దళితులు, ఆదివాసులు, శూద్రులు, స్త్రీలలో చదువుకునే అవకాశం లేనప్పుడు ఇంత పెద్ద మానవ జెనెటిక్ సైన్సు సమస్య ఉన్నదని గుర్తించడం, దానికి పరిష్కారం వెతుక్కోవడం, దాన్ని కులాల చేత, మతాల చేత ఒప్పించడం చాలా పెద్ద సమస్య. మన దేశంలో ఈ విధమైన సమస్యను లాబరేటరీకి, సోషల్ సైన్సు పాఠాల్లోకి తీసుకుపోవడం చాలా కష్టం. అయితే ఇతర దేశాల్లోని ప్రయోగాలు, అన్ని రంగాల్లో రచనలు, వీడియో చర్చలు బయటికి వస్తున్న నేపథ్యంలో మన దేశంలో కూడా ఆ సామాజిక వ్యాధిని కనుక్కోకపోయినా, దానికి పరిష్కారాలు వెతక్కపోయినా, మనం ఇతర దేశాలకు మానసిక బానిసలవ్వడం తప్పదు. ఇప్పటికి జరిగింది అదే. ఇక ముందు కూడా జరుగుతుంది. కేవలం మనల్ని మనం జాతీయవాద పొగడ్తల్లో ముంచెత్తుకుంటే మనం ఉపయోగించాల్సిన మెదడు అలాగే లాక్ వెయ్యబడి ఉంటుంది. సమాజం ముందుకు కొత్త ఆలోచన తేగానే కేసులు, దాడులు మామూలయ్యే కుల–మత విలువల్లో అది మరింత నిజం.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక విశ్లేషకుడు

◆ పిల్లలకు చాలా వెనుక తరాల నుండి కూడా ఆలోచనా శక్తి సంక్రమిస్తుందని డాక్టర్ ఒడెడ్ రెచావీ అనే ఇజ్రాయెలీ జన్యుశాస్త్ర నిపుణుడు తన అధ్యయనంలో తేల్చాడు.

◆ మెదడు క్రియాశీల శక్తిని భారతదేశంలో ఒకే కుల వృత్తికి పరిమితం చేసినందువల్ల ఈ తల్లిదండ్రుల సంతానాల మెదళ్ళు పరిమిత అనుభవ, ఆలోచన, క్రియాశీల, కమ్యూనికేషన్ శక్తిని మాత్రమే సొంతం చేసుకుంటున్నాయి.

◆ మానవ మెదడు చిప్ లాక్ చెయ్యబడి ఉండకపోతే ఒక మనిషి ఎన్ని పనులు చెయ్యగలడో చెప్పడానికి అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ జీవితం ఓ ఉదాహరణ.



సోషల్ మీడియా

దారుణ నేరం



సల్వాన్ మోమికాను కాల్చి చంపారు (ఖురాన్‌ను అవమానించాడని స్వీడన్‌లో). ఇది నాకు కోపాన్ని, అసహ్యాన్ని కలిగిస్తోంది. ఈ దారుణ నేరానికి పాల్పడ్డవారికి జీవిత ఖైదు పడాలని కోరుకుంటాను. దారుణ వార్త. ఆయన ఆత్మకు శాంతి కలుగుగాక.

– గీర్ట్ వైల్డర్స్, నెదర్లాండ్స్ నాయకుడు

అన్నిట్లో వాళ్లే



1990ల మధ్యలో పార్లమెంటరీ స్థాయీ సంఘాలు వేయడం మొదలైనప్పటి నుంచీ, పార్లమెంట్ ఒక్క ఎంపీ, ఒక్క స్టాండింగ్ కమిటీ అనే నియమాన్ని అనుసరించింది. కానీ ఇప్పుడు బీజేపీ ఎంపీల్లో 26 మంది రెండు స్టాండింగ్ కమిటీల్లో ఉన్నారు. దీన్నిబట్టే స్థాయీ సంఘాలను ఆ ఇద్దరు ఎలా నియంత్రిస్తున్నారో అర్థమవుతోంది.

– జైరామ్ రమేశ్, కాంగ్రెస్ నేత

రెండు నాలుకలు



కొందరి వ్యవహారం ఎలా ఉంటుందంటే– 'లడ్డూలో జంతు కొవ్వు ఉంది. గుజరాత్‌లోని నా స్నేహితుడి ప్రైవేటు ల్యాబులో నేనే పరీక్ష చేయించాను' అని ఒకరోజు చెబుతారు. మరో సందర్భంలో, మరో రోజు 'దీన్ని రాజకీయం చేయొద్దు. బాధితుల కోసం ప్రార్థించండి. ఇది దురదృష్టకరమేగానీ దీనికి ఎవరినీ నిందించలేం' అని మాట్లాడుతారు.

– పునీత్ పనియా, స్టాండప్ కమెడియన్

జంతువును దాటి...



ఏ పోరాటాన్నయినా మనిషి తన ఆదిమ జంతు ప్రవృత్తిని దాటి, సత్యం, అహింస, సర్వోదయం అనే మూడు ఆయుధాలతో ఎదుర్కోవాలని బోధించావు. డియర్ బాపూ! నీకు ప్రణామం! (జనవరి 30న గాంధీజీ వర్ధంతి.)

– సందీప్ మనుధానె, విద్యావేత్త

ఆ రెండ్రోజుల్లో మాత్రం...



ఇండియాలో ప్రస్తుత ఆర్థికవేత్తల సంఖ్య: 910. ఫిబ్రవరి 1న ఉండే ఆర్థికవేత్తలు: 3,87,89,000. ఫిబ్రవరి 2న ఆ సంఖ్య: 6,94,98,000. మళ్లీ ఫిబ్రవరి 3న ఉండే ఆర్థికవేత్తలు: 910.

– ముకుల్ దేఖనే, సెలబ్రిటీ

ఇన్ బాక్స్

ప్రజా యుద్ధనౌక

ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ (గుమ్మడి విఠల్‌రావు) గొంతు శాశ్వతంగా మూగబోయి పద్దెనిమిది నెలలయింది. దాదాపు అరవై వసంతాలకు పైగా ప్రజలతో మమేకమై... ఎన్నో ప్రజా ఉద్యమాలకు తన మాట, పాటల ద్వారా ఊపిరి నింపిన విప్లవకారుడాయన. నక్సల్బరీ ఉద్యమం, తెలంగాణ ఉద్యమం, దళిత బహుజన ఉద్యమం, సాంస్కృతిక ఉద్యమం... ఇలా అన్ని ఉద్యమాలపైనా తన ముద్ర వేశారు. 'అమ్మా తెలంగాణమా...', 'బండెనక బండి కట్టి...', 'భద్రం కొడుకో...', 'మదనాసుందరి', 'అడవి తల్లికి వందనం' లాంటి వందలాది పాటలతో కొన్ని వేలమందిని 'ఉద్యమం' బాట పట్టించారు. ఆయన రాసి, పాడిన 'నీ పాదం మీద పుట్టుమచ్చనై' పాటకు నంది అవార్డు వచ్చినా ఆయన తిరస్కరించారు.



గద్దర్

దేశంలో దళితుల హత్యలు, హత్యలను వ్యతిరేకిస్తూ అవిశ్రాంతంగా పోరాటం చేశారు. నకిలీ ఎన్‌కౌంటర్లను తీవ్రంగా వ్యతిరేకించారు. అమర వీరుల కుటుంబాలకు చేయూత నిచ్చేవారు. చాలామంది సానుభూతిపరులు, పౌర –ప్రజాసంఘాలు, హక్కుల సంఘాలు, మహిళా సంఘాలు, దళిత బహుజన సంఘాలలో సాంస్కృతిక విప్లవం తెచ్చిన వ్యక్తి ఆయన.

1971లో బి. నరసింగరావు ప్రోత్సాహంతో గద్దర్ 'ఆపర రిక్షా' పేరుతో తన మొదటి పాట రాశారు. ఆయన మొదటి ఆల్బం పేరు 'గద్దర్'. ఇదే ఆయన పేరుగా స్థిరపడింది. ఆయనపై అనేక హత్యా యత్నాలు జరిగినాయి. ముఖ్యంగా 1997 ఏప్రిల్ 6న ఆయనపై ఇంట్లోకి ప్రవేశించి జరిపిన కాల్పుల్లో మరణం అంచుల దాకా వెళ్లి, ప్రాణాలతో బయటపడ్డారు. తన చివరి రోజులలో సామాజిక సమగ్రత, రాజ్యాంగ పరిరక్షణ, అణగారిన వర్గాలకు న్యాయం కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యం అని గ్రహించి ఆ పార్టీ ఏర్పాటు చేసిన సభలలో పాల్గొన్నారు.

ప్రాంతాల మధ్య అంతరాలను, వెనుకబాటుతనాన్ని గట్టిగా వ్యతిరేకించారు. సమాజ పురోభివృద్ధికి ప్రతిబంధకాలు అవిద్య, అజ్ఞానం, మూఢ నమ్మకాలు, మతోన్మాదం, అశ్లీలత అని భావించి ప్రజలలో తన ఆట–పాటల ద్వారా చైతన్యం తీసుకొచ్చారు. 2023 జనవరిలో 'రాయలసీమ ప్రజా సంఘాల వేదిక'లో ప్రసంగించారు. ప్రాంతీయ అసమానతలు తుదముట్టించడానికి లౌకిక ప్రజాతంత్ర ఉద్యమానికి బాసటగా నిలిచారు. తెలుగు నేలపై ప్రజాకళలు ఉన్నంత వరకు గద్దర్ పాట సజీవంగా ఉంటుంది.

– డా.జి. వెన్నెల గద్దర్ । తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్
(నేడు గద్దర్ జయంతి)

రూపాయి పతనంతో ఆర్థిక వ్యవస్థ కుదేలు

సందర్భం



బి.టి. గోవిందరెడ్డి

ఏడాది కాలంగా దేశీ కరెన్సీ 'రూపాయి' తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. అమెరికా డాలర్‌తో పోలిస్తే దీని విలువ 12 నెలల్లోనే రూ. 82.60 నుంచి ఏకంగా రూ. 86.85కు పడిపోవడం ఆందోళనకరమైన అంశం. మారకం విలువ సుమారు 5 శాతం పడిపోవడం దేశ ఆర్థిక వ్యవస్థపై విస్తృత ప్రభావం చూపనుంది. వీటిల్లో ప్రధానంగా చెప్పుకోవాల్సింది ముడి చమురు దిగుమతుల ఖర్చులు పెరిగిపోవడం. చమురు దిగుమతుల్లో ప్రపంచంలోనే మూడో స్థానంలో భారత్ ఉన్నదన్న సంగతి ఈ సందర్భంగా గమనార్హం. 2022–23లో మన ముడిచమురు దిగుమతుల ఖర్చు రూ. 12 లక్షల కోట్లకు చేరుకోగా రూపాయి మారకం విలువలో వచ్చిన మార్పు ఫలితంగా ప్రస్తుతం రూ. 56 వేల కోట్ల అదనపు భారం పడనుంది. చమురు ధరలు పెరిగిపోతున్న కారణంగా వాణిజ్యలోటు, తద్వారా ద్రవ్యోల్బణం ఎక్కువై ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన ఒత్తిడికి లోనవుతోంది.

భారత్ ఏటా సుమారు 170 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు దిగుమతి చేసుకుంటోంది. దిగుమతుల ఖర్చుల్లో ముడిచమురు వాటానే 30 శాతం వరకూ ఉంది. రూపాయి మారకం విలువ ఏడాది కాలంలో రూ. 82.60 నుంచి రూ. 86.85కు పడిపోవడంతో దిగుమతి ఖర్చులు 5 శాతం వరకూ పెరిగినట్లే. రోజువారీ చమురు దిగుమతుల ఖర్చులు రూ. 411 కోట్ల వరకూ ఉండగా వీటితోపాటు రవాణా, ఉత్పత్తి ఖర్చులు కూడా పెరుగుతాయి. దీంతో అన్ని రకాల సరుకుల ధరలు ఎగబాకుతాయి. పెరిగిన ఖర్చులు వినియోగదారుల ఖాతాల్లో వేయడం వల్ల ద్రవ్యోల్బణం ఎక్కువవుతోంది.

రూపాయి ఎందుకు చిక్కిపోతోంది?

రూపాయి విలువ తగ్గిపోయేందుకు కారణాల్లో ముఖ్యమైనది అమెరికన్ డాలర్ బలపడుతూ ఉండటమని చెప్పవచ్చు. ఆర్థిక విషయాల్లో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ కొన్ని కఠిన చర్యలు తీసుకోవడంతో డాలర్ విలువ పెరుగుతోంది. అదే సమయంలో మిగిలిన కరెన్సీల విలువ తగ్గుతోంది. అంతేకాకుండా... ఆర్థిక అనిశ్చితి అనుమానాలు సర్వత్రా వినిపిస్తున్న తరుణంలో చాలామంది డాలర్‌ను సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తూండటం కూడా దాని విలువ పెరిగేందుకు కారణమవుతోంది. డాలర్ విలువ పెరగడం బంగారం వంటి కమాడిటీ ధరలపై కూడా ప్రభావం చూపుతుంది. డాలర్ బలపడిన కొద్దీ బంగారం ధరలూ పెరిగిపోతాయి. భారత్ లాంటి బలహీన కరెన్సీ ఉన్న దేశంలో ఇది మరికొంచెం ఎక్కువగా ఉంటుంది.



రూపాయి మారకం విలువ తగ్గిపోవడం వాణిజ్య లోటు పెరిగిపోయేందుకు కారణమవుతుంది. 2023లో దేశ ఎగుమతుల్లో వృద్ధి (3,350 లక్షల కోట్ల రూపాయలు) నమోదైనా, దిగుమతుల ఖర్చు పెరిగిపోవడం వల్ల ప్రయోజనం లేకుండా పోయింది. ఈ తేడా కూడా భారత రూపాయి విలువ తగ్గిపోయేందుకు ఒక కారణమైంది.

2022లో భారత విదేశీ మారక ద్రవ్య నిల్వలు సుమారు 58 లక్షల కోట్ల రూపాయల వరకూ ఉండగా 2023 నాటికి ఇది 48 లక్షల కోట్లకు తగ్గింది. ఫలితంగా విదేశీ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో రూపాయి విలువను స్థిరీకరించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కు ఉన్న సామర్థ్యం తగ్గిపోయింది. తగినన్ని విదేశీ మారక నిల్వలు లేని పరిస్థితుల్లో కరెన్సీ విలువల నియంత్రణ కష్టతరమవుతుంది. రూపాయి మరింత పడిపోకుండా ఉండేందుకు ఆర్‌బీఐ తన వద్ద ఉన్న విదేశీ మారక నిల్వలను ఉపయోగించవచ్చు కానీ ఇది తాత్కాలిక పరిష్కారం మాత్రమే. దీర్ఘకాలంలో మాత్రం ముడిచమురు దిగుమతులను వీలైనంత తగ్గించుకోవడంపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ఇంధన వనరుల్లో వైవిధ్యానికి ప్రాధాన్యమిస్తూ దేశీయంగా చమురు అన్వేషణను ముమ్మరం చేయడం; సౌర, పవన విద్యుత్తుల వాడకాన్ని మరింత ఎక్కువ చేయడం అవసరం. ఈ రంగాల్లో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు గట్టి ప్రయత్నం జరగాలి. దీంతోపాటే విదేశీ చమురుపై ఆధారపడటాన్ని తగ్గించడం, ఎగుమతులను పెంచుకోవడం అవసరం. సేవల రంగం విషయానికి వస్తే ఐటీ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయి. తయారీ రంగం కూడా మరింత బలం పుంజుకోవాల్సిన అవసరం ఉంది. తద్వారా అభివృద్ధిలో సమతౌల్యం ఏర్పడగలదు. ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్, ఆటోమొబైల్ రంగాలపై ఎక్కువ దృష్టి పెట్టడం ద్వారా మాత్రమే వాణిజ్య లోటును అధిగమించే అవకాశం ఉంది. అప్పుడే రూపాయి మారక విలువల్లో ఒడిదుడుకులను నియంత్రించడమూ సాధ్యమవుతుంది. ఇంధన రంగంలో స్వావలంబన సాధించేందుకు అన్ని రకాల ప్రయత్నాలూ చేస్తే మన ఆర్థిక వ్యవస్థ విదేశీ శక్తుల ప్రభావానికి లోనుకాకుండా ఉంటుంది.

రూపాయి మారకం విలువ తగ్గిపోవడం సామాన్యుడిపై నేరుగా ప్రభావం చూపుతుందన్నది తెలిసిందే. దేశ ప్రధాన నగరాల్లో ఇప్పటికే ఇంధన ధరలు లీటర్‌కు వంద రూపాయలు దాటిపోయాయి. దీనివల్ల వస్తు సేవల ధరలు కూడా ఎక్కువవుతాయి. 2023 డిసెంబర్‌లో ద్రవ్యోల్బణం 6.2 శాతానికి చేరుకుంది. నోబెల్ బహుమతి పొందిన ఆర్థికవేత్త మిల్టన్ ఫ్రైడ్‌మ్యాన్ చెప్పినట్లు.. 'కరెన్సీ బలహీన పడినప్పుడు ద్రవ్యోల్బణం పెరిగిపోయి సమాజంలో అట్టడుగున ఉన్నవారు తీవ్రంగా ప్రభావితమవుతారు' అన్నది ఇప్పుడు వాస్తవ రూపం దాలుస్తోంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

పని చెయ్యడమే!

సూఫీ సాధువులలో అత్యంత ప్రముఖులు ఇబ్రహీం. ఆయన జీవనశైలి నిరాడంబరమైనది. ఇబ్రహీం నిశ్చలమైన ధ్యానం ప్రాముఖ్యాన్ని నొక్కి చెప్పారు. ఆయన కుటుంబం అరబ్ మూలాలతో కూడినది. ఇప్పటి అఫ్గానిస్తాన్‌లోని బాల్ఖ్‌లో జన్మించారు. కొంతమంది చరిత్రకారుల ప్రకారం,



ఆయన 2వ రషీద్ ఖలీఫా ఉమర్ మాతృ వంశానికి చెందినవారు. సన్యాసిగా మారడానికి సింహాసనాన్ని విడిచి పెట్టారు. తన జీవితంలో పాక్షికంగా సంచార జీవనం గడిపారు. ఆయన భిక్షాటనను అసహ్యించుకున్నారు. జీవనోపాధి కోసం అవిశ్రాంతంగా పని చేశారు.

ఒకానొకమారు ఇబ్రహీం ఓ ధనవంతుడిని కలుసుకున్నారు. అతడు ఆయన జ్ఞాని అని తెలియక తోటమాలిగా నియమించాడు. కొన్ని రోజులు గడిచాయి. ఒకరోజు ఆ ధనవంతుడి ఇంటికి కొందరు స్నేహితులు వచ్చారు. అందరూ కలిసి తోటలోకి ప్రవేశించారు. ఇబ్రహీంను చూసి తమకు తినడానికి మంచి మామిడిపళ్ళు కావాలని అడిగారు. సరేనని ఇబ్రహీం పండ్లు కోసిచ్చారు. వాటిని తిన్న మిత్రులు పుల్లగా ఉన్నాయని ధనవంతుడితో అన్నారు. అప్పుడు ధనవంతుడు ఇబ్రహీంను పిలిచి 'ఏమిటీ పళ్ళన్నీ పుల్లగా ఉన్నాయంటున్నారు... చాలా కాలంగా తోటలో పని చేస్తున్నావు. ఏ పండ్లు పుల్లటివో, ఏవి తియ్యటివో తెలియవా' అని కసురుకున్నాడు. అందుకు ఇబ్రహీం చాలా నిదానంగా, ప్రశాంతంగా ఇలా జవాబిచ్చారు: 'మీరు నాకు తోటమాలి పని అప్పజెప్పారు తప్ప పండ్లు తినమని చెప్పలేదు. తింటే కదా వాటి రుచి తెలిసేది?'

ఈ సంఘటన తర్వాతే ఆ ధనవంతుడికి తన ఎదుట ఉన్న వ్యక్తి సామాన్యుడు కాదని, గొప్ప జ్ఞాని అని తెలుసుకున్నారు. కొన్ని నిముషాల ముందు కసురుకున్నందుకు తనను క్షమించమని ప్రాధేయపడ్డాడు ధనవంతుడు.

సాధువుగా ఉండాలనుకుంటే, ఈ లోకంలోని లేదా పరలోకంలోని వస్తువులను కోరుకోవద్దని ఇబ్రహీం చెప్పేవారు. దృష్టంతా ఆ దేవునిమీదే కేంద్రీకరించినప్పుడే మిమ్మల్ని తన సాధువుగా చేసుకుంటాడనేవారు. 'ముసుగులు తొలగించినప్పుడే ఆనందం తలుపు తెరవబడుతుంద'న్నది ఆయన సూక్తి.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.విదియ సా.4.21 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** ధనిష్ఠ ఉ.8.09 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** ప.3.03 నుండి 4.31 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.52 నుండి 9.40 వరకు, తదుపరి ప.12.39 నుండి 1.27 వరకు, **అమృత ఘడియలు:** రా.12.14 నుండి 1.44 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.50.

క్లుప్తంగా...

దివ్యాంగులకిచ్చిన హామీలన్నీ అమల్లోకి వచ్చాయి: సీఎం


సీఎం రేవంత్‌ను కలసిన ముత్తినేని వీరయ్య

సాక్షి, హైదరాబాద్: ప్రజాప్రభుత్వంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలన్నీ అమల్లోకి వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వికలాంగులకు ఉన్నత విద్యా సంస్థల్లో 5 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మొదటి ప్రాధాన్యత కల్పించడం, ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీలో ప్రాధాన్యత ఇస్తూ ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందించినందుకు రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

చదువుకు తగ్గ కొలువు దక్కలేదని..

- సాగర్‌కాల్వలో దూకి జూనియర్ అసిస్టెంట్ ఆత్మహత్య

మిర్యాలగూడ అర్బన్: చదువుకు సంబంధం లేని ఉద్యోగం చేయాల్సి వస్తోందన్న మనస్తాపంతో ఒక యువకుడు సాగర్ కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం బెజ్జికల్ గ్రామానికి చెందిన నూనె రాములు, నిర్మల రెండో కుమారుడు ప్రవీణ్‌కుమార్ (30) బీటెక్ పూర్తి చేసి గ్రూప్–4 పరీక్ష రాసి గత డిసెంబర్ 28న మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరాడు. ప్రభుత్వ సంక్షేమ పథకాల క్షేత్రస్థాయి సర్వే పని ఒత్తిడితో మానసికంగా ఇబ్బంది పడుతున్నట్లు పలు సందర్భాల్లో తల్లిదండ్రులకు చెప్పుకున్నాడు. తెలంగాణ జెన్‌కో నిర్వహించిన పరీక్షలో విద్యుత్ ఏఈ పోస్టు ఇంటర్వ్యూకు 1:2లో ఎంపికైన ప్రవీణ్‌కుమార్.. కొద్ది తేడాతో ఏఈ ఉద్యోగం చేజారడంతో తీవ్ర మానసిక క్షోభకు గురయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం విధులకు హాజరైన ప్రవీణ్‌కుమార్ రాత్రి ఇంటికి ఫోన్‌చేసి తల్లికి బాధ చెప్పుకోగా.. ఎప్పటిలాగే సర్దిచెప్పింది. అయితే, బుధవారం ప్రవీణ్‌కుమార్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా కలవకపోవడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం దొండవారిగూడెం వద్ద సాగర్‌కాల్వలో ప్రవీణ్‌కుమార్ మృతదేహం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

మావోయిస్టు కేంద్ర కమిటీ నుంచి హిడ్మా తొలగింపు

సాక్షి, అమరావతి: దండకారణ్యంలో వరుసగా తగులుతున్న ఎదురుదెబ్బలు మావోయిస్టు పార్టీపై పెను ప్రభావం చూపుతున్నాయి. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ నుంచి మద్వీ హిడ్మాను ఆ పార్టీ అగ్రనాయకత్వం తొలగించింది. దండకారణ్యంలో కేంద్ర బలగాలను ఎదుర్కోవడంలో వైఫల్యం చెందారనే కారణంతోనే హిడ్మాను తొలగించినట్టు తెలుస్తోంది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఆంధ్ర–ఒడిశా సరిహద్దు(ఏవోబీ) స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి రామచంద్రారెడ్డి అలియాస్ చలపతితోపాటు 16 మంది మావోయిస్టులు ఇటీవల హతమైన నేపథ్యంలో హిడ్మాను తొలగించడం గమనార్హం. వాస్తవానికి చలపతి నాయకత్వంలోనే హిడ్మా మావోయిస్టు పార్టీలో కీలక నేతగా ఎదిగారు. ప్రధానంగా మిలటరీ ఆపరేషన్ల ప్రణాళిక, నిర్వహణ చలపతి నుంచే ఆయన నేర్చుకున్నారు. వారిద్దరిదీ గురుశిష్యుల బంధంగా చెబుతారు. 2017లో ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మాలో భద్రతా బలగాలపై దాడికి హిడ్మానే నేతృత్వం వహించారు. దాంతో ఆయనకు పదోన్నతి కల్పిస్తూ కేంద్ర కమిటీ సభ్యునిగా నియమించారు. 2022 తరువాత ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల నుంచి మావోయిస్టు అగ్రనేతలు ఛత్తీస్‌ఘడ్ సరిహద్దులకు తరలిపోయారు. అప్పటి నుంచే చలపతి, హిడ్మా మధ్య విభేదాలు ఏర్పడినట్టు తెలుస్తోంది. చలపతి దీర్ఘకాలంగా అనారోగ్యంతో ఉండటంతో ఒడిశాలోని మావోయిస్టు పార్టీ వ్యూహాలను హిడ్మానే పర్యవేక్షిస్తున్నారు.

చెప్పారంటే చేయరంతే!

ఇదీ ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నైజం

ఏటా జనవరి 1న జాబ్ కేలండర్ ప్రకటిస్తామని హామీ

- జనవరి పోయె.. ఫిబ్రవరి వచ్చె.. జాబ్ కేలండర్ ఏది?



వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

వాష్‌రూంలో టూత్‌బ్రష్.. మీ పళ్లు మటాష్!!

- సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల తాజా అధ్యయనంలో వెల్లడి
- వాష్‌రూంలలోని బ్యాక్టీరియా టూత్ బ్రష్‌లపై చేరుతోందని స్పష్టీకరణ
- బ్రష్‌ల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోకపోతే అనారోగ్యం తప్పదని హెచ్చరిక



'మీ టూత్‌పేస్ట్‌లో ఉప్పుందా?'.. అంటూ వచ్చే టీవీ యాడ్‌ను చూసే ఉంటారుగా.. దృఢమైన దంతాలు, చిగుళ్ల కోసం ఉప్పున్న తమ పేస్ట్‌నే వాడాలంటూ ఓ ప్రముఖ టూత్‌పేస్ట్ కంపెనీ చేసుకొనే ప్రచారం అది. మరి మీ టూత్‌బ్రష్‌లు వాష్‌రూంలో ఉంటాయా? బ్రష్ చేసుకొని తిరిగి వాటిని అక్కడే ఉంచుతారా? అయితే మీకు పంటి సమస్యలు తప్పవని తాజా అధ్యయనం తేల్చిచెబుతోంది!!

సాక్షి, సిద్దిపేట: దంతాలు ఆరోగ్యంగా ఉండాలంటే సరైన టూత్‌పేస్ట్‌ను ఎంపిక చేసుకోవడం ఒక్కటే సరిపోదని.. టూత్‌బ్రష్‌లను సరైన చోట ఉంచడం కూడా ముఖ్యమని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు చేపట్టిన పరిశోధన తేల్చిచెబుతోంది. టూత్‌బ్రష్‌లపై ప్రధానంగా మూడు రకాల బ్యాక్టీరియాలు ఉంటున్నాయని.. బ్రష్‌ల వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే అనారోగ్యాలకు గురికావాల్సి వస్తుందని హెచ్చరిస్తోంది.

వాష్‌రూంలలో ఉంచితే అంతే..

అటాచ్డ్ వాష్‌రూంలు ఉన్న ఇళ్లలో నివసించే వారిలో చాలా మంది తమ టూత్‌బ్రష్‌లను భద్రపరుస్తుండటం సహజమే. అయితే అలా వినియోగిస్తున్న టూత్‌బ్రష్‌లపై భారీగా సూక్ష్మజీవులు పేరుకుపోతున్నాయని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల అధ్యయనంలో తేలింది. టూత్ బ్రష్‌లను వాష్‌రూంలో ఉంచడం వల్ల ఫ్లష్ చేసిన ప్రతిసారీ కమోడ్ నుంచి నీటితుంపర్లు ఎగిరిపడతాయని.. తద్వారా కమోడ్‌లో ఉండే బ్యాక్టీరియా నీటితుంపర్ల ద్వారా గాల్లో వ్యాపిస్తూ అక్కడ ఉండే బ్రష్‌లపైకి ఎక్కువగా చేరుతున్నాయని నిర్ధారణ అయింది. అదే వాష్‌రూంకు దూరంగా, కాస్త గాలి, ఎండ తగిలే చోట టూత్‌బ్రష్‌లను ఉంచిన చోట సూక్ష్మక్రిములు నశిస్తున్నట్లు పరిశోధనలో వెల్లడైంది. అలాగే ఇంట్లోని అందరి టూత్‌బ్రష్‌లను కూడా ఒకే దగ్గర పెట్టడం అంత సురక్షితం కాదని నిరూపితమైంది.

45 రోజులపాటు సాగిన పరిశోధన

టూత్ బ్రష్‌ల శుభ్రత, సూక్ష్మక్రిముల నుంచి సంరక్షణ అనే అంశంపై సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు పరిశోధన చేపట్టారు. కళాశాల సూక్ష్మ జీవశాస్త్ర ఇన్‌చార్జి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మదన్ మోహన్ పర్యవేక్షణలో 45 రోజులపాటు పరిశోధన చేశారు. కళాశాలకు చెందిన విద్యార్థులు, ఆధ్యాపకులు వినియోగిస్తున్న టూత్‌బ్రష్‌ల నుంచి 100 నమూనాలను శ్వాబ్‌ల ద్వారా సేకరించారు. వాటిలో బ్యాక్టీరియా ఉందా? ఉంటే ఏయే రకాల సూక్ష్మక్రిములు ఉన్నాయనే దానిపై పరిశోధన చేపట్టారు.

మూడు రకాల బ్యాక్టీరియాల గుర్తింపు

శాంపిల్స్ సేకరించిన టూత్‌బ్రష్‌లలో ప్రధానంగా మూడు రకాల బ్యాక్టీరియాలు ఉన్నట్లు విద్యార్థులు గుర్తించారు. స్ట్రెప్టోకోకస్ మ్యుటాన్స్ రకం బ్యాక్టీరియా 50 శాతం, స్టెఫైలోకోకస్ ఆర్యస్ 40 శాతం, ఎస్చెరిషియా కోలి (ఈ–కొలి) బ్యాక్టీరియా 20 శాతం ఉన్నట్లుగా తేల్చారు. పిప్పిపళ్లు, దంతాల క్షీణత, అరుగుదలకు స్ట్రెప్టోకోకస్ మ్యుటాన్స్ బ్యాక్టీరియా కారణమవుతుందని చెప్పారు. అలాగే స్టెఫైలోకోకస్ ఆర్యస్ వల్ల గొంతు సమస్యలు, మౌత్ అల్సర్, ఈ–కోలి బ్యాక్టీరియా వల్ల జీర్ణసంబంధ సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

యూవీ లైట్‌తో బ్యాక్టీరియా మాయం

బ్యాక్టీరియా ఉన్న బ్రష్‌లను ఆయా విద్యార్థులు సొంతంగా తయారు చేసిన యూవీ లైట్‌బాక్స్‌లో పెట్టి పరీక్షించగా వాటిపై ఎలాంటి క్రిములు లేవని తేలింది. టూత్ బ్రష్‌లను వినియోగించే ముందు యూవీ లైట్ బాక్స్‌లో 5 నుంచి 10 నిమిషాలపాటు ఉంచడం ద్వారా బ్రష్ శానిటైజ్ అవుతుందన్నారు. మరోవైపు ఒకవేళ బ్రష్‌లను ఒకేచోట పెట్టాల్సి వస్తే వాటికి క్యాప్‌లను పెట్టాలని ఈ ప్రయోగంలో పాలుపంచుకున్న విద్యార్థులు సూచిస్తున్నారు. ప్రతిరోజూ వేడినీటితో బ్రష్‌ను శుభ్రం చేశాకే వాడాలని.. మూడు నెలలకోసారి టూత్ బ్రష్‌ను తప్పనిసరిగా మార్చాలని చెబుతున్నారు.

ప్రజలకు అవగాహన కల్పించేందుకే

ప్రిన్సిపాల్ సునీత సూచనలతో సూక్ష్మజీవశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మదన్‌మోహన్ పర్యవేక్షణలో టూత్ బ్రష్‌ల శుభ్రత, సూక్ష్మక్రిముల నుంచి సంరక్షణపై పరిశోధన చేశాం. ప్రజలకు అవగాహన కల్పించాం. యూవీ బాక్స్‌ను సైతం తయారు చేశాం.



– మౌనిక, షారోన్, నాగలక్ష్మి, సిద్ధ, స్నేహ, సుష్మిత విద్యార్థులు

ప్రభుత్వ జిజ్ఞాస పోటీలకు పంపుతాం..



ప్రతి సంవత్సరం ఏదో ఒక అంశంపై పరిశోధన చేస్తాం. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం నిర్వహించే జిజ్ఞాస పోటీలకు పంపిస్తున్నాం. టూత్ బ్రష్‌ల ద్వారా బ్యాక్టీరియా వ్యాప్తి చెందుతోందన్న విషయమై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పరిశోధన చేపట్టాం.

– డాక్టర్ మదన్ మోహన్, సూక్ష్మజీవశాస్త్ర విభాగాధిపతి

నేడు గిరిజన దర్బార్

- ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లో ఏర్పాట్లు పూర్తి
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు దూరం


సమావేశానికి ముస్తాబవుతున్న దర్బార్ హాల్

సాక్షి, ఆదిలాబాద్: నాగోబా జాతర సందర్భంగా శుక్రవారం గిరిజన దర్బార్ నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఇందులో ప్రజాప్రతినిధులు పాల్గొనడం లేదు. ముందుగా నిర్ణయించిన ప్రకారం.. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దర్బార్‌కు వస్తారని అనుకున్నప్పటికీ కోడ్ నేపథ్యంలో వారు పాల్గొనే అవకాశాలు లేవని చెపుతున్నారు. నాగోబా పూజల్లో మాత్రం మంత్రి సీతక్క పాల్గొంటారని తెలుస్తోంది. ఇదిలా ఉండగా నాగోబా జాతరలో.. గిరిజన దర్బార్‌కు అత్యంత ప్రాముఖ్యం ఉంది. 1940 కాలంలో గిరిజన పోరాట యోధుడు కొమురం భీం వీర మరణం తర్వాత అప్పటి నైజాం సర్కార్.. గిరిజనుల్లో అసంతృప్తి, తిరుగుబాటుకు కారణం ఏమిటనే విషయంపై పరిశోధన కోసం మానవ పరిణామ శాస్త్రవేత్త, లండన్‌కు చెందిన హైమన్‌డార్ఫ్‌ను నియమించారు. ఆయన అప్పట్లో తన భార్య బెట్టి ఎలిజబెత్‌తో ఇక్కడికి వచ్చి జైనూర్ మండలం మార్లవాయిలో స్థిరపడ్డారు. ఆయన ఆదివాసీల జీవితాలపై పరిశోధించడమే కాకుండా వారి సమస్యలు తెలుసుకొని పరిష్కారంకోసం ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. గిరిజనుల కోసం విద్య, ఇతర పథకాలను అమలు చేసేలా కృషి చేశారు. ఇదిలా ఉంటే గిరిజనులు అత్యధిక సంఖ్యలో కేస్లాపూర్‌లో కలుస్తారని, అక్కడ గిరిజన దర్బార్ ఏర్పాటు చేయాలని 1942 ప్రాంతంలో హైమన్‌డార్ఫ్ ప్రభుత్వానికి సూచించారు. ఈ దర్బార్‌లో గిరిజనులు అధికారుల వద్ద తమ సమస్యలను చెప్పుకొనేవారు. అధికారుల ద్వారా వారి వినతులు నైజాం సర్కార్ వరకు చేరేవి. ఆ తర్వాత కూడా ప్రభుత్వాలు ఇదే పద్ధతిని కొనసాగిస్తూ వచ్చాయి. నాగోబా జాతరను అధికారికంగా నిర్వహించడమే కాకుండా ఏటా గిరిజన దర్బార్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంటారు. ఈ దర్బార్‌లో అనేక కౌంటర్లు ఏర్పాటు చేసి గిరిజనుల నుంచి సంక్షేమ పథకాలకు సంబంధించిన దరఖాస్తులు తీసుకుంటారు. ఏటా జరిగే ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున గిరిజనులు తరలి వస్తారు.

10 రోజుల్లో ఫీజు బకాయిలు ఇవ్వకుంటే సచివాలయ ముట్టడి

- బీసీ విద్యార్థుల సమర శంఖారావ సభలో అఖిలపక్ష నేతల హెచ్చరిక


సంఘీభావం తెలుపుతున్న ఈటల, మధుసూదనాచారి, జాన్‌వెస్లీ, జాజుల తదితరులు


కవాడిగూడ: రాష్ట్ర ప్రభుత్వం వారం–పది రోజుల్లోగా బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తామని అఖిలపక్ష నేతలు హెచ్చరించారు. బీసీ విద్యార్థులకు నష్టం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలుపుతామన్నారు. ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల విద్యార్థుల ఉసురు పోసుకుంటోందని విమర్శించారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో బీసీ విద్యార్థుల సమర శంఖారావం మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు.


ఫీజు పోరుకు అండగా ఉంటాం..

ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ రూ. 4,600 కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, కాలేజీ యాజమాన్యాలను ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. గత ప్రభుత్వం దారిలోనే నడుస్తోందని దుయ్యబట్టారు. దీనిపై బీసీ విద్యార్థుల పోరాటానికి బీజేపీ అండగా ఉంటుందని హామీనిచ్చారు. రాష్ట్ర ఖజానాను కాంట్రాక్టర్‌ల జేబులు నింపేందుకు వాడుతున్న ప్రభుత్వం బీసీ విద్యార్థులను అరిగోస పెడుతోందని మధుసూదనాచారి దుయ్యబట్టారు. బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్ బకాయిలు విడుదలయ్యే వరకు బీసీ విద్యార్థులకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందన్నారు. తెలంగాణ కోసం పోరాడిన విద్యార్థులను అక్కున చేర్చుకోవాల్సింది పోయి వారి ఉన్నతవిద్యకు నిధులు కేటాయించకుండా ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని జాన్‌వెస్లీ ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల తరహాలోనే బీసీ విద్యార్థులకు మొత్తం ఫీజును ప్రభుత్వం చెల్లించేలా నిర్ణయం తీసుకోకపోతే వేలాది మంది బీసీ విద్యార్థులతో సచివాలయాన్ని ముట్టడిస్తామని జాజుల హెచ్చరించారు.

భుజంగరావు, రాధాకిషన్‌రావుకు బెయిల్

- ఫోన్‌ట్యాపింగ్ కేసులో హైకోర్టు ఉత్తర్వులు
- పలు షరతులు విధించిన న్యాయస్థానం
- మరో నిందితుడు శ్రవణ్‌కుమార్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు


భుజంగరావు


రాధాకిషన్‌రావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులు మాజీ అడిషనల్ ఎస్పీ నాయిని భుజంగరావు, మాజీ డీసీపీ రాధాకిషన్‌రావులకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఇదే కేసులో తాజాగా సుప్రీంకోర్టు మరో నిందితుడికి ఇచ్చిన బెయిల్‌ను, నిందితులు సుదీర్ఘ కాలం జైలులో ఉన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ఉత్తర్వులిస్తున్నట్లు పేర్కొంది. అయితే, కోర్టు నిందితులకు పలు షరతులు విధించింది. రూ.లక్ష చొప్పున సొంత పూచీకత్తు, 2 ష్యూరిటీలు సమర్పించాలని ఆదేశించింది. 8 వారాలపాటు ప్రతీ సోమవారం ఉదయం 11 గంటలకు ఎస్‌హెచ్‌ఓ ముందు హాజరుకావాలని స్పష్టం చేసింది. ఆ తర్వాత కూడా అవసరమై విచారణాధికారి కోరితే హాజరుకావాలని తెలిపింది. నిందితులు తమ పాస్‌పోర్టులను వెంటనే ట్రయల్‌కోర్టుకు సమర్పించాలని చెప్పింది. పోలీసుల దర్యాప్తునకు సహకరించాలని, సాక్ష్యులను బెదిరించడం, కలవడం, దర్యాప్తును ప్రభావితం చేయడం లాంటివి చేయవద్దని, మీడియాతో కేసు గురించి మాట్లాడవద్దని హైకోర్టు స్పష్టం చేసింది. బెయిల్ షరతులు ఉల్లంఘిస్తే తదుపరి చర్యలు తీసుకునే స్వేచ్ఛను పోలీసులకు ఇచ్చింది. ఫోన్‌ట్యాపింగ్ కేసుకు సంబంధించి 2024, మార్చిలో భుజంగరావు, రాధాకిషన్‌రావులను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సల నిమిత్తం భుజంగరావుకు నాంపల్లి కోర్టు గత ఆగస్టులో మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అప్పటి నుంచి న్యాయస్థానాలు మధ్యంతర బెయిల్ పొడిగిస్తూ ఉండటంతో ఆయన బయటే ఉన్నారు. ఈ నేపథ్యంలో రెగ్యులర్ బెయిల్ కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు, చంచల్‌గూడ జైలులో ఉన్న రాధాకిషన్‌రావు కూడా బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్ వేశారు. ఇద్దరి పిటిషన్లపై వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన గురువారం తీర్పు వెలువరించారు.

సుప్రీంకోర్టు ఉత్తర్వులు పరిగణనలోకి..

ఇదే కేసులో మరో నిందితుడు తిరుపతన్నకు సుప్రీంకోర్టు తాజాగా బెయిల్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ ఉత్తర్వుల కాపీని పిటిషనర్ల న్యాయవాదులు హైకోర్టుకు సమర్పించారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాలను, నిందితులు సుదీర్ఘకాలం జైలులో ఉన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుని షరతులతో బెయిల్ మంజూరు చేస్తున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు. మరో నిందితుడు ఎ.శ్రవణ్‌కుమార్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది.

23న స్వర్ణగోపురానికి మహా కుంభ సంప్రోక్షణ

- ఫిబ్రవరి 19 నుంచి 23వ తేదీ వరకు యాదగిరిగుట్టలో ప్రత్యేక పూజలు
- పుణ్య నదుల నుంచి జలాలు సేకరించి సంప్రోక్షణ వేడుక
- దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్


అర్చక బృందం ముందు జెండా ఊపుతున్న దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్. చిత్రంలో కలెక్టర్ హనుమంతరావు, ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ దివ్య విమాన స్వర్ణ గోపురానికి ఫిబ్రవరి 23న మహా కుంభ సంప్రోక్షణ నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.శ్రీధర్ తెలిపారు. గురువారం ఆయన యాదగిరీశుడిని దర్శించుకున్నారు. అనంతరం కలెక్టర్ హనుమంతరావు, ఈవో భాస్కర్‌రావు, పోలీస్, రెవెన్యూ, దేవాలయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఫిబ్రవరి 19 నుంచి 23వ తేదీ వరకు మహా కుంభ సంప్రోక్షణ ఉత్సవ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. దేశంలో ఉన్న అన్ని పుణ్య నదుల నుంచి పవిత్ర జలం సేకరించి, మహా కుంభ సంప్రోక్షణ నిర్వహించేందుకు సంకల్పించామన్నారు. ఇందులో భాగంగా దేవస్థాన అర్చక, వేద పండితులను పవిత్ర నదీ జలాల సేకరణకు పంపిస్తున్నామని చెప్పారు. ఈ వేడుకలకోసం చేపట్టాల్సిన చర్యలు, వచ్చే వీవీఐపీలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు ఏర్పాట్లు, భక్తులకు సదుపాయాలకు సంబంధించి అంశాలపై ఆయా శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు. అంతకు ముందు ఆయన బంగారం తాపడం పనులను పరిశీలించారు. ఈ సమీక్షలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, దేవాదాయ శాఖ అదనపు డిప్యూటీ కమిషనర్ లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు.

ఊపిరి తీసిన 'ఉపాధి'

- బండరాళ్లు మీద పడి తల్లీకూతురు మృతి
- ఘటనపై విచారణకు మంత్రుల ఆదేశం


మమత


సారవ్వ

సాక్షి, హైదరాబాద్/హుస్నాబాద్: సిద్దిపేట జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఉపాధి హామీ పనులు చేస్తుండగా బండరాళ్లు పడటంతో తల్లీకూతురు మృత్యువాత పడ్డారు. గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన కందారపు సారవ్వ (50), అన్నాజీ మమత (32) తల్లీకూతుళ్లు. ఉపాధి హామీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీరు గ్రామ శివారులోని సంజీవరాయిని గుట్ట వద్ద మట్టి తవ్వకాల పనులకు వెళ్లారు. మట్టి బలంగా ఉండటంతో తవ్వడానికి సులువుగా ఉంటుందని పనిచేసే ప్రదేశంలో రాత్రి వేళ నీళ్లను పట్టారు. రోజు మాదిరిగానే పనులు చేస్తుండగా ఒక్కసారిగా దాదాపు 10 బండరాళ్లు నేలకూలాయి. అక్కడే పనిచేస్తున్న సారవ్వ, మమతపై బరువైన బండరాళ్లతో పాటు మట్టి పెళ్లలు పడి భూమిలో కూరుకుపోయారు. ఈ ప్రమాదంలో వారిద్దరూ అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

విచారణకు మంత్రుల ఆదేశం..

బండరాళ్లు పడి ఇద్దరు మహిళలు మృతి చెందిన ఘటనపై మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ వేర్వేరుగా తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. తక్షణ సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ మనుచౌదరితో ఫోన్‌లో మాట్లాడారు. అలాగే ఘటనపై విచారణకు ఆదేశించారు. ప్రమాదం జరిగే అవకాశం ఉన్న ఆ ప్రాంతంలో పనులు చేయొద్దని వారం రోజుల క్రితమే జిల్లా అధికారులు హెచ్చరించినా.. పనులు కొనసాగడం పట్ల మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు.

వాహనం ఢీకొని చిరుత మృతి

- మెదక్ జిల్లా నార్సింగి మండలంలో ఘటన


మృతి చెందిన చిరుత

చిన్నశంకరంపేట(మెదక్): గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో చిరుత పులి మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా నార్సింగి మండలం వల్లూర్ అటవీ ప్రాంతంలో జరిగింది. గురువారం రాత్రి నార్సింగి–వల్లూర్ మధ్యన నర్సరీ సమీపంలో రహదారిపై తీవ్రగాయాలతో పడి ఉన్న చిరుతను వాహనదారులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వైద్యం కోసం చిరుతను తరలించేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో మృత్యువాత పడింది. మెదక్ జిల్లా అటవీ శాఖ అధికారి జోజీ, రామాయంపేట రేంజి ఆఫీసర్ అక్కడికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. ముందు ఒక వాహనం ఢీకొన్న అనంతరం చిరుత పరుగెత్తేందుకు ప్రయత్నించిన క్రమంలో మరో వాహనం ఢీకొని ఉండవచ్చని, నడుముకు, పొట్ట భాగంలో తీవ్ర గాయాలు కావడంతో అది మృతి చెందిందని అటవీశాఖ అధికారులు తెలిపారు.

తెలంగాణ సచివాలయంలో నకిలీ ఉద్యోగి

- రెవెన్యూ శాఖలో ఉద్యోగిగా చెప్పుకుంటూ హల్‌చల్
- సహకరించిన డ్రైవర్


భాస్కర్‌రావు

సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలో నకిలీ ఉద్యోగి ప్రవేశం కలకలం సృష్టించింది. సచివాలయంలోని రెవెన్యూ శాఖలో ఉద్యోగినంటూ ఫేక్‌ఐడీలతో చెలామణి అవుతూ ఖమ్మంకు చెందిన భాస్కర్‌రావు పలువురిని మోసం చేసినట్లు తెలుస్తోంది. సెక్రటేరియట్‌లోని కీలక మంత్రుల పేర్లు చెబుతూ పనులు చేయిస్తానంటూ, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ గత కొద్ది రోజులుగా భాస్కరరావు ప్రచారం చేసుకుంటున్నట్లు సమాచారం. ఇతనిపై అనుమానం రావడంతో సచివాలయ ప్రధాన భద్రతాధికారి (సీఎస్‌వో) దేవీదాస్ ఆదేశాల మేరకు నిఘా పెట్టారు. ఈనెల 27న సీఎం రేవంత్‌రెడ్డి ప్రెస్‌మీట్ సమయంలో భాస్కరరావు సచివాలయంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించాడు. ఇతని కదలికలపై నిఘాపెట్టి పూర్తి ఆధారాలు సేకరించి రెవెన్యూ శాఖలో ఉద్యోగిగా ఫేక్ ఐడీ కార్డుతో చెలామణి అవుతున్నట్టు గుర్తించారు. భాస్కరరావుకు మైనారిటీ డిపార్ట్‌మెంట్ సెక్షన్ ఆఫీసర్ డ్రైవర్ రవి సహకరించినట్టు తెలుస్తోంది. ఎస్పీఎఫ్ ఇంటెలిజెన్స్ ఏఎస్ఐ యూసుఫ్, హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు వీరిని పట్టుకున్నారు. సైఫాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కాగా, తమకు మాకు అందిన సమాచారంతో గత కొద్ది రోజుల నుంచి నకిలీ ఉద్యోగి మీద నిఘా పెట్టి పట్టుకున్నట్టు సచివాలయ సీఎస్‌వో దేవీదాస్ తెలిపారు. 'ఇప్పటివరకు ఏమేం అక్రమాలు చేశారు. ఎవరినైనా ఆర్థికంగా మోసం చేశారా.. సెక్రటేరియట్‌లో వీరికి ఎవరు సహకరించారు అనే కోణంలో విచారిస్తున్నట్టు చెప్పారు.

గగనతలంలో మృత్యుకేళి

అమెరికా రాజధాని వాషింగ్టన్ డి.సి.లో ఘోర ప్రమాదం

- ఆర్మీ హెలికాప్టర్‌ను ఢీకొట్టిన ప్రయాణికుల విమానం
- పాటోమాక్ నదిలో కూలిన రెండు లోహ విహంగాలు.. 67 మంది మృతి
- 28 మృతదేహాలు వెలికితీత... మరో 39 మంది జాడ గల్లంతు
- ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని ట్రంప్ ప్రకటన


పాటొమాక్ నదిలో విమాన శకలాల వద్ద గాలింపు చర్యలు

అర్లింగ్టన్: అమెరికా రాజధాని వాషింగ్టన్ డి.సి. సమీపంలో ఘోర ప్రమాదం సంభవించింది. అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ప్రయాణికుల విమానం ఎయిర్‌పోర్టులో ల్యాండవుతున్న సమయంలో ఆర్మీ హెలికాప్టర్‌ను ఢీకొట్టింది. దాంతో వెంటనే అవి రెండూ నదిలో కూలిపోయాయి. ప్రమాద సమయంలో విమానంలో 60 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది, హెలికాప్టర్‌లో ముగ్గురు సైనికులు ఉన్నారు. ఇప్పటిదాకా 28 మంది మృతదేహాలను నది నుంచి వెలికితీయగా, మిగతా ప్రయాణికుల జాడ తెలియరాలేదు. వారంతా మరణించి ఉంటారని అధికారులు చెబుతున్నారు. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం రాత్రి 8.30 గంటల సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. అమెరికా చరిత్రలో అతిపెద్ద విమాన ప్రమాదాల్లో ఇది కూడా ఒకటి కావడం గమనార్హం. అమెరికా అధ్యక్షుడి అధికారిక నివాసమైన వైట్‌హౌస్‌కు, క్యాపిటల్ భవనానికి కేవలం మూడు మైళ్ల దూరంలోనే ఈ ప్రమాదం జరిగింది. అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఈ విమానాన్ని పీఎస్‌ఏ ఎయిర్‌లైన్స్ నిర్వహిస్తోంది. కాన్సాస్‌లోని విషిటా నుంచి బయలుదేరిన విమానం వాషింగ్టన్ డి.సి. సమీపంలోని రోనాల్డ్ రీగన్ నేషనల్ ఎయిర్‌పోర్టు రన్‌వేపై ల్యాండయ్యేందుకు సిద్ధమవుతూ అమెరికా రక్షణ శాఖకు చెందిన సికోర్‌స్కీ హెచ్–60 బ్లాక్‌హాక్ హెలికాప్టర్‌ను గగనతలంలో ఢీకొట్టింది. దాంతో పెద్ద శబ్దం చేస్తూ రెండు లోహ విహంగాలు పాటోమాక్ నదిలో కూలిపోయాయి. సమాచారం అందుకున్న వెంటనే అధికారులు రంగంలోకి దిగి, నదిలో గాలింపు చర్యలు ప్రారంభించారు. రోనాల్డ్ రీగన్ నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి విమానాల రాకపోకలను నిలిపివేశారు. విమానం, హెలికాప్టర్ చాలావరకు నీటిలో మునిగిపోయాయి. ఇప్పటిదాకా 28 మృతదేహాలను నది నుంచి వెలికితీసినట్లు ప్రకటించారు. మిగిలిన వారు జీవించి ఉంటారన్న నమ్మకం తమకు లేదని అగ్నిమాపక శాఖ అధికారి జాన్ డాన్లీ చెప్పారు. విమాన ప్రయాణికుల్లో చాలామంది ఫిగర్ స్కేటింగ్ క్రీడాకారులు, వారి కోచ్‌లు, కుటుంబ సభ్యులే ఉన్నారు. వీరంతా విషిటాలో శిక్షణా తరగతుల్లో పాల్గొని తిరిగి వస్తున్నారు. ఇద్దరు కోచ్‌లను రష్యాకు చెందిన ఎవ్‌గెనియా సిస్కోవా, వాదిమ్ నౌమోవ్‌గా గుర్తించారు. వీరు 1994లో ఫిగర్ స్కేటింగ్‌లో వరల్డ్ చాంపియన్‌షిప్స్ పెయిర్స్ టైటిల్ గెలుచుకున్నారు. రెండు సార్లు ఒలింపిక్ క్రీడల్లో పోటీపడ్డారు.


విమానం, హెలికాప్టర్ ఢీకొన్నప్పటి దృశ్యం

దర్యాప్తు ప్రారంభం

ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్, నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఆర్మీ హెలికాప్టర్‌ను ఢీకొట్టిన బాంబార్డియర్ సీఆర్‌జే–701 ట్విన్ ఇంజన్ విమానం 2004లో కెనడాలో తయారయ్యింది. ఇందులో 70 మంది ప్రయాణించవచ్చు. ప్రమాద సమయంలో విమానం భూమి నుంచి 400 అడుగుల ఎత్తులో ఉంది. గంటకు 140 మైళ్ల వేగంతో ప్రయాణిస్తోంది. రీగన్ ఎయిర్‌పోర్టులోని రన్‌వే 33పై ల్యాండ్ చేయాలని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు సూచించగా, పైలట్ అంగీకరించాడు. రన్‌వేపై దిగడానికి విమానం సిద్ధమైంది. సరిగ్గా పాటోమాక్ నది మధ్య భాగంపై గగనతలానికి చేరుకున్న సమయంలో హెలికాప్టర్‌ను ఢీకొట్టింది. ఇదంతా క్షణాల వ్యవధిలో జరిగిపోయింది. రన్‌వేకు 2,400 అడుగుల దూరంలో విమానంలోని రేడియో ట్రాన్స్‌పాండర్ నుంచి సమాచారం ఆగిపోయింది. విమానం ప్రయాణిస్తున్న మార్గంలోకి హెలికాప్టర్ ఎందుకు వచ్చిందన్నది తెలియరాలేదు. ప్రమాదం జరిగినప్పుడు వాషింగ్టన్‌లో గడ్డకట్టేంత చలి ఉంది. పాటోమాక్ నదిలో నీళ్లు అత్యంత చల్లగా ఉన్నాయి. తాజా దుర్ఘటన నేపథ్యంలో 1982లో జరిగిన విమాన ప్రమాదాన్ని వాషింగ్టన్ ప్రజలు గుర్తుచేసుకున్నారు. 1982 జనవరి 13న ఎయిర్ ఫ్లోరిడా విమానం పాటోమాక్ నదిలో కూలిపోయింది. 78 మంది మరణించారు. ప్రతికూల వాతావరణం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. వాషింగ్టన్ డి.సి.కి దక్షిణ భాగంలో పాటోమాక్ నది పక్కనే రీగన్ నేషనల్ ఎయిర్‌పోర్టు ఉంది. ఈ ఎయిర్‌పోర్టు నుంచి రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు ఆసక్తి చూపిస్తుంటారు. ఎందుకంటే విమానంలో ఉన్నవారికి వైట్‌హౌస్, వాషింగ్టన్ మాన్యుమెంట్, లింకన్ మెమోరియల్, నేషనల్ మాల్, యూఎస్ క్యాపిటల్ వంటి ప్రఖ్యాత కట్టడాలు చక్కగా కనిపిస్తాయి.

హెలికాప్టర్ ఎందుకు తప్పించుకోలేదు?: ట్రంప్

రాజధాని జరిగిన దుర్ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. ఈ దుర్ఘటనలో ఎవరూ ప్రాణాలతో మిగలలేదన్నారు. గగనతలంలో విమానం స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ ఆర్మీ హెలికాప్టర్ ఎందుకు తప్పించుకోలేకపోయిందని ట్రంప్ ప్రశ్నించారు. విమానం ఢీకొట్టకుండా పక్కకు మళ్లడమో లేదా పైకి లేదా కిందికు వెళ్లడమో ఎందుకు జరగలేదని అన్నారు. ఇది నివారించదగ్గ ప్రమాదమేనని స్పష్టంచేశారు. 2001 నవంబర్ 12 తర్వాత అమెరికాలో ఒక విమాన ప్రమాదంలో మొత్తం ప్రయాణికులు, సిబ్బంది మృతిచెందడం ఇదే మొదటిసారి. 2001 నవంబర్ 12న కెన్నడీ ఎయిర్‌పోర్టు నుంచి వచ్చిన విమానం న్యూయార్క్‌ని బెల్లీ హార్బర్‌లో కూలిపోయింది. ఆ ప్రమాదంలో విమానంలోని మొత్తం 260 మంది దుర్మరణం పాలయ్యారు.

నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు

ఒకటో తేదీన సాధారణ బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న విత్త మంత్రి నిర్మల

- వక్ఫ్ సవరణ బిల్లు సహా 16 బిల్లులు సభలో ప్రవేశపెట్టనున్న కేంద్రం
- అఖిలపక్ష భేటీలో అన్ని పార్టీల సహకారం కోరిన కేంద్రం
- ఫిబ్రవరి 13 వరకు తొలి సెషన్

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాలో తొక్కిసలాట జరిగి 30 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనలో యోగి, మోదీ ప్రభుత్వాలపై విపక్షాలు దుమ్మెత్తిపోస్తున్న వేళ ఈ అంశంపై పార్లమెంట్‌లో వాడీవేడీ వాదనలు జరగడం ఖాయంగా కనిపిస్తోంది. సమావేశాలు ప్రారంభమైన తొలిరోజు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి లోక్‌సభ హాల్‌లో ప్రారంభోపన్యాసం చేస్తారు. అనంతరం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సామాజిక, ఆర్థిక సర్వే నివేదికను లోక్‌సభలో, రాజ్యసభలో ప్రవేశపెడతారు. శనివారం నిర్మల లోక్‌సభలో 2025–26 సాధారణ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఫిబ్రవరి రెండో తేదీన రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. ఈ చర్చకు రాజ్యసభ, లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం ఇస్తారు. బడ్జెట్ సమావేశాల తొలి సెషన్ జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 దాకా, రెండోసెషన్ మార్చి 10 నుంచి ఏప్రిల్ 4వ తేదీ దాకా జరుగుతుంది.

నిలదీసేందుకు విపక్షాల వ్యూహరచన

మోదీ సర్కార్‌ను నిలదీసేందుకు విపక్షాలు వ్యూహరచన చేస్తున్నాయి. ముఖ్యంగా దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, రైతుల కష్టాలు, కుంభమేళాలో అపశ్రుతి సహా కేంద్ర–రాష్ట్ర సంబంధాలు, చైనా సరిహద్దు వివాదం వంటి ప్రధాన అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని విపక్షాలు నిర్ణయించాయి. రాష్ట్రపతి ప్రసంగాన్ని సైతం కొన్ని రాజకీయ పార్టీలు బహిష్కరించి వాకౌట్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. రైతులు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలపై సీపీఐ, సీపీఎం పార్టీలు, చైనా సరిహద్దు వివాదాలు, రూపాయి పతనం, బడా కార్పొరేట్లకు మాత్రం అన్ని కాంట్రాక్టులు దక్కేలా కుట్ర వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేలా కాంగ్రెస్ వ్యూహాన్ని సిద్ధంచేశాయి.

సహకరించాలన్న మోదీ సర్కార్

శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలకు ముందు కేంద్ర ప్రభుత్వం గురువారం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఉభయ సభలు సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కేంద్ర మంత్రులు కోరారు. దేశం ఎదుర్కొంటున్న ముఖ్య సమస్యలతో పాటు రాష్ట్రాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై చర్చకు అవకాశం ఇవ్వాలని పలు పార్టీలు డిమాండ్‌చేశాయి. మహాకుంభమేళాలో భక్తులను గాలికొదిలేసి వీఐపీ సంస్కృతికి యోగి ప్రభుత్వం జై కొట్టిందని, ఈ నిర్లక్ష్య ధోరణిపై చర్చ జరపాలని కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు పట్టుబట్టగా ఎజెండాలో ఏమేం ఉండాలో సభావ్యవహారాల సలహా కమిటీ నిర్ణయిస్తుందని మంత్రి కిరెణ్ రిజిజు చెప్పారు.

వక్ఫ్ సహా కీలక బిల్లులు ఈ సమావేశాల్లోనే..

ఈ సమావేశాల్లోనే అత్యంత కీలకమైన వక్ఫ్ సవరణ బిల్లును కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. ఈ బిల్లును సమీక్షించేందుకు ఏర్పాటుచేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ తన నివేదికను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు గురువారం సమర్పించింది. వక్ఫ్ సవరణ బిల్లును గత ఏడాది లోక్‌సభలో ప్రభుత్వం ప్రవేశపెట్టడం తెల్సిందే. కాగా గురువారం నాటి అఖిలపక్ష భేటీలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లుల జాబితాను అఖిలపక్ష నేతలకు ప్రభుత్వం అందజేసింది. ఈ జాబితాలో వక్ఫ్ సవరణ బిల్లు సైతం ఉంది. 16 బిల్లులను ఈ సెషన్‌లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఉభయసభల ముందుకొచ్చే బిల్లుల జాబితాలో బ్యాంకింగ్ చట్టాల(సవరణ) బిల్లు, రైల్వే(సవరణ) బిల్లు, విపత్తు నిర్వహణ బిల్లు, చమురు క్షేత్రాల(సవరణ) బిల్లు, షిప్పింగ్ బిల్లు, వైమానిక వస్తువుల ప్రయోజనాల పరిరక్షణ బిల్లు, త్రిభువన్ సహకారీ యూనివర్సిటీ బిల్లు, వలసల, విదేశీయుల బిల్లు వంటివి ఉన్నాయి.

డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ పైలట్‌గా శుభాంశు శుక్లా

వాషింగ్టన్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో అడుగుపెట్టిన మొట్ట మొదటి భారతీయుడిగా శుభాంశు శుక్లా రికార్డుకెక్క బోతున్నాడు. స్పేస్‌ఎక్స్ సంస్థ అభివృద్ధి చేసిన డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌కు పైలట్‌గా వ్యవహరించబోతున్నాడు. ఇందుకు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా అనుమతి మంజూరు చేసింది. యాక్సియోమ్–4 మిషన్‌లో భాగంగా నలుగురు ప్రైవేట్ వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకోనున్నారు. 14 రోజుల తర్వాత తిరిగి వస్తారు. ప్రయోగంలో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) సైతం భాగస్వామిగా మారింది. డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌కు నాసా మాజీ వ్యోమగామి పెగ్గీ విట్సన్ సారథ్యం వహించనున్నా డు. పోలాండ్‌కు చెందిన ఉజ్‌నాన్‌స్కీ, హంగేరీకి చెందిన టిబోర్ కపూ సైతం ఇందులో పాలుపంచుకుంటున్నారు. మొత్తం నలుగురు అస్ట్రోనాట్స్ డ్రాగన్ అంతరిక్ష నౌకలో ఐఎస్ఎస్‌కు చేరుకుంటారు. త్వరలో ఈ ప్రయోగం చేపట్టడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుభాంశు శుక్లా ప్రస్తుతం భారత వైమానిక దళంలో గ్రూప్ కెప్టెన్‌గా పనిచేస్తున్నాడు. యాక్సియోమ్–4 మిషన్‌కు ఎంపికయ్యాడు. నాసాతో పాటు యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ, జపాన్ ఏరో స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీల్లో శిక్షణ పొందాడు.



‘జన్మతః పౌరసత్వ రద్దు’ బిల్లు సెనేట్‌కు

వాషింగ్టన్: అక్రమంగా లేదంటే తాత్కాలిక వీసాల మీద వలస వచ్చిన వాళ్లకు అమెరికాలో పిల్లలు పుడితే వారికి సంక్రమించే జన్మతః పౌరసత్వాన్ని రద్దుచేస్తూ రూపొందించిన బిల్లును అమెరికా పార్లమెంట్ ఎగువసభ(సెనేట్)లో అధికార రిపబ్లికన్ పార్టీ సభ్యులు గురువారం ప్రవేశపెట్టారు. పుట్టే పిల్లలకు ఎలాగూ పౌరసత్వం వస్తుందన్న ఏకైక కారణంతోనే అక్రమ వలసలు విపరీతంగా పెరుగుతున్నాయని, ఇది జాతీయ భద్రతను బలహీనపరుస్తోందని ఈ బిల్లును ప్రవేశపెట్టిన రిపబ్లికన్ సభ్యులు లిండ్సే గ్రాహమ్, టెడ్ క్రజ్, కేటీ బ్రిట్‌లు సెనేట్‌లో వ్యాఖ్యానించారు. ‘‘ఇన్నాళ్లూ జన్మతః పౌరసత్వాన్ని ప్రసాదించిన ప్రపంచంలోని 33 దేశాల్లో అమెరికా కూడా ఒకటిగా కొనసాగింది. ఈ విధానం చివరకు ‘పుట్టుకల పర్యాటకం’లా తయారైంది. ఉన్నంతలో స్థితిమంతులైన చైనా, ఇతర దేశాల పౌరులు ఉద్దేశపూర్వకంగా అమెరికాకు వచ్చి ఇక్కడ పిల్లల్ని కనేసి తమ సంతానానికి అమెరికా పౌరసత్వం దక్కేలా చేస్తున్నారు. అమెరికాకు ఇంతమంది రావడానికి జన్మతః పౌరసత్వం కూడా ఒక ప్రధాన కారణం’’ అని రిపబ్లికన్ నేతలు చెప్పారు. జన్మతః పౌరసత్వాన్ని రద్దుచేస్తూ ట్రంప్ ఇచ్చిన కార్యనిర్వాహక ఉత్తర్వును విపక్ష డెమొక్రటిక్ పాలిత రాష్ట్రాలు ఫెడరల్ కోర్టులో సవాల్ చేసి ఉత్తర్వు అమలుపై స్టే తెచ్చుకున్న వేళ రిపబ్లికన్ సర్కార్ బిల్లును ప్రవేశపెట్టడం గమనార్హం.

సిరియా తాత్కాలిక అధ్యక్షుడిగా షరా

దమాస్కస్: సిరియా తాత్కాలిక అధ్యక్షుడిగా తిరుగుబాటు నేత అహ్మెద్ అల్ షరా నియమితులయ్యారు. ఈ విషయాన్ని అక్కడి తాత్కాలిక ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. తాత్కాలిక శాసనసభను ఏర్పాటు చేసే బాధ్యతను షరాకు అప్పగించినట్లు సిరియా సైనిక అధికారి హసన్ అబ్దెల్ ఘనీ ప్రకటించారు. షరా నాయకత్వం వహిస్తున్న హయత్ తహ్రీర్ అల్–షామ్ (హెచ్‌టీఎస్) నేతృత్వంలోని తిరుగు బాటు కూటమి మెరుపు దాడులు చేసి గత ఏడాది డిసెంబర్ ఎనిమిదో తేదీన అధ్యక్షుడు బషర్ అల్ అసద్ పాలనకు చరమగీతం పాడిన విషయం విదితమే.

రేప్ కేసులో కాంగ్రెస్ ఎంపీ రాకేశ్ రాథోడ్ అరెస్టు

సీతాపూర్ (ఉత్తరప్రదేశ్): కాంగ్రెస్ ఎంపీ రాకేశ్ రాథోడ్‌ను గురువారం ఉత్తరప్రదేశ్ పోలీసులు రేప్ కేసులో అరెస్టు చేశారు. రాథోడ్ పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను బుధవారం అలహాబాద్ హైకోర్టు తిరస్కరించడంతో మరుసటి రోజే పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఇక్కడ స్వగృహంలో రాథోడ్ పత్రికా సమావేశంలో మాట్లాడుతుండగా.. అక్కడికి చేరుకున్న కొత్వాలీనగర్ పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు.


హమాస్ చెర నుంచి విడుదలైన ఆగమ్ బెర్జర్, ఆర్బెల్ యేహూద్, గాడీ మోసెస్

8 మంది బందీలను వదిలేసిన హమాస్

110 మందిని విడుదల చేయనున్న ఇజ్రాయెల్

ఖాన్ యూనిస్(గాజా స్ట్రిప్): హమాస్, ఇజ్రాయెల్ సైన్యం మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం మరో అడుగు ముందుకేసింది. తమ అధీనంలో ఉన్న బందీల్లో ఎనిమిది మందిని హమాస్ సాయుధ సంస్థ గురువారం విడిచిపెట్టింది. ఇందులో ముగ్గురు ఇజ్రాయెలీలు, ఐదుగురు థాయిలాండ్ దేశస్తులున్నారు. తొలుత 20 ఏళ్ల ఇజ్రాయెల్ సైనికురాలు ఆగమ్ బెర్జర్‌ను జబాలియా పట్టణంలో వదిలేశారు. తర్వాత ఇజ్రాయెల్‌కు చెందిన ఆర్బెల్ యేహూద్, గాడీ మోసెస్(80), థాయిలాండ్‌కు చెందిన పోంగ్‌సాక్ థయెన్నా, సథియాన్ సువన్నఖమ్, వాట్చారా శ్రీయావున్, బనావత్ సియాతవో, సురాసక్ లాంనాలను విడిచిపెట్టారు. బందీలంతా క్షేమంగా ఇజ్రాయెల్ భూభాగంలోకి చేరుకున్నారని తర్వాత ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్, ఇజ్రాయెల్ సెక్యూరిటీ ఏజెన్సీ ప్రకటించాయి. ఇందుకు ప్రతిగా వెంటనే ఇజ్రాయెల్ సైతం తమ జైళ్లలో ఖైదీలుగా శిక్ష అనుభవిస్తున్న 110 మంది పాలస్తీనియన్లను విడుదలచేయబోయి అనూహ్య పరిస్థితుల్లో తమ నిర్ణయాన్ని వాయిదావేసుకుంది.

తిట్ల దండకం, ఎగతాళి

తాము విడుదల చేసిన బందీలను హమాస్ సాయుధులు ఖాన్ యూనిస్ పట్టణంలోని హమాస్ ముఖ్యనేత దివంగత యాహ్యా సిన్వర్ ఇంటి సమీప హోస్టేజ్ స్క్వేర్‌లో రెడ్ క్రాస్ ప్రతినిధులకు అప్పగించారు. అయితే ఈ అప్పగింత చూసేందుకు వేలాది మంది పాలస్తీనియన్లు వచ్చారు. పాలస్తీనియన్ల మధ్య నుంచి బందీలను క్షేమంగా తీసుకెళ్లడం రెడ్‌క్రాస్ ప్రతినిధులకు చాలా కష్టమైంది. బందీలను పాలస్తీనియన్లు ఇష్టమొచ్చినట్లు తిట్టడం, ఎగతాళిగా మాట్లాడటం కనిపించింది. వందలాది మంది పాలస్తీనియన్ల మధ్య నుంచి మహిళా బందీ ఆర్బెల్ యేహూద్ భయంభయంగా నడిచి వెళ్లిన దృశ్యాలు మీడియాలో ప్రసారమయ్యాయి. దీంతో విడుదలైన బందీల భద్రత ప్రమాదంలో పడిందని, ఈ నేపథ్యంలో జైళ్లలోని ఖైదీలను ఇప్పటికిప్పుడే వదిలేదిలేదని ఇజ్రాయెల్ స్పష్టంచేసింది. అప్పటికే జైళ్ల నుంచి ఖైదీలతో బయల్దేరిన వాహనాలను మళ్లీ జైళ్లలోకి రప్పించింది. దీంతో పాలస్తీనియన్ల విడుదల అర్ధంతరంగా ఆగింది. హమాస్ నుంచి విడుదలైన బందీలు క్షేమంగా తమ వద్దకు చేరుకున్నాకే ఖైదీలను వదిలేస్తామని ఇజ్రాయెల్ స్పష్టంచేసింది.

సీఈసీ రాజకీయాలు చేస్తున్నారు

- పదవీ విరమణ తర్వాత పెద్ద హోదా కోరుకుంటున్నారు
- ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆగ్రహం

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) రాజీవ్ కుమార్ రాజకీయాలు చేస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. యమునా నదిని హరియాణాప్రభుత్వం విషపూరితం చేస్తోందంటూ తాను చేసిన వ్యాఖ్యలకు గాను ఎన్నికల సంఘం నోటీసు ఇవ్వడం పట్ల అభ్యంతరం వ్యక్తంచేశారు. కేజ్రీవాల్ గురువారం మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సంఘం విశ్వసనీయతను రాజీవ్ కుమార్ దెబ్బతీస్తున్నారని, పదవీ విరమణ తర్వాత పెద్ద హోదాను కోరుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘానికి రాజీవ్ కుమార్ కలిగిస్తున్న నష్టం గతంలో ఎవరూ కలిగించలేదని ఆక్షేపించారు. రాజకీయాలపై ఆసక్తి ఉంటే ఎన్నికల్లో పోటీ చేయాలని ఆయనకు సూచించారు. తాను బతికి ఉన్నంత వరకూ ఢిల్లీ ప్రజలను విషపూరిత జలాలు తాగనివ్వనని కేజ్రీవాల్ తేల్చిచెప్పారు. రెండు రోజుల్లో తనను అరెస్టు చేస్తారని తెలుసని, అయినప్పటికీ భయపడబోనని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ చేతులు కలిపాయని, ఢిల్లీ ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయని మండిపడ్డారు. హరియాణా ముఖ్యమంత్రి నాయబ్‌సింగ్ సైనీపై కేజ్రీవాల్ విరుచుకుపడ్డారు. యుమునా నది నీరు తాగకపోయినా తాగినట్లు ఆయన డ్రామాలాడుతున్నారని విమర్శించారు. యమునా నది నీటిలో విష రసాయనాలు కలవకుండా చర్యలు తీసుకోవాలని తమ ముఖ్యమంత్రి అతిశీ కోరితే సైనీ పట్టించుకోలేదని ఆక్షేపించారు. యమునా నీటిని సీసాల్లో నింపి బీజేపీ, కాంగ్రెస్ పెద్దలకు ఇస్తామని, వారు ఆ నీటిని తాగితే... తాము చేసిన ఆరోపణలన్నీ తప్పు అని ఒప్పుకుంటామని చెప్పారు. తన సవాలును అమిత్ షా, నాయబ్‌సింగ్ సైనీ, రాహుల్ గాంధీ స్వీకరించాలని డిమాండ్ చేశారు.

కేజ్రీవాల్ స్పష్టమైన వివరణ ఇవ్వాలి: ఈసీ



యమునా నదిలో అమ్మోనియం స్థాయి పెరగడాన్ని విషంతో ముడిపెట్టొద్దని అరవింద్ కేజ్రీవాల్‌కు ఎన్నికల సంఘం సూచించింది. యమునా నది నీటి విషయంలో కేజ్రీవాల్ ఇచ్చిన వివరణపై ఎన్నికల సంఘం సంతృప్తి చెందలేదు. హరియాణా ప్రభుత్వంపై చేసిన ఆరోపణలకు ఆధారాలు ఏమిటో చెప్పాలని, అందుకు మరో అవకాశం ఇస్తున్నామని స్పష్టంచేసింది. ఈ మేరకు ఎన్నికల సంఘం గురువారం కేజ్రీవాల్‌కు లేఖ రాసింది. బుధవారం ఇచ్చిన వివరణలో స్పష్టత లేదని పేర్కొంది. శుక్రవారం ఉదయం 11 గంటల కల్లా పూర్తిస్థాయిలో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అందులో అన్ని అంశాలు ఉండాలని పేర్కొంది. తమ ఎదుట హాజరు కాకపోతే తగిన చర్యలు తీసుకోక తప్పదని తేల్చిచెప్పింది. ఎన్నికల సంఘం నుంచి లేఖ వచ్చిన తర్వాత కేజ్రీవాల్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి, సీఈసీ రాజీవ్ కుమార్‌పై ఆరోపణలు గుప్పించారు.

తాత్కాలిక జడ్జీలను నియమించుకోండి

హైకోర్టులకు సుప్రీంకోర్టు అనుమతి

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా హైకోర్టులో 18 లక్షలకుపైగా క్రిమినల్ కేసులు పోగుబడటంతో ఆ కేసుల కొండ కరిగించేందుకు హైకోర్టులకు సుప్రీంకోర్టు అదనపు అధికారాలిచ్చింది. సొంతంగా తాత్కాలిక ప్రాతిపదికన న్యాయమూర్తులను నియమించుకునేందుకు హైకోర్టులకు సర్వోన్నత న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. రెండు లేదా మూడేళ్ల కాలానికి జడ్జీల నియామకానికి అనుమతిస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌ల ధర్మాసనం గురువారం ఉత్తర్వులిచ్చింది. హైకోర్టుల్లో ఇలా అదనపు జడ్జీల నియామకంపై 2021 ఏప్రిల్ 20వ తేదీన విధించిన షరతుల అమలును తాత్కాలికంగా నిలుపుదల చేసింది. ‘‘హైకోర్టుల వారీగా ఆ కోర్టులో అనుమతించిన సామర్థ్యంలో 10 శాతానికి మించి తాత్కాలిక జడ్జీలను తీసుకోవద్దు. ఇద్దరు లేదా ఐదుగురు జడ్జీలను తీసుకోండి. సిట్టింగ్ జడ్జి సూచించిన ధర్మాసనంలో కొత్త జడ్జీలు కూర్చోవాలి. పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులను మాత్రమే వినాలి. డివిజన్ బెంచ్‌లో భాగ స్వాములుగా ఉన్నాసరే శాశ్వత జడ్జీలతోపాటు కాకుండా విడిగా కూర్చుని కేసులను పరిష్కరించాలి’’ అని సుప్రీంకోర్టు గురువారం స్పష్టంచేసింది. షరతులను విధిస్తూ గతంలో నాటి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఎస్ఏ బోబ్డే ఆ తీర్పు చెప్పారు. రిటైర్ అయిన హైకోర్టు జడ్జీలను కేవలం ఒక్కసారి మాత్రమే రెండు లేదా మూడేళ్ల కాలానికి తాత్కాలిక జడ్జీగా నియమించుకోవచ్చని ఆయన తీర్పు చెప్పడం తెల్సిందే. నేషనల్ జుడీషియల్ డేటా ప్రకారం దేశవ్యాప్తంగా హైకోర్టులో 62 లక్షల కుపైగా కేసులు పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నాయి. వీటిలో 18 లక్షలకు పైగా క్రిమినల్ కేసులున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 224ఏ ప్రకారం గతంలో హైకోర్టులో జడ్జిగా చేసి రిటైర్ అయిన వాళ్లను అవసరమైతే తిరిగి తాత్కాలిక జడ్జీలుగా నియమించవచ్చు. అయితే ఈ నిబంధనను కేంద్రప్రభుత్వం అత్యంత అరుదుగా వినియోగించుకుందని ఇటీవల సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

అక్రమ వలసదార్లు గ్వాంటనామోకు

నిర్బంధ కేంద్రాన్ని విస్తరించాలని ఆదేశించిన ట్రంప్ ● నిధుల కోసం కాంగ్రెస్‌ను కోరనున్న ప్రభుత్వం



వాషింగ్టన్: డాక్యుమెంట్లు లేని వలసదార్లను క్యూబాలోని గ్వాంటనామో బేలో ఉన్న అమెరికా నిర్బంధ కేంద్రానికి తరలించనున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. గ్వాంటనామో బేలో 30,000 మంది సామర్థ్యంతో వలసదారుల నిర్బంధ కేంద్రాన్ని నిర్మించాలని ఆదేశించారు. బుధవారం శ్వేత సౌధంలోని ఈస్ట్‌రూమ్‌లో జరిగిన కార్యక్రమం అనంతరం ట్రంప్ మాట్లాడారు. ‘వలసదారుల్లో కొందరు నేరస్తులున్నారని, వారిని స్వదేశాలకు పంపితే తిరిగి అమెరికాకు వచ్చే అవకాశముంది. ఇలా తిరిగిరాకూడదనే ఉద్దేశంతోనే వీళ్లను తిప్పిపంపడానికి బదులు గ్వాంటనామోకు పంపబోతున్నాం. క్యూబాలోని అమెరికా నావికాదళ స్థావరం సమీపంలో దీనిని ఏర్పాటు చేస్తు న్నాం. అమె రికన్లను బెది రిస్తున్న అత్యంత దారుణమైన నేరమయ అక్రమ వలసదార్లను ఈ నిర్బంధ కేంద్రంలో బందిస్తాం. అమెరికా వైపు గా వచ్చే కొత్త వలసదారులను అమెరికా తీరగస్తీ బృందాలు మార్గ మధ్యంలోనే అదుపులోకి తీసుకుని నేరుగా ఈ నిర్బంధ కేంద్రానికే ఇకపై తరలిస్తారు’’ అని ట్రంప్ తెలిపారు. అక్కడ ప్రస్తుతం ఉన్న కేంద్రాన్ని ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) ఆధ్వర్యంలో విస్తరిస్తామని ట్రంప్ ‘బోర్డర్ జార్’ టామ్ హోమన్ తెలిపారు. ఈ నిర్బంధ కేంద్రం నిర్మాణానికి ఎంత ఖర్చవుతుంది? ఎప్పుడు పూర్తవుతుందనే వివరాలను ఇంకా వెల్లడించలేదు. వ్యయ బిల్లులో భాగంగా ఈ కేంద్రం నిర్మా ణం, నిర్వహణ కోసం నిధులు ఇవ్వాలని పార్లమెంట్‌ను ప్రభుత్వం కోరనున్నట్లు సమాచారం.

ఖండించిన క్యూబా

అమెరికా ప్రభుత్వ ప్రణాళికలను క్యూబా ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఆక్రమిత భూముల్లో బందీలను అమెరికా చిత్రహింసలు పెడుతోందని, అక్రమంగా నిర్బంధిస్తోందని ఆరోపించింది. గ్వాంటనామో బేను అమెరికా ఆక్రమించిందని క్యూబా ఆరోపిస్తోంది. ఇక్కడ అమెరికా నావికా స్థావరాన్ని ఏర్పాటుచేయడాన్ని 1959లో ఫిడెల్ కాస్ట్రో ఖండించారు. అమెరికా తీరును ప్రస్తుత క్యూబా అధ్యక్షుడు మిగ్యుల్ దయాజ్–కానెల్ ఖండిస్తూ ‘ఎక్స్’లో ఒక పోస్టు చేశారు. ఈ ప్రకటన మానవ హక్కుల, అంతర్జాతీయ చట్టాల హక్కుల ధిక్కారమని క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రోడ్రిగ్జ్ విమర్శించారు.

వలసదార్ల నిర్బంధ చట్టంపై ట్రంప్ తొలి సంతకం

అక్రమంగా దేశంలో చొరబడి, అమెరికన్లను బెదిరించడం, గాయపరచడం, దోపిడీ, హత్య వంటి నేరాల్లో భాగస్వాములైన అక్రమ వలసదార్లను అదుపులోకి తీసుకునేందుకు ఉద్దేశించిన కీలక లేకెన్ రిలే చట్టంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేశారు. జనవరి 20న అధ్యక్షపీఠంపై కూర్చున్నాక ట్రంప్ ఒక చట్టంపై సంతకం చేయడం ఇదే తొలిసారి. ఈ చట్టం బుధవారం అమల్లోకి వచ్చాక ట్రంప్ మాట్లా డారు. ‘‘ చోరీ, దోపిడీ, దొంగతనం, దుకాణంలో సామాన్లు ఎత్తుకెళ్లడం, పోలీస్ అధికారిపై దాడి, హత్య, అమెరికన్లను గాయపరచడం, హత్యచేయడం వంటి నేరాలు చేసిన అక్రమ వలసదార్లను నిర్బంధించే అధికారం నేటి నుంచి హోం ల్యాండ్ సెక్యూరిటీ విభాగానికి దఖలుపడింది’’ అని ట్రంప్ అన్నారు.

నోబెల్ శాంతి బహుమతికి ఎలాన్ మస్క్ నామినేట్

లండన్: నోబెల్ శాంతి బహుమతి–2025కి ప్రపంచ కుబేరుడు, టెస్లా, స్పేస్‌ఎక్స్, ఎక్స్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్ నామినేట్ అయ్యారు ఈ మేరకు నార్వేజియన్ నోబెల్ కమిటీకి ఒక పిటిషన్ సమర్పించినట్లు యూరోపియన్ పార్లమెంట్ సభ్యుడు బ్రాంకో గ్రిమ్స్ ఫేస్‌బుక్ పోస్టులో పేర్కొన్నారు. ప్రపంచ ప్రఖ్యాత బహుమతికి ఎలాన్ మస్క్ నామినేట్ కావడం ప్రపంచవ్యాప్తంగా భావ ప్రకటనా స్వేచ్ఛను, మానవ హక్కులను కాపాడటానికి ఆయన చేసిన కృషికి ఒక గుర్తింపు అని వెల్లడించారు. గత ఏడాది జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఎలాన్ మస్క్ కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే.



అర్హులందరికీ రేషన్ కార్డులు
కొత్త రేషన్ కార్డుల కోసం ఆందోళన చెందవద్దు. అర్హులందరికీ కార్డులు అందిస్తామంటున్నారు హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ అధికారి ఫణీంద్ర రెడ్డి.
-10లో



షాపింగ్ డిస్‘ఆర్డర్’
గృహిణులు, విద్యార్థులకు, సమయాభావంతో షాపింగ్‌కు వెళ్లలేని వారికి అత్యంత సౌకర్యవంతం ఈ షాపింగ్ ట్రెండ్. కొందరిలో ఇది తీవ్ర స్థాయి వ్యసనంగా మారింది.
- సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
31.0/18.0
నగరంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం పూట పొగమంచు అలుముకుంటుంది. గరిష్టంగా 31, కనిష్టంగా 18 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.





పుష్ప సోయగం!

తీరొక్క మొక్కలు, చూడచక్కని పుష్ప జాతులు ప్రకృతి ప్రేమికులను అలరిస్తున్నాయి. గురువారం నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజా వేదికగా హార్టికల్చర్ షో ప్రారంభమైంది. దాదాపు 150 స్టాళ్లలో అందమైన పూల మొక్కలు కొలువుదీరాయి. చౌక ధరల్లో అందుబాటులో ఉన్నాయి. కిచెన్ గార్డెన్, మెడిసినల్ ప్లాంట్స్, మొక్కలు పెంచుకోవడానికి కావాల్సిన మెటీరియల్‌ను ప్రమోట్ చేసేలా నర్సరీ మేళాను ఏర్పాటు చేశారు. సందర్శకులు, కొనుగోలుదారులతో హార్టికల్చర్ షో సందడిగా కనిపించింది.





కాంగ్రెస్.. ‘ఢీ’ఆర్‌ఎస్!

మార్షల్స్‌తో 33 మంది బీఆర్‌ఎస్ సభ్యులు బలవంతంగా బయటకు

- 3 గంటల వ్యవధిలో 4 పర్యాయాలు సభ వాయిదా
- రసాభాసగా బల్దియా కౌన్సిల్ సమావేశం
- రూ.8440 కోట్లతో 2025-26 బడ్జెట్‌కు ఆమోదం





మేయర్ పోడియం వద్దకు దూసుకెళ్లిన బీఆర్‌ఎస్ సభ్యులతో కాంగ్రెస్ సభ్యుల వాగ్వాదం..

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ చరిత్రలోనే మున్నెన్నడూ లేని విధంగా అసెంబ్లీ తరహాలో మార్షల్స్‌తో సభ్యులను బలవంతంగా బయటకు పంపించిన ఘటన గురువారం చోటుచేసుకుంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల మధ్య జరిగిన వివాదంతో సభాధ్యక్ష స్థానంలోని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సభలో ఉన్న బీఆర్‌ఎస్ కార్పొరేటర్లందరినీ బయటకు పంపించాల్సిందిగా మార్షల్స్‌ను ఆదేశించారు. దాంతో వారు కార్పొరేటర్లను బలవంతంగా బయటకు తీసుకువెళ్లారు. అనంతరం రామ్‌గోపాల్‌పేట పీఎస్‌కు తరలించి, సాయంత్రం వరకు అక్కడే ఉంచారు. దాదాపు మూడు గంటల వ్యవధిలో సభ నాలుగుసార్లు వాయిదా పడింది.

ఆరంభం నుంచే..

సమావేశం ఆరంభం నుంచే రసాభాస చోటు చేసుకుంది. ఉదయం 10.35 గంటలకు సభ ప్రారంభం కాగా 10.40 గంటలకు బడ్జెట్‌పై చర్చ ప్రారంభిద్దామని మేయర్ అన్నారు. తొలుత ప్రశ్నోత్తరాలు చేపట్టాలని బీఆర్‌ఎస్, బీజేపీ సభ్యులు నినాదాలు చేశారు. గందరగోళం చెలరేగడంతో 10.50 గంటలకు మేయర్ సభను వాయిదా వేశారు. ఈ సమయంలోనూ సభ్యుల మధ్య తోపులాట జరిగింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ జూటా అంటూ బీజేపీ సభ్యులు నినాదాలు చేశారు. తిరిగి సభ ప్రారంభమయ్యాక సైతం గందరగోళం ఆగలేదు. ఎలాంటి చర్చ లేకుండానే వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025–26) రూ. 8440 కోట్ల బడ్జెట్‌ను ఆమోదించినట్లు (డీమ్డ్ టూ అప్రూవ్ అంటూ) మేయర్ ప్రకటించారు.

రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే : మంత్రి పొన్నం

జీహెచ్ఎంసీ బడ్జెట్ సమావేశాలను అడ్డుకోవడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేనని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అందుకు బీఆర్‌ఎస్ నాయకత్వం సమాధానం చెప్పాలన్నారు. బడ్జెట్‌ను అడ్డుకోవడం హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకున్నట్టేనన్నారు.

పరిస్థితి అదుపు తప్పిందిలా..

బీఆర్‌ఎస్ సభ్యుల చేతుల్లోని కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా ఉన్న ప్లకార్డుల్ని కాంగ్రెస్ సభ్యులు బాబా ఫసియుద్దీన్, సీఎన్ రెడ్డి తదితరులు చించివేశారు. బడ్జెట్ ప్రతులను బీఆర్‌ఎస్ వారు మేయర్ పోడియంపైకి విసిరారు. పోడియం వద్దకు వెళ్లకుండా కాంగ్రెస్ సభ్యులు వారికి అడ్డు నిల్చున్నారు. కాంగ్రెస్ డౌన్‌డౌన్ అంటూ బీఆర్‌ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. రెండు పార్టీల మధ్య తోపులాట పెరిగి పరిస్థితి అదుపు తప్పింది. ఒక దశలో బాహాబాహీకి సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు సింధు, శాంతి, పద్మా వెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్‌గౌడ్‌లను బయటకు పంపించారు. అనంతరం ప్రశ్నోత్తరాలు ప్రారంభిస్తున్నట్లు మేయర్ ప్రకటించారు. దీంతో బయటకు పంపిన తమ సభ్యులను లోనికి తీసుకురావాల్సిందేనని, లేనిదే తాము చర్చలో పాల్గొనమని బీఆర్‌ఎస్ సభ్యులు మన్నె కవితారెడ్డి తదితరులు పట్టుబట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్య పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారింది. బీఆర్‌ఎస్ సభ్యులందరినీ బయటకు తీసుకెళ్లాల్సిందిగా మేయర్ ఆదేశించడంతో 33 మంది సభ్యులను మార్షల్స్ బలవంతంగా ఎత్తుకెళ్లారు. బయటకెళ్లిన వారు నిరసన ప్రదర్శనకు దిగగా జీహెచ్ఎంసీ కార్యాలయం నుంచి రామ్‌గోపాల్‌పేట పీఎస్‌కు తరలించారు. బీఆర్‌ఎస్ బలంతోనే మేయర్‌గా ఎన్నికైన విజయలక్ష్మి తమనే బయటకు పంపించడం దారుణమని ఆ పార్టీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంకా..

కాంగ్రెస్ వాళ్లు కేటీఆర్ 420 అంటూ, బీఆర్‌ఎస్ వాళ్లు సీఎం రేవంత్‌రెడ్డి 420 అంటూ ఒకరికి వ్యతిరేకంగా ఒకరు ప్లకార్డులు పట్టుకొచ్చారు. సభ ప్రారంభానికి ముందు బీజేపీ సభ్యులు శ్రవణ్, తదితరులు తమకు బడ్జెట్ కేటాయించడం లేదంటూ, మేయర్ ఎంట్రన్స్ వద్ద యాచకుల మాదిరిగా చిప్పలు పట్టుకొని ప్రదర్శన నిర్వహించారు. బాబా ఫసియుద్దీన్ భారత్ జోడో యాత్ర టీషర్ట్ వేసుకొని రావడంపై బీజేపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

70 శాతం ఆదాయం అధికారులకే..

ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు కమిషనర్, సంబంధిత అధికారులు బదులిచ్చారు. వీధిదీపాల సమస్యలు త్వరలో తీరుతాయని, చెత్త సమస్యలు పరిష్కరిస్తామన్నారు. పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్యలున్నాయని డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి తెలిపారు. మేయర్‌తో కలిసి అన్నిడివిజన్లలో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. బల్దియాలో అనవసరంగా ఎందరో అధికారులున్నారని, 70 శాతం జీహెచ్ఎంసీ ఆదాయం వారి జీతభత్యాలకే పోతుండగా, వారి ద్వారా ఒరుగుతున్నదేమీ లేదని కాంగ్రెస్ సభ్యుడు ఉప్పలపాటి శ్రీకాంత్ జీహెచ్ఎంసీ తీరును ఎండగట్టారు. అవసరమైన పారిశుధ్యం వంటి పనులకు మాత్రం సిబ్బంది లేరన్నారు. సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఇలంబర్తి హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ చర్య దుర్మార్గం: కేటీఆర్

జీహెచ్ఎంసీ పాలకమండలి సమావేశంలో హైదరాబాద్ నగరాన్ని పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టినందుకు కార్పొరేటర్ లను అరెస్టు చేయడం దుర్మార్గమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత హైదరాబాద్ నగరానికి నిధులు ఇవ్వడం లేదని కోటి మంది నగర ప్రజల తరఫున ప్రశ్నిస్తే బయటకి గెంటిస్తారా? అని ఆయన ప్రశ్నించారు.

సైబర్ నేరాల నివారణకు ప్రాధాన్యం

- పిరమల్ ఫైనాన్స్ సంస్థ సహకారంతో వీధి నాటికలు



సైబర్ నేరాలపై వీధి నాటిక ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: ఈ ఏడాది సైబర్ నేరాల నిరోధానికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించిన హైదరాబాద్ పోలీసు విభాగం పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుంది. ఇందులో భాగంగా పలు సంస్థల సహకారం తీసుకుంటోంది. ఈ కోణంలో ముందుకు వచ్చిన పిరమల్ ఫైనాన్స్ సంస్థ వీధి నాటికల ద్వారా సామాన్యుల్లో సైబర్ నేరాలపై అవగాహనకు ముందుకు వచ్చింది. ఈ కార్యక్రమాన్ని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ బుధవారం ప్రారంభిచారు. ఆయా సీజన్లలో ఎక్కువగా జరిగే సైబర్ నేరాలు, వాటి తీరుతెన్నుల్ని వివరిస్తూ ఈ నాటికలను డిజైన్ చేశారు. బుధ–గురువారాల్లో ఈ వీధినాటిక బృందం చార్మినార్, బహదూర్‌పురా, నెక్లెస్ రోడ్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మైత్రీవనం, సచివాలయం, కేబీఆర్ పార్క్, మలక్‌పేట, ఐఎస్‌సదన్, సంతోష్‌నగర్, తార్నాక చౌరస్తాలో ప్రదర్శనలు నిర్వహించింది. ఆరు నిమిషాల నిడివితో ఉండే ఈ వీధి నాటిక ప్రస్తుతం తెలుగులోనే అందుబాటులో ఉండగా... రానున్న రోజుల్లో ఆంగ్లం, హిందీ, ఉర్దూల్లోనూ రూపొందించాలని నగర పోలీసు అధికారులు పిరమల్ సంస్థను కోరారు.

సైబర్ బాధితుల్లో విద్యాధికులు సైతం...

సైబర్ నేరాల బారినపడుతున్న వారిలో సామాన్యులే కాదు.. విద్యాధికులు సైతం ఉంటున్నారు. 13 ఏళ్ల నుంచి 86 ఏళ్ల మధ్య వయస్కులు బాధితులుగా మారుతున్నారు. గత ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు కాజేసిన మొత్తం రూ.3500 కోట్ల వరకు ఉంటోంది. డాక్టర్లు, ఇంజినీర్లు, వ్యాపారులతో పాటు సాఫ్ట్‌వేర్ రంగానికి చెందిన వాళ్లూ మోసపోతున్నారు. నాతో కలిసి గోల్ఫ్ ఆడే ఓ ప్రముఖ డాక్టర్ ఏకంగా రూ.15.5 కోట్లు పోగొట్టుకున్నారు. ఆయన్ను అలా ఎలా బాధితుడిగా మారారు? అంటూ ప్రశ్నించాను. ఫోన్ చేసే సైబర్ నేరగాళ్లు హిప్నటైజ్ చేస్తారని, మీ దాకా వస్తే మీకే తెలుస్తుందని వ్యాఖ్యానించారు. ఇలాంటి అనేక మంది నిత్యం మోసపోతున్నారు. ఈ నేపథ్యంలోనే అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాలు, అన్ని రంగాల వారికీ అవగాహన కల్పించాలని నిర్ణయించాం. ఆ మేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం’.
– బుధవారం నాటి సమావేశంలో కొత్వాల్ ఆనంద్

పోలీసు సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ

ఐసీసీసీలో ప్రారంభించిన కొత్వాల్ సీవీ ఆనంద్



సాక్షి, సిటీబ్యూరో: గుండెపోటు బారిన పడినవారికి సంజీవని లాంటి సీపీఆర్ విధానంపై నగర కమిషనరేట్‌లో పని చేస్తున్న ప్రతి ఒక్క అధికారి, సిబ్బందికి శిక్షణ ఇప్పించాలని సిటీ కొత్వాల్ సీవీ ఆనంద్ నిర్ణయించారు. ట్రాఫిక్ సహా వివిధ విభాగాల్లో పని చేస్తున్న 1,409 మందికి ఇప్పటికే పూర్తి కాగా... మరో 1,248 మందికి శిక్షణ ఇవ్వడానికి మెహిదీపట్నంలోని మైత్రీ హాస్పిటల్స్ ముందుకు వచ్చింది. గురువారం బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో కమిషనర్ సీవీ ఆనంద్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొత్తం 15 బ్యాచ్‌లుగా శిక్షణ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఇది కేవలం ప్రజలకే కాకుండా పోలీసు కుటుంబాలకూ పనికి వచ్చే అంశమని అన్నారు. ఓ సర్వే ప్రకారం దేశంలో 98 శాతం మందికి సీపీఆర్ విధానంపై అవగాహన లేదని, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడేందుకు ఇది చాలా అవసరమని ఆనంద్ వ్యాఖ్యానించారు. అమెరికా, జపాన్, సింగపూర్‌లతో పాటు యూరోపియన్ దేశాలు తమ విద్యావిధానంలో సీపీఆర్‌ను బోధించడం తప్పనిసరి చేశాయని, దీనిపై అవగాహన లేని కారణంగానే ఇక్కడ మరణాలు పెరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే నగర పోలీసు విభాగంలో పని చేస్తున్న 16 వేల మంది పోలీసు అధికారులు, సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ ఇప్పిస్తున్నామని ఆనంద్ పేర్కొన్నారు.

అలలపై అలా..

సాగర్‌పై సరదాల నడక!

- ఆట పాటలు, ఆనందోత్సాహాలు
- బాక్స్ క్రికెట్, ఫ్లోటెడ్ నైట్‌లైఫ్
- హుస్సేన్‌సాగర్ చుట్టూ 10 కిలోమీటర్ల సైకిల్, వాక్ ట్రాక్
- పార్కులు, రెస్టారెంట్‌లు, ఎంటర్‌టైన్‌మెంట్ ప్రాజెక్టులు
- రూ.500 కోట్లకు పైగా అంచనా వ్యయం
- పర్యాటక పాలసీకి అనుగుణంగా హుమ్టా ప్రణాళికలు

హుస్సేన్ సాగర్‌పై స్కై వాక్ (నమూనా చిత్రం)



సాక్షి, సిటీబ్యూరో: పోటెత్తే అలలను వీక్షిస్తూ హుస్సేన్ సాగర్‌లో ఇటు నుంచి అటు నడుచుకుంటూ వెళితే ఎలా ఉంటుంది? నీటిపై తేలే బాక్సుల్లో చేరి ఏదో ఒక ఆట ఆడితే ఆ థ్రిల్ ఎలా ఉంటుంది? అర్ధరాత్రి దాటిన తర్వాత స్ట్రీట్ ఫర్నిచర్ వద్ద నింగిని తాకే ఫౌంటేన్ వెల్లువను చూస్తూ గడపడం చక్కటి అనుభూతినిస్తుంది కదా. అంతేకాదు, సాగర్ చుట్టూ సైకిల్ తొక్కవచ్చు. హాయిగా నడుచుకుంటూ ఎక్కడికంటే అక్కడికి వెళ్లొచ్చు. అందమైన పార్కుల్లో సేదతీరొచ్చు. పార్టీలు, ఫంక్షన్‌లు, విందులు, వినోదాలు, ఆటా పాటలు వెరసీ.. ఒక అద్భుతమైన నైట్‌లైఫ్. నగరవాసులకే కాదు. దేశ విదేశాలకు చెందిన పర్యాటకులను సైతం ఆకట్టుకొనేలా హుస్సేన్‌సాగర్ చుట్టూ స్కైవాక్, సైక్లింగ్, ఎంటర్‌టైన్‌మెంట్, నైట్‌లైఫ్ షాపింగ్ వంటి సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) అనుబంధ హైదరాబాద్ యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (హుమ్టా) ప్రణాళికలను సిద్ధం చేసింది. ఇప్పటికే శ్వేతసౌధాన్ని తలపించే సచివాలయం, బాబాసాహెచ్ అంబేడ్కర్ భారీ విగ్రహం, ఎన్టీఆర్ గార్డెన్, లుంబినీ పార్కు, సంజీవయ్య పార్కు, లేక్‌వ్యూ పార్కులతో ఆకట్టుకుంటున్న ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్డు ప్రాంతాలను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు హుమ్టా దృష్టి సారించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రత్యేక ఎంటర్‌టైన్‌మెంట్ డిజైన్‌లను రూపొందించింది.

స్కైవాక్, సైక్లింగ్..

హుస్సేన్‌సాగర్ చుట్టూ 10 కిలోమీటర్ల పరిధిలో స్కైవాక్, సైకిల్ ట్రాక్ నిర్మించనున్నారు. ఈ ట్రాక్ అటు ట్యాంక్‌బండ్, సంజీవయ్య పార్కు నుంచి ఇటు ఐమాక్స్ థియేటర్ వరకు, ఖైరతాబాద్ మెట్రో స్టేషన్‌కు కనెక్టివిటీని కలిగి ఉంటుంది. పర్యాటకులు ట్యాంక్‌బండ్ మీదుగా ఇందిరా పార్కుకు వెళ్లేందుకు అనుగుణంగా నిర్మిస్తారు. ఇలా నలువైపులా కనెక్టివిటీ ఉండడంతో పర్యాటకులు అన్ని వైపులా రాకపోకలు సాగిస్తారు. సైక్లింగ్ పట్ల అభిరుచి ఉన్నవాళ్లకు ప్రత్యేకంగా పార్కింగ్ స్లాట్‌లను ఏర్పాటు చేసి సైకిళ్లను అందుబాటులో ఉంచుతారు. సొంత సైకిళ్లను తెచ్చుకోవచ్చు. గంటల చొప్పున అద్దెకు తీసుకోవచ్చు. మొత్తం 5.5 మీటర్ల విస్తీర్ణంతో ఏర్పాటు చేయనున్న స్కైవాక్‌లో 3.3 మీటర్లు సైకిలింగ్ కోసం కేటాయిస్తారు. అలాగే 10 కిలోమీటర్ల మార్గంలో అక్కడక్కడా రెస్టరెంట్‌లు, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్‌లు ఉంటాయి. సాగర్‌లోంచి రాకపోకలు సాగించేవిధంగా స్కైవాక్, సైక్లింగ్ సదుపాయాలు ఉంటాయి.



సైక్లింగ్ చేయవచ్చు ఇలా..

నైట్‌లైఫ్ ప్లాజాలు..

నెక్లెస్‌రోడ్డు, పీపుల్స్‌ప్లాజా ప్రాంతంలో నైట్‌లైఫ్ షాపింగ్‌లో భాగంగా ప్రత్యేకమైన ఎంటర్‌టైన్‌మెంట్ ప్లాజాలను ఏర్పాటు చేయాలని హుమ్టా ప్రతిపాదించింది. పర్యాటకులు రాత్రి వేళల్లో హాయిగా కాలక్షేపం చేసేందుకు వీలుగా స్ట్రీట్ ఫర్నిచర్ ఉంటుంది. రెస్టరెంట్‌లు, హోటళ్లు రాత్రిపూట అందుబాటులో ఉంటాయి. ఇప్పుడు ఉన్న పార్కులతో పాటు అద్భుతమైన ఆర్కిటెక్చర్‌తో మరిన్ని పార్కులను ఏర్పాటు చేయనున్నారు.

స్పోర్ట్స్ బాక్సులు..

సింగపూర్‌లోని ఫ్లోటెడ్ ఫుట్‌బాల్ తరహాలో హుస్సేన్‌సాగర్‌లో చిన్న గ్రౌండ్‌లో ఒక క్రికెట్‌బాక్సు లేదా ఇతర ఆటలకు అనుగుణమైన బాక్సులను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన కూడా ఉంది. నీటిపై తేలియాడే వేదికలపై క్రీడాకారులు ఆటలాడుకోవచ్చు. మరోవైపు ఫ్లోటెడ్ ఫౌంటెన్ కూడా ఏర్పాటు చేయనున్నారు. పర్యాటకులు ప్రశాంతంగా ఫౌంటెన్ చుట్టూ కూర్చొని గడిపేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తారు. ఈ భారీ ప్రాజెక్టుకు సుమారు రూ.500 కోట్లకు పైగా ఖర్చు కానున్నట్లు అంచనా. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో నిర్మించాలని హుమ్టా ప్రతిపాదించింది. సందర్శకుల నుంచి కొంత మొత్తం రుసుము వసూలు చేస్తారు.

పార్కింగ్‌లో కారు దగ్ధం

ఫిలింనగర్‌లోని ఓ హోటల్‌పై కేసు నమోదు


పార్కింగ్‌లో దగ్ధమైన కారు

బంజారాహిల్స్: హోటల్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా పార్కింగ్ చేసిన ప్రాంతంలో కారు దగ్ధమైన సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..వెంగళరావునగర్‌కు చెందిన మహ్మద్ ఖురానా సమీర్ హుస్సేన్ సినీదర్శకుడు. ఈ నెల 27న రాత్రి అతను స్కోడా కారులో తన స్నేహితులతో కలిసి ఫిలింనగర్ రోడ్డునెంబర్–1లో ఓ హోటల్‌కు వచ్చాడు. హోటల్ ముందు కారు పార్కింగ్ చేసి లోపలికి వెళుతుండగా వ్యాలెట్ పార్కింగ్ సిబ్బంది వచ్చి తాళం చెవులు ఇవ్వాలని, కారును మరోచోట పార్కింగ్ చేస్తున్నట్లు చెప్పాడు. దీంతో సమీర్ అతడికి కారు తాళం చెవులు ఇచ్చి లోపలికి వెళ్లాడు. ఆ తర్వాత కొద్ది సేపటికి హోటల్ యజమానురాలు వచ్చి మీ కారు పార్కింగ్‌లో కాలిపోతుందని చెప్పింది. దీంతో ఆందోళనకు గురైన సమీర్, అతడి స్నేహితులు కారు పార్కింగ్ చేసిన కేబీఆర్ పార్కు పార్కింగ్ స్థలంలోకి వెళ్లారు. అప్పటికే కారు దగ్ధమవుతుండగా ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. అయితే కారు ఇంజన్‌తో పాటు ముందు భాగం కాలి బూడిద కావడంతో రూ.12 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ఘటనపై బాధితుడు ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. అయితే హోటల్ తమ పరిధిలోనే ఉన్నా ఘటన జరిగింది బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అయినందున అక్కడికే వెళ్లి ఫిర్యాదు చేయాలని చెప్పారు. బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు వీడియోలు సేకరించారు. తమది కాని పార్కింగ్ స్థలంలో హోటల్ యాజమాన్యం వ్యాలెట్ పార్కింగ్ చేస్తున్నట్లుగా దర్యాప్తులో తేలింది. హోటల్ యాజమాన్యం ఇక్కడికి వచ్చే కస్టమర్ల కార్లను దర్జాగా కేబీఆర్ పార్కును ఆనుకుని ఉన్న జీహెచ్ఎంసీ పార్కింగ్ స్థలాల్లో పార్కింగ్ చేయిస్తుంది. సదరు వ్యాలెట్ డ్రైవర్ నిర్లక్ష్యంగా కారు నడపడమే కాకుండా ఫస్ట్ గేర్‌లో కారు నడపడం వల్లనే ఇంజిన్ హీటెక్కి కాలిపోయిందని బాధితులు ఆరోపిస్తున్నాడు. బంజారాహిల్స్ పోలీసులు హోటల్ యాజమాన్యం, వ్యాలెట్ పార్కింగ్ సంస్థలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయాన్ని బాంబులతో పేల్చేస్తామంటూ ఓ వ్యక్తి చేసిన ఫోన్ కాల్‌తో అప్రమత్తమైన పోలీసులు ఉరుకులు పరుగులు పెట్టారు. బుధవారం తెల్లవారు జామున 100 కామారెడ్డికి చెందిన నితిన్ అనే వ్యక్తి ఫోన్ చేసి బాంబుతో ఎయిర్‌పోర్టు పేల్చేస్తామంటు హెచ్చరించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే ఫోన్ నంబర్ ఆధారంగా అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడి మానసిక స్థితి సరిగా లేకపోవడంతో తిరిగి కుటుంబసభ్యులకు అప్పగించారు.

లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి జైలు

అల్వాల్: బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ న్యాయస్థానం గురువారం తీర్పు చెప్పింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఓల్డ్ నేరేడ్‌మెట్‌లో నివసించే ధనరాజ్ రెండేళ్ల క్రితం అదే ప్రాంతానికి చెందిన బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన నేరేడ్‌మెట్ పోలీసులు దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కోర్టు నిందితుడికి పై విధంగా శిక్ష విధిస్తూ గురువారం తీర్పు ఇచ్చింది.

'బ్యాంకింగ్' సమస్యల పరిష్కారానికి ఎస్ఓపీ

- విధివిధానాలు ఖరారు చేయాలని పోలీసుల నిర్ణయం
- అంగీకరించిన ఆర్బీఐ అధికారులు
- డీసీపీ దార కవిత నేతృత్వంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు


డీసీపీ దార కవిత

సాక్షి, సిటీబ్యూరో: బ్యాంకింగ్ విధానాల్లోని లోపాలు, అక్కడున్న కొందరు అవినీతిపరుల వైఖరి సైబర్ నేరాలకు ఊతం ఇస్తున్నాయి. వీటిని తమకు అనుకూలంగా మార్చుకుంటున్న నేరగాళ్లు అందినకాడికి దండుకుంటున్నారు. వీటికి పరిష్కార మార్గాలు కనిపెట్టడంపై నగర పోలీసు విభాగంతో పాటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రత్యేక దృష్టి పెట్టింది. దీనికోసం ఓ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) అమలులోకి తీసుకురావాలని సంయుక్తంగా నిర్ణయించారు. ఈ ఎస్ఓపీ రూపకల్పన కోసం హైదరాబాద్ సైబర్ క్రైమ్స్ డీసీపీ దార కవిత నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. మంగళవారం ఆర్బీఐ కార్యాలయంలో జరిగిన కీలక సమావేశంలో నగర కొత్వాల్ సీవీ ఆనంద్, ఆర్బీఐ ప్రాంతీయ డైరెక్టర్ కమల్ ప్రసాద్ పటానాయక్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న విధానాలు, వాటిలో ఉన్న లోపాలను అధ్యయనం చేసే ఈ కమిటీ పరిష్కార మార్గాలను సూచిస్తూ ఎస్ఓపీ రూపొందించనుంది. ఇందులో పలు బ్యాంకులకు చెందిన అధికారులకు స్థానం కల్పించారు. ఏ సైబర్ నేరంలో అయినా బాధితుల నుంచి డబ్బు కాజేయాలంటే సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతా అనివార్యం. డబ్బు జమ చేయించుకోవడానికి సేవింగ్స్ ఖాతా, భారీ మొత్తంలో డ్రా చేయడానికి కరెంట్ ఖాతాలు అనివార్యంగా మారాయి. బ్యాంకింగ్ రంగంలో నెలకొన్న పోటీ నేపథ్యంలో ఖాతాలు తెరవడానికి సంబంధించి ప్రతి బ్రాంచ్‌కు వాటి ప్రధాన కార్యాలయం నుంచి టార్గెట్స్ ఉంటున్నాయి. వీటిని పూర్తి చేసేందుకు కొందరు, సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపి మరికొందరు, డబ్బుకు ఆశపడి ఇంకొందరు.. నిబంధనలు పాటించకుండా బ్యాంకు ఖాతాలు తెరిచి ఇచ్చేస్తున్నారు. ఇలాంటి వాటినే దేశ విదేశాల్లో ఉన్న సైబర్ నేరగాళ్లు వినియోగించుకుంటున్నారు. బ్యాంకు ఖాతాలు తెరిచేప్పుడు జియో–బేస్డ్ అకౌంట్ వెరిఫికేషన్, రియల్–టైం మానిటరింగ్, మల్టీ–ఫ్యాక్టర్ అథెంటికేషన్ ప్రోటోకాల్స్ వంటివి తప్పనిసరి చేయాలని పోలీసు విభాగం కోరుతోంది. దీంతో పాటు ఫ్రీజ్ చేసిన నగదు బాధితులకు తిరిగి ఇవ్వడంలో ఉన్న లోపాలు, సత్వర న్యాయం కోసం చేపట్టాల్సిన చర్యలతో ఎస్ఓపీ రూపకల్పనకు నిర్ణయించారు. డీసీపీ దార కవిత నేతృత్వంలో పని చేసే కమిటీలో హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్బీఐ, యాక్సిస్ బ్యాంక్‌లకు చెందిన లీగల్ అడ్వైజర్లకు స్థానం కల్పించారు. క్రమం తప్పకుండా ప్రతి నెలా పోలీసులు–బ్యాంకుల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక వర్క్‌షాపుల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. తద్వారా ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కారం అవుతాయని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

సంస్కృతిని భావితరాలకు అందించాలి


నృత్యరూపకంలోని ఓ సన్నివేశం

గన్‌ఫౌండ్రీ: సాహిత్యం, సంగీతం, నృత్యం భారతీయ సంస్కృతిలో భాగమని, వాటిని పరిరక్షించి భావితరాలకు అందించాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం రవీంద్రభారతిలో న్యవ నాటక సమితి, సురస అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఆధ్వర్యంలో భామ కలాపం నృత్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్కృతిని భావి తరాలకు అందించే ప్రయత్నం చేస్తున్న సంస్థల కృషి అభినందనీయమన్నారు. నృత్య కళాకారిణి మధుమతి కులకర్ణి ప్రధాన పాత్రలో సాగిన నృత్య రూపకం ఆకట్టుకున్నది. కార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ప్రభుత్వ సంగీత కళాశాల విశ్రాంత హెచ్ఓడీ ఆర్.ప్రసన్నరాణి, నాటక సమితి అధ్యక్షుడు విజయకుమార్, అకాడమీ అధ్యక్షురాలు మధుమతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకురాలి అరెస్ట్

- దేశం విడిచి పారిపోయేందుకు యత్నం
- ఎయిర్‌పోర్ట్‌లో పట్టుకున్న పోలీసులు


గుర్రం విజయలక్ష్మి

దుండిగల్: నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపట్టడమేగాక, వినియోగదారులను మోసం చేసి రూ.కోట్లు సంపాదించింది. పోలీసు కేసులు నమోదు కావడంతో దేశం విడిచి పారిపోయేందుకు యత్నించిన ఓ నిర్మాణ సంస్థ యజమానురాలిని దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ జిల్లా దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో మల్లంపేటలోని సర్వే నెంబర్ 170/3, 170/4, 170/5లోని 15 ఎకరాల భూమిని పాతికేళ్ల క్రితం ముగ్గురు స్వాతంత్ర సమరయోధులకు అప్పటి ప్రభుత్వం కేటాయించింది. ఆ తర్వాత సదరు భూమి పలువురి చేతులు మారి చివరికి కొన్నేళ్ల క్రితం శ్రీ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ సంస్థకు చేరింది. సంస్థ నిర్వాహకురాలు గుర్రం విజయలక్ష్మి ఐదేళ్ల క్రితం 3.20 ఎకరాల్లో 65 విల్లాల నిర్మాణం కోసం హెచ్ఎండీఏకు దరఖాస్తు చేసుకుంది. ఆ తర్వాత సదరు సంస్థ ఎలాంటి అనుమతులు లేకుండానే పక్కనే ఉన్న కత్వ చెరువుకు సంబంధించిన 16 గుంటల ఎఫ్‌టీఎల్, మూడు ఎకరాల బఫర్ జోన్‌ను ఆక్రమించి ఏకంగా 300కు పైగా విల్లాలను నిర్మించింది. దీనిపై స్థానికులు పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలోని 11 అక్రమ విల్లాలను గత సెప్టెంబర్‌లో అధికారులు కూల్చివేశారు. అంతేగాక ఇరిగేషన్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపట్టారని దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి తోడు తమకు అన్ని సదుపాయాలు కల్పిస్తామని చెప్పి మోసం చేశారని, రిజిస్ట్రేషన్లు సైతం చేసుకుని బ్యాంకుల్లో రుణాల్లో తీసుకుని రూ. లక్షలు వెచ్చించి ప్లాట్లను కొనుగోలు చేశామని, చివరికి తమ విల్లాలను కూల్చివేశారని, సంస్థ నిర్వాహకురాలు గుర్రం విజయలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని బాధితులు దుండిగల్ పోలీసులను ఆశ్రయించారు. విజయలక్ష్మిపై ఇప్పటి వరకు ఏడు కేసులు నమోదు చేసిన పోలీసులు లుక్ ఔట్ నోటీసులు జారీ చేశారు. కాగా గురువారం తెల్లవారుజామున దేశం విడిచి పారిపోయేందుకు ప్రయత్నించిన ఆమెను శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీసులు అదుపులోకి తీసుకుని దుండిగల్ పోలీసులకు అప్పగించారు. వారు ఆమెను న్యాయమూర్తి ఎదుట హాజరు పరచడంతో 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆమెను చంచల్‌గూడ జైలుకు తరలించారు.

'స్పోర్ట్స్ కోటా పోస్టుల అవకతవకలపై విచారణ జరపాలి'


ఎల్బీ స్టేడియం వద్ద ఆందోళన చేస్తున్న ఏఐవైఎఫ్ ప్రతినిధులు, అభ్యర్థులు

గన్‌ఫౌండ్రీ: డీఎస్సీ–2024 ఎస్జీటీ స్పోర్ట్స్ కోటా పోస్టుల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని ఏఐవైఎఫ్ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఎల్బీ స్టేడియం వద్ద ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కోటా అర్హత పొందిన అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టడం అభినందనీయమని కానీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అక్రమాలు జరగడం బాధకరమన్నారు. నోటిఫికేషన్‌లో ఇచ్చిన ఫామ్–2 నిబంధనలను అడ్డుపెట్టుకుని కొందరు అక్రమార్కులు పోస్టులు అమ్ముకున్నారని ఆరోపించారు. వారిపై తగు చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీకాంత్, నగర అధ్యక్షుడు ఆర్.బాలకృష్ణ, మధు, పి.శివకుమార్, కల్యాణ్, అనిల్‌కుమార్, అభ్యర్థులు రాజేశ్, హరికృష్ణ, ఉమా, జరీనా తదితరులు పాల్గొన్నారు.

వర్క్ ఫ్రం హోం పేరుతో మోసం

ఫ్యూజన్ ఫ్యూచర్ హబ్ సంస్థపై కేసు నమోదు

బంజారాహిల్స్: వర్క్ ఫ్రం హోం పేరుతో మోసం చేసి ఓ యువకుడి నుంచి డబ్బులు దండుకున్న సంస్థపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే... లాల్ దర్వాజాకు చెందిన వి. మణివర్ధన్ జాబ్ కోసం సెర్చ్ చేస్తుండగా బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని సూఫి ఛాంబర్ బిల్డింగ్‌లో ఫ్యూజన్ ఫ్యూచర్ హబ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ నాల్గో అంతస్తులో కొనసాగుతున్నదని జాబ్‌లు రిక్రూట్ చేసుకుంటున్నట్లు తెలిసింది. దీంతో మణివర్ధన్ అక్కడికి వెళ్లి సంస్థ హెచ్ఆర్ హర్షితను కలిశాడు. ముందస్తుగా రూ. 2500 దరఖాస్తు కోసం చెల్లించాలని సూచించడంతో ఆ మేరకు అతడు తన మరో స్నేహితుడితో కలిసి ఇద్దరి కోసం రూ. 5 వేలు చెల్లించాడు. అనంతరం ఆఫర్ లెటర్ ఇస్తామంటూ పంపించేశారు. అక్కడి నుంచి వెళ్లిన తర్వాత ఈ కంపెనీ కోసం ఆరా తీయగా కొంతకాలంగా చాలా మందిని చీట్ చేస్తున్నట్లుగా గుర్తించాడు. తాము మోసపోయామని తెలుసుకొని డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా హర్షితతో పాటు సంస్థ యాజమాన్యం నిరాకరించింది. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

24 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం



సాక్షి, సిటీబ్యూరో: రాజస్థాన్ నుంచి కూకట్‌పల్లికి తరలిస్తున్న 24 కిలోల గంజాయి చాక్లెట్‌లను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన గోర్ సాహ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతడి లగేజీని సోదా చేయగా భారీగా గంజాయి చాక్లెట్లు లభ్యమయ్యాయి. కూకట్‌పల్లిలోని ఓ టీస్టాల్‌కు వాటిని తరలిస్తున్నట్లు నిందితుడు విచారణలో వెల్లడించాడు. అతడిని అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కూకట్‌పల్లి ప్రాంతంలోని హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని గంజాయి చాక్లెట్ల విక్రయాలకు పాల్పడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

నాబార్డ్ కరదీపిక ఆవిష్కరణ



ఇబ్రహీంపట్నం రూరల్: నాబార్డ్ ద్వారా పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్‌ప్లాన్ 2025–26 కరదీపికను గురువారం కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆవిష్కరించారు. నాబార్డ్ ప్రతి జిల్లాకు ప్రతి సంవత్సరం పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్‌ని సిద్ధం చేస్తుంది. ప్రాధాన్యత విభాగంలో జిల్లాలో అందుబాటులో ఉన్న భౌతిక, ఆర్థిక సామర్థ్యాన్ని అంచనా వేస్తుంది. దీన్ని ఆధారంగా చేసుకొని లీడ్ బ్యాంక్ జిల్లాలోని వివిధ బ్యాంకుల ద్వారా అమలు చేయడానికి వార్షిక జిల్లా క్రెడిట్ ప్లాన్‌ని సిద్ధం చేసింది. పంట ఉత్పత్తి, నిర్వహణ, మార్కెటింగ్ కోసం రూ.4,633.34 కోట్లు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల కోసం టర్మ్‌లోన్ రూ.2,107.22 కోట్లు, వ్యవసాయం, మౌలిక సదుపాయాల కోసం రూ.803.19 కోట్లు, అనుబంధ కార్యకలాపాల కోసం రూ.2,464.30 కోట్లు, సూక్ష్మ చిన్న మధ్యతరహా సంస్థలు ఎంఎస్ఎంఈ కోసం రూ.20,342.65 కోట్లు సహా జిల్లా మొత్తం ప్రాధాన్యత రంగానికి రూ.32,062.17 కోట్లుగా నాబార్డ్ ఆర్థిక అంచనా వేసింది. కార్యక్రమంలో డీడీఎం పి.హర్ష రఘురామ్, ఎల్‌డీఎం యాదగిరి, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

సాధ్యంకాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

హుడాకాంప్లెక్స్: అమలు సాధ్యంకాని హామీలతో అధికారం చేపట్టి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని ఎమ్మెల్యే సబితారెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురువారం సరూర్‌నగర్ డివిజన్ పార్టీ నాయకులు కొండల్‌రెడ్డి, అశోక్‌ల ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతిని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీల వినతిపత్రాన్ని గాంధీ విగ్రహానికి సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీల పేరుతో బూటకపు హామీలను కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని విమర్శించారు. వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి, 420 రోజులు గడుస్తున్నా మాట నిలబెట్టుకోలేక పోతుందని పేర్కొన్నారు. మంత్రులకు పరిపాలనపై అవగాహన లేదని, ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించాలని గాంధీ విగ్రహానికి విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు అరవింద్ శర్మ, నగేష్, శ్రీధర్, సుశీలరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎం.ఏ.సాజిద్, పెంబర్తి శ్రీనివాస్, జగన్మోహన్‌రెడ్డి, మల్లేశ్ ముదిరాజ్, వెంకటేష్‌గౌడ్, రమేష్,రాజేష్‌గౌడ్, రిషీ, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

రోజుకు 71 రోడ్డు ప్రమాదాలు

2024లో తెలంగాణలో 26,000 యాక్సిడెంట్స్

- నగటున రోజుకు 18 మంది మృతి
- ఏడాదిలో మరణించిన వారు సుమారు 7,700
- రోడ్డు ప్రమాదాల్లో మొదటి పది రాష్ట్రాల్లో తెలంగాణ
- రవాణాశాఖ వెల్లడి..
- నేడు నెక్లెస్ రోడ్డులో రోడ్డు భద్రతా వాకథాన్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. రాష్ట్రంలో 2024లో సగటున రోజుకు 71 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఆయా ఘటనల్లో రోజూ సగటున 18 మంది మృత్యువాత పడ్డారు. అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగిన మొదటి పది రాష్ట్రాల్లో తెలంగాణ సైతం ఉంది. రాష్ట్ర రవాణాశాఖ ఈ వివరాలను వెల్లడించింది. 2024లో రాష్ట్రంలో సుమారు 26,000 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో మొత్తం 7,700 మంది మరణించగా, కనీసం 20 వేల మంది గాయపడినట్లు రవాణాశాఖ తాజా గణాంకాలు వెల్లడించాయి. రహదారి భద్రతపై ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం, అపరిమిత వేగంతో వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్, రోడ్డు ఇంజినీరింగ్‌లో లోపాలు తదితర కారణాల వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయి. రవాణాశాఖ జనవరి నెలను జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో స్కూళ్లు, కళాశాలల్లో రోడ్డు భద్రతపైన ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం (జనవరి 31) నెక్లెస్‌రోడ్డులో రోడ్డు భద్రతా వాకథాన్ నిర్వహించనున్నారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

గత మూడేళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2022	21,619	7,559	20,209
2023	22,903	7,660	21,022
2024	25,934	7,733	23,826

మానవ తప్పిదాలే కారణం..

గత మూడేళ్లలో నమోదైన రోడ్డు ప్రమాదాల్లో 80 శాతం మానవ తప్పిదాల వల్లనే జరిగినట్లు రవాణాశాఖ తెలిపింది. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, ఓవర్ స్పీడ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, విశ్రాంతి లేకుండా డ్రైవింగ్ చేయడం వంటి కారణాల వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రమాదాల నియంత్రణకు రవాణాశాఖ పలు చర్యలు చేపట్టింది. వాహనదారుల్లో అవగాహన కల్పించేందుకు '4ఈస్' (ఎడ్యుకేషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఇంజనీరింగ్, ఎమర్జెన్సీ కేర్)పై దృష్టి సారించింది. మరోవైపు రహదారులపై బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించేందుకు చర్యలు చేపట్టినట్లు రవాణాశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

ట్రాఫిక్ చిల్డ్రన్స్ పార్క్..

నెల రోజుల పాటు చేపట్టిన రోడ్డు భద్రతా కార్యక్రమాల్లో భాగంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ట్రాఫిక్ చిల్డ్రన్స్ పార్కును ఏర్పాటు చేశారు. స్కూల్ విద్యార్థుల్లో అవగాహనకు ఇది దోహదం చేస్తుంది. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఈ పార్కును ప్రారంభించారు. అలాగే హెల్మెట్‌ల పంపిణీ, వైద్య, ఆరోగ్య శిబిరాలు, విద్యార్థులకు క్విజ్ పోటీలు వంటివి నిర్వహించారు.

కత్తితో దాడి కేసులో ముగ్గురి అరెస్ట్

జియాగూడ: ఓ యువతిని వేధిస్తుండగా అడ్డుకున్నందుకు ఇద్దరు వ్యక్తులపై కత్తితో దాడికి పాల్పడిన సంఘటనలో కుల్సుంపురా పోలీసులు గురువారం ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. ఇన్‌స్పెక్టర్ సునీల్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. రెండు రోజుల క్రితం జియాగూడ వెంకటేశ్వర నగర్‌లో రోడ్డుపై వెళుతున్న యువతిని ఐదుగురు యువకులు వేధిస్తున్నారు. దీనిని గుర్తించిన తందూరి నైట్స్ హోటల్ నిర్వాహకులు ఆకాష్, వికాస్ వారిని అడ్డుకుని అక్కడి నుంచి పంపించారు. దీంతో వారిపై కక్ష పెంచుకున్న జియాగూడకు చెందిన శ్రీకాంత్, దీపక్‌సింగ్, ఆకాష్‌కుమార్, శంషాబాద్‌కు చెందిన పవన్ అలియాస్ మొగిలి బుధవారం రాత్రి జియాగూడ మెయిన్‌రోడ్డులో ఆకాష్, వికాస్‌లపై కత్తితో దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో వికాస్ తలకు తీవ్ర గాయాలు కాగా, ఆకాష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు బాధితులను ఆసుపత్రికి తరలించారు. గురువారం నిందితులు శ్రీకాంత్, దీపక్ సింగ్, ఆకాష్ కుమార్‌లను అదుపులోకి తీసుకోగా హర్షసింగ్, మొగిలి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో కానిస్టేబుల్ ఆత్మహత్య


వెంకటేశ్వర్లు (ఫైల్)

అంబర్‌పేట: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.సూర్యాపేట జిల్లాకు చెందిన వెంకటేశ్వర్లు (42) మదన్నపేట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తూ అంబర్‌పేట, దుర్గానగర్‌లో నివాసం ఉంటున్నాడు. గత కొన్నాళ్లుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అతను గురువారం ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. వెంకటేశ్వర్లుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

2.4 కిలోల గంజాయి పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని వివిధ ప్రాంతాల్లో గురువారం తనిఖీలు చేపట్టిన ఎక్సైజ్ అధికారులు గంజాయి, డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. మలక్‌పేట్, పీర్జాదిగూడలో దాడులు నిర్వహించి 2.4 కిలోల గంజాయి పట్టుకున్నారు. మలక్‌పేట్‌లో గంజాయి విక్రయిస్తున్న మీర్జాపతియాజ్ బేగ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతడి నుంచి 1.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎండీ జావేద్ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. పీర్జాదిగూడలో నానాజీ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి 1.2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

చేవేళ్ల పరిధిలో డ్రగ్స్, గంజాయి దహనం..
శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెంట్ పరిధిలోని చేవేళ్ల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 11 కేసుల్లో పట్టుబడిన 7.65 కిలోల గంజాయి, 146 గంజాయి మొక్కలు, 150 గ్రాముల మాదకద్రవ్యాలను దహనం చేశారు. కార్యక్రమంలో స్టేషన్ సీఐ శ్రీలత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం.. యువకుడి అరెస్టు


లకావత్ రాము

బంజారాహిల్స్: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసగించిన యువకుడిని జూబ్లీహిల్స్ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే... ఉప్పల్‌కు చెందిన లకావత్ రాము (24) సినిమాల్లో డ్యాన్సర్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం శ్రీకృష్ణానగర్‌కు చెందిన సేల్స్‌గర్ల్‌తో ఇన్‌స్టాగామ్‌లో పరిచయం ఏర్పడింది. వీరి పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఈ క్రమంలో యువతిని పెళ్లి చేసుకుంటానని రాము పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. అయితే ఇటీవల కాలంలో పెళ్లి మాట ఎత్తేసరికి రాము మాటమార్చడంతోపాటు ముఖం చాటేశాడు. దీంతో తాను మోసపోయాయని తెలుసుకున్న బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుడి అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'కన్హా'లో ఐపీఎస్ అధికారుల బృందం



నందిగామ: మండల పరిధిలోని కన్హా శాంతి వనాన్ని ఐపీఎస్‌ల బృందం గురువారం సందర్శించింది. నాలుగు రోజుల డీప్ యు ఇండియా రిట్రీట్ కార్యక్రమంలో భాగంగా హ్యూమన్ ఫ్లరిషింగ్ ప్రఖ్యాత వక్త వాస్కో గ్యాస్పర్ ఆధ్వర్యంలో 40 మందికిపైగా ఐపీఎస్ అధికారుల బృందం ప్రత్యేకంగా సందర్శించి, ధ్యానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. స్వీయ ఆవిష్కరణ, స్వస్థత, జీవితంలో లక్ష్యాన్ని కనుగొనడం, పరివర్తనలో మార్పు తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఈ సందర్భంగా వాస్కో గ్యాస్పర్ మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో ధ్యానం చేసినట్లయితే మానసికంగా ప్రశాంతంగా ఉంటామని, ఒత్తిడిని తట్టుకొని ఏకగ్రత పెరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ధ్యానం చేయాలని సూచించారు.

నేడు యూఎస్‌ఏ స్టడీ ఎక్స్‌పో

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్ హోటల్‌లో నేడు అమెరికాలోని పలు యూనివర్సిటీల ద్వారా విద్యార్థులకు అందే విద్య, ఉపాధి అవకాశాలపై స్టడీ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు గ్లోబల్ ట్రీ సంస్థ ఫౌండర్ ఆలపాటి శుభకర్ తెలిపారు. ఈ ఎక్స్‌పోలో అమెరికాలో ప్రఖ్యాతిగాంచిన యూనివర్సిటీ ప్రతినిధులతో పాటు ఇమ్మిగ్రేషన్, వీసాకు సంబంధించిన పలు కీలక విషయాలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తెలుసుకునే అవకాశం ఉంటుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ప్రత్యేకంగా ఒక గంటపాటు యూఎస్ కాన్సులేట్ అధికారులతో ఎడ్యుకేషన్, వీసా పాలసీలపై సమావేశం కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బంజారాహిల్స్: పంజగుట్ట దుర్గానగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ద్వాత్రింశత్ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 3వ తేదీ వరకు అయిదు రోజులపాటు ఈ బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు తెలిపారు. పూజల్లో భాగంగా గురువారం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, స్వామివారికి పంచామృత స్నపనం, దీక్షా స్వీకరణ, నవగ్రహ హోమం, నీరాజన తీర్థగోష్టి, మృత్సంగ్రహణం, అంకురార్పణ, నవ కుంభారోవణం, ధ్వజపట ప్రతిష్టా, పూజాదికాలు నిర్వహించారు. ఈ పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా సేవాసంఘ్ ఆవిర్భావ దినోత్సవం

వెంకటేశ్వరకాలనీ: ఆలిండియా బంజారా సేవా సంఘ్ 73వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని నందినగర్ గ్రౌండ్‌లో మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ హాజరై సేవా సంఘ్ జెండాను ఎగురవేయడంతోపాటు సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సేవా సంఘ్ ద్వారా నేతలు, కార్యకర్తలు సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. అనంతరం సేవాలాల్ మహరాజ్ సమాజానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భారతి నాయక్, రాములు చౌహాన్, బాబానాయక్, ధన్‌రాజ్ రాథోడ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

తుది దశలో సుందరీకరణ పనులు



పనులు పరిశీలిస్తున్న అనురాగ్ జయంతి

బంజారాహిల్స్: నాగార్జున సర్కిల్ నుంచి సోమాజిగూడ జంక్షన్ వరకు పంజగుట్ట ఫ్లైఓవర్ కింద ఆరు మాసాలుగా జరుగుతున్న సుందరీకరణ పనులు తుది దశకు చేరుకున్నట్లు ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తెలిపారు. గురువారం ఆయన పంజగుట్ట ఫ్లైఓవర్ కింద జరుగుతున్న పనులను ఆయన ఇంజినీరింగ్, యూబీడీ అధికారులతో కలిసి పరిశీలించారు. తుదిదశలో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఈ సుందరీకరణలో భాగంగా విభిన్న రకాల మొక్కలతో పాటు మూడు ఫౌంటెన్లు, దారి పొడగునా రంగు రంగుల విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్కిల్–17 ఖైరతాబాద్ డీఎంసీ రజనీకాంత్‌రెడ్డి, ఈఈ వెంకట నారాయణ, వీధి దీపాల డీఈ కిరణ్మయి, హార్టికల్చర్ డీడీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ - ఒకరిపై ఒకరు ఫిర్యాదు

వెంగళరావునగర్: వాచ్‌మెన్ కుటుంబ సభ్యులు తమను కొట్టాడని ఓనర్, తమపైనే దాడులు చేశారంటూ వాచ్‌మెన్ మధురానగర్ పీఎస్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... స్థానిక సిద్ధార్థనగర్‌కాలనీలోని శ్రీరామచంద్రా టవర్స్‌లో ఐదు నెలలుగా ఆదాం కుటుంబ సభ్యులు వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈనెల 29న కొరియర్ బాయ్ వచ్చి ఫస్ట్‌ఫ్లోర్‌లో ఉన్న చక్రపాణి అనే యజమానికి కొరియర్ ఇచ్చి వెళ్లాడు. అనంతరం దుస్తులు దొంగతనం చేస్తున్నావంటూ చక్రపాణి వాచ్‌మెన్ ఆదాంను అడిగాడు. దీంతో వాచ్‌మెన్ ఆదాం అతని అల్లుడు, పలువురు స్నేహితులు కలిసి చక్రపాణిపై దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో చక్రపాణి భార్య అడ్డుకునే క్రమంలో ఆమె గొలుసు కూడా మాయం అయింది. అనంతరం అకారణంగా చక్రపాణి తనను తీవ్రమైన పదజాలంతో దుర్భాషలాడుతూ కొట్టాడని ఆదాం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా యజమాని చక్రపాణి కూడా వాచ్‌మెన్, అతడి కుటుంబ సభ్యులు దాడి చేశారని పోలీసులను ఆశ్రయించాడు. ఇరువురి ఫిర్యాదులు స్వీకరించిన మధురానగర్ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్యం రూ.230 కోట్లు... వసూళ్లు రూ.135 కోట్లు

ఇంకా రూ. 95 కోట్లు వసూళ్లు పెండింగ్

• డిమాండ్ నోటీసులు జారీ చేస్తున్న అధికారులు • రెండేళ్ల బకాయిలపై రెడ్ నోటీసులు • మార్చి 31లోగా లక్ష్యాన్ని చేరుకోవాలని దిశా నిర్దేశం



ఆస్తి పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహిస్తున్న సర్కిల్-18 డీసీ ప్రశాంతి

బంజారాహిల్స్: ఆస్తి పన్ను వసూళ్లపై జీహెచ్‌ఎంసీ అధికారులు దృష్టి పెట్టారు. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునే దిశలో తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలుకు కృషి చేస్తున్నారు. మార్చి 31వ తేదీ ఈ ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను చెల్లింపులకు ఆఖరి గడువు కావడంతో ఈలోగా నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రతిరోజూ సమీక్షలు నిర్వహిస్తున్నారు. రోజువారీ పురోగతిపై ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో మొత్తం ఆస్తి పన్నుదారులు 65,660 మంది ఉన్నారు. ఇందులో ఇప్పటి వరకు 40,850 మంది పన్నులు చెల్లించారు. ఇంకా 24,802 మంది పన్నులు చెల్లించాల్సి ఉంది. వీరందరికీ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు ఇప్పటికే డిమాండ్ నోటీసులు జారీ చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31లోగా ముగుస్తుందని ఈ లోపల జరిమానా లేకుండా పన్నులు చెల్లించాలని సూచిస్తున్నారు. గత రెండు, మూడు సంవత్సరాల నుంచి పన్నులు చెల్లించకుండా బకాయిలు పడ్డవారికి రెడ్ నోటీసు వారెంట్లు జారీ చేస్తున్నారు. ఈ ప్రక్రియ కూడా గత కొద్ది రోజుల నుంచి ముమ్మరంగా సాగుతున్నది. ఇదిలా ఉండగా సర్కిల్–18 పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 230 కోట్లు పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు రూ. 135.86 కోట్లు వసూలైంది. ఇంకా రూ. 95 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో రెండు నెలలపాటు బకాయిదారుల నుంచి చెల్లింపులు జరిగేలా చూడాలంటూ దీని కోసం ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించాలని సర్కిల్–18 డీసీ ప్రశాంతి సూచించారు. పన్ను వసూళ్లపై, పురోగతిపై ప్రతిరోజూ ఆమె ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. రెడ్ నోటీసులు జారీ చేయించడం ద్వారా బకాయిలు ముక్కుపిండి వసూలు చేయాలని తీర్మానించారు. అవసరమైతే గతంలో లాగా బకాయిదారుల నుంచి ఆస్తులు జప్తు చేయాలనే డిమాండ్ కూడా వినిపిస్తున్నది.

పద్మాలయ అంబేడ్కర్‌నగర్‌లో..

అక్రమ నిర్మాణాల కూల్చివేత

సాక్షి ఎఫెక్ట్..



అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తున్న రెవెన్యూఅధికారులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని పద్మాలయ అంబేడ్కర్‌నగర్ బస్తీలో 130 గజాల ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు గురువారం నేలమట్టం చేశారు. 'ఫిలింనగర్‌లో ప్రభుత్వ స్థలాల కబ్జా'ల శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనం పట్ల స్పందించిన షేక్‌పేట తహశీల్దార్ అనితారెడ్డి సిబ్బందితో కలిసి కబ్జా జరిగిన ప్రాంతానికి వెళ్లి విచారణ చేపట్టారు. డొక్కా ఉమా అనే మహిళ తనకు కేటాయించిన 50 గజాల స్థలంలో ఇంటిని నిర్మించుకోగా వెనుక ఖాళీగా ఉన్న 130 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేపడుతుంది. దీంతో ఈ అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. ఇక్కడ ప్రభుత్వ స్థలమని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామని తహశీల్దార్ తెలిపారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు సైతం పెడతామని ఆమె హెచ్చరించారు.

జాతీయస్థాయి పోటీల్లో భవిష్‌రెడ్డి ప్రతిభ



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ ఆరో తరగతి విద్యార్థి దేవరపల్లి భవిష్‌రెడ్డి యూసీఓ (యునిఫైడ్ సైబర్ ఒలింపియాడ్), యునిఫైడ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గత ఏడాది సెప్టెంబర్ 20న నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి 8వ ర్యాంక్‌ను సాధించాడు. దీంతో భవిష్‌రెడ్డికి రీజనింగ్ ట్రైనర్ విత్ సొల్యూషన్స్ పుస్తకాన్ని, రూ.3,996ల విలువైన ఒలింపియాడ్ కోచ్ ఆన్‌లైన్ సబ్‌స్క్రిప్షన్‌తో పాటు అద్భుత ప్రదర్శనకు గుర్తింపుగా మెడల్, సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. అదేవిధంగా గత ఏడాది నవంబర్ 19న బ్రెయిన్ ఫీడ్ నిర్వహించిన మి-చాంప్స్ ఆల్ ఇండియా చాలెంజ్ మ్యాథ్ ఎగ్జామ్‌లో 38/40 మార్కులతో ఆల్ ఇండియా ర్యాంక్ 1ని సాధించాడు. ఈ సందర్భంగా భవిష్‌రెడ్డిని పాఠశాల ప్రిన్సిపాల్ కాంచనవల్లి, డైరెక్టర్ వరలక్ష్మి అభినందించారు.

ఆలయ వార్షికోత్సవ సంచిక ఆవిష్కరణ



సంచిక ఆవిష్కరణ కార్యక్రమంలో బొగ్గారపు దయానంద్, కోలేటి దామోదర్ తదితరులు

ఖైరతాబాద్: శ్రీ స్వయంభూ నాగలింగేశ్వరస్వామి దేవస్థానం మొదటి వార్షికోత్సవ వేడుకల సందర్భంగా గురువారం ఖైరతాబాద్‌లోని వాసవి సేవాకేంద్రంలో వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా మాట్లాడుతూ తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా, రాగినేడు గ్రామంలో శ్రీ స్వయంభూ నాగలింగేశ్వరి దేవస్థానాన్ని మొదట్లో లక్ష సాయం కావాలని నా వద్దకు వచ్చారని తెలిపారు. అప్పట్లో చిన్నగుడి కట్టాలనుకొని, నేను పలువురి దాతల సాయంతో మొత్తంగా రూ. 3 కోట్లతో నిర్మాణాన్ని ఏడాదిన్నరలో పూర్తిచేశామని పేర్కొన్నారు. ఆ దేవస్థానం మొదటి వార్షికోత్సవం సందర్భంగా వార్షికోత్సవ సంచికను ఆవిష్కరించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ మాట్లాడుతూ వైశ్యులు సేవా కార్యక్రమాలతోపాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఆలయాల నిర్మాణంలో ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, టూరిజం శాఖ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, అవోపా అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, వాసవి సేవాకేంద్రం అధ్యక్షులు కోల్పూరు రమేష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, రమేష్, కొండ్లె మల్లికార్జున్, పత్రికా సంపాదకులు బల్లు చంద్ర ప్రకాష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మినీ స్టేడియం ఏర్పాటు చేయాలి



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ ఓపెన్ గ్రౌండ్‌లో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని గురువారం జరిగిన జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, మేయర్, కమిషనర్లను కోరారు. అలాగే ఈ ప్రాంతంలో అతిపెద్ద ఇండోర్ స్టేడియంగా గుర్తింపు పొందిన యూసుఫ్‌గూడ కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియం అభివృద్ధిపై ఆయన ప్రస్తావించారు. స్టేడియంలో మరిన్ని వసతులు కల్పించాలని, ప్రధానంగా పేద క్రీడాకారులకు అందుబాటులో ఉండేవిధంగా సమ్మర్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

తహసీల్దార్ ఫిర్యాదుతో వ్యక్తిపై కేసు నమోదు

ఫిలింనగర్: షేక్‌పేట మండలం జూబ్లీహిల్స్ డివిజన్ జూబ్లీహిల్స్ రోడ్ నెం. 46లోని మస్తాన్‌నగర్‌ను ఆనుకొని ఉన్న అంబేడ్కర్‌నగర్ బస్తీలో బండరాళ్లను తొలిచి ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్న బస్తీ నాయకుడు అశోక్‌పై షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అశోక్ తన అనుచరులతో కలిసి ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ప్రవేశించడమే కాకుండా బండరాళ్లను ధ్వంసం చేస్తూ కబ్జా చేసేందుకు యత్నిస్తున్నాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు అశోక్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

వెంగళరావునగర్: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కె.ప్రశాంత్‌సాయి (30) ప్రైవేట్ సంస్థలో ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా ఎల్లారెడ్డిగూడలో స్నేహితులతో కలిసి నివసిస్తున్నాడు. మూడురోజులుగా కడుపునొప్పి ఉండటంతో బుధవారం విధులకు వెళ్లలేదు. రాత్రి తన రూంమేట్ గణేష్ గదికి వచ్చే సరికి ప్రశాంత్‌సాయి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. ఆందోళన చెందిన గణేష్ 108కి ఫోన్ చేశాడు. సిబ్బంది వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. ప్రశాంత్‌సాయి మామ చాగంటి రాజశేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకుంటున్న కళాసిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శన



చీరలను తిలకిస్తున్న మహిళలు

శ్రీనగర్‌కాలనీ: సిల్క్, కాటన్, డిజైనరీ వస్త్రాలతో పాటు ఫ్యాన్సీ వస్తువులు మగువల మనసుదోచుకుంటున్నాయి. వెస్ట్ శ్రీనివాసనగర్‌కాలనీలో కళా సిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శనలో దేశంలోని పలు రాష్ట్రాల చేనేతకారుల ఉత్పత్తులైన పోచంపల్లి, మంగళగిరి, జందాన్ని శారీస్, కోటా, ఉప్పాడ, చీరలా, బెనారస్‌తో పాటు పలు సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 40 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. ప్రదర్శనలోని చీరలు మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. చేనేత కళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామని నిర్వాహకులు వికాస్ జైన్ తెలిపారు. ఈ ప్రదర్శన ఫిబ్రవరి 10 వరకూ కొనసాగుతుంది.

'కాంగ్రెస్‌కు బుద్ధి ప్రసాదించు'



గాంధీకి వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్లు

వెంగళరావునగర్: ఓ మహాత్మా... చేతగాని కాంగ్రెస్ సర్కార్‌కు బుద్ధి ప్రసాదించు అంటూ స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ గాంధీ విగ్రహం వద్ద వేడుకున్నారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని బీఆర్‌ఎస్ నేతలు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని పలు గాంధీ విగ్రహాల వద్ద కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా దేదీప్య విజయ్ ప్రత్యేకంగా వినతిపత్రాన్ని తయారుచేసి ఈస్ట్ రహమత్‌నగర్–జవహర్‌నగర్‌లలోని గాంధీ విగ్రహాల వద్ద దానిని సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వానికి గాంధీ ఇకనైనా కళ్లు తెరిపించాలని పేర్కొన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రతిరోజూ ప్రజలను వంచిస్తూనే ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్, పలువురు బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విరుద్ధమైన వర్గీకరణపై యుద్ధభేరి

లిబర్టీ: రాజ్యాంగ విరుద్ధమైన వర్గీకరణపై యుద్ధభేరి సాగిస్తామని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ వి.ఎల్.రాజు వెల్లడించారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు దేశవ్యాప్తంగా వర్గీకరణ ఉద్యమాన్ని విస్తరిస్తామని ప్రధానంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని మాల సామాజిక వర్గాలను సంఘటితం చేసి వర్గీకరణ వ్యతిరేక ప్రతిఘటన పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం వర్గీకరణ చెల్లదని స్పష్టంగా పేర్కొన్నప్పటికి న్యాయస్థానం తీర్పు ఎలా ఇచ్చిందో అర్థం కాని పరిస్థితి నెలకొందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం న్యాయ వ్యవస్థపై ఒత్తిడి తెచ్చి అలా తీర్పు చెప్పించిందని వి.ఎల్.రాజు ఆరోపించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని మాల వర్గాలను సమీకరించి లక్ష గొంతుల నినాదంతో పోరు సాగిస్తామని ఆయన పేర్కొన్నారు. కాలం చెల్లిన వర్గీకరణ వాదనను విడనాడి దళితుల ఐక్యత, రాజ్యాంగ హక్కులు, రిజర్వేషన్ల సాధన కోసం మాదిగ ఉపకులాలు కలిసి రావాలని విన్నవించారు. బీజేపీ అడుగుజాడల్లో ఎమ్మార్పీఎస్ పయనిస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో జాతీయ సలహాదారులు వి.కృష్ణస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'మాకు స్వతంత్రం కావాలి' నాటిక



సిటీబ్యూరో: కూకట్‌పల్లిలోని భారత్ వికాస్ పరిషత్ ఆడిటోరియంలో 'రెయిన్‌బో చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీ' వేడుకల్లో 'మాకు స్వతంత్రం కావాలి' నాటికను ప్రదర్శించడంతో పాటు బాలలకు సింగింగ్, డ్యాన్సింగ్ తదితర పోటీలను నిర్వహించారు. జి. ప్రియాంక వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో అతిథులుగా బిక్కవల్లి సత్యానందం, కటకం భాస్కర్, లక్ష్మీ సుజాత, సంధ్య, టీవీ రంగయ్య, డా.బాలకిషన్ తదితర ప్రముఖులు పోటీల్లో పాల్గొని, బాల బాలికలందరికీ మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. పిల్లలను ప్రోత్సహిస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా రెయిన్‌బో చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీ' జనరల్ సెక్రటరీ, బాలల చిత్రాల దర్శక–నిర్మాత కె. మోహన్ మాట్లాడుతూ బాలలకు మంచి సందేశం ఇవ్వాలనే ఆలోచనతో 'రెయిన్‌బో చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీ' ద్వారా ఎప్పటికప్పుడు మంచి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

మాజీ మంత్రి జార్జ్ ఫెర్నాండెస్ గొప్ప నాయకుడు

లిబర్టీ: విలువలతో జీవితాంతం ప్రజా సేవ చేసిన గొప్ప నాయకుడు మాజీ మంత్రి జార్జ్ ఫెర్నాండెస్ అని లోక్ దళ్ పార్టీ జాతీయ కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు పి.వి.రాజేశ్వరరావు అన్నారు. రాజకీయాల్లో నైతిక విలువలతో పనిచేసే ప్రజల హృదయాల్లో నిలిచిపోయిన గొప్ప సోషలిస్టు నాయకుడని అన్నారు. జార్జ్ వర్ధంతి సందర్భంగా గురువారం పార్టీ కార్యాలయంలో సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జార్జ్ నిబద్ధతకు నిలువుటద్దమని, రాజకీయాల్లో విలువలను పాటించిన విలక్షణ నాయకుడని అన్నారు. కేంద్ర రక్షణ మంత్రిగా జార్జ్ పనిచేసి దేశ భద్రత కోసం అనేక చర్యలు తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది పి.వి.శ్రీనివాస్‌రావు, సౌభాగ్యవతి, నాగేందర్, సంకీర్త తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అరెస్టు

ఫిలింనగర్: జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో ప్రజల కోసం గొంతెత్తిన జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఉదయం కౌన్సిల్ సమావేశం ప్రారంభంలోనే బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు ఆందోళనకు దిగగా వీరందరినీ అరెస్టు చేసి పోలీసు వ్యాన్‌లో తరలించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ నియంత పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజాపాలన ప్రభుత్వం ఎలా అవుతుందని నిలదీశారు. ప్రజాపాలన ప్రభుత్వం అంటే ఇదేనా..? అని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే దీనికి సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రంలో హోంమంత్రి లేకుండా ప్రభుత్వం కొనసాగడం, నిర్బంధాలకు గురిచేయడం, ప్రతిపక్షాల గొంతు నొక్కడం ఈ ప్రభుత్వంలోనే సాధ్యమవుతుందని ఆరోపించారు.



వెంకటేష్‌ను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

ఏరులై పారుతున్న మురుగు

మురుగునీటితో సహవాసం చేస్తున్న స్థానికులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ బసవతారకనగర్ బస్తీలో మురుగు ఏరులై పారుతోంది. మురుగునీటిలో నుంచే రాకపోకలు సాగించాల్సి రావడంతో స్థానికులు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఒకవైపు దుర్గంధం..మరోవైపు కాలు తీసి కాలు వేయాలంటే పడరాని పాట్లు పడుతున్నారు. డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు నిండి నిరంతరాయంగా పొంగుతుండడంతో వీధులన్నీ మురుగు నీటిమయమయ్యాయి. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళితే సిబ్బందిని పురమాయించి తూతూమంత్రంగా చేసి చేతుల దులుపుకుంటున్నారే తప్ప సమస్య శాశ్వత పరిష్కారం గురించి ఆలోచన చేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మురుగునీటిలోనే తాము సహవాసం చేయాల్సి రావడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని, రోగాల బారిన పడే ప్రమాదం ఉందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు మురుగు సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



బసవతారకనగర్ బస్తీ వీధుల్లో పొంగుతున్న మురుగు

సాక్షి
శుక్రవారం। 31। జనవరి। 2025

అర్హులందరికీ రేషన్ కార్డులు..!


సమగ్ర సర్వేలో గుర్తించిన కుటుంబాలపై విచారణ పూర్తి

- ఫిబ్రవరి రెండో వారంలో జరిగే సభల్లో జాబితా వెల్లడి
- దరఖాస్తు చేసుకోనివారికి మరో అవకాశం
- హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ అధికారి ఫణీంద్రరెడ్డి



"కొత్త రేషన్ కార్డుల కోసం ఆందోళ చెందవద్దు. అర్హులందరికీ కార్డులు అందిస్తాం. కొత్తకార్డుల మంజూరు కోసం ప్రభుత్వం విధివిధానాలు రూపొందించింది. రేషన్‌కార్డు లేకుండా ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని కుటుంబాలకు ఫిబ్రవరి రెండోవారంలో జరిగే వార్డు సభల్లో అర్జీలు పెట్టుకునేందుకు అవకాశం కల్పిస్తాం

- ఫణీంద్ర రెడ్డి, చీఫ్ రేషనింగ్ అధికారి, హైదరాబాద్



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభమైనా, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో దాని ఊసేలేదు. దానిపై ఎలాంటి అధికారికంగా ప్రకటన లేదు. దీంతో కార్డులులేని నిరుపేదల్లో అయోమయం నెలకొంది. ఈ నేపథ్యంలో తాజాగా హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ అధికారి 'సాక్షి'ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు వివరాలు వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

వార్డు సభల్లో అర్హుల జాబితా

ఫిబ్రవరి రెండోవారంలో నిర్వహించే వార్డు సభల్లో కొత్త రేషన్ కార్డుల కోసం అర్హత సాధించిన కుటుంబాల జాబితా ప్రదర్శిస్తాం. రెండు నెలల క్రితం ఇంటింటికీ నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో రేషన్‌కార్డులు లేని నిరుపేద కుటుంబాలను గుర్తించాం. వాటిపై క్షేత్రస్థాయి విచారణ పూర్తి చేశాం. వార్డు సభలో జాబితాపై అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తాం. అనంతరం అర్హులకు కొత్త కార్డులు మంజూరు చేస్తాం. అయితే అర్హుల జాబితాలో పేర్లు లేకుండా ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని కుటుంబాలు ఉంటే వార్డు సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. వాటిపై కూడా క్షేత్రస్థాయి విచారణ జరిపి అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేస్తాం.

ప్రజాపాలన దరఖాస్తులపై విచారణ

ప్రజాపాలన, కలెక్టరేట్, ప్రజాభవన్ ప్రజావాణి కార్యక్రమాల్లో కూడా కొత్త రేషన్ కార్డుల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. వాటిపై కూడా క్షేత్రస్థాయి విచారణ నిర్వహిస్తున్నాం. అర్హత సాధించిన కుటుంబాలందరికీ కార్డులు జారీ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

కొత్త కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

కొత్త రేషన్ కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ. నిరుపేద కుటుంబాలు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం అర్హత ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చు. వార్డు సభలో కొత్త కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ తర్వాత జీహెచ్ఎంసీలో కూడా అర్జీ పెట్టుకోవచ్చు. ప్రస్తుతం ఈపీడీఎస్ ఎఫ్ఎస్‌సీ లాగిన్ నిలిచిపోయిన కారణంగా ఆఫ్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

త్వరలో పాత కార్డుల్లో కొత్త పేర్లకు ఆమోదం

పాత రేషన్ కార్డుల్లో కొత్త కుటుంబ సభ్యుల పేర్ల నమోదు కోసం ఆన్‌లైన్ దరఖాస్తులుపై విచారణ నిర్వహిస్తున్నాం.హైదరాబాద్ పౌర సరఫరాల పరిధిలో సుమారు 1,22,235 రేషన్ కార్డుదారులు దాదాపు 2,05,171 మంది కొత్త సభ్యుల చేర్పులకు దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల ప్రకారం కొత్త సభ్యుల వివరాలను త్వరలో అమోదించనున్నాం.

తొమ్మిది సర్కిళ్లలో ..

హైదరాబాద్ పౌర సరఫరాల విభాగం పరిధిలో తొమ్మిది సర్కిళ్లున్నాయి. వాటి పరిధిలో సుమారు 6,39,407 కార్డులుండగా అందులో 23,60,783 మంది లబ్ధిదారులు ఉన్నారు. తాజాగా సమగ్ర కుటుంబ సర్వేలో రేషన్ కార్డులు లేని 43 వేల కుటుంబాలను గుర్తించాం. వాటిపై ప్రభుత్వం నిబంధల ప్రకారం విచారణ నిర్వహిస్తే కేవలం 70 శాతమే కుటుంబాలు అర్హత సాధించాయి. వారికి త్వరలో కార్డులు జారీ చేస్తాం.

సిగ్నల్ ప్రాసెసింగ్ కీలకం

అంతర్జాతీయ సదస్సులో రక్షణ పరిశోధనా సంస్థ సీనియర్ సైంటిస్ట్ ఏకే సింగ్

మణికొండ: సిగ్నల్ ప్రాసెసింగ్ అన్ని రంగాలకు కీలకమని, విద్యార్థులు కృత్రిమ మేధ(ఏఐ) సహాయంతో ఈ రంగంలో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రక్షణ రంగ పరిశోధనా సంస్థ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఏకే సింగ్ అన్నారు. గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ)లో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'అడ్వాన్సెస్ ఇన్ సిగ్నల్ ప్రాసెసింగ్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్'అనే అంశంపై నిర్వహించిన మూడో అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిశోధకులు, విద్యావేత్తలు, పారిశ్రామిక నిపుణుల నుంచి ఇప్పటి వరకు 200కుపైగా పరిశోధనా పత్రాలు అందుకున్నామని, నిపుణుల సహాయంతో 51 పరిశోధనా పత్రాలను ప్రదర్శనకు ఎంపిక చేశామని అన్నారు. స్పేస్ ఎలక్ట్రానిక్స్ వార్ఫేర్, అంతరిక్ష ఆధారిత రక్షణ వ్యవస్థలను, రక్షణ రంగంలో కృత్రిమ మేధస్సు వినియోగం, అంతరిక్ష యుద్ధ సాంకేతికత, యాంటీ శాటిలైట్ వెపన్స్ ప్రాముఖ్యతను వివరించారు. హైబ్రిడ్ మోడ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అమెరికాలోని పెన్‌స్టేట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎన్. సుదర్శన్‌రావు పాల్గొని సిగ్నల్, ఇమేజ్, వీడియో ప్రాసెసింగ్‌పై మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి, ఈసీఈ విభాగాధిపతి ఎస్‌పీ సింగ్, సదస్సు కన్వీనర్లు డాక్టర్ టీఆర్ విజయలక్ష్మి, డాక్టర్ వై. ప్రవీణ్ కుమార్‌రెడ్డి, నాగేంద్రకుమార్, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డి.వెంకట్‌రెడ్డి, డాక్టర్ జి.మాధవి, డాక్టర్ ఎస్.ప్రవీణ, డాక్టర్ సీహెచ్ రాజా పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభించిన ఏకే సింగ్

'ఉస్మానియా'పై సర్కార్ నిర్ణయం సరైనదే

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసిన ప్రభుత్వ వైద్యులు

సుల్తాన్‌బజార్: ఉస్మానియా ఆసుపత్రికి నూతన భవనం నిర్మించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ఉస్మానియా విభాగం నాయకులు డాక్టర్ బొంగు రమేష్, డాక్టర్ పల్లం ప్రవీణ్ అన్నారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉస్మానియా ఆసుపత్రి భవనం శిథిలావస్థలో ఉన్నందున, దాని కోసం గోషామహల్‌లో నూతన భవనం నిర్మించడం సరైనదేనని అన్నారు. ఆసుపత్రి నూతన భవనం నిర్మించాలని కొన్నేళ్లుగా ప్రభుత్వ వైద్యుల సంఘం కోరుతోందని, దానివల్ల పేద రోగులకు నాణ్యమైన వైద్యం అందుతుందని అన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ వైద్యులు పాల్గొన్నారు.



మంత్రి దామోదర్ రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రభుత్వ వైద్యులు

కేఎల్ డీమ్డ్ వర్సిటీ దరఖాస్తులకు ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ రానున్న విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రవేశాలకు దరఖాస్తుల్ని ఆహ్వానిస్తోంది. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులకు సంబంధించి విద్యార్థులు తమ అధికారిక పోర్టల్‌ను సందర్శించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు పంపింపవచ్చని ఒక ప్రకటనలో తెలిపింది. దరఖాస్తు ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, డిజిటల్ విధానంలో జరుగుతుందని స్పష్టం చేసింది.

2న పత్తర్‌ఘాట్ దర్గాలో 'బసంత పంచమి'

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని పత్తర్‌ఘాట్‌లోని హజ్రత్ షేఖ్ జీ హాలీ దర్గా మతసామరస్యానికి ప్రతీకగా భాసిల్లుతోంది. ఫిబ్రవరి రెండో తేదీన దర్గాలో ఘనంగా బసంత పంచమి వేడుకలు జరగనున్నాయి. ఏటా జరుగుతున్న ఈ ఉత్సవాల్లో ఈ ఏడాది బ్రిటీష్ హై కమిషన్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త భాగస్వాములుగా ఉండనున్నాయి. జషన్ ఈ ఖుస్రూ సూఫీ మ్యూజిక్ ఫెస్టివల్ అధ్యక్షుడు హజ్రత్ ముజఫర్ అలీ సూఫీ చిస్తీ ఆధ్వర్యంలో వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా అమీర్ ఖుస్రో అద్భుతమైన గానామృతం వీనుల విందు చేయనుంది. మానవత్వం పరిమళించడంతోపాటు అన్ని వర్గాల్లో ఏకత్వం, శాంతి, స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్న నమ్మకంతో చిస్తీ సూఫీ వర్గానికి చెందిన వారు 12వ శతాబ్దం నుంచి ఇక్కడ ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు.

'ఓసీల ఆత్మగౌరవాన్ని కాపాడాలి'

సాక్షి, సిటీబ్యూరో: ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణ పేదల ఆత్మగౌరవాన్ని కాపాడాలని కొందరు బీసీ మేధావులు చేస్తున్న తప్పుడు ప్రచారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఈబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. అన్ని కులాల్లోనూ ధనికులు, పేదలు ఉంటారని పేర్కొన్నారు. తమ పోరాటాలను గుర్తించిన అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తొలిసారిగా అగ్రవర్ణ పేదలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ప్రధాని మోదీ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించారని పేర్కొన్నారు. జనాభాలో 4 శాతం ఉన్న ఓసీల కుల జనగణన జరిపి ఆయా వర్గాల ఆర్థిక, సామాజిక స్థితిగతులను నిగ్గు తేల్చాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు.

నెట్, జేఆర్ఎఫ్ అభ్యర్థులకూ పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష

- తొలి రోజు 37 దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ: పీహెచ్‌డీ కేటగిరీ–2లో ప్రవేశాలకు యూజీసీ నెట్, నెట్ ఫర్ పీహెచ్‌డీ, టీఎస్ సెట్, జేఆర్ఎఫ్ తదితర అర్హతలు గల అభ్యర్థులు సైతం ఎంట్రన్స్ టెస్ట్–2025కు హాజరు కావాలని అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం కేటగిరీ–1లో మాత్రమే నెట్, జేఆర్ఎఫ్, టీఎస్‌సెట్, నెట్ ఫర్ పీహెచ్‌డీ అభ్యర్థులకు నేరుగా పీహెచ్‌డీలో ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు. కానీ, కేటిరీ–1లో సీటు లభించని అభ్యర్థులు కేటగిరీ–2లో పీహెచ్‌డీ ప్రవేశాలకు తప్పని సరిగా ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలని తెలిపారు. కాగా, తొలి రోజు 37 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వర్సిటీ వెబ్‌సైట్ చూడవచ్చు.

ఓయూ, ఇఫ్లూ మధ్య చర్చలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ, ఇఫ్లూ వర్సిటీల మధ్య పలు అంశాలపై ఒప్పందాలు జరగనున్నాయి. ఈ మేరకు గురువారం ఓయూ వీసీ ప్రొ.కుమార్ అధ్యక్షతన రెండు వర్సిటీ అధికారులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. పక్క పక్కనే ఉండే రెండు వర్సిటీల అధికారులు తొలిసారిగా సమావేశమయ్యారు. భాషా శాస్త్రాలు, కమ్యూనికేషన్ స్టడీస్, డిజిటల్ హ్యూమానిటీస్, భాషా సాంకేతికతలు, అధ్యాపక అభివృద్ధి అంశాల్లో భాగస్వామ్యాలపై ఓయూ–ఇఫ్లూ మధ్య ఒప్పందాలు కుదిరే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు.

విద్యార్థి దశ నుంచే గద్దర్ ఉద్యమబాట

ఓయూలో జరిగిన జయంతి సభలో వక్తలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థిగా ఉన్నప్పుడే ప్రజాయుద్ధ నౌక గద్దర్ ఉద్యమబాట పట్టారని వక్తలు అన్నారు. గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూసెమినార్ హాలులో గద్దర్ 77వ జయంతిని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఓయూ జేఏసీ వ్యవస్థాపక సభ్యులు సునీల్ శెట్టి అధ్యక్షత వహించగా ప్రొ.హరగోపాల్, బెల్లయ్య నాయక్, బి.నర్సింగరావు, సూర్యకిరణ్ గద్దర్, ప్రొ.సూరేపల్లి సుజాత తదితరులు పాల్గొని గద్దర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన గద్దర్‌కు రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించకుండా అవమానించిందని అన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఆయన చివరి వరకు పోరాడారని కొనియాడారు. ఆయన ఆటపాటలు నిత్యం ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశాయన్నారు. కార్యక్రమంలో ప్రొ.రమేష్, ప్రొ.కొండ నాగేశ్వర్, ప్రొ.సొడ నవీన్, ఏపూరి సోమన్న, ఓయూ జేఏసీ నాయకులు కోట శ్రీనివాస్‌గౌడ్, కంచర్ల బద్రి, మందాల భాస్కర్, రవింద్రనాయక్, దుర్గం భాస్కర్, గడ్డం శ్రీనివాస్, కేతూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



గురువారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్ వద్ద ఆయన విగ్రహానికి పూలాభిషేకం చేస్తున్న ఓ స్కూల్ విద్యార్థులు

నగరంలో నేడు

- పెటెక్స్ ఇండియా ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో 11 గంటలకు పెట్ ఎక్స్, హైదరాబాద్ కిడ్స్ ఫెయిర్ జరుగుతాయి.
- కేంద్ర సాంస్కృతిక శాఖ, శంకరానంద కళాక్షేత్ర ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని సీసీఆర్‌టీ క్యాంపస్‌లో రామాయణ కల్పవృక్షం ఫెస్టివల్ జరుగుతుంది.
- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 'రివైవింగ్ ది రూట్స్'పేరిట కళాకారుడు డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు వేసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

నిబంధనలు పాటిస్తే ప్రయాణాలు సురక్షితం



కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌జీసీఎల్, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు అధికారులు

మణికొండ: రహదారి భద్రతా నియమాలను డ్రైవర్లందరూ పాటిస్తే ప్రయాణాలు సురక్షితంగా ఉంటాయని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్(హెచ్‌జీసీఎల్) చీఫ్ జనరల్ మేనేజర్ పరంజ్యోతి అన్నారు. గురువారం పుప్పాలగూడ టోల్ ప్లాజా వద్ద ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన రోడ్డు భద్రతా మాసం(జనవరి) ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వాహనాన్ని నడుపుతున్నప్పుడు లేన్ క్రమశిక్షణ పాటించటం, కార్లు నడిపే వారు తప్పనిసరిగా సీటు బెల్టులు పెట్టుకోవడం వంటి నియమాలను పాటించాలన్నారు. సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ సాయి మనోహర్ మాట్లాడుతూ రోడ్డు భద్రత అందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, హెచ్‌జీసీఎల్ డీజీఎంలు సంజయ్‌కుమార్, రమేష్‌కుమార్, ఐఆర్‌బీ ప్రాజెక్ట్ హెడ్ గిరీశ్వర్, నార్సింగి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు నగరానికి కృష్ణా జలాలు బంద్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహా నగరంలో సగానికి పైగా నీటి సరఫరా బంద్ కానుంది. నాగార్జున సాగర్ నుంచి కృష్ణా నీటి సరఫరా పథకం -1, 2, 3 దశల కింద రిజర్వాయర్ల పరిధిలోని ప్రాంతాలకు శనివారం తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు జలమండలి ప్రకటించింది. కృష్ణా నీటి సరఫరా పథకానికి సంబంధించిన నాసర్లపల్లి సబ్ స్టేషన్‌లోని 132 కేవీ బల్క్ లోడ్ ఫీడర్ పీటీ మరమ్మతుల నేపథ్యంలో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు.



నగరంలోని మీరాలం, కిషన్‌బాగ్, అల్జుబైల్ కాలనీ, శాస్త్రిపురం, సంతోష్ నగర్, వినయ్ నగర్, సైదాబాద్, చంచల్ గూడ్, ఆస్మాన్ గఢ్, యాకుత్ పురా, మాదన్నపేట్, మహబూబ్ మాన్షన్, భోజగుట్ట, షేక్ పేట్. బొగ్గులకుంట, అఫ్జల్ గంజ్, ఆళ్లబండ, నారాయణగూడ అడిక్ మెట్, శివం రోడ్, చిలకల గూడ. జూబ్లీహిల్స్, ఫిల్మ్ నగర్, ప్రశాసన్ నగర్, తట్టిఖానా, తార్నాక, లాలాపేట్, బౌద్ధనగర్, మారేడ్ పల్లి, కంట్రోల్ రూమ్, రైల్వేస్, ఎంఈఎస్, కంటోన్మెంట్, ప్రకాశ్ నగర్, పాటిగడ్డ, రియాసత్ నగర్, ఆలియాబాద్, మైసారం, బండ్లగూడ, హస్మత్ పేట్, ఫిరోజ్ గూడ, గౌతమ్ నగర్, సాహెబ్ నగర్, వైశాలినగర్, అల్కపురి, బిఎన్ రెడ్డి నగర్, వనస్థలిపురం, ఆటోనగర్, మహేంద్ర హిల్స్, ఏలుగుట్ట, రామంతాపూర్, ఉప్పల్, నాచారం, హబ్సిగూడ, చిల్కానగర్, దేవేందర్ నగర్, గచిబౌలి, మాదాపూర్, అయ్యప్ప సొసైటి, కావురి హిల్స్, మధుబన్, దుర్గానగర్, బుద్వేల్, సులేమా నగర్, గోల్డెన్ హైట్స్, 9 నంబర్, హార్డ్ వేర్ పార్క్, ధర్మసాయి, గంధంగూడ, బోడుప్పల్, మల్లికార్జున నగర్, మానిక్ చంద్, చెంగిచెర్ల, భరత్ నగర్, ఆనంద్ నగర్ క్రాస్ రోడ్స్, పీర్జాదిగూడ,మీర్ పేట్, కుర్మగూడ, లెనిన్ నగర్, బడంగ్ పేట్ తదితర ప్రాంతాలకు నీటి సరఫరాను నిలిపి వేయనున్నట్లు జలమండలి అధికారులు పేర్కొన్నారు.

దివ్యాంగులకు అవకాశాలు కల్పించాలి

స్పెషల్ ఎంప్లాయీస్ జాతీయ సదస్సులో గవర్నర్

కంటోన్మెంట్: దివ్యాంగులకు అవకాశాలు కల్పిస్తూ అన్ని రంగాల్లో ఎదిగేందుకు దోహద పడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. బోయిన్‌పల్లిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజెబులిటీస్(దివ్యాంగ్జన్)లో రెండు రోజులపాటు జరిగిన 30వ జాతీయ స్థాయి స్పెషల్ ఎంప్లాయీస్ సదస్సు ముగింపు కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడారు. దేశం ఆర్థిక రంగంతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, అప్పుడే సాధికారత సాధ్యం అవుతుందన్నారు. 'సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్. సబ్ కా విశ్వాస్'అన్న ప్రధాని మోదీ నినాదాన్ని నెరవేర్చేందుకు కృషి చేయాలన్నారు. దివ్యాంగుల సాధికారత కోసం దివ్యాంగ్జన్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పీఎం దక్ష, ఆరోగ్యకార్డులు, యూడీఐడీ గుర్తింపు కార్డుల జారీ వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.



దివ్యాంగులకు టీఎల్ఎం కిట్ అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

16 సంస్థలకు అభినందన

11 రాష్ట్రాలకు చెందిన 150 మంది దివ్యాంగులకు స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముందుకొచ్చిన 16 సంస్థలను గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. దివ్యాంగులకు టీఎల్ఎం కిట్‌లు, వీల్ చైర్‌లు, వినికిడి యంత్రాలను అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగ్జన్ డైరెక్టర్ బీవీ రామ్‌కుమార్, స్పెషల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు, దివ్యాంగ్జన్ సంస్థ ఉద్యోగులు, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెంగిచర్ల స్లాటర్‌హౌస్‌లో అగ్ని ప్రమాదం

బోడుప్పల్: చెంగిచర్ల జంతు వధశాల ఆవరణలోని గోడౌన్‌లో గురువారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గోడౌన్‌లో నిల్వ ఉంచిన ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకోవడంతో లోపల ఉన్న వస్తువులు దగ్ధమై పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ ఆ ప్రాంతమంతా కమ్ముకుంది. సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు మేడిపల్లి పోలీసులు, ఫైర్ అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి వచ్చారు. ఫైరింజన్ సహాయంతో మంటలార్పారు. అయితే ఈ ఘటనలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. స్లాటర్ హౌస్‌ను గతంలో లీజ్‌కు తీసుకున్న వ్యక్తి గడువు ముగియడంతో తన వస్తువులు అక్కడ నుంచి వేరే చోటకు తరలించారు. ఈ క్రమంలో ఓ గోడౌన్‌లో ఉంచిన స్క్రాప్ ఈ ప్రమాదంలో దగ్ధమైనట్లు పోలీసు, ఫైర్ స్టేషన్ అధికారులు వెల్లడించారు.



'ఫ్రీడమ్' విజేతలకు బంగారు నాణేలు

బహుమతులు అందించిన సినీనటుడు తణికెళ్ల భరణి



ఫ్రీడం ఆయిల్ లక్కీ డ్రా విజేతలకు బంగారు నాణేలను అందజేస్తున్న తనికెళ్ల భరణి

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ వంటనూనెల బ్రాండ్ ఫ్రీడమ్ హెల్దీ కుకింగ్ ఆయిల్స్ ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన 'గో ఫర్ ఫ్రీడమ్ గోల్డ్ ఆఫర్ బంపర్ డ్రా విజేతలను ప్రకటించింది. ఇందులో భాగంగా గురువారం బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్ హోటల్ వేదికగా తెలుగు రాష్ట్రాల్లోని ఇద్దరు విజేతలకు 50 గ్రాముల బంగారు నాణేలను ప్రముఖ సినీనటుడు తనికెళ్ల భరణి అందించారు. ఈ సందర్భంగా జెమిని ఎడిబుల్స్, ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ సేల్స్–మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ ఈ పథకానికి అన్ని రాష్ట్రాల నుంచి అద్భుత స్పందన లభించిందని అన్నారు. పండుగ సీజన్‌కు ఉత్సాహాన్ని జోడించడం, తమ అభిమానులకు బహుమతులు అందించాలని ఈ 'గో ఫర్ ఫ్రీడమ్ గోల్డ్ ఆఫర్ 2024'ను పరిచయం చేశామని ఫ్రీడమ్ హెల్దీ కుకింగ్ ఆయిల్స్ మార్కెటింగ్ జీఎం చేతన్ పింపాల్ఖుటే పేర్కొన్నారు.

హెల్త్ కార్డులు పంపిణీ చేయండి

- జలమండలి ఎండీకి వాటర్ వర్క్ ఎంప్లాయీస్ వినతి

సాక్షి,సిటీబ్యూరో: జలమండలి ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రెన్యువల్ చేసిన హెల్త్ కార్డులను పంపిణీ చేయాలని వాటర్ వర్క్ ఎంప్లాయీస్ యూనియన్(2873) విజ్ఞప్తి చేసింది. గురువారం జలమండలి ప్రధాన కార్యాలయంలో యూనియన్ అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్, జనరల్ సెక్రటరి ఎల్లయ్య ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. ఇటీవల పలువురు ఉద్యోగులకు పదోన్నతి కల్పించడంపట్ల కృతజ్ఞతలు తెలిపింది. అనంతరం ఉద్యోగుల సమస్యలపై విన్నవించగా ఎండీ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ మేడ్చల్ శ్రీనివాస్, జి.లక్ష్మీనారాయణ, చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ జామ్మెల్ అహ్మద్, వర్కింగ్ ప్రెసిడెంట్స్ వెంకటేష్ యాదవ్, గోపాల కృష్ణ, మహమ్మద్ ఖలీల్, ఉదయ్ కుమార్, కిషన్, శివారెడ్డి, సాబిర్, అంజయ్య, ప్రేమ్ కుమార్, వినయ్‌కుమార్, గణేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



హెల్త్ కార్డులు పంపిణీ చేయాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

సాక్షి
11
సిటీ ప్లస్
హైదరాబాద్ । శుక్రవారం । 31 । జనవరి । 2025

ఐరన్ మ్యాన్ 3 టీ షర్ట్ కావాలా.. ఆన్‌లైన్‌కు వెళ్లు, బ్లూటూత్ అవసరమా నెట్‌లో చూడు.. లంచ్‌కి వెజిటబుల్స్ లేవా జొమాటోలో ఆర్డర్ పెట్టు.. ఇది ప్రస్తుతం నగరంలో నడుస్తోన్న కొత్త రకమైన మానియాగా వైద్యులు చెబుతున్నారు.. నగరవాసుల ధోరణిలోనూ ఇదే ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. గృహిణులకు, విద్యార్థులకు, సమయాభావంతో షాపింగ్‌కు వెళ్లలేని వారికి అత్యంత సౌకర్యంగా ఉంటున్న ఈ షాపింగ్ ట్రెండ్.. తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్టు కొందరిలో తీవ్రస్థాయి వ్యసనంగా మారడం ఆందోళనకర పరిణామం అని నిపుణులు చెబుతున్నారు. తొలుత దీనిని 'కంపల్సివ్ బైయింగ్ డిజార్డర్'గా పేర్కొన్న సైకాలజిస్ట్స్.. ఇప్పుడు తీవ్రత దృష్ట్యా ఈ వ్యాధికి ఒనియోమానియా అని నామకరణం చేశారు. ఈ వ్యాధి బాధితులు పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు తప్పనిసరి అని స్పష్టం చేస్తున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో



షాపింగ్ డిస్ఆర్డర్

ముదిరిన ఆన్‌లైన్ షాపింగ్ వ్యసనం

నియంత్రణలేని కొనుగోళ్లతో వచ్చే వ్యాధి

'కంపల్సివ్ బైయింగ్ డిజార్డర్' నుంచి ఒనియోమానియా

నగరవాసుల్లో కనిపిస్తోందంటున్న వైద్యులు

విభిన్న రకాల మానసిక విపరీత ధోరణులకు అవకాశం

ఆన్‌లైన్ షాపింగ్‌లో దేశవ్యాప్తంగా ఐదో స్థానంలో నగరం

ఇటీవల జర్మనీలోని హన్నోవర్ మెడికల్ స్కూల్ పరిశోధకులు 'కంపల్సివ్ బైయింగ్ డిజార్డర్' అని పేర్కొనే వ్యాధి ఆధునికుల్లో ముదురుతోందని గుర్తించారు. 'దీనిని ప్రత్యేక మానసిక ఆరోగ్య స్థితిగా గుర్తించడానికి ఇది సరైన సమయం' అని ఈ అధ్యయనానికి నాయకత్వం వహించిన ఆస్ట్రిడ్ ముల్లర్ అన్నారు. కాంప్రెహెన్సివ్ సైకియాట్రి అనే జర్నల్‌లో ప్రచురించిన అధ్యయనం ప్రకారం, అభివృద్ధి చెందిన దేశాల్లో దాదాపు 5% మంది పెద్దలను సీబీడీ ప్రభావితం చేస్తోంది. ప్రతి 20 మందిలో ఒకరు దీని బారిన పడుతున్నారని ఇంటర్నేషనల్ బిజినెస్ టైమ్స్ వెల్లడించింది. వీరిలో ముగ్గురిలో ఒకరు తీవ్రమైన ఆన్‌లైన్ కొనుగోలు వ్యసనంతో బాధపడుతున్నారు. ఇప్పుడు దీనినే ఒనియోమానియాగా వ్యవహరిస్తున్నారు. ఒనియోమానియా అనేది గ్రీకు భాషలోని 'ఒనియోస్' అనే పదం నుంచి ఉద్భవించింది, ఇది 'ఉన్మాదం', 'పిచ్చితనం' అనే దానిని సూచిస్తుంది. కంపల్సివ్ బైయింగ్ డిజార్డర్ (సీబీడీ) ముదిరి ఆరోగ్యంపై ప్రతికూల ఫలితాలకు దారితీసే స్థాయిని షాపింగ్ ద్వారా నిర్ధారిస్తారు.

తక్షణ ఉత్సాహం కోసం..

ఆన్‌లైన్ షాపింగ్ వ్యసనపరులం అయ్యామా లేదా అనేదానికి సమాధానంగా వారం రోజుల్లో మనం ఎన్ని ప్యాకేజీలను రిసీవ్ చేసుకున్నాం? అనేది లెక్కిస్తే సరి అంటున్నారు కన్సల్టెంట్ క్లినికల్ సైకాలజిస్ట్ అంకుర్ సింగ్. ఆన్‌లైన్ షాపింగ్ వ్యసనాన్ని కంపల్సివ్ బైయింగ్ డిజార్డర్ దాటి ఒనియోమానియాగా పిలుస్తున్నామని, ఇది జీవితంలో ప్రతికూల పరిణామాలకు దారితీసే అతి పెద్ద ప్రవర్తనా సమస్య అని హెచ్చరించారు. ఈ ఆన్‌లైన్ షాపింగ్ తక్షణ ఆనందాన్ని ఉత్సాహాన్ని అందిస్తుందని అన్నారు.

హార్మోన్లపై ప్రభావం..

కొనుగోలు వల్ల కలిగే ఉత్సాహంతో బాక్స్‌ను ఓపెన్ చేసిన మరుక్షణమే డోపమైన్ హార్మోన్ విడుదలవుతుంది. ఇది మరింత షాపింగ్ చేయాల్సిన అవసరాన్ని తెస్తుందని అంకుర్ వివరించారు. దీంతో ఒత్తిడి, ఆందోళన, నిరాశ లేదా ఒంటరితనాన్ని ఎదుర్కోడానికి షాపింగ్‌ను ఒక మార్గంగా ఉపయోగించడం పెరుగుతోందని, చివరికి మరింత తీవ్ర ఒత్తిడికి దారి తీస్తోందని విశ్లేషించారు. షాపింగ్ నుంచి పొందిన తాత్కాలిక ఉపశమనం లేదా ఆనందాన్ని పదే పదే కోరుకోవడం, మాదకద్రవ్య దుర్వినియోగానికి సమానమైన వ్యసనాన్ని సృష్టించగలదని హెచ్చరించారు.

నష్టాలెన్నో..

సాధారణ వ్యక్తిగత షాపింగ్ సరదా ఎవరికీ హానికరం, లేదా బాధించేది కాదని చాలా మంది భావించవచ్చు. అయితే, ఇది స్థూల ఆర్థిక ఒత్తిడికి దారితీస్తుంది. ప్రత్యేకించి భాగస్వాములిద్దరూ ఉమ్మడి ఆర్థిక ఖాతాను కలిగి ఉన్న సందర్భాల్లో.. ఇది కొనుగోళ్లను దాచిపెట్టమని ప్రేరేపిస్తుంది. ఇది నెమ్మదిగా అపరాధ భావం లేదా అవమానం, ఆందోళన, నిరాశ, ఆత్మగౌరవం లోపించడం వంటి భావనలను కలిగిస్తుంది. ఈ ప్రవర్తన సామాజిక ఒంటరితనానికి దారితీయవచ్చు. వ్యక్తులు తమ షాపింగ్ అలవాట్లపై నియంత్రణ కోల్పోవచ్చు. ఇది ఆకస్మిక నిర్ణయాలకు దారి తీస్తుందని, ప్రతికూల పరిణామాలు ఉన్నప్పటికీ ఆపలేకపోవడం వ్యాధి తీవ్రతకు చిహ్నమని, ఈ అలవాటు అనుబంధాలపై సైతం వ్యతిరేక ప్రభావం చూపిస్తుందని చెబుతున్నారు. అంతేకాకుండా భవిష్యత్తు పొదుపు వంటి దీర్ఘకాలిక లక్ష్యాలపైనా వ్యతిరేక ప్రభావం చూపిస్తుందని సూచిస్తున్నారు.





ఇలా వదులుకోవాలి..

- ఆన్‌లైన్‌లో గడపడం కన్నా వ్యాయామం చేయడం, స్నేహితులతో ముచ్చట్లు వంటి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి.
- విచక్షణతో కూడిన ఖర్చుల కోసం కఠినమైన బడ్జెట్‌ను సెట్ చేసుకోవాలి. పరిమితుల్లో ఉండేలా ఖర్చులను నిర్ణయించుకోవాలి.
- ప్రచార ఈ మెయిల్స్ నుంచి సబ్‌స్క్రిప్షన్స్ తీసేయడం, ఫోన్ వగైరా డివైజ్‌ల నుంచి షాపింగ్ యాప్‌లను తగ్గించేయాలి.
- తరచూ షాపింగ్ వెబ్‌సైట్‌లను సందర్శించకుండా నియంత్రించుకోవాలి.
- అవసరం లేని వస్తువులను జాబితా తయారు చేసి పొరపాటున కూడా అవి కొనుగోలు చేయవద్దని నిర్ణయించుకోవాలి.

మొదటి పది ఇవే..

నగరవాసులు అత్యధికంగా ఈ-షాప్ చేస్తున్నవాటిలో అగ్రస్థానంలో పుస్తకాల కొనుగోలు ఉంటే, ఆ తర్వాత వరుసగా దుస్తులు, మూవీ టిక్కెట్స్, ప్రయాణ టిక్కెట్లు, యాక్సెసరీస్, కార్డ్స్, డిజిటల్ డివైజ్‌లు, ఫుట్‌వేర్, గృహోపకరణాలు, బ్యూటీ ప్రొడక్ట్స్.. వగైరా ఉన్నాయి. ఇక ప్రస్తుతం మన వాళ్లు తరచూ సందర్శిస్తున్న షాపింగ్ సైట్లలో.. స్నాప్‌డీల్, అమెజాన్, ఇబే, మింత్ర, జెబాంగ్, ఫ్లిప్‌కార్ట్, షాప్‌క్లూస్, దేశీడైమ్, ఫ్యాషన్ ఎస్ యు.. వంటివి ఉన్నాయి.



నగరమా బీకేర్‌ఫుల్..

కరోనా మహమ్మారితో లాక్‌డౌన్ వల్ల నగరవాసులు ఫిజికల్ స్టోర్‌లను విస్మరించి, ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసేలా అలవాటుపడ్డారు. పైగా నగరంలో ఒక చోటు నుంచి మరోచోటుకు రాకపోకలకు ఉన్న ట్రాఫిక్ ఇబ్బందులు.. వంటివి దృష్టిలో పెట్టుకుని గత కొన్ని సంవత్సరాలుగా ఇ-కామర్స్ విపరీతంగా పెరిగింది. అంతేకాక స్మార్ట్‌ఫోన్‌ల వినియోగం ఆన్‌లైన్ షాపింగ్ విజృంభణకు ఆజ్యం పోసింది. ప్రస్తుతం ఆన్‌లైన్ షాపింగ్ పరంగా 5.73 శాతంతో నగరం దేశంలోనే ఐదో స్థానంలో ఉంది. కాగా రంగారెడ్డి జిల్లా తొమ్మిదో స్థానంలో ఉండడం గమనార్హం. నానాటికీ విస్తరిస్తున్న వ్యాపార వ్యూహాలను గమనిస్తే.. త్వరలోనే నగరం టాప్‌కి చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదని, దీంతో పాటే వ్యసనబాధితుల సంఖ్యలోనే అగ్రగామి కావడం జరగవచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

కేవలం పుస్తకాలే..


తొలుత దాదాపు 50 పుస్తకాలకు పైగా ఆన్‌లైన్ ద్వారానే కొన్నాను. అలా అలా ఇప్పుడు రెగ్యులర్ ఈ-షాపర్ అయిపోయా. కేవలం పుస్తకాలే కాకుండా టేబుల్స్, టెక్నికల్ ఎక్విప్‌మెంట్ కూడా ఆన్‌లైన్‌లోనే కొంటున్నాను.

- నికుల్‌గుప్తా

తక్కువ ధరలకు..

నగరంలోని షోరూమ్‌లు అందించే వాటికన్నా.. ఆన్‌లైన్ ద్వారానే ఎక్కువ లేటెస్ట్ వెరైటీలు దొరుకుతాయి. బర్త్‌డే లేదా పార్టీ, ఫంక్షన్‌కు తగినవి, లేటెస్ట్ ఫ్యాషనబుల్ గూడ్స్ ఇంటి నుంచే సులభంగా యాక్సెస్ చేయవచ్చు. అందుకే ప్రస్తుతం షాపింగ్‌లో దాదాపు 70 శాతం ఆన్‌లైన్ మీదే.

- పూజానేతి



- నూతన గృహాల కోసం, ఇతర రియల్ ఎస్టేట్ అంశాల కోసం పోర్టల్స్
- బ్రోకర్లను అనుసంధానం చేసే యాప్‌లకు పెరిగిన ఆదరణ
- ఈ రంగంలో దేశవ్యాప్తంగా 15 శాతం మాత్రమే సాంకేతికత వినియోగం
- 5 లక్షల బ్రోకర్లతో హైదరాబాద్ వంటి రెండు వందల నగరాల్లో లీడ్ ప్రో సేవలు

ఏఐతో 'రియల్' సేవలు..

సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగంలో సుమారు 5 లక్షల మంది ఉంటే, అందులో కేవలం 15 శాతం మంది మాత్రమే సాంకేతికతను, ఆన్‌లైన్ టూల్స్‌ను వినియోగిస్తున్నారని ఇటీవల పలు సర్వేలు వెల్లడించాయి. ముఖ్యంగా హైదరాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో రియల్ ఎస్టేట్ వ్యవస్థ అనేది దళారులపై ఆధారపడి ముందుకుసాగుతోంది. ఇందులో 80 నుంచి 85 శాతం వరకూ దళారులు మాన్యువల్ ప్రక్రియలపై ఆధారపడుతున్నారని రియల్ రంగ అధ్యయనాలు తెలిపాయి. ఈ తరుణంలో హైదరాబాద్ వంటి మహానగరాల్లో బ్రోకర్లు, గృహ కొనుగోలుదారులు, వ్యాపారులు ప్రధాన ఆస్తి పోర్టల్‌ను వినియోగించడం ఉత్తమమని మ్యాజిక్ బ్రిక్స్ సీఈఓ సుధీర్ పాయ్ తెలిపారు.

దేశవ్యాప్త నెట్‌వర్క్‌తో..

దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన సాంకేతిక మౌలిక సదుపాయాలు, విస్తారమైన అమ్మకాల నెట్‌వర్క్‌తో, కన్సల్టెంట్లకు సీఆర్‌ఎమ్ పరిష్కారంగా 'లీడ్ ప్రో'ను ఆవిష్కరించామని సుధీర్ తెలిపారు. కృత్రిమ మేధ ఆధారిత సీఆర్‌ఎమ్ వేదికగా ఈ 'లీడ్ ప్రో' రెండు వందలకు పైగా నగరాల్లో 95 వేల యాక్టివ్ బ్రోకర్ లైసెన్స్‌లను సాధించింది. రియల్-టైమ్ సేల్స్ ట్రాకింగ్, లీడ్ ఇంటిగ్రేషన్, పెర్ఫార్మెన్స్ అనలిటిక్స్ వంటి ఫీచర్లతో ఈ లీడ్ ప్రో డేటా, లీడ్ మేనేజ్‌మెంట్, లైవ్ టీమ్ అప్‌డేట్‌లు, రియల్-టైమ్ పెర్ఫార్మెన్స్ ట్రాకింగ్, పెర్ఫార్మెన్స్ డాష్‌బోర్డ్‌లు, కంపాస్ వంటి అధునాతన సాధనాల ద్వారా లీడ్ జనరేషన్‌లో 200% పెరుగుదలకు సహాయపడిందన్నారు.

రెండు కోట్ల కస్టమర్లకు..

ఈ ఆస్తి పోర్టల్‌లో వెరిఫైడ్ లీడ్స్, సైట్ సందర్శనలతో పాటు.. రెండు కోట్లకు పైగా కస్టమర్లు, 15 లక్షల జాబితాలతో మ్యాజిక్ బ్రిక్స్ రియల్ ఎస్టేట్ పరిశ్రమకు నాయకత్వం వహిస్తోంది. గృహ కొనుగోలు దారులు, దళారుల సామర్థ్యాలను, అవకాశాలను మెరుగు పరచడంలో 'లీడ్ ప్రో' వంటి సేవలు అత్యవసరమని లీడ్ ప్రో వ్యవస్థాపకుడు అక్షయ్ సేథ్ పేర్కొన్నారు.



ఆకట్టుకుంటున్న 'రివైవింగ్ రూట్స్'..

సందర్శకులకు అందుబాటులో 250కి పైగా చిత్రాలు

ఫిబ్రవరి 5 వరకూ ప్రదర్శన కొనసాగింపు

ఆకర్షణగా రామాయణ ప్రధాన ఘట్టాల చిత్రాలు

ఆ చిత్రాలు సాలార్‌జంగ్ మ్యూజియం, ఆంధ్రప్రదేశ్ లలిత కళా అకాడమీ వంటి మ్యూజియాలలో ప్రదర్శించబడ్డాయి. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలం, చారిత్రక చిహ్నాలు (రాణి లక్ష్మీ బాయి, రుద్రమదేవి, అక్కన్న, మాదన్న) ఇతర స్థానిక ప్రముఖుల నుంచి పౌరాణిక వ్యక్తులు, శకుంతల సిరీస్‌కు ప్రసిద్ధి. సందేశాత్మక, సంస్కృతి, సంప్రదాయాల చిత్రాలకు కేరాఫ్ అడ్రస్ ఆయన చిత్రాలే. ఆయనే కళాకారుడు డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు. ఆయన వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

- మాదాపూర్









మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ అర్ట్ గ్యాలరీలో ఆయన కుమారుడు వేణుగోపాల్ రావు అధ్వర్యంలో రివైవింగ్ ది రూట్స్ పేరిట ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంటుంది. 1940 నుంచి 2012 వరకూ గీసిన 250 చిత్రాలను ప్రదర్శనలో ఉంచారు. రామాయణాన్ని కళ్లకు కట్టినట్టు ప్రతి సన్నివేశాన్నీ చిత్రరూపంలో గీసి సందర్శకులను ఆశ్చర్యానికి గురిచేశారు. రామాయణంలోని ప్రధాన ఘట్టాలను చిత్రప్రదర్శన ద్వారా నేటి యువతరం తెలుకునే విధంగా వివరించారు. యువతరం చిత్రరంగంలో రాణించడానికి ఈ ప్రదర్శన స్ఫూర్తినిస్తుందని పలువురు చిత్రకారులు చెబుతుండడం విశేషం. నేటి యువకళాకారులకు చిత్రకళపై ఆకర్షణ పెరిగేందుకు ఈ ప్రదర్శన తోడ్పడుతుందన్నారు. ఫిబ్రవరి 5 వరకూ నిర్వహించనున్న ఈ ప్రదర్శనను నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులు సందర్శిస్తున్నారు.



సంస్కృతి, సంప్రదాయాలు తెలిసేలా..

కళాకారుడు శేషగిరిరావు చిత్రాలు సందేశాత్మకంగా ఉంటాయి. యువతను ఆలోచింపజేస్తాయి. ఆయన చిత్రరంగంలో రాణించేందుకు ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నాడు. నేటి భవిష్యత్తు తరాలకు తెలిసేలా ఆయన కోడలు కొండపల్లి నిహారిక చిత్రకళా తపస్వి కొండపల్లి శేషగిరిరావు పేరిట జీవిత చరిత్రను రాశారు. ప్రతి ఒక్కరూ కుటుంబాలతో కలసి చూడాల్సిన ప్రదర్శన.

- డాక్టర్ కె.లక్ష్మి, అర్ట్‌గ్యాలరీ డైరెక్టర్

ప్రదర్శన ఉపయోగకరం..

చిత్రరంగంలో రాణిస్తున్న వారికి ఈ ప్రదర్శన ఎంతో ఉపయోగకరం. రామాయణ ఘట్టాలను చిత్రరూపంలో అద్భుతంగా చిత్రించారు. వీటి ద్వారా సంస్కృతి, సాంప్రదాయాలను నేటి తరానికి తెలియజెప్పొచ్చు. చిత్రకారులు వీటి ద్వారా ఎన్నో మెళకువలను తెలుసుకోవచ్చు.

- కీర్తి, జేఎన్‌ఏఎఫ్‌యూ విద్యార్థిని



నగరంలో కలినరీ ఫెస్ట్..

50 దేశాలకు చెందిన చెఫ్‌ల పాకశాస్త్ర ప్రదర్శన

ఐఐహెచ్‌ఎమ్, ఇంటర్నేషనల్ హాస్పిటాలిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహణ



సాక్షి, సిటీబ్యూరో: నగరం మరోసారి వివిధ దేశాలకు చెందిన పసందైన రుచులకు వేదికగా మారనుంది. ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, ఇంటర్నేషనల్ హాస్పిటాలిటీ కౌన్సిల్ లండన్ భాగస్వామ్యంతో నగరంలోని ది గ్లాస్ ఆనియన్ వేదికగా యునైటెడ్ వరల్డ్ యంగ్ చెఫ్స్ గ్యాస్ట్రోనమిక్ ఎక్స్‌పీరియన్స్ నిర్వహించనున్నారు. ఈ కలినరీ ఫెస్ట్‌లో 50కి పైగా దేశాల నుంచి ప్రముఖ చెఫ్‌లు అంతర్జాతీయ వంటకాలను దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో ప్రదర్శించనున్నారు. ఇందులో 10 మంది చెఫ్‌లు హైదరాబాద్‌లో విభిన్న రుచుల సమ్మేళనాన్ని సృష్టించనున్నారు. ఫిబ్రవరి 3న జరగనున్న ఈ ఫెస్ట్‌లో భారత్‌తో పాటు అల్బేనియా, ఆస్ట్రేలియా, గ్రీస్, ఉజ్బెకిస్తాన్, కజకిస్తాన్, తైమూర్-లెస్టే, నైజీరియా, ఉగాండా, ఫిలిప్పీన్స్ వంటి దేశాలకు చెందిన చెఫ్‌లు తమ పాకశాస్త్ర నైపుణ్యాలను ప్రదర్శించనున్నారు.

యువర్స్



● ఇన్నోవేషన్

ఎందుకు? ఏమిటి? ఎలా? అనే ఆసక్తి చిన్న వయసులోనే గగన్‌చంద్రలో మొదలైంది. ఆ ఆసక్తే గగన్‌ను ఆవిష్కరణల బాటలో నడిపిస్తోంది. 'హైబ్రీడ్ త్రీ ఇన్ వన్' సైకిల్ రూపకల్పనతో ప్రశంసలు అందుకుంటున్నాడు....

● గగన్ చంద్ర

హైటెక్ కుర్రాడు

సోలార్ విద్యుత్తు, బ్యాటరీ, అవసరమైనప్పుడు పెట్రోల్‌తోనూ నడిచే హైబ్రీడ్ త్రీ ఇన్ వన్ సైకిల్‌కు రూపకల్పన చేశాడు 14 ఏళ్ల గగన్‌చంద్ర. ఎలాంటి ఖర్చు లేకుండా బ్యాటరీతో 35 కి.మీ దూరం వరకు ప్రయాణించడంతో పాటు సోలార్ విద్యుత్ సాయంతో రోజంతా ప్రయాణించేలా సైకిల్‌ను రూపొందించాడు.

సాధారణ సైకిల్‌కు ఎలక్ట్రికల్ బ్యాటరీ, సోలార్‌ప్యానెల్, హబ్ మోటారును అమర్చి హైబ్రీడ్ సైకిల్‌ను తయారుచేశాడు. ఈ సైకిల్‌కు డిజిటల్ స్పీడో మీటర్, సెంట్రల్ లాక్ సిస్టమ్‌తో పాటు నావిగేషన్, జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశాడు. అధునాతన వాహనాల మాదిరిగానే ఈ సైకిల్‌కు ఉన్న జీపీఎస్ ద్వారా ఎక్కడి నుంచైనా ట్రాకింగ్ చేయవచ్చు. మొబైల్ వాయిస్ కమాండ్, అలెక్సా ద్వారా మ్యూజిక్, కాల్స్ ఆపరేట్ చేసేలా సైకిల్‌ను రూపొందించాడు. సైకిల్‌లో కంట్రోల్ బాక్స్‌ను గగన్ సొంతంగా తయారుచేశాడు. అవసరమైన సామాగ్రిని ఆన్‌లైన్‌లో కొనుగోలు చేశాడు. మొత్తం రూ. 20వేల వరకు ఖర్చయిందని, భవిష్యత్తులో ఈ ఖర్చును మరింత తగ్గిస్తాను అంటున్నాడు గగన్.

నల్లమల అటవీప్రాంతమైన నాగర్‌కర్నూల్ జిల్లాలోని బల్మూరు మండల కేంద్రానికి చెందిన గౌరమోని గగన్‌చంద్ర 9వ తరగతి విద్యార్థి. ఇటీవల పుదుచ్చేరిలో నిర్వహించిన 'సదర్న్ ఇండియా సైన్స్ ఫేర్'లో మూడో బహుమతి అందుకున్నాడు. వివిధ రాష్ట్రాల నుంచి 250 మంది ఈ సైన్స్ ఫేర్‌లో పాల్గొన్నారు. ఫిబ్రవరిలో నిర్వహించనున్న జాతీయస్థాయి సైన్స్ ఫేర్‌కు ఎంపిక య్యాడు.

'నా కొడుకు రెండో తరగతి నుంచే పాత వస్తువులతో ప్రయోగాలు చేసేవాడు. వాడి పడేసిన వస్తువులతో లైట్లు, మోటార్లు, కూలర్లు తయారు చేసేవాడు. ఇల్లు చిన్నగా ఉండటంతో వాటిని పడేసేదాన్ని. అప్పుడప్పుడూ కోపడ్డాను. ఇప్పుడు అందరూ మెచ్చుకుంటుంటే సంతోషంగా ఉంది' అంటుంది గగన్ తల్లి నాగరాణి.

– పాదం వెంకటేశ్,
సాక్షి, నాగర్‌కర్నూల్

ఇక ఎలక్ట్రికల్ కారు

ఎలక్ట్రికల్ సైకిల్ కొనేందుకు వెళ్తే అరవై వేలు చెప్పారు. దాంతో నేనే ఇరవై వేలతో సొంతంగా తయారుచేసుకున్నాను. విద్యార్థులకు ఉపయోగపడేలా ఇంకా తక్కువ ఖర్చులో అయ్యేలా చూస్తాను. భవిష్యత్తులో ఎక్కువ మంది ప్రయాణించేలా, తక్కువ ఖర్చులో ఎలక్ట్రికల్ కారును రూపొందించాలనుకుంటున్నాను.
- గగన్ చంద్ర



● టెక్.. టాక్

ఇన్‌స్టా 360 ఫ్లో 2 ప్రో

● ఏఐ-పవర్డ్ ట్రాకింగ్ టెక్నాలజీ ● బిల్ట్-ఇన్ సెల్ఫీ స్టిక్ ● 360 డిగ్రీ ఇనిఫినిటీ పాన్ ట్రాకింగ్ బరువు: 357 గ్రా, ● సెల్ఫీ మిర్రర్ ● టెలి ప్రాంప్టర్ మోడ్ ● బ్యాటరీ: 1,100 ఎంఏహెచ్ ● రన్ టైమ్: 10 గంటలు



వివో ఎక్స్ 200

● డిస్‌ప్లే: 6.67 అంగుళాలు ● రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్ ● రిజల్యూషన్: 1260×2800 పిక్సెల్స్ ● ఫ్రంట్ కెమెరా: 32 ఎంపీ ● మెమోరీ: 256జీబి 12జీబి ర్యామ్/512జీబి 12జీబి ర్యామ్/ 512 జీబి 16జీబి ర్యామ్ ● వోఎస్: ఆండ్రాయిడ్ 15 ● బ్యాటరీ: 5800 ఎంఏహెచ్

● యంగ్ టాలెంట్

2023 ఓజీ 40



నాసా వారి ఇంటర్నేషనల్ ఆస్ట్రాయిడ్ డిస్కవరీ ప్రాజెక్ట్(ఐఏడీపీ)లో ఇద్దరు క్లాస్‌మెట్లతో కలిసి పాల్గొన్న 14 సంవత్సరాల దక్ష్ మాలిక్ అంగారక గ్రహం, బృహస్పతిల మెయిన్ ఆస్ట్రాయిడ్ బెల్ట్ మధ్య గ్రహశకలాన్ని కనుగొన్నాడు. దీని కోసం ఆస్ట్రోనామికా అనే సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించుకున్నాడు.

హార్డిన్ సిమన్స్ యూనివర్శిటీకి చెందిన డాక్టర్ పాట్రిక్ మిల్లర్ పర్యవేక్షణలో ఈ ప్రాజెక్ట్ చేపట్టారు. తాత్కాలికంగా ఈ గ్రహశకలానికి '2023 ఓజీ40' అని నామకరణం చేశారు. త్వరలో మాలిక్ పెట్టబోయే పేరే ఈ గ్రహశకలానికి శాశ్వతంగా ఉండిపోతుంది. గ్రహశకలానికి ప్రాథమిక పరీక్షలు నిర్వహించి ధ్రువీకరించడానికి నాసాకు నెలల సమయం పడుతుంది. ఆ తరువాత దానికి పేరు పెడతారు.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాకు చెందిన మాలిక్ 'శివనాడర్ స్కూల్'లో 9వ తరగతి చదువుతున్నాడు. చిన్నప్పటి నుంచి మాలిక్‌కు అంతరిక్షం అంటే ఇష్టం. గ్రహాలు, సౌరకుటుంబం గురించి నేషనల్ జియోగ్రాఫిక్‌లో వచ్చిన డాక్యుమెంటరీలన్నీ చూసేవాడు.

ఐఏడీపీలో ప్రతి సంవత్సరం ఆరువేలమందికి పైగా పాల్గొంటారు. వారిలో కొందరు కొత్త గ్రహశకలాలని కనుక్కోవడంలో విజయం సాధించారు. 'ఐఏడీపీ' వెబ్‌సైట్ ప్రకారం గ్రహశకలాన్ని కనుగొన్న ఆరవ భారతీయ విద్యార్థి దక్ష్ మాలిక్.

'ఈ అన్వేషణ నాకు సరదాగా అనిపించింది. గ్రహశకలం కోసం వెదుకుతున్నప్పుడు నాసాలో పనిచేస్తున్నట్లు అనిపించింది. నా కల నిజమైంది' అంటున్నాడు ఆనందంగా దక్ష్ మాలిక్.

యూట్యూబ్‌లో....



సరికొత్త ప్రయోగాత్మక ఫీచర్‌లలో భాగంగా యూట్యూబ్ అధిక నాణ్యతతో ఆడియోను వినడం, మునపటి కంటే ఎక్కువ వేగంతో వీడియోలను చూసే సామర్థ్యం, షార్ట్స్ కోసం పిక్చర్-ఇన్-పిక్చర్ మోడ్...ఇలా ఎన్నో అందుబాటులోకి తీసుకువస్తోంది. గత సంవత్సరం 'జంప్ ఎహెడ్' అనే కొత్త ఫీచర్‌ను తీసుకువచ్చింది. ఇది వీడియోకు సంబంధించి బెస్ట్ పార్ట్‌ను స్కిప్ చేయడానికి అనుమతిస్తుంది. ఇప్పుడు ఈ ఫీచర్ వెబ్‌లో అందుబాటులో ఉంది. పిక్చర్-ఇన్-పిక్చర్, షార్ట్స్ స్మార్ట్ డౌన్‌లోడ్స్ ఫిబ్రవరి 19 వరకు అందుబాటులో ఉంటాయి. కొత్త ఫీచర్‌లు, మెరుగు పరిచిన ఫీచర్‌లకు యూజర్‌లు ఎలా స్పందిస్తారో అంచనా వేయడానికి యూట్యూబ్ ప్రయోగాలు పరీక్షలు.

మరిన్ని ఫీచర్‌లతో ఆంత్రోపిక్



అమెరికన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ 'ఆంత్రోపిక్' తన ఏఐ ఆధారిత చాట్బాట్ క్లాడ్‌కు క్రమంగా కొత్త ఫీచర్‌లను జోడిస్తుంది. వాయిస్ మోడ్, విషయాలను గుర్తుంచుకునే సామర్థ్యంతో కూడిన చాట్‌జీపీటిలాంటి ఫీచర్‌లపై పని చేస్తున్నట్లు కంపెనీ సీయీవో డారియో అమోడీ తెలియజేశాడు. పీడిఎఫ్ ఫైల్స్ అప్‌లోడ్, విశ్లేషించే సామర్థ్యంతో సహా చాట్‌జీపీటీలాంటి ఫీచర్‌లను అందిస్తున్నప్పటికీ, ఇంటర్నెట్‌లో సమాచారాన్ని సెర్చ్ చేయడంలాంటి కొన్ని ప్రాథమిక కార్యాచరణలు దీనికి లేవు. చాట్‌జీపీటితో పోల్చితే క్లాడ్ ఫీచర్‌ల సెట్ వెనకబడి ఉంది.

● గేమింగ్

వింత జీవుల లోకంలోకి....



ఆకాశమంత ఎత్తులో ఒక కొండ. ఆ కొండపై ఒక ఇల్లు. ఆ ఇంటిని 'మ్యాడ్ హౌజ్' అని పిలుస్తారు. ఆ అనూహ్యమైన, మాయాజాలంతో కూడిన ఇంట్లోకి అడుగు పెట్టాలని, ఆ ఇంట్లో కనిపించే అంతుచిక్కని మనుషులు, వారి విచిత్ర వేషధారణను చూడాలనే ఆసక్తి మీకు ఉంటే...'ది స్టోన్ ఆఫ్ మ్యాడ్‌నెస్'లోకి అడుగుపెట్టాల్సిందే.

'ది స్టోన్ ఆఫ్ మ్యాడ్‌నెస్' గేమింగ్ కంపెనీ 'ది గేమ్ కిచెన్' సృష్టి. స్పానిష్ మడ్‌హౌజ్‌లో 18వ శతాబ్దంలో జరిగే ఘటనలతో ఈ అడ్వెంచర్ గేమ్‌ను రూపొందించారు. అయిదు మిస్టీరియస్ క్యారెక్టరల చుట్టూ తిరిగే గేమ్ ఇది. గేమ్‌ప్లే విషయానికి వస్తే...అయిదు క్యారెక్టర్‌లపై అల్టర్‌నేట్ కంట్రోల్‌ను గేమ్ ఇస్తుంది. ప్రతి క్యారెక్టర్‌కు తనదైన సామర్థ్యం, నైపుణ్యాలు ఉంటాయి. శత్రువుల దృష్టిని మరల్చడానికి, కష్టమైన ప్రదేశాలకు చేరుకోవడానికి...ఇలా ఎన్నో విషయాలకు సంబంధించి శక్తియుక్తులకు ఈ గేమ్ అనుమతిస్తుంది.

ప్లాట్‌ఫామ్: ప్లే స్టేషన్ 5, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్, నిన్‌టెండో స్విచ్, పీసీ జానర్స్: యాక్షన్ గేమ్, ఇండి గేమ్, స్ట్రాటజీ వీడియో గేమ్

● న్యూస్‌మేకర్

నాటి బాలకార్మికురాలు.... నేటి లీడ్ స్టార్!



ఏ కలలకు ఆస్కారం లేని కరుకు జీవితాన్ని చిన్న వయసులోనే అనుభవించిన సజ్దా పఠాన్ పేరు ఆస్కార్ విశేషాల్లో భాగంగా తరచు వినిపిస్తోంది. ప్రియాంక చోప్రా, గునీత్ మోంగా షార్ట్ ఫిల్మ్ 'అనూజ' 97వ ఆస్కార్ అవార్డుల్లో నామినేట్ అయిన విషయం తెలిసిందే. బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్‌గా నామినేట్ అయిన 'అనూజ'పై బజ్ వేడెక్కడంతో అందరి దృష్టి ఆ చిత్రంలో నటించిన తొమ్మిదేళ్ల లీడ్‌స్టార్ సజ్దా పఠాన్‌పై పడింది.

దిల్లీ మురికివాడల్లోని బాల కార్మికురాలైన సజ్దాను 'సలాం బాలక్ ట్రస్ట్' అనే స్వచ్ఛంద సంస్థ కాపాడింది. సజ్దాకు సినిమా నేపథ్యం లేకపోయినప్పటికీ సినిమాలకు బొత్తిగా కొత్త కాదు. ఇంతకుముందు లాటిటియా కొలోంబానీ దర్శకత్వం వహించిన ఫ్రెంచ్ చిత్రం 'ది బ్రైడ్'లో సజ్దా నటించింది.

ఆ సినిమాలో మియా మేల్జర్‌తో స్క్రీన్ స్పేస్ పంచుకుంది. మీరా నాయర్ ఆస్కార్ నామినేటెడ్ చిత్రం 'సలాం బాంబే' ద్వారా వచ్చిన ఆదాయంతో ఏర్పాటైన 'సలాం బాలక్ ట్రస్ట్' కృష్ణన్ నాయక్ ఫిల్మ్స్ భాగస్వామ్యంతో 'ది బ్రైడ్'ను నిర్మించింది.

ఊహించని నాటకీయ పరిణామాలు వెండితెరకే పరిమితం కాదు అని నిజజీవితంలో కూడా ఉంటాయని మరోసారి బలంగా చెప్పడానికి సజ్దా పఠాన్ బలమైన ఉదాహరణ.

● ఇంగ్లీష్ ఇడియమ్స్

వెజ్ ఔట్



మరీ ఎక్కువగా కష్టపడకుండా, సులువుగా, రిలాక్స్‌డ్‌గా పనిచేసే సందర్భంలో వాడే మాట....వెజ్ ఔట్.

● ఉదా: మై గ్రాండ్‌ఫాదర్ హ్యాడ్ డిసైడెడ్ టు వర్క్ హార్డ్ అన్‌టిల్ హీ టర్న్‌డ్ 50 అండ్ దెన్ వెజ్ ఔట్ అండ్ ఎంజాయ్ లైఫ్.

మూలం: ఇది ఆధునిక పదబంధం. 90ల చివరలో ప్రాచుర్యంలోకి వచ్చింది. సాహిత్య మూలం గురించి తెలియనప్పటికీ 'ప్రెటీ ఉమెన్' అనే సినిమాలో 'వెజ్ ఔట్' అనే మాట వినిపిస్తుంది.

సాక్షి సినిమా

సందడిగా ఊరే కలిసేనయ్యా...


● అజిత్, త్రిష

అజిత్ హీరోగా నటించిన తాజా చిత్రం 'విడా ముయర్చి'. త్రిష హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో రెజీనా, అర్జున్, ఆరవ్, నిఖిల్ నాయర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. మగిళ్ తిరుమేని దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 6న విడుదల కానుంది. ఈ సినిమా 'పట్టుదల' టైటిల్‌తో తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ మూవీ నుంచి 'సవదీక...' అనే పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. 'సందడిగా ఊరే కలిసేనయ్యా... విడి విడిగా తిరిగే రెండు ఎదలు ఫ్యామిలీగా ఒక్కటయ్యాయయ్యా..' అన్న లిరిక్స్‌తో ఈ పాట తెలుగు వెర్షన్ సాగుతుంది. ఈ పాటకు శ్రీ సాయికిరణ్ సంగీతం అందించారు. ఆంటోనీతో కలిసి ఈ చిత్రం సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఈ పాటను పాడారు.

మేలో ఆరంభం


● ప్రభాస్

'స్పిరిట్' సినిమా సెట్స్‌కు వెళ్లే సమయం ఆసన్నమైంది. ప్రభాస్ హీరోగా 'అర్జున్ రెడ్డి, యానిమల్' చిత్రాల ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందనున్న చిత్రం 'స్పిరిట్'. ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమా రెగ్యులర్ షూట్‌ను మేలో ప్రారంభించాలని యూనిట్ ప్లాన్ చేస్తోందని సమాచారం. ఈ చిత్రంలో ప్రభాస్ తొలిసారిగా పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించనున్నారు. దీంతో లుక్స్, ఫిజిక్ పరంగా స్పెషల్‌గా మేకోవర్ కానున్నారట. 'స్పిరిట్' చిత్రీకరణ అనుకున్న సమయానికన్నా కాస్త ఆలస్యం కావడానికి ఇదొక కారణమని ఫిల్మ్‌నగర్ భోగట్టా. ఇక ఈ సినిమాలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్, ఆలియా భట్, రష్మికా మందన్నా... ఇలా పలువురు తారల పేర్లు తెరపైకి వచ్చాయి. కానీ ఇంకా ఎవరూ ఫైనలైజ్ కాలేదట. టీ సిరీస్ భూషణ్ కుమార్, ప్రణయ్‌రెడ్డి వంగా (సందీప్‌రెడ్డి వంగా సోదరుడు) భద్రకాళి పిక్చర్స్ నిర్మించనున్న 'స్పిరిట్' చిత్రం 2026 చివర్లో విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ సినిమాకు సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్.

కెన్యా కాలింగ్?


● మహేశ్‌బాబు


మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో అడ్వెంచరస్ యాక్షన్ మూవీ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా చిత్రీకరణ అతి త్వరలోనే ప్రారంభం కానుందని సమాచారం. హైదరాబాద్ శివార్లలో ఈ సినిమా కోసం భారీ సెట్ వర్క్ జరుగుతోంది. అలాగే గత ఏడాది అక్టోబరులో దర్శకుడు రాజమౌళి కెన్యా వెళ్లి, అక్కడి లోకేషన్స్‌ను పరిశీలించిన సంగతి గుర్తుండే ఉంటుంది. ముందుగా ఈ సినిమా షూటింగ్ కెన్యాలోనే ప్రారంభం అవుతుందని, ఆ దిశగా రాజమౌళి ఆల్రెడీ ఏర్పాట్లు పూర్తి చేశారని ఫిల్మ్ నగర్ భోగట్టా. ఇక ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా ఓ కీలక పాత్రలో నటించనున్నారు. మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ఓ లీడ్ రోల్ చేస్తారనే ప్రచారం ఎప్పట్నుంచో జరుగుతోంది. అయితే ఈ విషయంపై ఇంకా ఏదీ ఫైనలైజ్ కాలేదని, ఏదైనా ఉంటే మేమే చెబుతామని పృథ్వీరాజ్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. కేఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రం 2027లో విడుదల కావొచ్చనే ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాకు కీరవాణి స్వరకర్త.

మోనాలిసాకి బాలీవుడ్ ఆఫర్


● సనోజ్ మిశ్రా, మోనాలిసా

ఉత్తరప్రదేశ్ కుంభమేళాలో పూసల దండలు, రుద్రాక్షలు అమ్ముకునేందుకు వచ్చిన మోనాలిసా అందరి దృష్టినీ ఆకర్షించిన విషయం తెలిసిందే. సోషల్ మీడియాల వేదికగా ఆమె ఫొటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. ఆమెతో సెల్ఫీలు తీసుకునేందుకు కొందరు ఆసక్తి చూపించారు. ఈ సెల్ఫీల తాకిడి ఎక్కువగా ఉండటంతో కుంభమేళా నుంచి మోనాలిసా ఇంటికి తిరిగి వెళ్లిపోవాల్సి వచ్చింది. కాగా ఈ పాపులార్టీయే మోనాలిసాకి సినిమాలో నటించే అవకాశం తెచ్చిపెట్టింది. బాలీవుడ్ దర్శకుడు సనోజ్ మిశ్రా తెరకెక్కించనున్న 'ది డైరీ ఆఫ్ మణిపూర్' సినిమాలో మోనాలిసా ఓ రోల్ చేయనున్నారు. మోనాలిసా స్వగ్రామం మహేశ్వర్‌కు వెళ్లి, ఆమె కుటుంబ సభ్యులను కలిసి, వారితో మాట్లాడి 'ది డైరీ ఆఫ్ మణిపూర్' మూవీలో మోనాలిసా భాగం అయ్యేలా చేశారు సనోజ్ మిశ్రా. అంతేకాదు... ఈ సినిమా చిత్రీకరణకు ఇంకా నెల రోజుల సమయం ఉండటంతో మోనాలిసాకు నటనలో ప్రత్యేక శిక్షణ ఇప్పించనున్నట్లు సనోజ్ పేర్కొన్నారు. ఇక 'ది డైరీ ఆఫ్ వెస్ట్ బెంగాల్, శ్రీనగర్' వంటి సినిమాలకు సనోజ్ మిశ్రా దర్శకత్వం వహించారు.

డేట్ చేంజ్


● రాశీ ఖన్నా, జీవా

జీవా, అర్జున్ సర్జా హీరోలుగా, రాశీ ఖన్నా హీరోయిన్‌గా నటించిన తాజా చిత్రం 'అగత్యా'. ప్రముఖ పాటల రచయిత పా. విజయ్ కథ అందించడంతో పాటు దర్శకత్వం వహించారు. వేల్స్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై ఐసరి గణేశ్ నిర్మించిన ఈ చిత్రం తమిళ, తెలుగు, హిందీ భాషల్లో నేడు విడుదల కావాల్సింది. అయితే జనవరి 31 నుంచి ఫిబ్రవరి 28కి విడుదలని వాయిదా వేసినట్లు ప్రకటించారు మేకర్స్. ''గ్రామీణ నేపథ్యంతో పాటు మంచి థ్రిల్లింగ్ కాన్సెప్ట్‌తో రూపొందిన చిత్రం 'అగత్యా'. మన సంస్కృతి, అనుబంధాలను దర్శకుడు బలంగా చెప్పారు. అద్భుతమైన సీజీ వర్క్‌తో భారీ బడ్జెట్‌తో తెరకెక్కింది. వీఎఫ్ఎక్స్ కోసం మరికొంత టైమ్ కేటాయించాలని భావించి, విడుదల వాయిదా వేశాం'' అని యూనిట్ పేర్కొంది.

క్వీనే వచ్చేను...


● ప్రియాంకా మోహనన్

'మామా మామా కమ్ అండ్ సింగు... క్వీనే వచ్చెను... నువ్వే కింగు...' అంటూ మొదలవుతుంది 'జాబిలమ్మ నీకు అంత కోపమా' సినిమాలోని 'గోల్డెన్ స్పారో...' పాట. పవీష్, అనిఖా సురేంద్రన్, ప్రియా ప్రకాశ్ వారియర్, మాథ్యూ థామస్, వెంకటేశ్ మీనన్, రబియా ఖతూన్, రమ్యా రంగనాథన్ ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'నిలవుక్కు ఎన్ మేల్ ఎన్నడి కోబం'. ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ మూవీకి హీరో ధనుష్ దర్శకత్వం వహించారు. ఆర్కే ప్రొడక్షన్స్‌తో కలిసి ధనుష్ సొంత నిర్మాణ సంస్థ వండర్‌బార్ ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 21న విడుదల కానుంది. ఈ మూవీని 'జాబిలమ్మ నీకు అంత కోపమా..' అనే టైటిల్‌తో తెలుగులో ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్‌పి రిలీజ్ చేస్తోంది. తాజాగా ఈ మూవీలోని 'గోల్డెన్ స్పారో' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. 'గోల్డెన్ స్పారో... నా గుండెలో యారో... నువ్వు లేని లైఫు ఫుల్ శారో...,' అంటూ సాగే ఈ స్పెషల్ సాంగ్‌లో పవీష్, అనిఖాలతో పాటు హీరోయిన్ ప్రియాంకా మోహనన్ డ్యాన్స్ చేశారు. ఈ పాటకు రాంబాబు గోసాల లిరిక్స్ అందించగా, అశ్విన్ సత్య-సుదీష్ శశికుమార్-సుభాషిణి ఆలపించారు. ఈ సినిమాకు సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.

ఓటీటీ — ఇది చూడొచ్చు

హాలీవుడ్ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్!

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం బ్యాక్ ఇన్ యాక్షన్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



హాలీవుడ్ సినిమాలన్నీ ఏదైనా ఒక జోనర్‌కి సంబంధించనవి మాత్రమే ఎక్కువగా ఉంటాయి. అలాంటిది ఓ యాక్షన్ జోనర్‌ని ఫ్యామిలీతో కలిపి హాలీవుడ్‌లో సినిమా రావడమంటే అదో వింత. అదే 'బ్యాక్ ఇన్' యాక్షన్ సినిమా. నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమ్ అవుతోంది. తెలుగు వెర్షన్ కూడా లభ్యమవుతోంది. ఈ సినిమాకి సేత్ గార్డన్ దర్శకుడు . కేమరన్ డియాజ్, జెమీ ఫాక్స్ వంటి ప్రముఖ నటులతో పాటు జేమ్స్ బాండ్ సినిమాలలో సుపరిచితురాలైన గ్లెన్ క్లోజ్ ఈ సినిమాలో ఓ ప్రత్యేక పాత్రలో కనిపించడం విశేషం. ఇక కథ విషయానికొస్తే... అమెరికాలోని ప్రముఖ సీఐఎ సంస్థలో ప్రతినిధులుగా పని చేస్తున్న ఎమిలీ, మాట్ ప్రేమించుకుంటుంటారు. వారి ప్రేమకు ఫలితంగా ఎమిలీ గర్భవతి అవుతుంది. ఆ విషయాన్ని ఓ ఆపరేషన్‌లో భాగంగా మాట్‌కు చెబుతుంది ఎమిలీ. ఆ ఆపరేషన్ ఏంటంటే ప్రపంచంలోని ప్రముఖ పారిశ్రామిక, వాణిజ్య మరియు ప్రభుత్వ అధికార యంత్రాంగానికి సంబంధించిన ఓ డేటా డ్రైవ్‌ను తీసుకురావడం. ఈ దశలో ఇద్దరూ ఓ ఘోర విమాన ప్రమాదం నుండి తప్పించుకుంటారు. అలా తప్పించుకున్నవాళ్లు ఇక ప్రపంచానికి తమ ఉనికి తెలియకుండా దూరంగా పుట్టబోయే పిల్లలతో సంతోషంగా ఉండాలనుకుంటారు. అందుకే వాళ్లిద్దరూ 12 ఏళ్ళ దాకా అటు సీఐఎకి ఇటు ప్రపంచానికి తమ అసలు ఉనికి తెలియకుండా జాగ్రత్త పడతారు. ఈ 12 ఏళ్లలో వాళ్లకి ఇద్దరు పిల్లలు పుడతారు. తమ పిల్లలకు కూడా తమ అసలు ఐడెంటిటీ తెలియనివ్వరు. అయితే ఏ ఆపరేషన్ కోసం వీళ్లిద్దరూ అజ్ఞాతానికి వచ్చారో ఆ ఆపరేషన్ వల్లే మళ్లీ కథ మొదలవుతుంది. ఆ ఆపరేషన్‌లో శత్రువులకు దొరకకుండా ఉండాలని మాట్ తనతో పాటు ఆ డేటా డ్రైవ్‌ని ఎమిలీకి కూడా తెలియకుండా దాస్తాడు. ఆ డ్రైవ్ కోసం విలన్స్ వీళ్లిద్దరినీ మళ్లీ ట్రాక్ చేసి ఎటాక్ చేస్తారు. మరి విలన్స్ ఆ డ్రైవ్ చేజిక్కించుకుంటారా? తమ పిల్లలకు, సమాజానికి తమ ఐడెంటిటీని దాచి పెట్టిన ఎమిలీ, మాట్ విలన్స్ ఎటాక్ నుండి తప్పించుకున్నారా? లేదా అన్నది సినిమాలోనే చూడాలి. పైన చెప్పుకున్నట్లు ఇదో చక్కటి ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్. మంచి స్టంట్స్, విజువల్స్‌తో పాటు చక్కని కామెడీని ఈ సినిమాలో చూసి ఎంజాయ్ చేస్తారు. మరింకెందుకు ఆలస్యం... గ్రాబ్ యువర్ రిమోట్ టు 'బ్యాక్ ఇన్ యాక్షన్' ఫర్ వాచింగ్ దిస్ వీకెండ్

– ఇంటూరు హరికృష్ణ

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 227	76,760
నిఫ్టీ ▲ 87	23,250

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	19,606	▽ 27
డోజోన్స్	44,817	▲ 106
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,647	▲ 89
డాక్స్	21,727	▲ 90
షాంఘై (గురువారం ముగింపు)	3,251	▽ 2
నికాయ్	39,514	▲ 99

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	81,303	▲ 328
బంగారం (99.5 స్వచ్ఛత)	80,977	▲ 326
వెండి (కిలో)	92,184	▲ 1,504

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.05	87.07
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.20	108.00
€	యూరో	ఎస్‌బీఐ	88.77	91.39
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.62	55.98
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.19	55.39
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	60.95	65.62
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.13	23.69
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.19	23.74
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.01	12.83



పసిడి తగ్గేదేలే..

- అంతర్జాతీయంగా ఫ్యూచర్స్ మార్కెట్లో 2,852 డాలర్లకు అప్
- దేశీయంగా మరింత పెరిగే అవకాశం

న్యూఢిల్లీ: యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ కీలక వడ్డీ రేట్లను తగ్గించడం, 2024 నాలుగో త్రైమాసికంలో అమెరికా జీడీపీ నెమ్మదించిందన్న పరిణామాల నేపథ్యంలో పసిడి ఆల్‌టైమ్ రికార్డుల ర్యాలీ కొనసాగుతోంది. అంతర్జాతీయంగా ఫ్యూచర్స్ మార్కెట్లో ఏప్రిల్ కాంట్రాక్టుకు సంబంధించి ఔన్సు (31.1 గ్రాములు) ధర ఒక దశలో ఏకంగా 2,852 డాలర్లకు ఎగిసింది. ఈ నేపథ్యంలో



2025లో 3,290 డాలర్లకు కూడా చేరే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. బుధవారం అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించకపోవడంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేయడం కూడా పసిడి రేట్లకు ఆజ్యం పోసినట్లు తెలిపాయి. తాజా పరిణామంతో దేశీయంగా స్పాట్ మార్కెట్లో పసిడి ధర శుక్రవారం మరింత పెరగవచ్చని పేర్కొన్నాయి.

మరోవైపు, ఢిల్లీలో గురువారమూ పసిడి కొత్త జీవితకాల గరిష్టాలను తాకింది. 99.9 స్వచ్ఛత బంగారం 10 గ్రాముల ధర రూ.50 పెరిగి రూ.83,800కు చేరింది. బుధవారం 10 గ్రా. రూ.910 లాభపడి రూ.83,750 వద్ద ముగియడం తెలిసిందే. 99.5 స్వచ్ఛత బంగారం సైతం రూ.50 పెరిగి రూ.83,400కు చేరింది. మరోవైపు వెండికి సైతం డిమాండ్ పెరిగింది. కొనుగోళ్ల మద్దతుతో కిలోకి ఏకంగా రూ.1,150 పెరిగి రూ.94,150కి చేరింది. ఎంసీఎక్స్ ఫ్యూచర్స్ మార్కెట్లోనూ బంగారం నూతన గరిష్టాలను నమోదు చేసింది. ఏప్రిల్ నెల కాంట్రాక్టుల ధర రూ.541 పెరిగి రూ.81,145కు చేరింది. బడ్జెట్లో దిగుమతి సుంకాలు పెంచొచ్చన్న అంచనాలతో బంగారం సానుకూలంగా ట్రేడ్ అవుతోందని నిపుణులు చెబుతున్నాయి.

మనకూ సొంత ఏఐ మోడల్!

- 8–10 నెలల్లో దేశీ సామర్థ్యంతో తయారీ
- అందుబాటులో 18,693 జీపీయూలు
- కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి



న్యూఢిల్లీ: కృత్రిమ మేథకి (ఏఐ) సంబంధించి చాట్‌జీపీటీ, డీప్‌సీక్ ఆర్1లకు దీటుగా మన సొంత ఫౌండేషన్ మోడల్స్‌ను ప్రోత్సహించడంపై కేంద్రం కసరత్తు చేస్తోంది. ఇందుకోసం అంకుర సంస్థలు, పరిశోధకులకు కావాల్సిన మౌలిక సదుపాయాలను చౌకగా అందుబాటులోకి తెస్తోంది. వీటి దన్నుతో వచ్చే 8–10 నెలల వ్యవధిలో కనీసం ఆరు పెద్ద డెవలపర్లు/స్టార్టప్‌లు పూర్తి దేశీయ సామర్థ్యంతో, దేశీ అవసరాల కోసం ఫౌండేషన్ మోడల్స్‌ను తయారు చేయగలవని కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ ధీమా వ్యక్తం చేశారు. మరింతగా దృష్టి పెడితే 4–6 నెలల వ్యవధిలో కూడా ఇవి సాధ్యపడే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఏఐ మార్గదర్శ ప్రణాళికలో తదుపరి చర్యలను మంత్రి గురువారం వెల్లడించారు. దీని ప్రకారం ఏఐ ఫౌండేషన్ మోడల్స్‌పై పని చేసే అంకురాలు, పరిశోధకులకు 18,693 అత్యాధునిక గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ల (జీపీయూ) ఉమ్మడి కంప్యూటింగ్ సామర్థ్యం అందుబాటులోకి రానుంది. జియో ప్లాట్‌ఫామ్స్, సీఎంఎస్ కంప్యూటర్స్, టాటా కమ్యూనికేషన్స్ మొదలైన సంస్థలు ఈ జీపీయూలను అందుబాటులో ఉంచుతాయి. అంతర్జాతీయ వ్యయ ప్రమాణాలతో పోలిస్తే ఉమ్మడి కంప్యూటింగ్ సదుపాయం దేశీయంగా ఒక డాలరు కన్నా తక్కువకే (జీపీయూ అవర్‌కి) లభిస్తుందని, 40% వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుందని వైష్ణవ్ తెలిపారు.

ఏఐ సేఫ్టీ...: ఫౌండేషనల్ మోడల్స్ సురక్షితంగా, విశ్వసనీయమైనవిగా ఉండేలా చూసేందుకు ఏఐ సేఫ్టీ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు మంత్రి చెప్పారు. దీని కింద మెషిన్ అన్‌లెర్నింగ్ (ఐఐటీ జోధ్‌పూర్), సింథటిక్ డేటా జనరేషన్ (ఐఐటీ రూర్కీ), ప్రైవసీ ఎన్హాన్సింగ్ స్ట్రాటెజీ (ఐఐటీ ఢిల్లీ, ట్రిపుల్ ఐటీ ఢిల్లీ, టీఈసీ) తదితర ప్రాజెక్టులు ఎంపికైనట్లు ఆయన వివరించారు.

ఇండియా ఏఐ మిషన్..

కృత్రిమ మేథ సహకారంతో ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, లాజిస్టిక్స్ తదితర సవాళ్ల పరిష్కారానికి ఉద్దేశించి ఆవిష్కరించిన ఏఐ మిషన్ కింద పలు దరఖాస్తులు వచ్చినట్లు వైష్ణవ్ చెప్పారు. తొలి విడత ఫండింగ్ కోసం 18 అప్లికేషన్లను ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇవి వ్యవసాయం, వాతావరణ మార్పులు మొదలైన అంశాలపై పని చేస్తున్నట్లు వివరించారు.

భారతీయ అమెరికన్‌కు యూఎస్ బ్యాన్‌కార్ప్ పగ్గాలు

సీఈవోగా గుంజన్ కేడియా



హ్యూస్టన్: ఫైనాన్షియల్ సర్వీసుల్లో ఉన్న యూఎస్‌కు చెందిన యూఎస్ బ్యాన్‌కార్ప్ తదుపరి సీఈవోగా గుంజన్ కేడియా నియమితులయ్యారు. తద్వారా కంపెనీకి నాయకత్వం వహించనున్న మొదటి భారతీయ అమెరికన్‌గా నిలిచారు. యూఎస్‌లోని అతిపెద్ద ఆర్థిక సంస్థలలో యూఎస్ బ్యాన్‌కార్ప్ ఒకటి. ఏప్రిల్ 15న జరిగే వార్షిక వాటాదారుల సమావేశం తర్వాత ఆమె కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. అలాగే డైరెక్టర్ల బోర్డులో కూడా చేరనున్నారు. ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా పదవి స్వీకరించనున్న ఆండీ సెసిరీ స్థానాన్ని 54 ఏళ్ల కేడియా భర్తీ చేస్తారు. ఢిల్లీకి చెందిన గుంజన్ 2016 నుండి యూఎస్ బ్యాన్‌కార్ప్‌లో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. ఆర్థిక సేవల రంగంలో దాదాపు మూడు దశాబ్దాల అనుభవం ఉంది. స్టేట్ స్ట్రీట్ ఫైనాన్షియల్, బీఎన్‌వై మెలన్, మెకిన్సీ అండ్ కంపెనీ, పీడబ్ల్యూసీలో సీనియర్ ఎగ్జిక్యూటివ్ బాధ్యతలను నిర్వహించారు. న్యూయార్క్‌కు చెందిన మ్యాగజీన్ అమెరికన్ బ్యాంకర్ ప్రకటించిన బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగంలో అత్యంత శక్తివంతమైన మహిళల జాబితాలో ఏడుసార్లు చోటు సంపాదించారు.

మూడో రోజూ లాభాలే

- అధిక వెయిటేజీ షేర్ల దన్ను
- సెన్సెక్స్ లాభం 227 పాయింట్లు

ముంబై: అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(1%), రిలయన్స్ ఇండస్ట్రీస్(1.50%), ఎయిర్‌టెల్(3%), షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు మూడోరోజూ లాభాలు ఆర్జించాయి. సెన్సెక్స్ 227 పాయింట్లు పెరిగి 76,760 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 87 పాయింట్లు పెరిగి 23,250 వద్ద నిలిచింది. ఉదయం బలహీనంగా మొదలైన సూచీలు రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. సెన్సెక్స్ 76,401 వద్ద కనిష్టాన్ని, 76,898 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 23,139 – 23,311 శ్రేణిలో ట్రేడైంది. ఆయిల్‌అండ్‌గ్యాస్, ఇంధన, రియల్టీ, ఫార్మా, టెలికం షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఐటీ, కన్జూమర్ డ్యూరబుల్స్, టెక్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించడంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి. టాటా మోటార్స్ షేరు 7% నష్టపోయి రూ.697 వద్ద స్థిరపడింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

టీమ్ సీతారామన్... బడ్జెట్ మే 'సవాల్'!	ఎల్‌అండ్‌టీ లాభం ప్లస్

ఆరోగ్య సేవలకు టానిక్ ఇస్తారా..?

- మరిన్ని కేటాయింపులు చేయాలి
- జీడీపీలో 2.5 శాతానికి పెంచాలి
- పరిశోధన, అభివృద్ధికి ప్రోత్సాహకాలు కల్పించాలి
- ఎంఎస్‌ఎంఈలకు రుణ లభ్యతను పెంచాలి
- నిపుణుల సూచనలు

ప్రజలందరికీ ఆరోగ్య సదుపాయాలు మరింతగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు వీలుగా.. ప్రజారోగ్యంపై ప్రభుత్వం మరింత దృష్టి సారించడంతోపాటు కేటాయింపులను గణనీయంగా పెంచాలని ఈ రంగానికి చెందిన నిపుణులు కోరుతున్నారు. ప్రభుత్వరంగంలో కొత్త ఆస్పత్రుల ఏర్పాటుతోపాటు, ప్రైవేటు రంగంలో ఆస్పత్రులకు సైతం పలు రకాల ప్రయోజనాలతో ప్రోత్సాహం అందించాలన్న సూచనలు వస్తున్నాయి. వైద్య సేవలు, పరికరాలు, ఔషధాలపై జీఎస్‌టీని తగ్గించాలన్న డిమాండ్లు నెలకొన్నాయి. మరోవైపు 11 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తూ జీడీపీలో 30–35 శాతం వాటా కలిగిన ఎంఎస్‌ఎంఈ రంగం సైతం విధానపరమైన మద్దతు చర్యలను ఆశిస్తోంది.

అంచనాలు-డిమాండ్లు..

- 2024–25 బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి రూ.90,171 కోట్లు కేటాయించారు. అత్యాధునిక ఆరోగ్య సదుపాయాలు మరింత మందికి అందుబాటులోకి రావాలంటే జీడీపీలో కేటాయింపులు 2.5 శాతానికి పెంచాలి.



- ఒకరికి వినియోగించిన లేదా పునర్వినియోగానికి అనుకూలంగా మార్చిన (రీఫర్బిష్డ్) వైద్య పరికరాల విషయంలో తగిన నియంత్రపరమైన విధానాల తీసుకురావడం ద్వారా.. ఈ పరికరాలు సమాజంలో వైద్య సదుపాయాలు అంతగా అందని వర్గాలకు చేరువ చేయొచ్చు.
- వ్యాధి నివారణ ముందస్తు ఆరోగ్య చికిత్సలు, టెస్టులకు పన్నుల ప్రయోజనాలు కల్పించాలి. వైద్య, ఆరోగ్య సేవలు, జీవనశైలి వ్యాధులు(మధుమేహం, స్థూలకాయం తదితర) ప్రాణాధార ఔషధాలపై జీఎస్‌టీని తగ్గించాలి.
- గత బడ్జెట్లలో టెలీ మెడిసిన్‌కు మద్దతు లభించింది. నేషనల్ డిజిటల్ హెల్త్ మిషన్ (ఎన్‌డీహెచ్‌ఎం)ను సైతం కేంద్రం ప్రవేశపెట్టింది. 2025 బడ్జెట్‌లోనూ హెల్త్ యాప్‌లు, ఏఐ ఆధారి డయాగ్నోస్టిక్స్ టూల్స్ తదితర డిజిటల్ హెల్త్ సేవల విస్తరణ దిశగా చర్యలు ఉంటాయని అంచనా.
- ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్స్ కేంద్రాల విషయంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) బలోపేతం చేసే దిశగా చర్యలు అవసరం.

ఎంఎస్‌ఎంఈలకు రుణ విస్తృతి అవసరం

- సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్‌ఎంఈలు) కృత్రిమ మేధ (ఏఐ) టెక్నాలజీతో అనుసంధానం కావాల్సి ఉంటుంది. కనుక ఈ రంగంలోని కార్మికులకు డిజిటల్ నైపుణ్యాల కల్పన, ఏఐ ఆధారిత శిక్షణ కార్యక్రమాలను అందించాలి.
- ఎంఎస్‌ఎంఈలకు నిధుల లభ్యత పెద్ద సమస్యగా ఉంది. అత్యవసర క్రెడిట్ గ్యారంటీ సహా పలు రకాల పథకాలను ప్రభుత్వం తీసుకొచ్చినప్పటికీ ఆచరణలో లోపం నెలకొంది. దీంతో టైర్ 3, 4, గ్రామీణ ప్రాంతాల్లోని ఎంఎస్‌ఎంఈలకు రుణాల లభ్యత కష్టంగానే ఉంది. ఏఐ ఆధారిత రుణ దరఖాస్తుల మదింపు, రిస్క్ ప్రొఫైలింగ్‌తో రుణ లభ్యతను విస్తృతం చేయొచ్చు.
- తయారీ విస్తరణకు, తక్కువ వడ్డీరేట్లపై రుణాలు అందించాలి.



- ఫార్మాస్యూటికల్స్, వైద్య పరికరాల కోసం దేశం మొత్తానికి ఒకే నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయాలి.
- పరిశోధన, అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు, ప్రోత్సాహకాలు కల్పించాలి. ప్రభుత్వం నుంచి పరిశోధనా ప్రోత్సాహకాలు ప్రస్తుతం ఇనిస్టిట్యూషన్లు, విద్యా కేంద్రాలకే వెళుతున్నాయి.
- క్లినికల్, డిస్కవరీ రీసెర్చ్ కార్యక్రమాల్లో పాల్గొనే కాంట్రాక్ట్ రీసెర్చ్ సంస్థలకు (సీఆర్‌వోలు) నిధులు, ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

– సాక్షి, బిజినెస్ డెస్క్

మహావీర్ స్కోడా షోరూంలో కైలాక్



హైదరాబాద్: ఆల్ న్యూ స్కోడా కైలాక్‌ను మహావీర్ స్కోడా షోరూంలో విడుదల చేసినట్లు స్కోడా ఇండియా తెలిపింది. కాంపాక్ట్ ఎస్‌యూవీ కైలాక్ లగ్జరీ ఇంటీరియర్స్, అధునాత ఫీచర్లు కలిగి ఉంది. ఎన్‌సీఏపీ క్రాష్ టెస్ట్‌లో 5 స్టార్ సేఫ్టీ రేటింగ్ సాధించింది. దీని పనితీరు తెలుసుకునేందుకు మహావీర్ స్కోడా షోరూం కస్టమర్లకు టెస్ట్ డ్రైవ్ సదుపాయం కల్పించింది. జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన ఈ లాంచింగ్ కార్యక్రమంలో కంపెనీ బిజినెస్, బ్రాండ్ డెవలప్‌మెంట్ హెడ్ అనిలా పెండ్సే పాల్గొన్నారు.

కెప్టెన్ల ఫొటోషూట్ లేకుండానే చాంపియన్స్ ట్రోఫీ...

కరాచీ: ప్రతీ ఐసీసీ మెగా టోర్నమెంట్‌కు ముందు కెప్టెన్లతో ఫొటోషూట్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కానీ పాకిస్తాన్‌లో వచ్చే నెలలో జరిగే చాంపియన్స్ ట్రోఫీలో మాత్రం ఈ షూట్ రద్దయ్యింది. అంతర్జాతీయ క్రికెట్ సీజన్ జోరుగా సాగడం వల్లే ఈ ప్రిటోర్నీ ఈవెంట్ రద్దు చేయాల్సి వచ్చిందని పాక్ క్రికెట్ బోర్డు తెలిపింది.

సొంతమా... సమమా!

నేడు భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య నాలుగో టి20 మ్యాచ్

- టీమిండియా గెలిస్తే సిరీస్ 3–1తో కైవసం
- ఇంగ్లండ్ నెగ్గితే సిరీస్ 2–2తో సమం
- ఆసక్తికర పోరుకు రంగం సిద్ధం
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం


తిలక్ వర్మ, రింకూ సింగ్

పుణే: ఓ జట్టుది సిరీస్ గెలిచే ఆరాటం... మరో జట్టుది సిరీస్‌లో నిలిచే పోరాటం... వేదికేమో పరుగుపెట్టే పుణే స్టేడియం... ఈ నేపథ్యంలో భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య శుక్రవారం జరిగే నాలుగో టి20 అసలైన మెరుపుల మజాను పంచనుంది. ఆశించినట్లు రాత్రి ఇదే జరిగితే నిజమైన చుక్కలతో పాటు బంతి కూడా పదేపదే చుక్కల్లోకెక్కడం ఖాయం! ఈ పరుగుల విందులో పైచేయి సాధిస్తే భారత్ మ్యాచ్‌తో పాటు సిరీస్‌ను ఎగరేసుకుపోతుంది. కానీ గత మ్యాచ్‌లో పర్యాటక ఇంగ్లండ్ పట్టుబిగిస్తే మాత్రం సిరీస్ 2–2తో సమమవుతుంది. అప్పుడు ఇరుజట్లు ద్వైపాక్షిక సిరీస్ కోసం 'ఫైనల్స్' ఆడాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో నాలుగో టి20 ఈ సిరీస్‌లోనే ఆసక్తికర సమరంగా జరగనుంది. దీంతో ప్రేక్షకులకు గత మూడు మ్యాచ్‌లుగా కరువైన టి20 విందు ఈ పోరుతో తీరుతుంది.

సామ్సన్‌కు ఏమైంది...

భారత స్టార్లు రోహిత్, కోహ్లిలు టి20లకు బైబై చెప్పడంతో తదుపరి టి20 ప్రపంచకప్‌కు కోచ్ గంభీర్ సన్నద్ధం చేసే జట్టులో ఓపెనర్ సంజూ సామ్సన్ కీలకం. కోచ్ గౌతీ వచ్చాక ప్రత్యేకించి పొట్టి ఫార్మాట్‌లో అతనికి విరివిగా అవకాశాలిస్తున్నాడు. అతనూ గత సిరీస్‌లలో వరుస సెంచరీలు, లేదంటే ఓపెనింగ్ మెరుపులతో అలరించాడు. కానీ ఇప్పుడు మాత్రం ఇంగ్లండ్ బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు ఆపసోపాలు పడుతున్నాడు. ఇది ఇన్నింగ్స్‌పై పెద్ద ప్రభావమే చూపిస్తోంది. దీనికి కెప్టెన్ సూర్యకుమార్ వైఫల్యం అదనం! దీనివల్ల టీమిండియా రెండు మ్యాచ్‌లైతే గెలిచింది కానీ... టి20లకు తగిన ఆట తీరును మాత్రం టి20 ప్రపంచ చాంపియన్ ఇంకా ఆడలేదన్నది వాస్తవం. బౌలింగ్ విభాగంలో షమీని కొనసాగించి, విశ్రాంతినిచ్చిన అర్ష్‌దీప్‌ను తుది జట్టులోకి తీసుకుంటే... గత మ్యాచ్‌లో భారీగా పరుగులు ఇచ్చుకున్న స్పిన్నర్ రవి బిష్ణోయ్‌ను పక్కనబెట్టే అవకాశముంది.

పుంజుకున్న బట్లర్ బృందం

మూడో టి20లో మెరిపించి తర్వాత కుదుపులకు గురైనా కూడా కోలుకున్న తీరు, పుంజుకున్న వైనం ఇంగ్లండ్ జట్టులో సిరీస్ ఆశల్ని రేపింది. ఇదే సమరోత్సాహంతో ఇప్పుడు వరుసగా రెండో విజయంపై కన్నేసిన బట్లర్ సేన సిరీస్‌ను 2–2తో సమం చేయడానికి సర్వసన్నద్ధమై ఉంది. సాల్ట్ ఓపెనింగ్‌లో దంచేస్తే ఇంగ్లండ్ జోరుకు అదనపు బలం ఖాయం. ఆర్చర్, వుడ్, కార్స్‌లతో పాటు స్పిన్‌తో కట్టిపడేస్తున్న ఆదిల్ రషీద్ ఉన్న బౌలింగ్ విభాగం భారత్‌కు సవాల్ విసిరేందుకు సై అంటోంది.

4 పుణేలోని మహారాష్ట్ర క్రికెట్ సంఘం (ఎంసీఏ) స్టేడియంలో ఇప్పటి వరకు భారత జట్టు నాలుగు టి20 మ్యాచ్‌లు ఆడింది. 2 మ్యాచ్‌ల్లో గెలిచి, 2 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఇంగ్లండ్ జట్టుతో 2012 ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో భారత్ ఐదు వికెట్ల తేడాతో గెలిచింది. మిగతా మూడు టి20 మ్యాచ్‌లు శ్రీలంక జట్టుతో జరిగాయి.

పిచ్, వాతావరణం

పుణే పిచ్ బ్యాటింగ్‌కు, ప్రత్యేకించి పొట్టి ఫార్మాట్ మెరుపులకు అనువైంది. రెండేళ్ల క్రితం శ్రీలంక 200 పైచిలుకు స్కోరు చేస్తే... ఛేదనలో భారత్ 190 వరకు వచ్చి కేవలం 15 పరుగుల తేడాతోనే ఓడింది. ఈ నేపథ్యంలో బౌలర్లకు సవాల్ తప్పదు. వాతావరణంతో ఏ సమస్యా లేదు. వానముప్పూ లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), సామ్సన్, అభిషేక్, తిలక్‌వర్మ, హార్దిక్ పాండ్యా, సుందర్, అక్షర్, జురేల్, షమీ, రవిబిష్ణోయ్/అర్ష్‌దీప్, వరుణ్. **ఇంగ్లండ్:** బట్లర్ (కెప్టెన్), సాల్ట్, డకెట్, హ్యారీ బ్రూక్, లివింగ్‌స్టోన్, స్మిత్, ఓవర్టన్, కార్స్, జోఫ్రా ఆర్చర్, ఆదిల్ రషీద్, మార్క్ వుడ్.

ఫైనల్ బెర్త్ కోసం...

- నేడు అండర్–19 టి20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌తో భారత్ సెమీఫైనల్ పోరు
- మధ్యాహ్నం 12 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

కౌలాలంపూర్: డిఫెండింగ్ చాంపియన్ హోదాకు నూటికి నూరుశాతం న్యాయం చేస్తూ అండర్–19 మహిళల టి20 ప్రపంచకప్‌లో జైత్రయాత్ర కొనసాగిస్తున్న భారత్ టైటిల్ నిలబెట్టుకునే అర్హత కోసం సెమీఫైనల్స్‌కు సిద్ధమైంది. ఇప్పటి వరకు ఆడిన మ్యాచ్‌లు ఒక ఎత్తయితే... ఈ రోజు ఆడే మ్యాచ్ ఒక ఎత్తు! ఎందుకంటే ఇన్నాళ్లు లీగ్ దశలో, సూపర్ సిక్స్‌లో తన గ్రూపులోని ప్రత్యర్థుల్ని చిత్తు చేసిన నికీ ప్రసాద్ నేతృత్వంలోని భారత్ ఇప్పుడు అసలైన సెమీఫైనల్ సవాల్‌కు రె'ఢీ' అయ్యింది. నేడు జరిగే సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో భారత్ ఆడుతుంది. మరో సెమీఫైనల్లో ఆస్ట్రేలియాతో దక్షిణాఫ్రికా తలపడుతుంది. ఈ ప్రపంచకప్‌లో భారత్ అసాధారణ ప్రదర్శన కనబరుస్తోంది. ముఖ్యంగా తెలంగాణ టీనేజ్ సంచలనం గొంగడి త్రిష ఫామ్ ప్రత్యర్థి బౌలర్ల గుండెల్లో గుబులు రేపుతోంది. . బౌలింగ్‌లో వైజాగ్ సీమర్ షబ్నమ్ సహా ఆయుషి, మిథిల, వైష్ణవి నిలకడగా రాణిస్తున్నారు. మరోవైపు ఇంగ్లండ్ జట్టు మెరుగ్గా ఆడుతున్నప్పటికీ భారత్‌ను నిలువరిస్తుందో లేదో చూడాలి.




మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

కోహ్లి తెచ్చిన కిక్...



సాధారణంగా రంజీ మ్యాచ్ జరుగుతోందంటే.. వంద మంది ప్రేక్షకులు ఆట చూసేందుకు రావడం కూడా కష్టమైన ఈ రోజుల్లో... గురువారం న్యూఢిల్లీలోని అరుణ్ జైట్లీ క్రికెట్ స్టేడియం (గతంలో ఫిరోజ్ షా కోట్లా మైదానం) కిక్కిరిసిపోయింది. ఎటు చూసినా జనమే... ఇసుక వేస్తే రాలనంత మంది అభిమానులు రంజీ మ్యాచ్ చూసేందుకు పోటెత్తారు. సుదీర్ఘ కాలంగా దేశవాళీ క్రికెట్‌కు దూరంగా ఉన్న టీమిండియా స్టార్ విరాట్ కోహ్లి 2012 తర్వాత తొలిసారి ఢిల్లీ జట్టు తరఫున రంజీ మ్యాచ్ ఆడుతుండటంతో అభిమానులు బ్రహ్మరథం పట్టారు. మ్యాచ్ ప్రారంభానికి మూడు గంటల ముందు నుంచే క్యూ లైన్లు నిండిపోగా... ఢిల్లీ, డిస్ట్రిక్ట్ క్రికెట్ సంఘం (డీడీసీఏ) చేసిన ఏర్పాట్లకు మించి ప్రేక్షకులు మైదానానికి తరలివచ్చారు. అభిమానులు భారీగా వస్తారని ముందే అంచనా వేసిన డీడీసీఏ... స్టేడియంలోని 6 వేల సామర్థ్యం గల 'గౌతమ్ గంభీర్ స్టాండ్'ను తెరవగా... కాసేపట్లోనే అది నిండిపోయి స్వల్ప తొక్కిసలాట జరిగింది. అదే సమయంలో మైదానం వెలుపల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కార్యక్రమం జరుగుతుండటంతో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది... 11 వేల సామర్థ్యం గల 'బిషన్ సింగ్ బేడీ స్టాండ్'లోకి అభిమానులను అనుమతించారు. తొలి రోజు ఏకంగా 27 వేల మంది కంటే ఎక్కువ మంది ప్రేక్షకులు హాజరైనట్లు సమాచారం.



రైల్వేస్, ఢిల్లీ రంజీ మ్యాచ్‌కు అనూహ్య స్పందన

- బ్రహ్మరథం పట్టిన అభిమానులు
- 27 వేల మంది ప్రేక్షకుల హాజరు
- నేడు బ్యాటింగ్ చేయనున్న కోహ్లి


న్యూఢిల్లీ: భారత స్టార్ క్రికెటర్లు బరిలోకి దిగితే... దేశవాళీ క్రికెట్ మ్యాచ్‌లు కూడా కళకళలాడుతాయని నిజమైంది. రంజీ ట్రోఫీ చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌లో భాగంగా గురువారం అరుణ్ జైట్లీ స్టేడియంలో రైల్వేస్, ఢిల్లీ జట్ల మధ్య మ్యాచ్‌కు ప్రేక్షకుల నుంచి అసాధారణ స్పందన లభించింది. 2012 తర్వాత భారత దిగ్గజం విరాట్ కోహ్లి రంజీ మ్యాచ్‌లో ఆడేందుకు సిద్ధం కావడమే దీనికి కారణం. కోహ్లి ఆటతీరును ప్రత్యక్షంగా చూసేందుకు ప్రేక్షకులు ఉదయం నుంచే ఎగబడ్డారు. ఫలితంగా మైదానం అభిమానులతో నిండిపోయింది. 'రంజీ ట్రోఫీలో ఇలాంటి సందడి గతంలో ఎప్పుడూ చూడలేదు. దేశవాళీ మ్యాచ్‌లు చూసేందుకు అభిమానులు ఈ స్థాయిలో వస్తారని ఎప్పుడూ ఊహించలేదు. ఇదంతా కేవలం ఒక్క వ్యక్తి కోసమే. వచ్చిన వాళ్లంతా కోహ్లి నామస్మరణ చేస్తున్నారు' అని మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించిన ఓ భారత మాజీ క్రికెటర్ అన్నాడు. ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్స్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) కార్యదర్శి అశోక్ శర్మ మాట్లాడుతూ... '30 ఏళ్లుగా ఢిల్లీ క్రికెట్‌ను గమనిస్తున్నా. రంజీ ట్రోఫీలో ఇలాంటి దృశ్యాలు చూడలేదు. కోహ్లి ఆదరణకు ఇది నిదర్శనం. మొదట ఒక గేట్ ద్వారానే అభిమానులను అనుమతించాం. తర్వాత పరిస్థితిని బట్టి మైదానంలోని అన్ని గేట్లు తెరిచాం' అని అన్నాడు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కెరీర్‌లో చివరగా ఆడిన రంజీ మ్యాచ్‌కు ఇప్పటి వరకు అత్యధికంగా 8 వేల పైచిలుకు మంది అభిమానులు హాజరు కాగా... గురువారం రైల్వేస్–ఢిల్లీ మ్యాచ్ చూసేందుకు 27 వేల మందికి పైగా ప్రేక్షకులు పోటెత్తారు.

ఈరోజు క్రీజులోకి రానున్న కోహ్లి

ఎలైట్ గ్రూప్ 'డి'లో భాగంగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ నెగ్గిన ఢిల్లీ కెప్టెన్ ఆయుశ్ బదోనీ ఫీల్డింగ్ చేయాలని నిర్ణయించుకున్నా... అభిమానుల ఉత్సాహం మాత్రం తగ్గలేదు. 'గంటల కొద్దీ నిలబడి మైదానంలోకి వచ్చింది... కోహ్లిని చూసేందుకే. అతడు ఫీల్డింగ్ చేసినా మాకు ఆనందమే' అని ప్రేక్షకుల్లోని ఒక గృహిణి పేర్కొనగా... కోహ్లి ఆట చూసేందుకే పాఠశాల నుంచి వచ్చామని పలువురు విద్యార్థులు చెప్పారు. రెండో స్లిప్‌లో ఫీల్డింగ్ చేసిన కోహ్లి... అభిమానులకు చేతులు ఊపుతూ అభివాదం చేయగా... ఇన్నింగ్స్ 12వ ఓవర్‌లో ఓ అభిమాని మైదానంలోకి వచ్చి కోహ్లి కాళ్లకు నమస్కరించాడు. మొదట బ్యాటింగ్‌కు దిగిన రైల్వేస్ తొలి ఇన్నింగ్స్‌లో 67.4 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. ఉపేంద్ర యాదవ్ (95; 10 ఫోర్లు, 1 సిక్స్), కరణ్ శర్మ (50; 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఢిల్లీ బౌలర్లలో నవ్‌దీప్, సుమిత్ చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం ఢిల్లీ జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 10 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 41 పరుగులు చేసింది. శుక్రవారం కోహ్లి బ్యాటింగ్‌కు రానున్న నేపథ్యంలో... మరింత మంది అభిమానులు మైదానానికి పోటెత్తడం ఖాయమే!

2025

మము బ్రోవమని...



'సీత'మ్మ తల్లికి సామాన్యుడి మొర ఇదీ..

సామాన్యుడు.. ఏంటో ఎన్ని బడ్జెట్‌లు వచ్చినా.. దేశంలో వీడు మాత్రం ఎప్పుడూ సామాన్యుడిగానే మిగిలిపోతున్నాడు.. ఆకాశాన్నంటే ధరలతో.. వాటితో ఏ మాత్రం పొంతన కుదరని వేతనాలతో కుటుంబ బడ్జెట్‌ను కంట్రోల్ చేయలేక.. కిందా మీదా పడుతూనే ఉన్నాడు. మళ్లా బడ్జెట్ వస్తోంది. పరిశ్రమలకు చెందిన పెద్ద పెద్దోళ్లంతా అవి కావాలి.. ఇవి కావాలి అని అడుగుతున్నారు. సామాన్యుడూ వినతుల చిట్టాను విప్పాడు.
నను బ్రోవమంటున్నాడు..
'సీత'మ్మ తల్లీ.. తన మొర వింటావా మరి..

1 ధరలకు కళ్లెం వేయాలి..

కూరగాయలు, నూనెలు, పప్పులు, పాలు.. ఇలా నిత్యావసరాల ధరలన్నీ కొండెక్కిపోయాయి. దీంతో జేబుకు మరింత చిల్లు పడుతోంది. ముందు ముందు మరింతగా ధరలు పెరిగే పరిస్థితి కనిపిస్తోందని మార్కెట్ వర్గాలు కూడా చెబుతున్నాయి. పామాయిల్ ధర పెరగడం వల్ల బిస్కట్లు లాంటి ప్యాకేజ్డ్ ఫుడ్ రేట్లూ పెరిగాయి. ఈ క్రమంలో ధరా భారం నుంచి ఉపశమనం కల్పించాలి. నూనెలపై దిగుమతి పన్ను తగ్గించడంతోపాటు ఇతర నిత్యావసరాల ధరల కట్టడికి చర్యలు ప్రకటించాలి.

- సాక్షి సెంట్రల్ డెస్క్

2 వేతనాల్లో వేగం పెంచాలి..

ధరలు అలా ఉంటే.. జీతాల పెరుగుదల నత్తనడకను తలపిస్తోంది. జూనియర్ల నుంచి మధ్యస్థాయి ఉద్యోగులతోపాటు అసంఘటిత రంగంలోని కార్మికుల వేతనాల పరిస్థితీ ఇలాగే ఉంది. ఫిక్కీ, స్టాఫ్ సేవల సంస్థ క్వెస్ కార్ప్ గణాంకాల ప్రకారం... గత 12 నెలల్లో అసంఘటిత రంగ కార్మికుల వేతనాలు కేవలం 3.4 శాతం, ఉద్యోగుల జీతాలు 6.5 శాతం పెరిగాయి. ఇంజనీరింగ్, మ్యాన్యుఫాక్చరింగ్, ఇన్‌ఫ్రా ఉద్యోగుల వేతనాలు 0.8శాతమే పెరిగాయి. ఈ క్రమంలో వేతనాల పెరుగుదలకు తోడ్పడేలా బడ్జెట్‌లో చర్యలు ఉండాలి.

3 ఉద్యోగ అవకాశాలు పెరగాలి

కరోనా సమయంలో పట్టణాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గిపోయి.. చాలా మంది వ్యవసాయం వైపు మళ్లినట్టు గణాంకాలు చెబుతున్నాయి. కానీ అక్కడా సరైన ఆదాయం లేక, తిరిగి ఉద్యోగం చేయడానికి సిద్ధమైనా... అవకాశాలు లభించని పరిస్థితి ఉంది. అదే సమయంలో చదువు పూర్తిచేసుకుని ఉద్యోగాలకు సిద్ధమవుతున్నవారు మరెందరో ఉన్నారు. ఈ క్రమంలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వ వ్యయాన్ని పెంచడంతోపాటు ప్రైవేటు రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించడం ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సి ఉంది.

4 పన్నుల మోత తగ్గించాలి

తక్కువ, మధ్యస్థాయి ఆదాయ వర్గాలపై పన్నుల భారం ప్రభావం ఎక్కువ. ముఖ్యంగా వంట నూనెలపై పన్నుల తగ్గింపు, పెట్రోల్, డీజిల్‌ల ధరల నుంచి ఉపశమనం కల్పించాలనే డిమాండ్ చాలా రోజులుగా వినవస్తోంది. అదే సమయంలో వ్యక్తిగత ఆదాయ పన్నులో మినహాయింపులు పెంచాలని ఉద్యోగులు కోరుతున్నారు. ఈ చర్యలతో మా జీవన ప్రమాణాలు పెరిగేందుకు వీలవుతుంది.

5 ఆర్థిక వ్యవస్థ మందగమనంతో..



2024–25లో దేశ ఆర్థికవృద్ధి 6.4 శాతంగా ఉంటుందని జాతీయ గణాంకాల సంస్థ (ఎన్ఎస్ఓ) అంచనా వేసింది. కరోనా తర్వాతి కాలంలో ఇదే అతి తక్కువ వృద్ధి కావడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వ మూలధన వ్యయం తగ్గడమూ దీనికి కారణమని నిపుణులు చెబుతున్నారు. ఈ మందగమనంతో మార్కెట్లో అన్ని రంగాల్లో డిమాండ్ తగ్గిపోయిందని అంటున్నారు. ప్రభుత్వ వ్యయం పెరిగితే.. క్షేత్రస్థాయిలో ఆర్థిక వృద్ధికి, మార్కెట్లో డిమాండ్ పెరగడానికి దారితీస్తుందని స్పష్టం చేస్తున్నారు. ఈ దిశగా అడుగులు పడితే... మాకు మేలు జరుగుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఆ దిశగా మీరు ఆలోచించాలి.

దక్షిణమధ్య రైల్వేలో యూటీఎస్ సేవల విస్తరణ

- సాధారణ టికెట్ల కొనుగోలు సరళతరం

సాక్షి, హైదరాబాద్: సాధారణ టికెట్ల కొనుగోలును దక్షిణమధ్య రైల్వే మరింత సరళతరం చేసింది. ప్రయాణికులు క్యూ లైన్లలో పడిగాపులు కాయాల్సిన పనిలేకుండా అన్‌రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్ (యూటీఎస్) ద్వారా డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు సేవలను విస్తృతం చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు యూటీఎస్ కౌంటర్లను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేశారు. తాజా వెర్షన్‌తో క్యూఆర్ (క్విక్ రెస్పాన్స్) కోడ్ చెల్లింపు సదుపాయం ఏర్పాటు చేశారు. దక్షిణమధ్య రైల్వే జోన్ పరిధిలో 879 క్యూఆర్ పరికరాలను.. అన్ని యూటీఎస్ కౌంటర్లకు అందుబాటులోకి తెచ్చినట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. నగదు చెల్లింపు, చిల్లర ఇబ్బందులు లేకుండా ప్రయాణికులు సత్వరమే టికెట్లు పొందవచ్చు. అన్ని రైల్వేస్టేషన్లలోని టికెటింగ్ కౌంటర్లలో టికెట్ విండో వెలుపల ప్రత్యేక పరికరాలను ఏర్పాటు చేసినట్లు సీపీఆర్వో చెప్పారు. యూటీఎస్ కౌంటర్‌లో వివరాలను నమోదు చేశాక క్యూఆర్ కోడ్ కనిపిస్తుంది. తద్వారా మొబైల్ ఫోన్లోని చెల్లింపు యాప్‌ల ద్వారా ప్రయాణికుడు దాన్ని స్కాన్ చేయవచ్చు. ప్రయాణికులు తమ మొబైల్ ఫోన్లోని పేమెంట్ యాప్ ద్వారా స్కాన్ చేసే వెసులుబాటు కలుగుతుంది. చార్జి మొత్తం జమ చేసిన తరువాత టికెట్ వస్తుంది. అన్‌రిజర్వ్‌డ్ ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ కోరారు.

అక్షరాల గుడి... 150 ఏళ్ల బడి

ఇద్దరు ముఖ్యమంత్రులు, గవర్నర్‌కు విద్య నేర్పిన పాఠశాల

- నేడే ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద సర్కారు పాఠశాల 150 ఏళ్ల ఉత్సవాలు
- హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి

మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల



సాక్షి, రంగారెడ్డిజిల్లా/షాద్‌నగర్: అక్షర సుమమై వికసించింది.. ఎంతోమంది మేధావులకు అక్షరాలను నేర్పించింది. ఈ చారిత్రక సరస్వతీ నిలయం ప్రత్యేకతను చాటుతూ 150 వసంతాలను పూర్తి చేసుకుంది. అదే రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల. ఇది స్వాతంత్ర్యానికి పూర్వమే ఏర్పాటైంది. శుక్రవారం 150 ఏళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

అనేకమంది ప్రముఖుల అక్షరాభ్యాసం

ఈ బడిలో అనేక మంది ప్రముఖులు అక్షరాభ్యాసం చేశారు. తర్వాత ఉన్నత చదువులు చదువుకుని వివిధ రంగాల్లో దేశవిదేశాల్లో స్థిర పడ్డారు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి, యూపీ మాజీ గవర్నర్ సత్యనారాయణరెడ్డి, మాజీ విద్యాశాఖ మంత్రి శ్రీనివాసరావు, ఓయూ మాజీ వీసీ మల్లారెడ్డి, స్వాతంత్ర్య సమరయోధుడు రంగారావు, పౌర హక్కుల సంఘం నేత, ప్రొఫెసర్ హరగోపాల్ సహా అనేక మంది ఇక్కడ అక్షరాలు దిద్దినవారే.

గ్రామస్తుల్లో చైతన్యం రగిలించేందుకు..

నిజాం పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించిన తుర్రెబాజ్‌ఖాన్ అప్పట్లో వారి నుంచి తప్పించుకుని షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్దలో ఆశ్రయం పొందినట్లు చరిత్రకారులు చెబుతుంటారు. ఈ విషయం నిజాంకు తెలిసి తుర్రెబాజ్‌ఖాన్‌ను అరెస్ట్ చేసి, హైదరాబాద్‌కు తరలించి ఉరి తీసినట్లు ప్రచారం ఉంది. గ్రామస్తులను విద్యాపరంగా చైతన్యవంతులను చేయాలనే సంకల్పంతో నాటి నిజాం సర్కార్ 1873లో మొగిలిగిద్దలో పాఠశాలను ఏర్పాటు చేసింది. మొదట్లో ఉర్దూ మీడియంలో విద్యాబోధన చేయగా, 1948లో తెలుగు మాధ్యమంలో బోధనను ప్రారంభించారు. నిజానికి పాఠశాల ప్రారంభమై 152 ఏళ్లుపూర్తి కావొస్తున్నా.. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఇప్పుడు 150వ వార్షికోత్సవాన్ని (కోవిడ్ కారణంగా రెండేళ్ల ఉత్సవాలు వాయిదా వేశారు) జరుపుకొనేందుకు సంసిద్ధులయ్యారు. ఇక్కడ 500 మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు.

నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

స్వాతంత్ర్యానికి ముందే ఇక్కడ పోలీస్‌స్టేషన్‌తోపాటు గ్రంథాలయాన్ని కూడా ఏర్పాటు చేశారు. అప్పట్లో ఈ ఠాణా కింద 140 గ్రామాలు ఉండేవి. ఈ పోలీస్‌స్టేషన్‌ను 1983లో కొందుర్గ్‌కు తరలించారు. ఈ చారిత్రక గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలనే డిమాండ్ కూడా ఉంది. పాఠశాల వార్షికోత్సవాలను పురస్కరించుకుని సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం మొగిలిగిద్దకు చేరుకోనున్నారు. పాఠశాలలో పలు మౌలిక సదుపాయాల కల్పనకు, గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

ప్రభుత్వ స్కూళ్లలో ఏఐ టీచింగ్

ఎక్‌స్టెప్‌తో తెలంగాణ విద్యాశాఖ సమన్వయం



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత ద్వారా మెరుగైన విద్యను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఐటీ ఆధారిత భాగస్వామ్య పక్షాల తోడ్పాటుతో ఏఐ, డిజిటల్ బోధన పద్ధతులను అభివృద్ధి చేసేందుకు ముందడుగు పడిందని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి తెలిపారు. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఎక్‌స్టెప్ ఫౌండేషన్‌ను విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా నేతృత్వంలో ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం గురువారం సందర్శించింది. ఈ బృందంలో ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ కమిషనర్ కృష్ణ ఆదిత్య, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్లు ఉమా హారతి, గరిమ తదితరులు ఉన్నారు. ఎక్‌స్టెప్ ఫౌండేషన్ ఇప్పటికే గుజరాత్, కర్ణాటక, ఒడిశా, పంజాబ్, తమిళనాడు ప్రభుత్వాలతో కలిసి స్కూళ్లలో డిజిటల్ విద్యను అందించేందుకు సహకారం అందిస్తోంది. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నిలేకనీ ఈ సంస్థకు కూడా కో–ఫౌండర్. ఈ సంస్థ ప్రతినిధులతో సమావేశమైన రాష్ట్ర బృందం.. విద్యారంగంలో చేపట్టాల్సిన వినూత్న కార్యక్రమాలపై చర్చించింది. ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్), ప్రాథమిక విద్యా స్థాయిలో ఏఐ ఆధారిత డిజిటల్ పద్ధతుల ద్వారా రాయడం, చదవడం, సంఖ్యా పరమైన విజ్ఞానాన్ని పెంపొందించే వీలుందని అధికారులు తెలిపారు. ఉపాధ్యాయులలో వృత్తిపరమైన ప్రమాణాలను పెంపొందించడం, పాఠశాల గదుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించడానికి ఏఐ తోడ్పడుతుందని చెప్పారు. ఈ అధికారుల బృందం 2024 లో కేరళలో పర్యటించి విద్యా రంగంలో చేపట్టిన ఆధునిక పద్ధతులను పరిశీలించింది.

ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ నుంచి 'ఆకాశ్ ఇన్విక్టస్'

సాక్షి, హైదరాబాద్: వివిధ పరీక్షలకోసం సిద్ధమయ్యే విద్యార్థులకోసం అద్భుతమైన సేవలందిస్తూ వస్తున్న ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఈఎస్ఎల్) తాజాగా 'ఆకాశ్ ఇన్విక్టస్'ను ప్రారంభించిందని ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో దీపక్ మెహరోత్రా వెల్లడించారు. జేఈఈ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకోసం ఇది అద్భుతమైన స్టడీ మెటీరియల్‌గా ఆయన అభివర్ణించారు. దాదాపు లక్ష మంది విద్యార్థులకు మార్గదర్శనం చేసిన 500 మంది పేరెన్నికగన్న జేఈఈ ఫ్యాకల్టీని సంస్థ ఈ కార్యక్రమం కోసం ఎంచుకుందన్నారు. 25 నగరాల్లో విద్యార్థులు లబ్ధి పొందేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. ఆకాశ్ ఇన్విక్టస్ పాఠ్యప్రణాళిక అత్యుత్తమ ఐఐటీ ర్యాంక్‌లను పొందేలా రూపొందిందని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపడం ద్వారా వారు మెరుగైన ఫలితాలను సాధించేలా ఉంటుందన్నారు. మరింత సమాచారం కోసం 7303759494 నంబర్‌లో లేదా support.invictus@aesl ఈమెయిల్‌లో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

ప్రొఫెసర్ల రిటైర్‌మెంట్ @ 65

- పదవీ విరమణ వయోపరిమితి 60 నుంచి 65 ఏళ్లకు పెంపు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- త్వరలో రిటైర్ కానున్న 500 మంది కొనసాగింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్ల పదవీ విరమణ వయో పరిమితిని 60 నుంచి 65 ఏళ్లకు పెంచారు. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా గురువారం జీవో విడుదల చేశారు. ఈ నిర్ణయం వల్ల సమీప భవిష్యత్తులో రిటైర్ అవ్వాల్సిన 500 మంది వారివారి ఉద్యోగాల్లో కొనసాగనున్నారు. కాగా వయో పరిమితి పెంచడానికి గల కారణాలను జీవోలో స్పష్టం చేశారు. వర్సిటీల్లో 2013 నుంచి నియామకాలు చేపట్టలేదు. మరోవైపు చాలామంది అధ్యాపకులు రిటైర్ అయ్యారు. దీంతో వర్సిటీల్లో విద్యా ప్రమాణాలు పడిపోయాయి. న్యాక్, ఎన్‌బీఏ తదితర జాతీయ, అంతర్జాతీయ ర్యాంకుల్లో వెనుకబడ్డాయి. పరిశోధన ప్రమాణాలు కూడా కుంటుపడ్డాయి. ఈ పరిస్థితులపై ప్రభుత్వానికి ఇటీవల ఉన్నత విద్యా మండలి ఓ నివేదిక ఇచ్చింది. ఈ సందర్భంగా దేశంలోని అనేక యూనివర్సిటీల్లో పదవీ విరమణ వయసు 65 ఏళ్లు ఉందని పేర్కొంది. 22 ప్రధాన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని విశ్వవిద్యాలయాల్లో వయో పరిమితి వివరాలను ఈ నివేదికలో పొందుపరిచింది.

పలు రాష్ట్రాల్లో 60 ఏళ్లకు పైనే..

పశ్చిమ బెంగాల్, బిహార్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, పుదుచ్చేరి, ఢిల్లీ, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రొఫెసర్ల రిటైర్‌మెంట్ వయసు 65 ఏళ్లుగా ఉందని మండలి తెలిపింది. కర్ణాటక, గుజరాత్, ఒడిశా, కేరళ, ఛత్తీస్‌గఢ్, గోవా, హరియాణా, జమ్మూకశ్మీర్, మిజోరంలో 62 ఏళ్లుగా ఉందని వివరించింది. అదే సమయంలో తెలంగాణ, తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాల్లో మాత్రం ప్రొఫెసర్ల రిటైర్‌మెంట్ వయసు 60 ఏళ్లుగానే ఉందని వివరించింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 2,878 ప్రొఫెసర్ పోస్టులు ఉన్నాయి. కానీ 753 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఏకంగా 2,125 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే 1,170 మంది ప్రొఫెసర్లు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు.

ఇంటర్ పరీక్షలపై కెమెరాల వార్

పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు బోర్డు ఆదేశం

- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కొన్ని ప్రైవేటు కాలేజీలు
- బోర్డు అధికారులు వేధిస్తున్నారని సీఎంకు ఫిర్యాదు
- పరీక్షల పారదర్శక నిర్వహణ కోసమే అంటున్న అధికారులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ పరీక్షల కోలాహలం ప్రారంభమైంది. గురువారం నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఇంటర్ బోర్డు పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీచేసింది. ఈ ఆదేశాలను కొన్ని ప్రైవేటు కాలేజీలు వ్యతిరేకిస్తున్నాయి. అయితే, ఇప్పటికే 417 కాలేజీల్లో అద్దెకు సీసీ కెమెరాలు తెప్పించారు. కొన్ని కార్పొరేట్ కాలేజీల్లో ఇప్పటికే కెమెరాలున్నాయి. దీంతో స్వల్ప సంఖ్యలో కాలేజీలు సీసీ కెమెరాల ఏర్పాటును వ్యతిరేకిస్తే.. వాటికి పరీక్ష కేంద్రాలు ఇవ్వబోమని బోర్డు అధికారులు హెచ్చరించారు. ఇదిలా ఉంటే అగ్నిమాపక శాఖ అనుమతి లేని బహుళ అంతస్తుల భవనాల్లోని కాలేజీలకు ఇంటర్ బోర్డు చివరి నిమిషం వరకు అనుమతివ్వలేదు. ఆఖరులో పెద్ద మొత్తంలో జరిమానా విధించి అనుమతిచ్చింది. ఆ కాలేజీల్లో చదివే విద్యార్థుల అడ్మిషన్లకు రూ.2,500, పరీక్ష ఫీజు రూ.500 వసూలు చేసింది. దీంతో ఇంటర్ బోర్డు అధికారులు వేధిస్తున్నారని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు సీఎంకు ఫిర్యాదు చేశాయి. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణకు ప్రైవేటు కాలేజీలు ఎంతవరకు సహకరిస్తాయనేది అనుమానంగా మారింది.

కొన్ని కాలేజీలపై నిఘా: పరీక్షల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ప్రభుత్వం ఇంటర్ బోర్డును ఆదేశించింది. పరీక్షలపై నిఘా పెట్టాలని పోలీసులకు సూచించింది. దీంతో కొన్ని ప్రైవేటు కాలేజీలపై ఇంటెలిజెన్స్ వర్గాలు దృష్టి పెట్టాయి. ప్రశ్న పత్రాల బట్వాడా నుంచి, సమాధాన పత్రాలను మూల్యాంకన కేంద్రాలకు చేరవేసే దాకా వీడియో రికార్డింగ్ ఉండాలని ఇంటర్ బోర్డు జిల్లా అధికారులను ఆదేశించింది. ఇంటర్ పరీక్షల నియంత్రణ అధికారి జయప్రదబాయి గురువారం కొన్ని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

మొదలైన ప్రాక్టికల్స్: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. గురువారం ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించారు. ఫిబ్రవరి 3 నుంచి సెకండియర్ సైన్స్, మ్యాథమెటిక్స్ ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. థియరీ పరీక్షలు మార్చి 5 నుంచి మొదలవుతాయి. మొదటి సంవత్సరంలో 4,88,316మంది, రెండో సంవత్సరంలో 5,08,225 మంది కలిపి మొత్తం 9,96,541 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. థియరీ పరీక్షల హాల్ టిక్కెట్లు రెండు రోజుల్లో అందుబాటులో ఉంచుతామని అధికారులు చెబుతున్నారు. ప్రాక్టికల్స్ కోసం 2,008, థియరీ కోసం 1,532 కేంద్రాలను ఏర్పాటుచేశారు.

మాపై నియంత్రణ దేనికి?



పరీక్షలకు మేం సహకరిస్తామనే చెబుతున్నాం. కానీ ఇంటర్ బోర్డు అధికారులు ప్రైవేటు కాలేజీలపై కక్ష గట్టినట్టు వ్యవహరిస్తున్నారు. సమస్య సృష్టించే విధంగా వ్యవహరిస్తున్నారు. సీసీ కెమెరాలు పెట్టాలనే ఆదేశం సరైంది కాదు.

– గౌరీ సతీష్, ప్రైవేటు కాలేజీల యాజమాన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు.

అన్ని చర్యలు తీసుకున్నాం



ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. పరీక్షల విధానాన్ని మొత్తం రికార్డు చేస్తున్నాం. ప్రైవేటు కాలేజీలు కూడా సహకరించాలి.

– జయప్రదబాయి, ఇంటర్ పరీక్ష విభాగం ముఖ్య అధికారి.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
శుక్రవారం । 31-1-2025



పచ్చని పందిరిలా..

దొంగతుర్తి గ్రామ శివారులో రహదారికిరువైపులా చెట్లు పచ్చని పందిరిని తలపిస్తున్నాయి. వాహనచోదకులు, పాదచారులు చల్లని చెట్ల నీడలో సేదదీరుతున్నారు. ప్రకృతి ప్రేమికులను మురిపిస్తున్న ఈ చెట్ల చలువ పందిరి పెద్దపల్లి జిల్లా ధర్మారం - దొంగతుర్తి మధ్య ఆహ్లాదాన్ని పంచుతోంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

చేజారుతున్న కర్రిగుట్టలు

- మావోయిస్టుల చేజారనున్న కర్రిగుట్టలు
- భద్రతా దళాల ఆధిపత్యం
- తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో మావోయిస్టులకు పెట్టని కోట
- కర్రిగుట్టలు కేంద్రంగా షెల్టర్ జోన్లు
- ఈ అంశాన్ని అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లిన సీఎం రేవంత్
- గత జూలైలో కర్రిగుట్టలో పోలీసుల కూంబింగ్
- 'పూజారి కాంకేర్'తో గుట్టల్లోకి భద్రతా దళాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఆపరేషన్ కగార్ ఫలితంగా.. దండకారణ్యంలో తమకు పట్టున్న ఒక్కొక్క ప్రాంతాన్ని మావోయిస్టులు కోల్పోతున్నారు. ఈనెల 16న జరిగిన ఎన్‌కౌంటర్‌తో తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రిగుట్టలు ప్రాంతం సైతం మావోయిస్టుల చేజారిపోతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



కర్రిగుట్టల్లోని ముత్యాల ధార జలపాతం (ఫైల్)

రాష్ట్రాలకు సహజ సరిహద్దుగా..

తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు సహజ సరిహద్దుగా కర్రిగుట్టలు ఉన్నాయి. మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులో.. ఇంద్రావతి నది గోదావరిలో కలిసే చోటునుంచి ప్రారంభమయ్యే కర్రిగుట్టలు.. చర్ల మండలంలో తాలిపేరు వాగు గోదావరిలో కలిసే వరకు ఇంచుమించు 100 కిలోమీటర్ల పొడవుతో వ్యాపించి ఉంటాయి. గుట్టలకు ఆవలి వైపు బీజాపూర్ జిల్లా ఉండగా.. తెలంగాణ వైపు ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం మండలాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో కొద్ది భాగం ఉంటాయి. ఈ గుట్టల మధ్య పుష్కలమైన జలవనరులు ఉన్నాయి. దీంతో ఏళ్ల తరబడి ఈ ప్రాంతం మావోయిస్టులకు షెల్టర్ జోన్‌గా ఉపయోగపడుతోంది. తెలంగాణలో పట్టు కోసం మావోయిస్టులు ఇక్కడి నుంచే ప్రయత్నాలు చేస్తున్నారు.



మావోయిస్టులు (ఫైల్)

జాయింట్ టాస్క్‌ఫోర్స్..

కర్రిగుట్టలు కేంద్రంగా మావోయిస్టులు తెలంగాణలో మళ్లీ ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ గతేడాది జూలై 4న సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లారు. మావోయిస్టుల దూకుడుకు అడ్డుకట్ట వేసేలా.. ఈ గుట్టలకు సరిహద్దుగా ఉన్న ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆలుబాక, భద్రాద్రి జిల్లా చర్ల మండలం కొండవాయిలో సీఆర్‌పీఎఫ్ జాయింట్ టాస్క్‌ఫోర్స్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం జూలై 19న కర్రిగుట్టల్లోకి స్పెషల్ పార్టీ పోలీసులు కూంబింగ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు చనిపోగా.. మిగిలిన దళ సభ్యులు తప్పించుకున్నారు. దీంతో గాలింపు ఉధృతం చేసే లక్ష్యంతో అదనపు బలగాలు ఈ గుట్టల్లోకి వెళ్లాయి. ఆ సమయాన వర్షాల కారణంగా పొంగిన వాగులు, వంకలతో స్పెషల్ పార్టీ పోలీసులంతా అడవిలో చిక్కుకుపోయారు. వీరికి వాయుమార్గంలో సాయమందించడం వీలు పడలేదు. దీంతో ప్రతికూల పరిస్థితుల నడుమ సుమారు 60 కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ తెలంగాణ సరిహద్దుకు.. తెలంగాణ పోలీసులు చేరుకోగా.. చివరకు వారిని హెలీకాప్టర్ సాయంతో కాపాడారు.



గత జూలైలో కర్రిగుట్టలో చిక్కుకున్న సాయుధ దళాల రెస్క్యూ (ఫైల్)

కర్రిగుట్టల్లో భద్రతా దళాలు

కర్రిగుట్టల్లో ఛత్తీస్‌గఢ్ వైపు పూజారి కాంకేర్ - మారేడుబాక అటవీ ప్రాంతంలోని మావోయిస్టులు, భద్రతా దళాల నడుమ ఈనెల 16న ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో అధికారిక లెక్కల ప్రకారం 12 మంది మావోయిస్టులు చనిపోగా.. మిగిలిన వారు తప్పించుకుని సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. ప్రస్తుతం కర్రిగుట్టల్లో సుమారు రెండు వేల మందికి పైగా సంయుక్త భద్రతా దళాల జవాన్లు కూంబింగ్ చేస్తూ.. ఈ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తెచ్చుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. వచ్చే వేసవి చివరి నాటికి ఈ ప్రాంతంలో మావోయిస్టుల ఉనికి నామమాత్రం చేయాలని భద్రతా దళాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఇప్పటికే ఈ దాడిలో మావోయిస్టుల ఆయుధాల తయారీ కేంద్రాన్ని భద్రతా దళాలు కనుగొన్నాయి. అయితే, ఇప్పటికీ మావోయిస్టు శిబిరాలు భద్రతా దళాలకు చిక్కకపోవడం.. ఈ గుట్టల్లో నెలకొన్న సంక్లిష్టతను చెబుతోంది.



కర్రిగుట్టల్లో ఇటీవల బయటపడిన మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రం (ఫైల్)

మావోయిస్టుల అడ్డా బస్తర్

దేశంలోనే మావోయిస్టులకు బస్తర్ ప్రాంతం అడ్డాగా ఉంది. ఇక్కడి నుంచే బస్తరేతర ప్రాంతాలకు చెందిన వివిధ రాష్ట్ర, డివిజన్, ఏరియా కమిటీలు పని చేస్తున్నట్టు సమాచారం. బస్తర్‌కు చెందిన కీలక కమిటీలైన దండకారణ్య స్పెషల్ జోనల్, దక్షిణ బస్తర్ జోన్ వంటి కమిటీలు సంచరిస్తూ పని చేస్తుంటాయి. కానీ, బస్తర్ బయటి ప్రాంతాలకు చెందిన కమిటీలు ఎక్కువగా శిబిరాల్లోనే షెల్టర్ తీసుకుంటాయి. ఈ కమిటీలకు చెందిన వివిధ దళాలు.. అప్పుడప్పుడు తమ సంబంధిత ప్రాంతాలకు వెళ్లి తిరిగి షెల్టర్ జోన్లకు చేరుకుంటున్నాయి. అందులో భాగంగానే తెలంగాణతో పాటు ఇతర డివిజన్, ఏరియా కమిటీలు కర్రిగుట్టలు కేంద్రంగా షెల్టర్ తీసుకున్నట్టు తెలుస్తోంది. పాల్వంచ - మణుగూరు, ఏటూరునాగారం - మహదేవపూర్ ఏరియా కమిటీల సభ్యులు కర్రిగుట్టల నుంచి తెలంగాణకు వచ్చి గతేడాది జరిగిన ఎన్‌కౌంటర్లలో 15 మంది చనిపోయారు.



శ్రీరాంసాగర్‌కు పూడిక సమస్య

భారీగా తగ్గిపోయిన నీటి నిల్వ సామర్థ్యం

భవిష్యత్తులో ఆయకట్టు తగ్గిపోయే పరిస్థితి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పద్దెనిమిది లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్న బృహత్తర శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పూడిక సమస్య భవిష్యత్తులో పెద్ద అవరోధం కానుంది. ఈ జలాశయాన్ని 1978లో 112 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించారు. తరువాత 1996లో 'ఏపీఈఆర్ఎల్'చేపట్టిన సర్వేలో.. జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 90 టీఎంసీలకు పడిపోయినట్లు నిర్ధారించారు. అప్పటి నుంచి 2024 వరకు.. అదే నీటి నిల్వ సామర్థ్యాన్ని అధికారులు చూపుతూ వచ్చారు. తరువాత కొన్ని నెలల క్రితం జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు పడిపోయినట్లు నీటిపారుదల శాఖ అధికారులు నిర్ధారించారు. ప్రస్తుతం శ్రీరాంసాగర్ జలాశయం నీటి నిల్వ 1,091 అడుగులు, 80.5 టీఎంసీల సామర్థ్యంతో ఉంది. జలాశయంలోకి ఎగువ మహారాష్ట్ర నుంచి వస్తున్న వరదలతో.. ఏటా 0.8 టీఎంసీల పూడిక వచ్చి చేరుతున్నట్లు ప్రాజెక్ట్ అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

ఏటా వచ్చి చేరుతున్న పూడిక.. అధికారులు చెబుతున్న లెక్కల కంటే ఎక్కువ ఉంటుందని, జలాశయంలో నీటి నిల్వ సామర్థ్యం ప్రస్తుతం చెబుతున్న లెక్కల కంటే తక్కువ ఉంటుందని భావిస్తున్నారు. నీటి నిల్వ సామర్థ్యం కేవలం 70 టీఎంసీలు ఉంటుందని వాదనలున్నాయి. అధికారులు ప్రకటించిన 80.5 టీఎంసీలపై అనేక అనుమానాలున్నాయి. కాగా నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతున్నప్పటికీ.. ఆయకట్టు అలాగే ఉంటోంది. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో ఆయకట్టుకు సాగునీరు అందించడమనేది గగనమే అని అర్థమవుతోంది. మూడేళ్లుగా జలాశయంలోకి 70 టీఎంసీల మేర నీరు చేరగానే.. వరద గేట్ల ద్వారా గోదావరి దిగువకు నీటిని వదిలేస్తున్నారు. ప్రాజెక్ట్ జలాశయంలో పూడిక తీసివేతకు ప్రపంచంలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పూడిక తొలగించకపోతే భవిష్యత్తులో తాగునీటి ప్రాజెక్టుగానే మిగిలిపోయే పరిస్థితి తలెత్తుతుందని నిపుణులు అంటున్నారు.





గురుతు మిగిలి'నది'

గోదావరి తీర పల్లెలు, పట్టణాలకు వైకుంఠధామాల్లేక.. ఆఖరి మజిలీకి అనేక ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తోంది. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణానికి శ్మశాన వాటిక లేక గోదావరి నదిలోనే అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు. నదిలో నీరు ఉన్నప్పుడు ఒడ్డున, నీరు లేనప్పుడు ఇసుకలో పూడ్చడమో, దహనం చేయడమో చేస్తుంటారు. కర్మలు పూర్తి చేసేవరకు.. ఆ చోటును గుర్తుంచుకునేందుకు.. నదిలో కర్రలు పాతి పెడుతున్నారు. ఈ కర్రలు వానాకాలంలో నీరు చేరేదాక.. అయినవారి ఆఖరి జ్ఞాపకాలుగా నిలుస్తున్నాయి.

- సాక్షి ప్రతినిధి, మంచిర్యాల

కాంగ్రెస్ పాలన గాలి మాటలు.. ఢిల్లీకి మూటలు

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి
- సీఎం, మంత్రులకు రైతులను పరామర్శించే ఓపిక లేదు
- మేము రైతులకు ధైర్యం చెపితే మీకు భయమెందుకు ?



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన దినదిన గండంలా మారిందని, 14 నెలల పాలనలో గాలి మాటలు, ఢిల్లీకి మూటలు మినహా ఆచరణలో ప్రజలకు మేలు జరగలేదని బీఆర్ఎస్ మాజీ మంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డి విమర్శించారు. రుణమాఫీ, రైతుబంధు పథకాలు అమలు కాకపోవడంతో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసేందుకు బీఆర్ఎస్ బృందాన్ని పోలీసులు అనుమతించడం లేదన్నారు. వరంగల్ జిల్లా తలారిగూడెంలో బీఆర్ఎస్ అధ్యయన కమిటీని పోలీసులు అడ్డుకోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధ్యయన కమిటీ సభ్యులు పువ్వాడ అజయ్‌కుమార్, జోగు రామన్న, అంజయ్య యాదవ్, వినోద్ కుమార్, దేవీప్రసాద్‌లతో కలసి నిరంజన్‌రెడ్డి గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. 'పోలీసు కంట్రోల్ రూమ్ నుంచే రాష్ట్రంలో పాలన నడుస్తోంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని పట్టుకుని తిరుగుతున్నా తెలంగాణలో మాత్రం రాజ్యాంగ స్ఫూర్తి కనిపించడం లేదు. తరచూ ఢిల్లీ, విదేశీ పర్యటనలకు వెళ్తున్న సీఎం, మంత్రులకు రైతులను పరామర్శించే తీరిక లేదు. ఆపదలో ఉన్న రైతులకు ధైర్యం చెప్పేందుకు బీఆర్ఎస్ నేతలు వెళ్తే కాంగ్రెస్‌కి వచ్చిన నొప్పేంటి'అని నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. 'కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 420 రోజుల్లో రైతులు రోడ్డు ఎక్కి ఆందోళన చేయని రోజంటూ లేదు. మద్దతు ధర, రుణమాఫీ, రైతుబంధు, బోనస్, విద్యుత్, సాగునీరు వంటి అనేక సమస్యలతో రైతులు సతమతం అవుతున్నారు. కేసీఆర్ పాలన మళ్లీ రావాలని ప్రజలు కోరుకోవడాన్ని కాంగ్రెస్ జీర్ణించుకోవడం లేదు' అని ఆయన విమర్శించారు.

బ్లాక్‌మనీ తెప్పిస్తామన్న హామీ ఏమైంది?

టీపీసీసీ అధికార ప్రతినిధి సుధాకర్

సాక్షి, హైదరాబాద్: విదేశాల్లో అక్రమంగా దాచుకున్న నల్లధనాన్ని తెప్పించి.. ప్రతి వ్యక్తి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తానన్న మోదీ హామీ ఏమైందని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్.. బీజేపీని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో అర గ్యారంటీ కూడా అమలు కాలేదని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ వ్యాఖ్యానించడం.. ఆయన అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకిచ్చిన వాగ్దానాల్ని ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు పోతున్నారని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏటా కోటి మందికి ఉద్యోగాలిస్తామన్నారు.. పదేళ్ల కాలం సరిపోలేదా? అని ఆయన లక్ష్మణ్‌ను నిలదీశారు.

వీసా మోసాల కేసులో ఇద్దరి అరెస్టు

సాక్షి, హైదరాబాద్: వీసా మోసాల కేసులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరిని తెలంగాణ సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. సీఐడీ డీజీపీ శిఖాగోయెల్ ఆదేశాల మేరకు ఏపీలోని ఏలూరు జిల్లా కొయ్యలగూడెంకు చెందిన కొట్టు సాయి రవితేజ, కొట్టు మనోజ్‌లను సీఐడీ అరెస్టు చేసింది. ఈ మేరకు సీఐడీ డీజీ గురువారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ కేపీహెచ్‌బీలో 'అబ్రాడ్ స్టడీ ప్లాన్ కన్సల్టెన్సీ' పేరుతో ఉన్న సంస్థ తన నుంచి లక్షల రూపాయలు వసూలు చేసిందంటూ నిర్మల్ జిల్లా దిల్వాపూర్‌కు చెందిన గోనే శ్రీనివాస్ ఖానాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాల్టా, లాత్వియా లాంటి దేశాల్లో ఉద్యోగం గ్యారంటీ అంటూ నమ్మించారని చెప్పారు. ఖానాపూర్‌లో నమోదైన ఈ కేసు సీఐడీకి బదిలీ అయ్యింది. ఈ సంస్థ నిర్వాహకులు విదేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తామని ఆశ చూపి తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ మోసాలకు పాల్పడ్డారు. నిందితులు హైదరాబాద్, విజయవాడ, ఢిల్లీలో బ్రాంచ్‌లు నిర్వహిస్తూ దాదాపు 100 మందిని మోసం చేసినట్లు విచారణలో తేలింది. ఒక్కొక్కరి నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేశారని ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజలు కాంగ్రెస్ గూబ పగలగొట్టారు

- జనం కేసీఆర్ పాలనే కోరుకుంటున్నారు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో కాంగ్రెస్ పార్టీ అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్ 'తెలంగాణ కాంగ్రెస్'నిర్వహించిన ఆన్‌లైన్ పోల్‌లో ఆ పార్టీకి నెటిజన్లు గూబగుయ్యమనిపించేలా తీర్పునిచ్చారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. 'సునీల్ కనుగోలు మా పార్టీ నుంచి పది మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారు. సునీల్ సూచన మేరకు కాంగ్రెస్ పెట్టిన పోల్‌లో 'తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు ఎలాంటి పాలన కోరుకుంటున్నారు అనే ప్రశ్నతో పాటు, ప్రజలకు రెండు సమాధానాలతో కూడిన ఆప్షన్ ఇచ్చారు. (ఏ) ఫామ్ హౌజ్‌పాలన (బీ) ప్రజల వద్దకు పాలన అని అడిగితే.. ప్రజలు కాంగ్రెస్‌కు గూబ పగిలే సమాధానం ఇచ్చారు. ప్రజలంటే తమాషా అనుకుంటున్నారు. ఇష్టారీతిన అబద్ధాలు చెప్తే ప్రజలు చూస్తలేరు అనుకుంటున్నారా. కేసీఆర్ పాలనను ప్రజలు కోరుకుంటున్నారని కాంగ్రెస్ పోల్‌తో స్పష్టమైంది'అని కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ పోల్‌లో మొదట్లో 73 శాతం ఫామ్‌హౌజ్ పాలనకు, 27 శాతం ప్రజల వద్దకు పాలన అంటూ సమాధానం ఇచ్చారని.. దీనితో వారు ఈ పోల్‌ను తమ అధికారిక ఖాతా నుంచి డిలీట్ చేశారని కౌశిక్ రెడ్డి ఎద్దేవా చేశారు. మరో పక్క హామీల అమలులో సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద జోకర్‌గా మారారని కౌశిక్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మాట్లాడుతూ, అన్ని పథకాలు ఇచ్చాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.




ఏ నాయకుడికి పోల్‌తో సంబంధం లేదు: మన్నే సతీశ్

రాష్ట్రంలో పరిపాలన విధానం ఎలా ఉండాలన్న అంశంపై ప్రజల వద్ద పరిపాలన ఉండలా..? ఫామ్ హౌజ్ పాలన ఉండలా..? అని తాము ఆన్‌లైన్ పోల్‌చేశామని, దీనితో ఏ నాయకుడికి సంబంధం లేదని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా చైర్మన్ మన్నే సతీశ్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అసలు స్వరూపం తెలుసుకోవడానికే ఈ పోల్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ సోషల్ మీడియా తప్పుడు ప్రచారం ప్రజలకు తెలిసిపోయిందని, బీఆర్ఎస్ సోషల్ మీడియా అమెరికా నుంచి నడుస్తోందని ఆరోపించారు. ఫామ్ హౌస్ పాలన కావాలని టాగ్ చేశారన్నారు. టీపీసీసీ పోల్ ఫలితాలను బీఆర్ఎస్ సోషల్ మీడియా పబ్లిసిటీ చేయడం సంతోషకరమన్నారు.

ఎస్సీ వర్గీకరణ కాంగ్రెస్ మూల సిద్ధాంతం

- ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ కాంగ్రెస్ మూల సిద్ధాంతం అని పార్టీ పీఏసీ మీటింగ్‌లలో తాను స్పష్టంగా చెప్పానని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ నిర్ణయాలకు విరుద్ధంగా ఎమ్మెల్యే వివేక్, ఇతర నేతలు మాట్లాడినా పార్టీ చర్యలు తీసుకుంటుందని భావిస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ వర్గీకరణను కచ్చితంగా అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారని అన్నారు. ఇందుకోసం మందకృష్ణ మాదిగ ఎలాంటి ఆందోళన చేయాల్సిన అవసరం లేదని తెలిపారు. మాదిగల కోసం సుప్రీంకోర్టులో వాదనలు వినిపించిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని, వర్గీకరణ కోసం నియమించిన కమిషన్ నివేదిక రాగానే ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ల విభజన చేస్తుందన్నారు. మాదిగ సామాజిక వర్గానికి న్యాయం చేస్తామని హరీశ్ రావు, కేటీఆర్ అంటుంటే నవ్వొస్తోందని సంపత్‌కుమార్ ఎద్దేవా చేశారు.



బాబోయ్.. బుల్ ఫైట్!

విశాఖలోని ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో రెండు ఎద్దులు అధిపత్యం కోసం పోరాడాయి. వీటి మధ్య జరిగిన పోరును స్థానికులు ఆసక్తిగా గమనించారు. ఓ దశలో ఇవి వారివైపునకు రాగా... స్థానికులు భయాందోళనకు గురై పరుగులు తీశారు.
– సాక్షి ఫోటోగ్రాఫర్, విశాఖపట్నం



సంపద సృష్టి పాలనలో పోలీసు బైకూ మూలకే...

ఒకవైపు పెట్రోలింగ్‌కు వాహనాలు లేవని చెబుతున్న పోలీసులు..చిన్న మరమ్మతులైన వాటినీ రిపేర్ చేయించకుండా మూలన పడేస్తున్నారు. దానికి ఈ చిత్రమే నిదర్శనం. విశాఖలోని మద్దిలపాలెం అవుట్‌పోస్ట్ వద్ద మరమ్మతులకు గురైన పోలీస్ పెట్రోలింగ్ బైక్‌ను నెలల తరబడి ఇలాగే వదిలేయడం విమర్శలకు తావిస్తోంది.
– సాక్షి ఫోటోగ్రాఫర్, విశాఖపట్నం



స్వామి అచట... లడ్డూల్లేవు ఇచట

ఇది తిరుపతిలోని కపిలేశ్వర స్వామి ఆలయం వద్ద టీటీడీ ఏర్పాటు చేసిన ప్రసాదం కౌంటర్. లడ్డూలు లేకపోవడంతో ఇలా నో స్టాక్ బోర్డును టీటీడీ ఏర్పాటు చేసింది. దీంతో అక్కడికి వచ్చిన భక్తులు లడ్డు ప్రసాదం దొరక్క నిరాశతో వెనుదిరిగారు.
– సాక్షి ఫోటోగ్రాఫర్, తిరుపతి

రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్‌గా వైడీఆర్

కాకినాడ: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ నూతన చైర్మన్‌గా వై.డి.రామారావు ఎన్నికయ్యారు. ప్రస్తుతం కాకినాడ జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్‌గా ఉన్న ఆయనను విజయవాడలో గురువారం జరిగిన రాష్ట్ర కార్యనిర్వాహక సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు చైర్మన్‌గా ఎ.శ్రీధర్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. 26 ఏళ్లగా రామారావుకు రెడ్‌క్రాస్ సంస్థతో అనుబంధం ఉంది. ఎనిమిదేళ్లుగా ఉమ్మడి తూర్పుగోదావరి, కాకినాడ జిల్లా చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

'మోడల్' టీచర్ల పదవీ విరమణ వయసు పెంచాలి

సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్న లక్ష్యంతో 2013లో ఏర్పాటైన మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అన్ని సదుపాయాలు ఇవ్వాలని ఎస్టీయూ డిమాండ్ చేసింది. జీవో 23 ప్రకారం మోడల్ స్కూల్స్‌ను పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్‌లో విలీనం చేసి, రెగ్యులర్ ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా జీతాలు చెల్లిస్తున్నారని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పదవీ విరమణ వయసు 62 సంవత్సరాలకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష తగదు

సాక్షి, అమరావతి: కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల కొనసాగుతున్న వివక్షను నిర్మూలించేందుకు సమష్టిగా కృషి చేయాలని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ సంచాలకులు డాక్టర్ కె.పద్మావతి పిలుపునిచ్చారు. గురువారం కుష్టు వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా గొల్లపూడిలో నిర్వహించిన 'స్పర్శ లెప్రసీ అవేర్‌నెస్ క్యాంపెయిన్' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రజల్లో ఈ వ్యాధిపై అవగాహన పెంచడం ద్వారా వ్యాధిగ్రస్తుల పట్ల కొనసాగుతున్న వివక్షను నిర్మూలించగలమని స్పష్టం చేశారు.

గోదావరి బోర్డు పరిశీలనకు గోదావరి-బనకచర్ల లింక్

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు కుడి కాలువ సామర్థ్యం పెంచడం, తాడిపూడి ఎత్తిపోతల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా రోజుకు 2 టీఎంసీల చొప్పున గోదావరి జలాలను ప్రకాశం బ్యారేజ్(కృష్ణా) మీదుగా నాగార్జున సాగర్ కుడి కాలువ, వెలిగొండ ప్రాజెక్టు ద్వారా బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు తరలించాలని ఏపీ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను మదింపు చేసి, నివేదిక ఇవ్వాలని గోదావరి బోర్డును కేంద్ర జల్ శక్తి శాఖ ఆదేశించింది. గోదావరి బోర్డు సర్వ సభ్య సమావేశంలో ఈ ప్రతిపాదనపై చర్చించి, మదింపు చేసి కేంద్ర జల్ శక్తి శాఖకు నివేదిక ఇస్తామని బోర్డు వర్గాలు తెలిపాయి. గోదావరి–బనకచర్ల అనుసంధానం ద్వారా వెనుకబడిన రాయలసీమ, ప్రకాశం, పల్నాడు, నెల్లూరు జిల్లాలకు గోదావరి జలాలను అందించి, అభివృద్ధి చేస్తామని.. విభజన చట్టంలో పేర్కొన్న మేరకు వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద ఆ ప్రాజెక్టుకు నిధులు ఇవ్వాలని గత నవంబర్ 15న కేంద్ర ఆర్థిక మంత్రికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేసి, నివేదిక ఇచ్చారు. ఈ ప్రాజెక్టు ప్రతిపాదనను కేంద్ర జల్ శక్తి శాఖ పరిశీలనకు ఆమె పంపారు. ఆ ప్రాజెక్టు ప్రతిపాదనను సీడబ్ల్యూసీలోని పీఏవో విభాగం సీఈకి కేంద్ర జల్ శక్తి శాఖ పంపింది. విభజన చట్టం ప్రకారం ఆ ప్రాజెక్టు ప్రతిపాదనను మదింపు చేయడానికి గోదావరి బోర్డుకు సీడబ్ల్యూసీ పంపింది.

భూమి పాయే.. బతుకూ పోయే..

'రిలయన్స్' సేకరించిన భూములు పదిహేడేళ్లుగా బీడు

థర్మల్ పవర్ ప్రాజెక్టుల కోసం 2,668 ఎకరాల సేకరణ	కార్యరూపం దాల్చని ప్రాజెక్ట్.. ఉపయోగపడని భూములు	నాడు ఎకరాకు రూ.7.70 లక్షలే పరిహారం	అదే ఎకరా భూమి విలువ ఇప్పుడు రూ.కోట్లు

నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో అటవీ ప్రాంతాన్ని తలపిస్తున్న పరిస్థితి ● ఇటీవల అనిల్ అంబానీ వచ్చి భూముల పరిశీలన

భూమితో రైతుకు విడదీయలేని బంధం. మట్టిని పెకళించి.. స్వేదం చిందించి.. సేద్యం చేసే రైతు తన భూమిని కన్నతల్లి కంటే మిన్నగా భావిస్తాడు. అటువంటి భూమిని నమ్ముకుని బతికే అన్నదాతలు తమ బిడ్డల భవిష్యత్‌ను కాంక్షించి పారిశ్రామిక అవసరాల కోసం అమ్ముకున్నారు. ఆ రోజు ప్రభుత్వం పదో పరకో ఇచ్చి కొనుగోలు చేసిన భూములను కార్పొరేట్ సంస్థకు అప్పగించింది. భూమిపోయినా.. బతుకుపోయినా.. భవిష్యత్ ఉంటుందని భావించిన రైతుల ఆశలు పదిహేడేళ్లుగా పగటి కలగా మిగిలిపోయాయి. రూ.కోట్లు పలుకుతున్న తమ భూములు కళ్ల ముందు నిర్జీవంగా పడి ఉండడం చూసి అన్నదాతలు కుమిలిపోతున్నారు.

ముత్తుకూరు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పారిశ్రామికాభివృద్ధిని కొత్త పుంతలు తొక్కించారు. వైఎస్సార్ సీఎం కాక ముందు వరకు చీకటి ఆంధ్రప్రదేశ్‌గా ఉండేది. రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలని, విద్యుత్ కోతలు, కొరత లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వ రంగంతోపాటు ప్రైవేట్ రంగంలో విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని యోచన చేశారు. అందులో భాగంగా ముత్తుకూరు మండలం నేలటూరులో ప్రభుత్వ రంగ జెన్‌కో విద్యుత్ ప్రాజెక్టులకు వైఎస్సార్ శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో కోస్టల్ ఆంధ్ర పవర్ లిమిటెడ్ పేరుతో రిలయన్స్ సంస్థ రిలయన్స్ పవర్స్ యాజమాన్యం కృష్ణపట్నంలో 3,960 మెగావాట్ల రిలయన్స్ అల్ట్రామెగా థర్మల్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందు కోసం 2007లో ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది.

ఎకరాకు రూ.7.70 లక్షల పరిహారం

రిలయన్స్ విద్యుత్ ప్రాజెక్ట్ కోసం రైతుల నుంచి మాగాణి, మెట్ట భూములే కాకుండా దేవాలయాలు, సీజేఎఫ్ఎస్ భూములు మొత్తం 2,668 ఎకరాలు సేకరించారు. అయితే అప్పట్లో పట్టా భూములు ఎకరాకు రూ.7.70 లక్షల పరిహారంగా ఇచ్చారు. భూమి సేకరించినప్పుడు ప్రభుత్వం ఇచ్చిన పదో పరకో అప్పుడే ఖర్చయిపోయాయి. అదే భూములు కొద్ది రోజులకే రూ.కోట్లు పలికాయి. ఈ ప్రాజెక్ట్ కోసం అయ్యవారప్పకండ్రిగ, శంభునితోపు గ్రామాలను సైతం ఖాళీ చేయించి, ముత్తుకూరు సమీపంలో పునరావాస కాలనీలు ఏర్పాటు చేశారు. ముక్కారు పంటలు పండే భూములను రైతులు పారిశ్రామికాభివృద్ధి కోసం త్యాగం చేశారు. ఆ భూమి మీదనే బతికే రైతులు భూములు పోయినా.. తమ బిడ్డలకు ఉద్యోగాలు వస్తాయి.. బంగారు భవిష్యత్ ఉంటుందని భావించారు. కానీ భూములు పోయి.. బతుకు పోయి.. భవిష్యత్ కానరాక రైతు కుటుంబాలు కూలీలుగా మారారు.



ప్రాజెక్టులో యంత్రాల గోడౌన్



రిలయన్స్ పవర్ ప్రాజెక్టు ప్రధాన ద్వారం

అర్ధాంతరంగా నిలిచిపోయిన ప్రాజెక్ట్

రూ.20,000 కోట్ల అంచనాలతో ప్రాజెక్ట్ పనులు 2008లో ప్రారంభమయ్యాయి. ప్రాజెక్టు చుట్టూ ఎత్తైన గోడ నిర్మాణం పూర్తి చేశారు. ప్రత్యేక రోడ్లు నిర్మించారు. పెద్ద పెద్ద అడ్మినిస్ట్రేషన్ భవనాలు నిర్మించారు. పెద్ద ఎత్తున యంత్రాలు, పరికరాలను దిగుమతి చేసుకొన్నారు. యజమాని అనిల్ అంబానీ పర్యటన కోసం హెలిప్యాడ్ కూడా ఏర్పాటు చేశారు. అల్ట్రామెగా పవర్ ప్రాజెక్ట్ నిబంధనల ప్రకారం విద్యుత్ ఉత్పత్తిలో ఆంధ్ర (ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు)కు 40 శాతం, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రకు 20 శాతం చొప్పున విద్యుత్ పంపిణీ జరగాలని ఒప్పందాలు కుదిరాయి.

అనూహ్యంగా రైతు బతుకు తలకిందులు

పనులు వేగంగా జరుగుతున్న దశలో ఎంఓయూలో చేసుకున్న ఒప్పందాలకు-వాస్తవ పరిస్థితులకు మధ్య తలెత్తిన తేడా వల్ల 2011లో అనూహ్యంగా ప్రాజెక్ట్ పనులు నిలిచిపోయాయి. ఈ పరిణామాలతో భూములిచ్చిన కృష్ణపట్నం పంచాయతీ రైతులు హతాశులయ్యారు. భూముల పరిహారంగా పుచ్చుకున్న డబ్బు కరిగిపోయింది. ప్రాజెక్టు ద్వారా ఉపాధి, ఉద్యోగావకాశాలు పొందవచ్చని భావించిన రైతులు, యువకుల ఆశలు అడియాశలయ్యాయి. సన్న, చిన్నకారు రైతులు కూలీలుగా మారారు. పునరావాస కాలనీల్లో అభివృద్ధి పడకేసింది.

భూములు తిరిగి రైతులకు ఇచ్చేయాలి

పశ్చిమబెంగాల్ సింగూరులో ప్రాజెక్ట్ కోసం సేకరించిన భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడంతో అక్కడి ప్రభుత్వం గతంలో తిరిగి రైతుల పరం చేసింది. ఆ తరహాలోనే రిలయన్స్ ప్రాజెక్ట్ కోసం సేకరించిన భూముల్ని కూడా రైతులకు స్వాధీనం చేయాలని సర్వేపల్లి ఎమ్మెల్యే హోదాలో గతంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి పలు మార్లు డిమాండ్ చేశారు. స్థానిక నాయకులతో కలిసి ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. చట్ట ప్రకారం రైతుల భూముల్లో ప్రాజెక్ట్ ఏర్పాటు చేయకుంటే వాటిని తిరిగి రైతుల పరం చేయాలని ఆందోళన చేశారు. కానీ దాదాపు 17 ఏళ్లు గడుస్తున్నా.. ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చలేదు. తిరిగి భూములు రైతుల పరం కాలేదు. ఈ నేపథ్యంలో ఇటీవల రిలయన్స్ అధినేత అనిల్ అంబానీ కృష్ణపట్నంలోని భూములను స్వయంగా పరిశీలించారు. దీంతో స్థానికంగా ఆశలు చిగురిస్తున్నాయి. ఈ భూముల్లో కొత్త పరిశ్రమలు వస్తాయని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, గ్రామం అభివృద్ధి చెందుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



విలువైన భవనాల చుట్టూ ముళ్ల చెట్లు



గతంలో రిలయన్స్ ప్రతినిధులను ప్రశ్నిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి (ఫైల్)

కృష్ణపట్నం పంచాయతీ అభివృద్ధి జరగాలి



ప్రాజెక్టుల కోసం భూములు సేకరించి, కృష్ణపట్నం చుట్టూ ప్రహరీ నిర్మించారు. ప్రాజెక్టులు రాకపోవడం వల్ల అటు రైతులకు వ్యవసాయం, ఇటు యువతకు ఉద్యోగాలు కరువయ్యాయి. పేదలు ఉపాధికి దూరమయ్యారు. రిలయన్స్ కోసం సేకరించిన భూముల్లో కొత్త ప్రాజెక్ట్ ఏర్పాటు చేసి, యువతకు ఉద్యోగాలు, పేదలకు ఉపాధి కల్పించాలి.
– కారంచేటి ప్రసాదశర్మ, ఎంపీటీసీ సభ్యుడు, కృష్ణపట్నం

యువకులకు ఉద్యోగ కల్పన జరగాలి



రిలయన్స్ థర్మల్ విద్యుత్ ప్రాజెక్ట్‌కు అనిల్ అంబానీ ఇటీవల వచ్చినట్లు తెలిసింది. ఈ ప్రాజెక్ట్ కోసం సేకరించిన భూముల్లో కాలుష్యం లేని పరిశ్రమలు ఏర్పాటు కావాలి. చదువుకున్న యువకులకు ఉద్యోగాల కల్పన జరగాలి. గ్రామం అన్ని విధాలా అభివృద్ధి జరగాలి. ప్రాజెక్టులు ఏర్పాటు కాకుంటే రైతులకు తిరిగి భూములు స్వాధీనం చేయాలి.
– రాగాల వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్, కృష్ణపట్నం

కాలుష్య కారక పరిశ్రమలపై చర్యలేవి?

- తీర ప్రాంత పరిరక్షణకు ప్రజలు నడుం బిగించాలి
- వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ రాజేంద్రసింగ్

సీతంపేట: నీటి వనరులు, సముద్ర తీరప్రాంత కాలుష్యానికి కారణం అవుతున్న పరిశ్రమలపై ప్రభుత్వం ఎందుకు చర్యలు చేపట్టడం లేదని వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ రాజేంద్రసింగ్ ప్రశ్నించారు. విశాఖ జిల్లాలో హెటిరో, అచ్యుతాపురం సెజ్, రాంకీ, దివీస్ పరిశ్రమలు సముద్రంలోకి విడుదల చేస్తున్న వ్యర్థాల వల్ల ఏర్పడిన కాలుష్యం, జీవనోపాధి కోల్పోయిన మత్స్యకార గ్రామాలను సందర్శించి క్షేత్ర స్థాయి పరిస్థితిని గురువారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వివరించారు. 1,000 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం ఉన్న ఏపీలో పరిశ్రమల కాలుష్యం వల్ల 2 లక్షల మత్స్యకార కుటుంబాలు జీవనోపాధి కోల్పోతున్నాయని పేర్కొన్నారు. పాయకరావుపేట, అనకాపల్లి, భీమిలి, విశాఖ తూర్పు, దక్షిణ నియోజకవర్గాలలో ఉన్న సముద్ర తీర ప్రాంతాన్ని, నీటి వనరులను గురువారం సందర్శించి అక్కడి కాలుష్య వాతావరణాన్ని పరిశీలించి, మత్స్యకారుల సమస్యలు అడిగి తెలుసుకున్నట్లు వెల్లడించారు. తీరప్రాంతంలో ఉన్నపరిశ్రమల వల్ల వచ్చే వ్యర్థాలు సముద్రంలో కలవడం వల్ల మత్స్యసంపదకు నష్టం కలుగుతోందన్నారు. కాలుష్యం వల్ల తాబేళ్లు పెద్ద సంఖ్యలో మృత్యువాత పడుతున్నట్లు గుర్తించామన్నారు. దీనిపై కాలుష్య నియంత్రణ మండలి చర్యలు చేపట్టాలని గతంలోనే మాట్లాడటం జరిగిందని, నెలలు గడిచినా ఇప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో హెటిరో, భీమిలిలో దివీస్, అచ్యుతాపురం సెజ్‌లలో పరిశ్రమల వల్ల సముద్ర తీర ప్రాంత కాలుష్యం జరిగి మత్స్య సంపద నష్టపోతున్నట్టు మత్స్యకారుల ద్వారా తెలుసుకున్నామన్నారు. తక్షణమే వీటి నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే విశాఖలో లాసన్స్ బే కాలనీవద్ద పెద్ద ఎత్తున మురుగునీరు డ్రెయిన్ ద్వారా సముద్రంలో కలుస్తోందని, ముడసర్లోవ డంప్‌యార్డ్ నుంచి వస్తున్న మురుగు నీరు మంచి నీటి వనరు అయిన ముడసర్లోవ డ్యామ్‌లో కలుస్తోందని, ఈ విషయమై జీవీఎంసీపై కోర్టులో కేసు వేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఎటువంటి పరిరక్షణ చర్యలు చేపట్టలేదన్నారు. ప్రజలు చైతన్యవంతులై నీటి వనరులు, సముద్రతీర ప్రాంత పరిరక్షణకు ముందుకు రావాలన్నారు. మీడియా కూడా తీరప్రాంత పరిరక్షణపై దృష్టి సారించాలన్నారు.



మాట్లాడుతున్న రాజేంద్రసింగ్

పశువులకు త్వరలో గో ఆధార్

పశుసంవర్ధక శాఖ స్పెషల్ సీఎస్ బి.రాజశేఖర్ వెల్లడి

సాక్షి, అమరావతి: ఆధార్ తరహాలో పశువులకు కూడా గుర్తింపు సంఖ్య(గో ఆధార్) ఇవ్వడానికి వాటి ముట్టె నమూనాలను పరిశీలించే సాంకేతికతను త్వరలో ఆచరణలోకి తీసుకురానున్నట్లు పశుసంవర్ధక శాఖ ఎక్స్ అఫీషియో స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ చెప్పారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో ఏర్పాటు చేసిన ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. గో ఆధార్‌కు సంబంధించిన సాంకేతికత అమలు తీరుపై ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ నెల 20న ప్రారంభించిన పశు ఆరోగ్య శిబిరాలు 31వ తేదీతో ముగియనున్నాయని చెప్పారు. ఇప్పటివరకు 12 వేల గ్రామాల్లో 13 వేల శిబిరాలు నిర్వహించి.. 10.05 లక్షల పశువులకు వైద్య సేవలు అందించినట్టు చెప్పారు.

టిడ్కో రుణాల చెల్లింపునకు రూ.294.34 కోట్లు విడుదల

సాక్షి, అమరావతి: టిడ్కో నిర్మాణం కోసం గతంలో హడ్కో వంటి వివిధ ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న రుణాల చెల్లింపునకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో నాలుగో విడతగా రూ.294,34,67,000 విడుదల చేస్తూ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, తాము అధికారంలోకి వచ్చాక వెంటనే టిడ్కో ఇళ్లు పూర్తి చేసి నూరుశాతం లబ్ధిదారులకు అందిస్తామని మున్సిపల్‌శాఖ మంత్రి చేసిన ప్రకటన మాటలకే పరిమితమైంది. బ్యాంకులకు రూ.102 కోట్లు చెల్లిస్తే, లబ్ధిదారులకు రుణాలు మంజూరవుతాయని, ఈ నిధులను వెంటనే చెల్లిస్తామని మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ డిసెంబర్‌లో ప్రకటించారు. కానీ ఆ నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో బ్యాంకులకు చెల్లించాల్సిన మొత్తం రూ.140 కోట్లకు పెరిగింది.8 నెలలుగా టిడ్కో ఇళ్ల నిర్మాణం ముందుకు కదలడంలేదు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 3 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 62,710 మంది స్వామివారిని దర్శించుకున్నారు. హుండీలో రూ. 3.14 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు కూడా 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

కుంభమేళా యాత్రకు ప్రత్యేక టూర్

తిరుపతి కల్చరల్: ప్రయాగరాజ్ మహా కుంభ మేళా యాత్రకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక టూరు బస్సులు నడుపుతున్నట్లు ఆంధ్రపదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ సీహెచ్.శ్రీనివాసరావు ఇందులో భాగంగా తిరుపతి నుంచి ఫిబ్రవరి 11న ఉదయం 6 గంటలకు బస్సు బయలు దేరి కడప, కర్నూలు, హైదరాబాద్ ప్రయాణికులను పికప్ చేసుకొని వెళ్లి తిరిగి 18వ తేదీన తిరుపతికి చేరుకుంటుందని పేర్కొన్నారు. అలాగే నెల్లూరు నుంచి విజయవాడ, రాజమహేంద్రవరం, అన్నవరం, విశాఖపట్నం, పూరి, కోణార్క్, భువనేశ్వర్, కటక్, చండీఘర్, గయా, బుద్ధ గయా, కాశీ, మీదుగా ప్రయాగరాజ్‌కు యాత్ర బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నెల్లూరు నుంచి ఫిబ్రవరి 12వ తేదీ బస్సు యాత్ర ఆరంభమై 19వ తేదీ నెల్లూరుతో యాత్ర పూర్తవుతుందని తెలిపారు.

బంగారు తిరుచ్చిపై దేవదేవుడు



చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి గురువారం బంగారు తిరుచ్చి వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని వజ్రవైఢూర్యాలతో అలంకరించి దర్శనం కల్పించారు.ఆ తర్వాత వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవం, సాయంత్రం ఉయ్యాలసేవ నిర్వహించారు. ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ రమేష్ బాబు పాల్గొన్నారు.

విద్యా సమాచారం


ఎల్ఎల్‌బీ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో గత ఏడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో జరిగిన మూడేళ్ల లా కోర్సుకు సంబంధించి 4వ సెమిస్టర్, ఐదేళ్ల లా కోర్సుకు సబంధించి 4వ, 8వ సెమిస్టర్ ఫలితాలు గురువారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ తెలిపారు. ఫలితాల కోసం విద్యార్థులు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. అలాగే మహిళా వర్సిటీలో గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన బీటెక్ ద్వితీయ సంవత్సరం ఫస్ట్ సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి.

రూ.9 లక్షల ప్యాకేజీతో ఎంపికైన పాలిటెక్నిక్ విద్యార్థినులు

పలమనేరు/కుప్పం రూరల్: ఏపీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రతిష్ఠాత్మక టెక్సాస్ మల్టినేషనల్ ఇన్స్ట్రుమెంట్స్ కంపెనీలో ఉద్యోగాలకోసం నిర్వహించిన రాష్ట్రస్థాయి పరీక్షలో పలమనేరు, కుప్పం పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లమో చదువుతున్న విద్యార్థినులు ఎంపికయ్యారు. టెక్సాస్ మల్టీ నేషనల్ ఇన్స్ట్రుమెంట్స్ కంపెనీలో ఉద్యోగాలకోసం ఆ హెచ్ఆర్‌లు పాలిటెక్నిక్ విద్యార్థులకు ఎంట్రెన్స్ పరీక్షను ఇటీవల నిర్వహించారు. ఇందులో రాష్ట్రంలోని 30 పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 800మందికి పైగా పరీక్ష రాశారు. వీరిలో 17 పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 98మంది ఇంటర్వ్యూకు ఎంపికైయ్యారు. వీరిలో పలమనేరు కళాశాలకు చెందిన పూర్ణిమ రూ.9.02లక్షల ప్యాకేజీతో ఈ ఉద్యోగానికి ఎంపికైంది.

ఎన్ఈఈఆర్ఐ డైరెక్టర్‌గా ఎస్వీయూ పూర్వ విద్యార్థి



తిరుపతి సిటీ: ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ పూర్వ విద్యార్థి డాక్టర్ ఎస్వీ మోహన్ నాగపూర్‌లోని కేంద్రప్రభుత్వ సంస్థ నేషనల్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఈఈఆర్ఐ) డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఎస్వీయూలో సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తి చేసిన ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో చీఫ్ సైంటిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనను ఏబీఆర్ఎస్ఎమ్ ఎస్వీయూ ప్రొఫెసర్ డాక్టర్ వైవీ.రామిరెడ్డి అభినందించారు.



'జోరుగా హుషారుగా షికారు పోదమా...' అంటూ అక్కినేని నాగేశ్వర రావు, కృష్ణకుమారి అప్పట్లో సిల్వర్ స్క్రీన్‌పై చేసిన సందడిని నాటి ప్రేక్షకులు ఎంజాయ్ చేశారు. ఇప్పుడు ఈ పాట ప్రస్తావన ఎందుకూ అంటే... జోరుగా హుషారుగా షూటింగ్‌కి పోదమా... అంటూ కొందరు కథానాయికలు డైరీలో నాలుగుకి మించిన సినిమాలతో బిజీ బిజీగా ఉన్నారు. ఆ హీరోయిన్లు చేస్తున్న సినిమాల గురించి తెలుసుకుందాం...

జోరుగా హుషారుగా షూటింగ్‌కి పోదమా...


త్రిష · పూజా హెగ్డే · నయనతార · రష్మికా మందన్నా · సంయుక్తా మీనన్ · మృణాల్ ఠాకూర్ · జాన్వీ కపూర్

రెండు దశాబ్దాలు దాటినా బిజీగా...

చిత్ర పరిశ్రమలో రెండు దశాబ్దాలకుపైగా ప్రయాణం పూర్తి చేసుకున్నారు త్రిష. అందం, అభినయంతో తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ ప్రేక్షకులను అలరిస్తున్న ఆమె ఇప్పటికీ ఫుల్ బిజీ హీరోయిన్‌గా దూసుకెళుతున్నారు. అంతేకాదు.. అందం విషయంలోనూ యువ హీరోయిన్లకు గట్టి పోటీ ఇస్తున్నారు. ప్రస్తుతం త్రిష చేతిలో తెలుగు, తమిళ్, మలయాళంలో కలిపి అరడజను సినిమాలున్నాయి. ఆమె నటిస్తున్న తాజా తెలుగు చిత్రం 'విశ్వంభర'. ఈ మూవీలో చిరంజీవికి జోడీగా నటిస్తున్నారామె. 'స్టాలిన్' (2006) సినిమా తర్వాత చిరంజీవి–త్రిష కలిసి నటిస్తున్న చిత్రం ఇదే కావడం విశేషం. అలాగే మోహన్‌లాల్ లీడ్ రోల్‌లో డైరెక్టర్ జీతూ జోసెఫ్ తెరకెక్కిస్తోన్న మలయాళ చిత్రం 'రామ్' లోనూ నటిస్తున్నారు త్రిష. అదే విధంగా అజిత్ కుమార్ హీరోగా మగిళ్ తిరుమేని తెరకెక్కిస్తున్న 'విడాముయర్చి', అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్న 'గుడ్ బ్యాడ్ అగ్లీ', కమల్‌హాసన్ హీరోగా మణిరత్నం రూపొందిస్తున్న 'థగ్ లైఫ్', సూర్య కథానాయకుడిగా ఆర్‌జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న 'సూర్య 45' (వర్కింగ్ టైటిల్) వంటి తమిళ చిత్రాల్లో నటిస్తూ జోరు మీద ఉన్నారు త్రిష.

తెలుగులో లేవు కానీ...

తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో బుట్ట బొమ్మగా స్థానం సొంతం చేసుకున్నారు హీరోయిన్ పూజా హెగ్డే. నాగచైతన్య హీరోగా నటించిన 'ఒక లైలా కోసం' (2014) అనే చిత్రంతో తెలుగులో ఎంట్రీ ఇచ్చారీ బ్యూటీ. టాలీవుడ్‌లో పదేళ్ల ప్రయాణం పూజా హెగ్డేది. కాగా చిరంజీవి, రామ్‌చరణ్ హీరోలుగా నటించిన 'ఆచార్య' (2022) సినిమా తర్వాత ఆమె ఒక్క తెలుగు సినిమా కూడా చేయలేదు. కానీ, బాలీవుడ్, తమిళ చిత్రాలతో బిజీగా ఉన్నారు పూజా హెగ్డే. తమిళంలో స్టార్ హీరోలైన విజయ్, సూర్యలకు జోడీగా నటిస్తున్నారు. విజయ్ హీరోగా హెచ్. వినోద్ దర్శకత్వం వహిస్తున్న 'జన నాయగన్' అనే సినిమాతో పాటు, సూర్య కథానాయకుడిగా కార్తీక్ సుబ్బరాజ్ డైరెక్షన్‌లో రూపొందుతోన్న 'రెట్రో' మూవీస్‌లో నటిస్తున్నారు పూజా హెగ్డే. అలాగే డేవిడ్ ధావన్ దర్శకత్వం వహిస్తున్న హిందీ చిత్రం 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' అనే సినిమాలో నటిస్తున్నారామె. షాహిద్ కపూర్ హీరోగా రోషన్ ఆండ్రూస్ దర్శకత్వంలో రూపొందిన హిందీ మూవీ 'దేవా'. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. హిందీ, తమిళ భాషల్లో బిజీగా ఉన్న పూజా హెగ్డే తెలుగులో మాత్రం ఒక్క సినిమాకి కూడా కమిట్ కాలేదు.

జోరుగా లేడీ సూపర్ స్టార్

ఇండస్ట్రీలో లేడీ సూపర్‌స్టార్‌గా పేరు తెచ్చుకున్నారు నయనతార. నటిగా రెండు దశాబ్దాలకు పైగా ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న ఆమె ఇప్పటికీ వరుస సినిమాలతో దూసుకెళుతున్నారు. కథానాయికగా ఫుల్ క్రేజ్‌లో ఉన్నప్పుడే దర్శకుడు విఘ్నేశ్ శివన్‌తో 2022 జూన్9న వివాహబంధంలోకి అడుగుపెట్టారు నయనతార. వీరిద్దరికీ ఉయిర్, ఉలగమ్ అనే ట్విన్స్ ఉన్నారు. ఇక కెరీర్ పరంగా ప్రస్తుతం ఆమె చేతిలో ఏడు సినిమాలున్నాయి. తమిళంలో 'టెస్ట్, మన్నాంగట్టి సిన్స్ 1960, రాక్కాయి' వంటి సినిమాలతో పాటు పేరు పెట్టని మరో తమిళ చిత్రం, 'డియర్ స్టూడెంట్'తో పాటు మరో మలయాళ మూవీ, 'టాక్సిక్' అనే కన్నడ సినిమాతో ఫుల్ బిజీ బిజీగా ఉన్నారు నయనతార. అయితే 2022లో విడుదలైన చిరంజీవి 'గాడ్ ఫాదర్' తర్వాత మరో తెలుగు చిత్రానికి పచ్చజెండా ఊపలేదామె.

అరడజను సినిమాలతో

'చూసీ చూడంగానే నచ్చేశావే.. అడిగీ అడగకుండా వచ్చేశావే... నా మనసులోకి' అంటూ రష్మికా మందన్నాని ఉద్దేశించి పాడుకుంటారు యువతరం ప్రేక్షకులు. అందం, అభినయంతో అంతలా వారిని ఆకట్టుకున్నారామె. కన్నడలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ 'ఛలో '(2018) సినిమాతో తెలుగుకి పరిచయమయ్యారు. ఆ తర్వాత తెలుగు, తమిళ, హిందీ సినిమాల్లో వరుస సినిమాలు చేస్తూ స్టార్ హీరోయిన్లలో ఒకరిగా దూసుకెళుతున్నారు ఈ కన్నడ బ్యూటీ. ఓ వైపు కథానాయకులకి జోడీగా నటిస్తూనే.. మరోవైపు లేడీ ఓరియంటెడ్ చిత్రాల్లోనూ నటిస్తున్నారు. ప్రస్తుతం ఆమె చేతిలో అరడజను సినిమాలున్నాయి. వాటిలో 'రెయిన్ బో, ది గాళ్ ఫ్రెండ్' వంటి ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్ కూడా ఉన్నాయి. శాంతరూబన్ దర్శకునిగా పరిచయమవుతున్న 'రెయిన్ బో' చిత్రం తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోంది. అదే విధంగా 'చిలసౌ' సినిమాతో దర్శకుడిగా మారిన నటుడు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ది గాళ్ ఫ్రెండ్'. అలాగే విక్కీ కౌశల్ హీరోగా లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించిన బాలీవుడ్ మూవీ 'ఛావా'లో హీరోయిన్‌గా చేశారు రష్మిక. ఈ సినిమా ఫిబ్రవరి 14న విడుదల కానుంది. ఇక సల్మాన్ ఖాన్ హీరోగా మురుగదాస్ తెరకెక్కిస్తున్న హిందీ మూవీ 'సికందర్'లోనూ రష్మిక కథానాయిక. అదే విధంగా నాగార్జున, ధనుష్ హీరోలుగా శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న తెలుగు, తమిళ చిత్రం 'కుబేర'లోనూ హీరోయిన్‌గా నటించారు ఈ బ్యూటీ. మరోవైపు అమర్ కౌశిక్ దర్శకత్వం వహించిన 'థామా' అనే బాలీవుడ్ మూవీలోనూ నటిస్తున్నారు రష్మికా మందన్నా.

ఏడు చిత్రాలతో బిజీ బిజీగా...

మలయాళ, తెలుగు, తమిళ, కన్నడ సినిమాల్లో నటించి, ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు హీరోయిన్ సంయుక్తా మీనన్. 'భీమ్లా నాయక్' (2022) చిత్రంతో టాలీవుడ్‌కి పరిచయమయ్యారు ఈ మలయాళ బ్యూటీ. 'భీమ్లా నాయక్, బింబిసార, సార్, విరూపాక్ష' వంటి వరుస హిట్‌లను తన ఖాతాలో వేసుకున్నారు సంయుక్త. ప్రస్తుతం ఆమె చేతిలో ఏడు సినిమాలున్నాయి. వాటిలో తెలుగులోనే ఐదు చిత్రాలుండగా, ఓ హిందీ ఫిల్మ్, ఓ మలయాళ సినిమా కూడా ఉంది. నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న 'స్వయంభూ', శర్వానంద్ కథానాయకుడిగా రామ్ అబ్బరాజు డైరెక్షన్‌లో రూపొందుతున్న 'నారి నారి నడుమ మురారి', బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా లుధీర్ బైరెడ్డి తెరకెక్కిస్తున్న 'హైందవ', బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తున్న 'అఖండ 2: తాండవం' సినిమాల్లో నటిస్తున్నారు సంయుక్తా మీనన్. అదే విధంగా తొలిసారి ఓ లేడీ ఓరియంటెడ్ సినిమాలోనూ నటిస్తున్నారామె. యోగేష్ కేఎంసీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. అలాగే ఆమె నటిస్తున్న తొలి హిందీ చిత్రం 'మహారాజ్ఞి–క్వీన్ ఆఫ్ క్వీన్స్'. ఈ మూవీకి చరణ్ తేజ్ ఉప్పలపాటి దర్శకత్వం వహిస్తున్నారు. అదే విధంగా మోహన్‌లాల్ లీడ్ రోల్‌లో జీతూ జోసెఫ్ దర్శకత్వంలో రూపొందుతోన్న మలయాళ చిత్రం 'రామ్'లోనూ నటిస్తున్నారు సంయుక్తా మీనన్. ఇలా ఏడు సినిమాలతో ఫుల్ బీజీ బీజీగా ఉన్నారామె.

హుషారుగా యంగ్ హీరోయిన్

టాలీవుడ్‌లో మోస్ట్ సెన్సేషన్ హీరోయిన్‌గా దూసుకెళుతున్నారు శ్రీలీల. 'పెళ్లిసందడి' (2021) సినిమాతో తెలుగులో హీరోయిన్‌గా పరిచయమైన ఈ బ్యూటీ అనతి కాలంలోనే స్టార్ హీరోయిన్ రేంజ్‌ని సొంతం చేసుకున్నారు. రవితేజ హీరోగా నటించిన 'ధమాకా' (2022) సినిమాతో తెలుగులో తొలి హిట్‌ని తన ఖాతాలో వేసుకున్న శ్రీలీల వరుస చిత్రాలతో యమా జోరు మీదున్నారు. ప్రస్తుతం ఆమె చేతిలో మూడు తెలుగు సినిమాలతో పాటు ఓ తమిళ చిత్రం ఉన్నాయి. నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో రూపొందుతోన్న 'రాబిన్ హుడ్', రవితేజ హీరోగా భాను భోగవరపు తెరకెక్కిస్తున్న 'మాస్ జాతర', పవన్ కల్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' వంటి తెలుగు చిత్రాల్లో నటిస్తున్నారు శ్రీలీల. అదే విధంగా శివ కార్తికేయన్ హీరోగా సుధ కొంగర దర్శకత్వం వహిస్తున్న 'పరాశక్తి' అనే తమిళ చిత్రంలోనూ నటిస్తూ బిజీగా ఉన్నారామె.

హిందీలోనూ...

దుల్కర్ సల్మాన్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వం వహించిన 'సీతా రామం' (2022) సినిమాతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చారు మృణాళ్ ఠాకూర్. ఆ సినిమా మంచి హిట్‌గా నిలిచింది. మృణాళ్ నటనకి మంచి మార్కులే పడ్డాయి. ఆ తర్వాత తెలుగులో 'హాయ్ నాన్న, ది ఫ్యామిలీ స్టార్' చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన ఈ బ్యూటీ ప్రభాస్ 'కల్కి: 2898 ఏడీ' చిత్రంలో అతిథి పాత్ర చేశారు. ప్రస్తుతం మృణాళ్ ఠాకూర్ బాలీవుడ్‌లో బిజీ హీరోయిన్‌గా మారారు. ఆమె హిందీలో 'పూజా మేరీ జాన్, హై జవానీతో ఇష్క్ హోనా హై, సన్ ఆఫ్ సర్దార్ 2', తుమ్ హో తో' వంటి చిత్రాలు చేస్తున్నారు. అదే విధంగా అడివి శేష్ హీరోగా తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతోన్న 'డెకాయిట్' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్నారు మృణాళ్ ఠాకూర్.

రెండు తెలుగు... రెండు హిందీ

ప్రేక్షకుల హృదయాల్లో అతిలోక సుందరిగా అభిమానం సొంతం చేసుకున్న దివంగత నటి శ్రీదేవి, నిర్మాత బోనీకపూర్ వారసురాలిగా పెద్ద కుమార్తె జాన్వీ కపూర్ హిందీలో ఎంట్రీ ఇచ్చారు. యూత్ కలల రాణిగా మారారు ఈ బ్యూటీ. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వం వహించిన 'దేవర: పార్ట్ 1' (2024) సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయం అయ్యారు జాన్వీ. ప్రస్తుతం ఆమె చేతిలో కూడా నాలుగు సినిమాలు ఉన్నాయి. వాటిలో రెండు తెలుగు కాగా రెండు హిందీ మూవీస్. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతోన్న 'ఆర్‌సీ 16' (వర్కింగ్ టైటిల్) చిత్రంలో నటిస్తున్నారు. అలాగే ఎన్టీఆర్ 'దేవర: పార్ట్ 2' సినిమా కూడా ఉండనే ఉంది. అదే విధంగా హిందీలో 'సన్నీ సంస్కారీ కీ తులసీ కుమారి, పరమ్ సుందరి' వంటి సినిమాల్లో నటిస్తున్నారు.

ఇలా నాలుగైదు సినిమాలతో బిజీ బిజీగా షూటింగ్స్ చేస్తున్న కథానాయికలు ఇంకొందరు ఉన్నారు.

– దేరంగుల జగన్ మోహన్

కార్తికేయుడిగా?


అల్లు అర్జున్

'పుష్ప 2: ది రూల్' సినిమాతో వసూళ్ల పరంగా సరికొత్త రికార్డులు సృష్టించారు అల్లు అర్జున్. ఆ సినిమా తర్వాత అల్లు అర్జున్ హీరోగా నటించనున్న కొత్త మూవీ ఏంటి? అనే ప్రశ్నకు అధికారికంగా జవాబు లేదు. కాగా 'పుష్ప 2: ది రూల్' తర్వాత త్రివిక్రమ్, తమిళ దర్శకుడు అట్లీలతో అల్లు అర్జున్ సినిమా ఉంటుందనే ప్రచారం జరిగింది. అయితే ఎవరితో ముందుగా మూవీ చేస్తారనే దానిపై స్పష్టత లేదు. తాజాగా త్రివిక్రమ్ దర్శకత్వంలోనే అల్లు అర్జున్ సినిమా చేయనున్నారని ఫిల్మ్‌నగర్ టాక్. 'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'అల.. వైకుంఠపురములో' వంటి హ్యాట్రిక్ విజయాల తర్వాత ఈ ఇద్దరి కాంబోలో రూపొందనున్న నాలుగో సినిమా ఇది. ఈ ప్రాజెక్ట్ కోసం త్రివిక్రమ్ భారీ కాన్వాస్ ఉన్న వైవిధ్యమైన కథను సిద్ధం చేసినట్లు టాక్. శివుడి తనయుడైన కార్తికేయుడు యుద్ధ దేవుడిగా ఎలా మారాడు? తండ్రి అయిన శివుణ్ణి తిరిగి కలవడానికి కార్తికేయ బయలుదేరినప్పుడు అతని ప్రయాణం ఎలా సాగింది? అనే కథాంశంతో ఈ చిత్రం ఉంటుందట. సోషల్ మైథలాజికల్ ఫ్యాంటసీ నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించేందుకు త్రివిక్రమ్ కథని సిద్ధం చేస్తున్నారని టాక్. హారికా అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై రాధాకృష్ణ (చినబాబు), నాగవంశీ నిర్మించనున్న ఈ సినిమా షూటింగ్ ఏప్రిల్‌లో ప్రారంభం కానుందని సమాచారం. అల్లు అర్జున్ ఇప్పటివరకు చేసిన పాత్రలకి పూర్తి వైవిధ్యంగా కార్తికేయ పాత్ర ఉంటుందని తెలుస్తోంది. ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

గ్రీన్ సిగ్నల్?


రవి తేజ


కళ్యాణ్ శంకర్

రవితేజ ప్రస్తుతం 'మాస్ జాతర' మూవీలో హీరోగా చేస్తున్నారు. ఈ చిత్రం మే 9న రిలీజ్ కానుంది. ఈ చిత్రం తర్వాత రవితేజ నెక్ట్స్ మూవీకి ఎవరు దర్శకత్వం వహించనున్నారనే చర్చ జరుగుతోంది. కొంత మంది దర్శకుల పేర్లు తెర్పైకి వచ్చాయి. కాగా 'మ్యాడ్' చిత్రంతో దర్శకునిగా హిట్ సాధించి, ప్రస్తుతం 'మ్యాడ్ 2'ని డైరెక్ట్ చేస్తున్న కళ్యాణ్ శంకర్ ఇటీవల రవితేజకు ఓ కథ వినిపించారట. స్క్రిప్ట్ నచ్చడంతో రవితేజ కూడా ఈ సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని భోగట్టా. దీంతో స్క్రిప్ట్‌పై మరింత ఫోకస్ పెట్టారట కల్యాణ్ శంకర్. ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థ నిర్మించనుందని, అన్నీ కుదిరితే 2026 సంక్రాంతికి ఈ మూవీని రిలీజ్ చేయాలని రవితేజ అండ్ టీమ్ ప్రణాళికలు రెడీ చేస్తున్నారని సమాచారం.

యాక్షన్ థ్రిల్లర్‌కి సై


వరలక్ష్మి

నెగటివ్ రోల్స్‌తో దూసుకెళుతూ, పాజిటివ్ క్యారెక్టర్స్‌లోనూ భేష్ అనిపించుకున్నారు వరలక్ష్మీ శరత్‌కుమార్. కథ నచ్చినప్పుడల్లా కథానాయిక ప్రాధాన్యం ఉన్న చిత్రాలు కూడా చేస్తుంటారామె. తాజాగా ఆ తరహా చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారామె. ఈ సినిమాకి 'ఆదిపర్వం' మూవీ డైరెక్టర్ సంజీవ్ మేగోటి దర్శకత్వం వహించనున్నారు. ''సంజీవ్ మేగోటి రాసుకున్న సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ కథకి వరలక్ష్మి ఓకే చెప్పారు. ఈ మూవీలో ఆమె మెయిన్ లీడ్ చేయనున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కించనున్న ఈ సినిమాలో పలువురు ప్రముఖ నటీనటులను తీసుకోనున్నాం. పూర్తి వివరాలు అతి త్వరలోనే ప్రకటిస్తాం'' అని మేకర్స్ తెలిపారు.

టీమ్ సీతారామన్... బడ్జెట్ మే 'సవాల్'!

దేశం చాలా క్లిష్ట పరిస్థితుల్లో ఉంది... ఒకపక్క ఆర్థిక వ్యవస్థ మందగమనంలోకి జారిపోయింది. ఈ ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు నాలుగేళ్ల కనిష్ట స్థాయి అయిన 6.4 శాతానికి తగ్గుతుందని స్వయంగా ప్రభుత్వ అంచనాలే చెబుతున్నాయి. ప్రజల వినిమయం తగ్గిపోవడం, ప్రైవేటు పెట్టుబడుల్లో స్తబ్దత, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మోదీ సర్కారుకు కత్తిమీద సాముగా మారాయి. రూపాయి పాతాళానికి నిచ్చెనేసినట్లు జారిపోతోంది. తాజాగా డాలర్‌తో దేశీ కరెన్సీ మారకం విలువ 86.7 జీవిత కాల కనిష్ఠానికి క్రాష్ అయ్యింది. మరోపక్క, అమెరికా అధ్యక్ష పీఠమెక్కిన ట్రంప్... చాలా దేశాలతో పాటు మన మెడపైనా సుంకాల కత్తి పెట్టడంతో టారిఫ్ వార్ 2.0కు తెరలేచింది. దీంతో మన ఎగుమతులకు గడ్డుకాలం తప్పేలా లేదు. ఇంటాబయటా ఇలాంటి ఎన్నో ప్రతికూల పరిస్థితుల్లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రికార్డు స్థాయిలో వరుసగా ఎనిమిదోసారి దేశ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.50 లక్షల కోట్లకు మించిన బడ్జెట్‌ను రెడీ చేశారు. ఆర్థిక క్రమశిక్షణ గాడి తప్పకుండానే ప్రగతిని పట్టాలెక్కించడం ప్రభుత్వం ముందున్న అతి పెద్ద సవాలు. ఈ నేపథ్యంలో 140 కోట్లకు పైగా దేశ ప్రజల కోసం సీతారామన్ అండ్ టీమ్ తయారు చేసిన ఈ బడ్జెట్ నలభీమ పాకాన్ని అలుపెరగకుండా వండివార్చిన ఉద్ధండ అధికారుల సంగతేంటో చూద్దాం...





అజయ్ సేథ్

ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా ప్రస్తుతం విధుల్లో ఉన్నారు. 2021 నుంచి నాలుగు దఫాలుగా బడ్జెట్ రూపకల్పన జట్టులో కీలకంగా వ్యవహరించారు. ఆర్థిక శాఖలో రెండో సీనియర్ అధికారిగా ఆయన నేతృత్వంలోనే వివిధ విభాగాలను సమన్వయం చేసుకుంటూ మొత్తం బడ్జెట్ ప్రక్రియకు చుక్కానిగా నిలుస్తున్నారు. ఆయన సారథ్యంలో బడ్జెట్ విభాగం ప్రభుత్వ ఆదాయ వ్యయాలు, రుణ సమీకరణ మధ్య సమతూకంతో బ్యాలెన్స్ షీట్‌కు తుదిమెరుగులు దిద్దింది. భారతదేశంలో తొలి సార్వభౌమ గ్రీన్ బాండ్స్ జారీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ సెక్రటేరియట్ ఏర్పాటు వంటి సాహసోపేతమైన చర్యల అమలు ఘనత సేథ్ సొంతం. ద్రవ్యలోటును ప్రభుత్వ లక్ష్యమైన 4.5 శాతం దిగువన కట్టడి చేస్తూ ఆర్థిక క్రమశిక్షణకు పెద్దపీట వేయడంతో పాటు జీడీపీతో పోలిస్తే ప్రభుత్వ రుణ నిష్పత్తి విషయంలో సరికొత్త వ్యూహాన్ని అమలు చేయడం రానున్న బడ్జెట్లో ఆయన ప్రధాన అజెండాగా మారింది.



మనోజ్ గోవిల్

1991 బ్యాచ్ మధ్యప్రదేశ్ కేడర్ ఐఏఎస్ అధికారి అయిన గోవిల్... మోదీ 3.0లో 2024 ఆగస్టులో కేంద్ర వ్యయ విభాగం కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. కేంద్ర బడ్జెట్ రూపకల్పనలో మొదటిసారి భాగస్వామ్యం వహిస్తున్నారు. రూపాయి ఘోరంగా పడిపోతున్న తరుణంలో బడ్జెట్లో సబ్సిడీలకు సంబంధించి అంచనాలు, కేటాయింపుల వంటి కఠిన వ్యవహారాలపై కఠోరంగా శ్రమించారు.



తుహిన్ కాంత పాండే

కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలో అత్యంత సీనియర్ అధికారి. ఆర్థిక, రెవెన్యూ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2019లో దీపమ్ (పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం) కార్యదర్శిగా ఉన్నప్పటి నుంచి దేశ బడ్జెట్ రూపకల్పన ప్రక్రియలో పాలుపంచుకుంటున్నారు. 1987 బ్యాచ్ ఒడిశా కేడర్ ఐఏఎస్ అధికారి అయిన పాండే గతేడాది సెప్టెంబర్‌లో ఆర్థిక శాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. దీపమ్ సెక్రటరీగా ఎయిరిండియా ప్రైవేటీకరణ, ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల డివిడెండ్ పాలసీ వంటి కీలక చర్యలు చేపట్టి దమ్మున్న అధికారిగా పేరు దక్కించుకున్నారు. దీపమ్ సెక్రటరీగా రాక ముందు ఆయన ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంలో పని చేయడంతో పాటు ఐక్యరాజ్యసమితి పారిశ్రామిక అభివృద్ధి సంస్థ (యూఎన్ఐడీఓ) ప్రాంతీయ కార్యాలయంలో కూడా సేవలందించారు.



వి. అనంత నాగేశ్వరన్

2022లో ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ)గా నియమితులయ్యారు. మోదీ 3.0లోనూ కొనసాగుతుండటం ఆయన దీక్షాదక్షతలకు నిదర్శనం. 2025–26 కేంద్ర బడ్జెట్‌కు ముందు వరుసగా మూడోసారి ఆర్థిక సర్వేను రూపొందించారు. ఆర్థికాంశాల బోధనతో పాటు క్రెడిట్ సూసే గ్రూప్ ఏజీ, జూలియస్ బేయర్ గ్రూప్ వంటి దిగ్గజ సంస్థల్లో టాప్ ఎగ్జిక్యూటివ్‌గా కూడా గతంలో పనిచేశారు. నేడు పార్లమెంట్‌కు సమర్పించనున్న ఆర్థిక సర్వేలో నాగేశ్వరన్ భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత స్థితిగతులను కళ్లకు కట్టడంతో పాటు 2047 నాటికి వికశిత భారత్ (అభివృద్ధి చెందిన దేశం)గా నిలిపేందుకు అవసరమైన కీలక సూచనలను కూడా పొందుపరిచడానికి తీవ్రంగా శ్రమించారు.



అరుణీశ్ చావ్లా

దీపమ్, ప్రభుత్వ రంగ సంస్థల విభాగం (డీపీఈ) కార్యదర్శిగా 2024 డిసెంబర్లో చార్జ్ తీసుకున్నారు. 1992 బ్యాచ్ బిహార్ కేడర్ ఐఏఎస్ అధికారి అయిన చావ్లా ప్రభుత్వానికి అదనపు ఆదాయాన్ని సమకూర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ, డాక్టరేట్ పొందిన చావ్లాకు 2014 నుంచి వ్యయాల విభాగం జాయింట్ సెక్రటరీగా పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉంది. ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణ, పీఎస్‌యూలకు చెందిన నిరుపయోగ ఆస్తుల విక్రయం, పీఎస్‌యూల కార్యకలాపాలను గాడిలో పెట్టి, మరింత బలోపేతం చేయడం వంటి వాటిపై బడ్జెట్లో ఆయన ప్రధానంగా దృష్టి సారించారు.



ఎం. నాగరాజు

ఆర్థిక సేవల కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 1993 బ్యాచ్ త్రిపుర కేడర్ ఐఏఎస్ అధికారి ఆయన. బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) పరిమితుల పెంపు వంటి సంస్కరణలకు రోడ్ మ్యాప్ రూపొందించడం, అంతకంతకూ పెరుగుతున్న సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేయడం, బ్యాంకింగ్ రంగానికి మరింత ఆర్థిక జవసత్వాలను అందించడంపై బడ్జెట్లో ఫోకస్ చేశారు.

బోర్డు సమావేశాలు

ఓఎన్‌జీసీ, సన్‌ఫార్మా, వేదాంత, బంధన్ బ్యాంక్, యూపీఎల్, నెస్లే ఇండియా, ఇండస్‌ఇండ్ బ్యాంక్, కర్ణాటక బ్యాంక్, సిటీ యూనియన్ బ్యాంక్, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్, ఐనాక్స్ విండ్, ఫైజర్, నువామా వెల్త్, జీఎండబ్ల్యూ ఇండస్ట్రీస్, సీసీఎల్ ఇంటర్నేషనల్, గోద్రేజ్ అగ్రోవేట్, ఐనాక్స్ విండ్ ఎనర్జీ, జ్యోతీ ల్యాబ్స్, ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్, పూనావాలా ఫైనాన్స్, మారికో, మెడ్‌ప్లస్ హెల్త్, నువామా వెల్త్, రిలాక్సో ఫుట్‌వేర్, ఎస్‌కేపీ సెక్యూరిటీస్, విశాల్ మెగా మార్ట్

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

31-1-2025

విశాఖ	505–00
చిత్తూరు	553–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	490–00
విజయవాడ	500–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	480–00
వరంగల్	482–00
రిటైల్ ధర	5.40

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BEL	280.2	4.87
POWERGRID	295.9	2.8
HEROMOTOCO	4,185.00	2.76
BHARTIARTL	1,642.50	2.63
CIPLA	1,459.95	2.53

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATAMOTORS	699.95	-6.98
ITCHOTELS	163.25	-5
ADANIENT	2,247.90	-3.05
SHRIRAMFIN	540.85	-2.29
BAJAJFINSV	1,750.00	-2.26

స్టాక్ మార్కెట్ డేటా


	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,688
ఎన్ఎస్ఈ	1,03,561
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	4,16,330
ఎఫ్ఐఐ	- 4,583
డీఐఐ	+ 2,166

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	72.77 $ (రాత్రి 11.30కు)	72.62 (క్రితం ముగింపు)
బ్రెంట్	75.98 $ (రాత్రి 11.30కు)	75.61 (క్రితం ముగింపు)

హైదరాబాద్‌లో ఇళ్ల ధరల్లో స్వల్ప పెరుగుదల

- చదరపు అడుగు ధర రూ.7,053
- ఎనిమిది నగరాల్లోనూ ఇదే ధోరణి
- వెల్లడించిన ప్రాప్ టైగర్ నివేదిక



న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో ఇళ్ల ధరలు స్వల్పంగా పెరిగాయి. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలంలో 3 శాతం పెరిగి చదరపు అడుగు (ఎస్ఎఫ్‌టీ) ధర రూ.7,053కు చేరింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికం (2023 అక్టోబర్–డిసెంబర్)లో ఇది రూ.6,842గా ఉంది. దేశవ్యాప్తంగా ఎనిమిది నగరాల్లోనూ ఇళ్ల ధరలు పెరుగుదలను చూసినట్టు హౌసింగ్ బ్రోకరేజీ సంస్థ ప్రాప్ టైగర్ వెల్లడించింది. గడిచిన రెండేళ్లలోనూ ఇళ్ల ధరలు దేశవ్యాప్తంగా పెరిగిపోవడం గమనార్హం. అత్యధికంగా ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో ఇళ్ల ధరలు 49 శాతం ఎగిశాయి. ఎస్ఎఫ్‌టీ ధర రూ.8,105కు చేరింది. ప్రధానంగా లగ్జరీ ఇళ్లకు (విలాసవంతమైన) డిమాండ్ పెరిగినట్టు ఈ నివేదిక తెలిపింది. అలాగే, నిర్మాణ సామగ్రి, కార్మికుల వ్యయాలు కూడా పెరిగినట్టు పేర్కొంది. ''ధరల్లో ఈ స్థాయి పెరుగుదల అన్నది అంతర్గతంగా ఉన్న డిమాండ్‌కు నిదర్శనం. వృద్ధి అవకాశాలకుతోడు సానుకూల కొనుగోళ్ల సెంటిమెంట్ మద్దతుగా నిలిచింది. ఇళ్ల కొనుగోలుకు ఎక్కువ మంది ప్రజలు ప్రభుత్వ సబ్సిడీలపై ఆధారపడి ఉన్న పరిస్థితుల్లో ధరల పెరుగుదల ఒత్తిళ్లు కొనుగోలు సామర్థ్యంపై ప్రభావం చూపిస్తాయన్న ఆందోళనకు దారితీయవచ్చు''అని హౌసింగ్ డాట్‌కామ్ అండ్ ప్రాప్ టైగర్ గ్రూప్ సీఈవో ధ్రువ్ అగర్వాల్ పేర్కొన్నారు. అందుబాటు ధరల ఇళ్లకు ప్రోత్సాహకంగా ప్రభుత్వం విధానపరమైన చర్యలతో ముందుకు రావాలని కోరారు.

పట్టణాల వారీగా పెరుగుదల

- బెంగళూరులో ఇళ్ల ధరలు సగటున 12 శాతం పెరిగాయి. 2024 డిసెంబర్ చివరికి ఎస్ఎఫ్‌టీ ధర రూ.7,536కు చేరింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికం చివరికి ఇది రూ.6,744గా ఉంది.
- చెన్నైలో ఎస్ఎఫ్‌టీ ధర 16 శాతం వృద్ధితో రూ.7,173కు చేరింది.
- అహ్మదాబాద్‌లో 10 శాతం పెరిగాయి. చదరపు అడుగు ధర రూ.4,402కు చేరింది.
- కోల్‌కతాలోనూ 10 శాతం పెరిగి ఎస్ఎఫ్‌టీ ధర రూ.5,633కు చేరింది.
- ముంబై మెట్రోపాలిటన్ రీజియన్‌లో 18% ధరలు పెరిగాయి. ఎస్ఎఫ్‌టీ ధర రూ.10,712 నుంచి ఏడాదిలో రూ.12,600కు చేరింది.
- పుణెలో 16 శాతం పెరిగి ఎస్ఎఫ్‌టీ ధర రూ.7,108కి చేరింది.

దొడ్ల డెయిరీ కొత్త ప్లాంట్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పాలు, పాల ఉత్పత్తుల రంగంలో ఉన్న దొడ్ల డెయిరీ మహారాష్ట్రలో ప్లాంటు నెలకొల్పాలని నిర్ణయించింది. ఇందుకోసం కంపెనీ రూ.280 కోట్లు పెట్టుబడి చేయనుంది. అంతర్గత వనరులు, రుణం ద్వారా ఈ మొత్తాన్ని సమకూర్చనున్నట్టు కంపెనీ ఎండీ దొడ్ల సునీల్ రెడ్డి తెలిపారు. డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో కంపెనీ నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 53.8 శాతం అధికమై రూ.63.6 కోట్లు నమోదైంది. ఎబిటా 15.8 శాతం ఎగసి రూ.95.9 కోట్లను తాకింది. ఎబిటా మార్జిన్ 44.7 బేసిస్ పాయింట్లు తగ్గి 10.6 శాతంగా ఉంది. టర్నోవర్ 20.7 శాతం పెరిగి రూ.901 కోట్లకు చేరుకుంది. క్రితం ముగింపుతో పోలిస్తే దొడ్ల డెయిరీ షేరు ధర బీఎస్ఈలో గురువారం 3.71 శాతం వృద్ధి చెంది రూ.1,088 వద్ద స్థిరపడింది.

ఆగ్మంట్ ప్లాట్‌ఫాంలో డైమండ్ ట్రేడింగ్



ముంబై: ల్యాబ్‌లో తయారు చేసే డైమండ్లలో (ఎల్‌జీడీ) ట్రేడింగ్‌ను తమ డిజిటల్ స్పాట్ ప్లాట్‌ఫాంలో అందుబాటులోకి తెచ్చినట్టు ఆగ్మంట్ గ్రూప్ వెల్లడించింది. దేశవ్యాప్తంగా 5,000 మంది జ్యుయలర్లకు ఇది ఉపయోగపడనున్నట్టు సంస్థ డైరెక్టర్ కేతన్ కొఠారి తెలిపారు. ప్రస్తుతం గనుల్లో నుంచి వెలికితీసిన వజ్రాల ధర ఆధారంగా ఎల్‌జీడీ రేట్లను నిర్ణయించే విధానంలో లోపాలున్నాయని, దీన్ని సరి చేయాలనేది తమ ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

మాల్స్‌లో తగ్గిన రిటైల్ లీజింగ్

- 2024లో 10% తక్కువ నమోదు
- సీబీఆర్ఈ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: షాపింగ్ మాల్స్, హై స్ట్రీట్‌లలో (ప్రముఖ షాపింగ్ ప్రాంతాలు) రిటైల్ స్థలాల లీజింగ్ 2024లో 10 శాతం తగ్గిపోయింది. దేశవ్యాప్తంగా ఎనిమిది నగరాల్లో 64 లక్షల చదరపు అడుగుల లీజింగ్ కార్యకలాపాలు 2024లో నమోదయ్యాయి. హైదరాబాద్, చెన్నై మాత్రం రాణించాయి. ఈ వివరాలను రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సీబీఆర్ఈ వెల్లడించింది. 2023లో ఇవే నగరాల్లో స్థూల రిటైల్ స్పేస్ లీజింగ్ 71 లక్షల చదరపు అడుగులుగా ఉండడం గమనార్హం. ''భారత రిటైల్ స్పేస్ విభాగం 2025లో గణీయమైన వృద్ధిని చూడనుంది. హైదరాబాద్, ఢిల్లీ–ఎన్‌సీఆర్, ముంబై, బెంగళూరులో 50–60 లక్షల చదరపు అడుగుల గ్రేడ్–ఏ మాల్స్ స్థలాలు ఈ ఏడాది వినియోగంలోకి రానున్నాయి''అని సీబీఆర్ఈ ఇండియా చైర్మన్, సీఈవో అన్షుమన్ మ్యాగజిన్ తెలిపారు. మధ్య శ్రేణి ఫ్యాషన్, వ్యాల్యూ ఫ్యాషన్, క్రీడా వస్త్రాలు, జ్యుయలరీ విభాగాల నుంచి బలమైన డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా సైతం మెరుగ్గా ఉంటుందని అంచనా వేశారు. రిటైల్ కేంద్రాలు షాపింగ్, డైనింగ్, వినోదం కలిసిన వినూత్నమైన అనుభవాన్ని అందిస్తూ, వినియోగదారులను ఆకర్షిస్తున్నట్టు తెలిపారు.

పట్టణాల వారీగా లీజింగ్

- హైదరాబాద్ మార్కెట్లో 2024లో రిటైల్ స్పేస్ లీజింగ్ డిమాండ్ 10 లక్షల చదరపు అడుగులకు చేరింది. అంతక్రితం ఏడాది ఇది 7 లక్షల చదరపు అడుగులుగానే ఉంది.
- చెన్నైలోనూ రిటైల్ స్పేస్ లీజింగ్ 6 లక్షల ఎస్ఎఫ్‌టీ నుంచి 7 లక్షల ఎస్ఎఫ్‌టీకి పెరిగింది.
- ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో 2023లో 14 లక్షల చదరపు అడుగుల లీజింగ్ నమోదు కాగా, 2024లో 10 లక్షల ఎస్ఎఫ్‌టీకి పరిమితమైంది.
- బెంగళూరులో పెద్దగా మార్పు లేకుండా 19 లక్షల ఎస్ఎఫ్‌టీ లీజింగ్ లావాదేవీలు జరిగాయి.
- ముంబైలో 10 లక్షల ఎస్ఎఫ్‌టీ నుంచి 8 లక్షల ఎస్ఎఫ్‌టీకి లీజింగ్ తగ్గింది.
- పుణెలోనూ 8 లక్షల చదరపు అడుగుల నుంచి 6 లక్షలకు పరిమితమైంది.
- కోల్‌కతాలో రిటైల్ స్పేస్ లీజింగ్ లక్ష చదరపు అడుగుల నుంచి 2 లక్షలకు పెరిగింది.
- అహ్మదాబాద్‌లో 5 లక్షల నుంచి 4 లక్షల ఎస్ఎఫ్‌టీకి పరిమితమైంది.

క్యూ3 ఫలితాలు

అదానీ ఎంటర్‌ప్రైజెస్‌కు బొగ్గు సెగ

క్యూ3లో లాభం 97% క్షీణత



న్యూఢిల్లీ: బొగ్గు అమ్మకాలు గణనీయంగా పడిపోవడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ (ఏఈఎల్) నికర లాభం ఏకంగా 97 శాతం క్షీణించింది. రూ. 58 కోట్లకు పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో కంపెనీ నికర లాభం రూ. 1,888 కోట్లుగా నమోదైంది. ప్రధాన వినియోగదారయిన విద్యుత్ రంగంలో పునరుత్పాదక వనరుల వాటా పెరిగి బొగ్గుకు డిమాండ్ తగ్గడంతో అమ్మకాల పరిమాణం ఏకంగా 42 శాతం మేర క్షీణించింది. ఇక ఆస్ట్రేలియా కార్యకలాపాలకు సంబంధించి విదేశీ మారకంపరంగా నష్టాలు నమోదు కావడం కూడా తాజా పనితీరుకు కారణమయ్యాయి. సమీక్షాకాలంలో కంపెనీ ఆదాయం 9 శాతం తగ్గి రూ. 22,848 కోట్లకు పరిమితమైంది. మరోవైపు, ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో ఆదాయం 6 శాతం పెరిగి రూ. 72,763 కోట్లకు చేరగా, నికర లాభం 17 శాతం వృద్ధి చెంది రూ. 3,254 కోట్లకు ఎగిసింది.

గురువారం బీఎస్ఈలో ఏఈఎల్ షేరు సుమారు మూడు శాతం క్షీణించి రూ. 2,253 వద్ద క్లోజయ్యింది.

ఎల్అండ్‌టీ లాభం ప్లస్

- ఆర్డర్ల బుక్ సరికొత్త రికార్డ్



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ మౌలిక, ఇంజినీరింగ్ దిగ్గజం ఎల్అండ్‌టీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 14 శాతం ఎగసి రూ. 3,359 కోట్లను తాకింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 2,947 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 17 శాతం పుంజుకుని రూ. 64,668 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 55,128 కోట్ల టర్నోవర్ నమోదైంది. ఈ కాలంలో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 1,16,036 కోట్ల విలువైన ఆర్డర్లు అందుకున్నట్లు కంపెనీ పేర్కొంది. గత క్యూ3తో పోలిస్తే ఇది 53 శాతం వృద్ధి. థర్మల్, రెనెవబుల్ పవర్‌సహా విద్యుత్ ప్రసారం, ప్రెసిషన్ ఇంజినీరింగ్ మినరల్స్, మెటల్స్, హైడ్రోకార్బన్ ఆన్‌షోర్, వాటర్, వాణిజ్య భవనాలు తదితర విభాగాల నుంచి కాంట్రాక్టులు లభించినట్లు వివరించింది. ఆర్డర్లలో 50 శాతానికి సమానమైన రూ. 62,059 కోట్లు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి పొందినట్లు వెల్లడించింది. వెరసి 2024 డిసెంబర్‌కల్లా కంపెనీ మొత్తం ఆర్డర్‌బుక్ విలువ రూ. 5,64,223 కోట్లకు చేరినట్లు తెలియజేసింది. కాంట్రాక్టుల సమయానుగుణ ఎగ్జిక్యూషన్, నిర్వహణ సామర్థ్యం, కస్టమర్లకు అనుగుణమైన సేవల కారణంగా ఆర్డర్‌బుక్‌లో సరికొత్త రికార్డ్‌కు తెరలేచినట్లు ఎల్అండ్‌టీ చైర్మన్, ఎండీ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ పేర్కొన్నారు.

ఎల్అండ్‌టీ షేరు బీఎస్ఈలో 1 శాతం నష్టంతో రూ. 3,420 వద్ద ముగిసింది.

డాబర్ లాభం ఫ్లాట్

రూ. 516 కోట్లు



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం డాబర్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 2 శాతం స్వల్ప వృద్ధితో రూ. 516 కోట్లకు చేరింది. ఆహార ధరల ద్రవ్యోల్బణం, పట్టణ ప్రాంత వినియోగం నీరసించడం ప్రభావం చూపాయి. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 506 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 3 శాతం బలపడి రూ. 3,355 కోట్లను అధిగమించింది. అయితే మొత్తం వ్యయాలు 4 శాతం పెరిగి రూ. 2,826 కోట్లను తాకాయి. కాగా.. ఇతర ఆదాయంతో కలిసి మొత్తం టర్నోవర్ 3 శాతం అధికమై రూ. 3,438 కోట్లను దాటింది.

డాబర్ ఇండియా షేరు బీఎస్ఈలో 3 శాతం జంప్‌చేసి రూ. 534 వద్ద ముగిసింది.

అదానీ పోర్ట్స్ లాభం అప్

రూ. 2,518 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ మౌలిక దిగ్గజం అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 14 శాతం ఎగసి రూ. 2,518 కోట్లను అధిగమించింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 2,208 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ.7,427 కోట్ల నుంచి రూ. 8,187 కోట్లకు బలపడింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 4,588 కోట్ల నుంచి రూ. 5,191 కోట్లకు పెరిగాయి. ఈ కాలంలో టెక్నాలజీ ప్లాట్‌ఫామ్.. ట్రకింగ్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్(టీఎంఎస్)ను ప్రారంభించినట్లు కంపెనీ పేర్కొంది. తద్వారా కస్టమర్లకు అనుగుణంగా సరఫరా చైన్‌ను మరింత క్రమబద్ధీకరించినట్లు తెలియజేసింది. పలు పరీక్షల తదుపరి విజింజం పోర్ట్ వాణిజ్య ప్రాతిపదికన కార్యకలాపాలు ప్రారంభించినట్లు వెల్లడించింది.

అదానీ పోర్ట్స్ షేరు బీఎస్ఈలో 2 శాతం నష్టంతో రూ. 1,077 వద్ద ముగిసింది.

కోరమాండల్ మధ్యంతర డివిడెండ్ రూ.6



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎరువుల తయారీలో ఉన్న కోరమాండల్ ఇంటర్నేషనల్ 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.6 మధ్యంతర డివిడెండ్ చెల్లించాలని బోర్డు నిర్ణయించింది. నెదర్లాండ్స్‌లో అనుబంధ కంపెనీ ఏర్పాటు చేయాలని నిశ్చయించింది. అలాగే టెక్నికల్ పెస్టిసైడ్ తయారీ సామర్థ్యం పెంచాలని నిర్ణయించింది. డిసెంబర్ త్రైమాసికం స్టాండలోన్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 116 శాతం దూసుకెళ్లి రూ.525 కోట్లు సాధించింది. ఎబిటా 103 శాతం అధికమై రూ.727 కోట్లు నమోదైంది. టర్నోవర్ 28% పెరిగి రూ.7,038 కోట్లకు ఎగసింది. క్రితం ముగింపుతో పోలిస్తే కోరమాండల్ షేరు ధర బీఎస్ఈలో గురువారం 1.73 శాతం వృద్ధి చెంది రూ.1,825.35 వద్ద స్థిరపడింది.

పోకర్ణ లాభం 137 శాతం జూమ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గ్రానైట్స్, క్వార్ట్స్ వ్యాపారంలో ఉన్న పోకర్ణ డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 137 % పెరిగి రూ.50.7 కోట్లు సాధించింది. టర్నోవర్ రూ.166 కోట్ల నుంచి రూ. 234 కోట్లకు ఎగసింది. క్రితం ముగింపుతో పోలిస్తే పోకర్ణ షేరు ధర బీఎస్ఈలో గురువారం 5.75% వృద్ధి చెంది రూ.1,132 వద్ద స్థిరపడింది.

గెయిల్ లాభం హైజంప్

- షేరుకి రూ. 6.5 డివిడెండ్



న్యూఢిల్లీ: ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం గెయిల్(ఇండియా) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 36 శాతం జంప్‌చేసి రూ. 3,867 కోట్లను అధిగమించింది. విదేశీ ఎల్ఎన్‌జీ సరఫరాదారు నుంచి నష్టపరిహారం అందడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 2,843 కోట్లు మాత్రమే ఆర్జించింది. వాటాదారులకు షేరుకి రూ. 6.5 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం దాదాపు యథాతథంగా రూ. 34,958 కోట్లుగా నమోదైంది. ఈ కాలంలో రష్యన్ ఇంధన దిగ్గజం గాజ్‌ప్రామ్ నుంచి రూ. 2,440 కోట్ల అనుకోని ఆదాయం లభించినట్లు కంపెనీ వెల్లడించింది.

పెరిగిన కల్యాణ్ జ్యుయలర్స్ లాభం



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో కల్యాణ్ జ్యుయలర్స్ నికర లాభం 21 శాతం పెరిగి రూ. 219 కోట్లుగా నమోదైంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో లాభం రూ. 180 కోట్లు. ఇక సమీక్షాకాలంలో మొత్తం ఆదాయం రూ. 5,243 కోట్ల నుంచి రూ. 7,318 కోట్లకు చేరింది. పసిడి ధరల్లో హెచ్చుతగ్గులు నెలకొన్నప్పటికీ ప్రస్తుత త్రైమాసికం మెరుగ్గానే ప్రారంభమైందని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేశ్ కల్యాణరామన్ తెలిపారు. పెళ్లిళ్ల సీజన్ బాగుంటుందని, పూర్తి ఆర్థిక సంవత్సరం పటిష్టమైన పనితీరుతోనే ముగించగలమని భావిస్తున్నామని ఆయన వివరించారు. ఈ త్రైమాసికంలో దేశీయంగా 30 కల్యాణ్ షోరూంలు, 15 క్యాండియర్ షోరూమ్‌లను ప్రారంభించే ప్రణాళికలు యథాప్రకారంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

శార్దుల్ 'హ్యాట్రిక్'

మేఘాలయతో మ్యాచ్‌పై పట్టు బిగించిన ముంబై

మెరిసిన రహానే, పుజారా ● నిరాశ పరిచిన రాహుల్ ● రంజీ ట్రోఫీ

ముంబై: దేశవాళీల్లో నిలకడగా రాణిస్తున్న భారత పేస్ ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్ 'హ్యాట్రిక్'తో సత్తా చాటాడు. ఫలితంగా రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'ఎ'లో భాగంగా మేఘాలయతో జరుగుతున్న మ్యాచ్‌పై ముంబై పట్టు బిగించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన మేఘాలయ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 24.3 ఓవర్లలో 86 పరుగులకు ఆలౌటైంది. ముంబై పేసర్లు శార్దుల్ ఠాకూర్, మోహిత్ ధాటికి మేఘాలయ బ్యాటర్లు క్రీజులో నిలవలేక పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఇన్నింగ్స్ నాలుగో బంతికే నిశాంత్ చక్రవర్తి (0)ని అవుట్ చేసి హెచ్చరికలు పంపిన శార్దుల్... మూడో ఓవర్‌లో రంజీ ట్రోఫీలో ఐదో 'హ్యాట్రిక్' నమోదు చేసుకున్నాడు. నాలుగో బంతికి బాలచందర్ అనిరుధ్ (0)ను క్లీన్ బౌల్డ్ చేసిన శార్దుల్... ఆ తర్వాత వరుసగా సుమిత్ కుమార్ (0), జస్కీరత్ సింగ్ సచ్‌దేవ్ (0)ను పెవిలియన్‌కు పంపాడు. దీంతో ఒక దశలో మేఘాలయ 2 పరుగులు మాత్రమే చేసి 6 వికెట్లు కోల్పోయింది. పదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన హిమన్ (28) టాప్ స్కోరర్. ముంబై బౌలర్లలో శార్దుల్ 4, మోహిత్, 3, సిల్వెస్టర్ డిసౌజా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ముంబై... గురువారం ఆట ముగిసే సమయానికి 59 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. కెప్టెన్ అజింక్య రహానే (152 బంతుల్లో 83 బ్యాటింగ్; 9 ఫోర్లు, 1 సిక్స్), సిద్ధేశ్ లాడ్ (155 బంతుల్లో 89 బ్యాటింగ్; 11 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్ధశతకాలతో ఆకట్టుకున్నారు. వీరిద్దరూ అబేధ్యమైన మూడో వికెట్‌కు 170 పరుగులు జోడించారు. చేతిలో 8 వికెట్లు ఉన్న ముంబై జట్టు... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ కంటే 127 పరుగుల ఆధిక్యంలో ఉంది.



రాహుల్

కేఎల్ రాహుల్ విఫలం

నాకౌట్‌కు చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో కర్ణాటక స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ (37 బంతుల్లో 26; 4 ఫోర్లు) నిరాశ పరిచాడు. అయినప్పటికీ ఎలైట్ గ్రూప్ 'సి'లో భాగంగా హరియాణాతో జరుగుతున్న పోరులో కర్ణాటక జట్టు మెరుగైన ప్రదర్శన చేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 89 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 267 పరుగులు చేసింది. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (149 బంతుల్లో 91; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలవగా... దేవదత్ పడిక్కల్ (43), రవిచంద్రన్ స్మరణ్ (35) ఫర్వాలేదనిపించారు. ఐదేళ్ల తర్వాత రంజీ మ్యాచ్ ఆడిన రాహుల్ ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. హరియాణా బౌలర్లలో అన్షుల్ కంబోజ్, అనూజ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. కృష్ణన్ శ్రీజిత్ (18 బ్యాటింగ్), యశోవర్ధన్ ప్రతాప్ (27 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

పుజారా 95 బ్యాటింగ్

టీమిండియా సీనియర్ బ్యాటర్ చతేశ్వర్ పుజారా (162 బంతుల్లో 95 బ్యాటింగ్; 9 ఫోర్లు) అజేయ అర్ధ శతకంతో ఆకట్టుకోవడంతో సౌరాష్ట్ర భారీ స్కోరు దిశగా సాగుతోంది. రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'డి'లో భాగంగా అస్సాంతో జరుగుతున్న మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసేసరికి సౌరాష్ట్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 361 పరుగులు చేసింది. ఓపెనర్ హర్విక్ దేశాయ్ (181 బంతుల్లో 130; 17 ఫోర్లు, 1 సిక్స్) 'శత'క్కొట్టగా... చిరాగ్ జానీ (80; 14 ఫోర్లు), షెల్డన్ జాక్సన్ (48; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. గ్రూప్‌లో భాగంగా 6 మ్యాచ్‌లాడిన సౌరాష్ట్ర 2 విజయాలు, 2 పరాజయాలు, 2 'డ్రా'లతో 18 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో మూడో స్థానంలో కొనసాగుతోంది. నాకౌట్‌కు చేరాలంటే ఈ మ్యాచ్‌లో భారీ విజయం సాధించడంతో పాటు ఇతర మ్యాచ్‌ల ఫలితాలు అనుకూలించాల్సిన అవసరముంది.



శార్దుల్

విజయ్ మాయాజాలం

- ఐదు వికెట్లు పడగొట్టిన ఆంధ్ర ఆఫ్‌స్పిన్నర్
- రాజస్తాన్ తొలి ఇన్నింగ్స్ 258 ఆలౌట్
- ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ 49/0

సాక్షి, విజయనగరం: ప్రతిష్టాత్మక దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీలో ఆంధ్ర ఆఫ్‌స్పిన్నర్ త్రిపురణ విజయ్ (5/62) విజృంభించాడు. ఫలితంగా ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా రాజస్తాన్‌తో జరుగుతున్న ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు మెరుగైన ప్రదర్శన కనబరిచింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్తాన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 79.5 ఓవర్లలో 258 పరుగుల వద్ద ఆలౌటైంది. అభిజీత్ తోమర్ (188 బంతుల్లో 94; 11 ఫోర్లు, 1 సిక్స్) శతకం చేజార్చుకోగా... మానవ్ సుతార్ (104 బంతుల్లో 54; 8 ఫోర్లు) హాఫ్‌సెంచరీతో ఆకట్టుకున్నాడు. కెప్టెన్ మహిపాల్ లోమ్రర్ (2)తో పాటు కార్తీక్ శర (13), సమర్పిత్ జోషి (8) విఫలమయ్యారు. ఆంధ్ర బౌలర్లలో విజయ్ 5 వికెట్లు పడగొట్టగా... సత్యనారాయణ రాజు రెండు వికెట్లు తీశాడు. పృథ్వీ రాజ్, శశికాంత్, వినయ్ కుమార్ తలా ఒక వికెట్ ఖాతాలో వేసుకున్నారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు 8 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 49 పరుగులు చేసింది. ఓపెనర్లు వంశీకృష్ణ (23 బంతుల్లో 18 బ్యాటింగ్; 3 ఫోర్లు), శ్రీకర్ భరత్ (23 బంతుల్లో 26 బ్యాటింగ్; 5 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. చేతిలో 10 వికెట్లు ఉన్న ఆంధ్ర జట్టు... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 209 పరుగులు వెనుకబడి ఉంది.



క్వార్టర్స్‌లో శ్రీకాంత్, శంకర్



శ్రీకాంత్

బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్-300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ విభాగం భారత ప్లేయర్లు కిడాంబి శ్రీకాంత్, శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. మహిళల సింగిల్స్ విభాగంలో రక్షిత శ్రీ క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో శ్రీకాంత్ 21-19, 21-15తో జేసన్ గుణవాన్ (హాంకాంగ్)పై, శంకర్ 9-21, 21-10, 21-17తో చికో ద్వి వర్డోయో (ఇండోనేసియా)పై, రక్షిత శ్రీ 21-15, 21-12తో క్లా టాంగ్ టుంగ్ (చైనీస్ తైపీ)పై గెలుపొందారు. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో గద్దె రుత్విక శివాని-రోహన్ కపూర్ (భారత్) ద్వయం 19-21, 15-21తో రచాపోల్-నాథమోన్ (థాయ్‌లాండ్) జంట చేతిలో ఓడిపోయింది. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సాయిప్రతీక్-పృథ్వీ కృష్ణమూర్తి రాయ్ (భారత్) జోడీ 14-21, 21-10, 21-9తో విచాయాపోంగ్-నారుసెట్ (థాయ్‌లాండ్) ద్వయంపై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది.

రాణించిన రక్షణ్, అనికేత్

- విదర్భ తొలి ఇన్నింగ్స్ 190 ఆలౌట్
- హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ 90/2
- తన్మయ్ అజేయ అర్ధశతకం

నాగ్‌పూర్: దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీలో హైదరాబాద్ బౌలర్లు మెరుగైన ప్రదర్శన కనబర్చారు. ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా గురువారం విదర్భతో ప్రారంభమైన పోరులో మన బౌలర్లు సమష్టిగా సత్తా చాటారు. ఫలితంగా టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన విదర్భ... తొలి ఇన్నింగ్స్‌లో 55.5 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌటైంది. హర్ష్ దూబే (46 బంతుల్లో 65; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధశతకం సాధించగా... ఫుల్ ఫామ్‌లో ఉన్న సీనియర్ బ్యాటర్ కరుణ్ నాయర్ (3), ధ్రువ్ షోరే (0), అథర్వ (7), దానిశ్ (13), యశ్ రాథోడ్ (16) విఫలమయ్యారు. హైదరాబాద్ బౌలర్లలో రక్షణ్ రెడ్డి, అనికేత్ రెడ్డి చెరో మూడు వికెట్లు ఖాతాలో వేసుకోగా... కెప్టెన్ చామా మిలింద్ 2 వికెట్లు తీశాడు. చాన్నాళ్ల తర్వాత దేశవాళీ మ్యాచ్ ఆడిన టీమిండియా పేసర్ మొహమ్మద్ సిరాజ్ 18 ఓవర్లు బౌలింగ్ చేసి 47 పరుగులిచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన హైదరాబాద్ గురువారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 29 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 90 పరుగులు చేసింది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (86 బంతుల్లో 53 బ్యాటింగ్; 7 ఫోర్లు) హాఫ్‌సెంచరీతో రాణించాడు. అభిరత్ రెడ్డి (20), రాహుల్ రాధేశ్ (12) ఔట్ కాగా... తన్మయ్‌తో పాటు హిమతేజ (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. చేతిలో 8 వికెట్లు ఉన్న హైదరాబాద్ జట్టు... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 100 పరుగులు వెనుకబడి ఉంది.



రక్షణ్



అనికేత్



నర్మద పసిడి గురి

డెహ్రాడూన్: జాతీయ క్రీడల్లో భాగంగా గురువారం జరిగిన షూటింగ్ ఈవెంట్‌లో తమిళనాడు షూటర్ నర్మద నితిన్‌రాజు స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో నర్మద 254.4 పాయింట్లు స్కోరు చేసి కొత్త జాతీయ రికార్డు నెలకొల్పడంతోపాటు పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. 2019 ప్రపంచకప్‌లో 252.9 పాయింట్లతో అపూర్వీ చండేలా నెలకొల్పిన జాతీయ రికార్డును నర్మద సవరించింది. మహారాష్ట్రకు చెందిన ఆర్య బోర్సే (252.5 పాయింట్లు) రజతం... హరియాణాకు చెందిన రమిత జిందాల్ (230.4 పాయింంట్లు) కాంస్య పతకం గెల్చుకున్నారు. రెండో రోజు క్రీడలు ముగిశాక కర్ణాటక 7 స్వర్ణాలు, 3 రజతాలు, 2 కాంస్యాలతో కలిపి 12 పతకాలతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

హర్మన్‌ప్రీత్ సారథ్యంలో...

- ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ బరిలో భారత్
- ఫిబ్రవరి 15 నుంచి 25 వరకు భువనేశ్వర్‌లో మ్యాచ్‌లు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) పురుషుల ప్రొ లీగ్‌లో పాల్గొనే భారత ప్రాబబుల్స్‌ను ప్రకటించారు. ప్రస్తుత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోనే భారత బృందం తొలి అంచె పోటీల్లో బరిలోకి దిగనుంది. హాకీ ఇండియా లీగ్, జూనియర్ టోర్నీలలో ఆయా ఆటగాళ్లు కనబరిచిన ప్రదర్శన ఆధారంగా మొత్తం 32 మందిని ఈ టోర్నీ కోసం ఎంపిక చేశారు. ఫిబ్రవరి 15 నుంచి 25వ తేదీ వరకు జరిగే మ్యాచ్‌ల్లో స్పెయిన్, జర్మనీ, ఐర్లాండ్, ఇంగ్లండ్ జట్లతో భారత జట్టు రెండేసి మ్యాచ్‌లు ఆడుతుంది. 2023-2024 ప్రొ లీగ్ సీజన్‌లో భారత జట్టు ఏడో స్థానంలో నిలిచింది.

భారత హాకీ ప్రాబబుల్స్: కృషన్ బహదూర్ పాఠక్, సూరజ్ కర్కెరా, ప్రిన్స్‌దీప్ సింగ్ (గోల్‌కీపర్లు). **డిఫెండర్లు:** హర్మన్‌ప్రీత్ సింగ్, జర్మన్‌ప్రీత్ సింగ్, అమిత్ రోహిదాస్, సుమిత్, సంజయ్, జుగ్‌రాజ్ సింగ్, నీలం సంజీప్ జెస్, వరుణ్ కుమార్, యశ్‌దీప్ సివాచ్. **మిడ్‌ఫీల్డర్లు:** రాజ్‌కుమార్ పాల్, షంషేర్ సింగ్, మన్‌ప్రీత్ సింగ్, హార్దిక్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్, నీలకంఠ శర్మ, రబిచంద్ర సింగ్, రాజిందర్ సింగ్. **ఫార్వర్డ్స్:** అభిషేక్, సుఖ్‌జీత్ సింగ్, లలిత్ కుమార్ ఉపాధ్యాయ్, మన్‌దీప్ సింగ్, గుర్జంత్ సింగ్, అంగద్‌బీర్ సింగ్, బాబా సింగ్ ధామి, శిలానంద్ లాక్రా, దిల్‌ప్రీత్ సింగ్, అరిజిత్ సింగ్ హుండల్, ఉత్తమ్ సింగ్, అర్ష్‌దీప్ సింగ్.



బాక్సింగ్‌కు మనోజ్ వీడ్కోలు

న్యూఢిల్లీ: కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ పతక విజేత... 'డబుల్ ఒలింపియన్' భారత స్టార్ మనోజ్ కుమార్ బాక్సింగ్ నుంచి వీడ్కోలు తీసుకున్నాడు. త్వరలో కోచ్ రూపంలో ముందుకు వస్తానని హరియాణాకు చెందిన 39 ఏళ్ల మనోజ్ గురువారం ప్రకటించాడు. 2010 ఢిల్లీ కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణ పతకం (64 కేజీలు) గెలిచిన మనోజ్... 2018 గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్య పతకం (69 కేజీలు) సాధించాడు. 2012 లండన్ ఒలింపిక్స్‌లో, 2016 రియో ఒలింపిక్స్‌లో పోటీపడ్డ మనోజ్ ప్రిక్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించాడు. 2007, 2013 ఆసియా చాంపియన్‌షిప్‌లలో కాంస్య పతకాలు నెగ్గిన మనోజ్ 2016 దక్షిణాసియా క్రీడల్లో పసిడి పతకం సొంతం చేసుకున్నాడు.



ఖ్వాజా డబుల్ సెంచరీ

- జోస్ ఇంగ్లిస్ రికార్డు శతకం
- ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 654/6 డిక్లేర్డ్
- శ్రీలంక తొలి ఇన్నింగ్స్ 44/3

గాలె: బ్యాటర్లంతా కలిసికట్టుగా కదం తొక్కడంతో... శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియా జట్టు కొండంత స్కోరు చేసింది. స్పిన్‌కు సహకరిస్తున్న పిచ్‌పై లంక స్పిన్నర్లను సమర్థవంతగా ఎదుర్కొన్న కంగారూలు పరుగుల జాతర చేసుకున్నారు. ఓవర్‌నైట్ స్కోరు 330/2తో గురువారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 154 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 654 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. ఆసియా పిచ్‌లపై ఆసీస్‌కు ఇదే అత్యధిక స్కోరు. ఓపెనర్ ఉస్మాన్ ఖ్వాజా (352 బంతుల్లో 232; 16 ఫోర్లు, 1 సిక్స్) కెరీర్‌లో తొలి డబుల్ సెంచరీ నమోదు చేసుకోగా... అరంగేట్ర మ్యాచ్ ఆడుతున్న జోస్ ఇంగ్లిస్ (94 బంతుల్లో 102; 10 ఫోర్లు, 1 సిక్స్) 'శత'క్కొట్టాడు. స్టీవ్ స్మిత్ (251 బంతుల్లో 141; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రితం రోజు స్కోరుకు మరో 37 పరుగులు జోడించి వెనుదిరిగాడు. సొంతగడ్డపై లంక బౌలర్లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోగా... ఆసీస్ ప్లేయర్లు ఆడుతూ పాడుతూ పరుగులు రాబట్టారు. ఖ్వాజాతో కలిసి మూడో వికెట్‌కు 266 పరుగులు జోడించిన తర్వాత స్మిత్ అవుట్ కాగా... ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇంగ్లిస్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఆడుతున్నది తొలి టెస్టే అయినా వన్డే తరహాలో ధనాధన్ షాట్లు ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఈ క్రమంలో శ్రీలంకలో ద్విశతకం నమోదు చేసుకున్న తొలి ఆసీస్ బ్యాటర్‌గా ఖ్వాజా రికార్డుల్లోకెక్కాడు. కాసేపటికే ఇంగ్లిస్ అరంగేట్ర టెస్టులో వేగవంతమైన శతకం చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. అలెక్స్ కేరీ (46 నాటౌట్) కూడా రాణించడంతో ఆసీస్ భారీ స్కోరు చేయగలిగింది. లంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య, జెఫ్రీ వాండర్సే చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక గురువారం ఆట ముగిసే సమయానికి 15 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 44 పరుగులు చేసింది. ఒషాడో ఫెర్నాండో (7), దిముత్ కరుణరత్నె (7), ఏంజెలో మాథ్యూస్ (7) అవుట్ కాగా... దినేశ్ చండీమల్ (9 బ్యాటింగ్), కమిందు మెండిస్ (13 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఆసీస్ బౌలర్లలో స్టార్క్, కునెమన్, లయన్ తలా ఒక వికెట్ తీశారు. చేతిలో 7 వికెట్లు ఉన్న లంక ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 610 పరుగులు వెనుకబడి ఉంది.



జోస్ ఇంగ్లిస్



ఖ్వాజా

2 అరంగేట్ర టెస్టులో వేగవంతమైన సెంచరీ చేసిన రెండో ప్లేయర్‌గా ఇంగ్లిస్ (90 బంతుల్లో) నిలిచాడు. 2013లో ఆస్ట్రేలియాపై అరంగేట్ర మ్యాచ్‌లో 85 బంతుల్లోనే 'శత'క్కొట్టిన భారత ఆటగాడు శిఖర్ ధావన్ అగ్రస్థానంలో ఉన్నాడు. ఆసీస్ తరఫున 1991లో మార్క్‌వా ఇంగ్లండ్‌పై తొలి టెస్టులో 126 బంతుల్లో మూడంకెల స్కోరు అందుకున్నాడు. ఓవరాల్‌గా తొలి టెస్టులో సెంచరీ చేసిన 21వ ఆసీస్ బ్యాటర్‌గా ఇంగ్లిస్ నిలిచాడు. 654/6 ఆసియా పిచ్‌లపై ఆస్ట్రేలియాకు ఇదే అత్యధిక స్కోరు. 1980లో పాకిస్తాన్‌పై ఫైసలాబాద్‌లో ఆసీస్ జట్టు 617 పరుగులు చేసింది.

2 ఆస్ట్రేలియా తరఫున టెస్టుల్లో డబుల్ సెంచరీ చేసిన రెండో పెద్ద వయస్కుడిగా ఖ్వాజా (38 ఏళ్ల 43 రోజులు) గుర్తింపు పొందాడు. ఈ రికార్డు డాన్ బ్రాడ్‌మన్ (39 ఏళ్ల 149 రోజులు; భారత్‌పై 1948లో 201 పరుగులు) పేరిట ఉంది.

3 శ్రీలంక తరఫున ముగ్గురు బౌలర్లు ప్రభాత్ జయసూర్య (3/193), నిశాన్ పెరిస్ (0/189), జెఫ్రీ వాండర్సే (3/182) ఇన్నింగ్స్‌లో 150 అంతకంటే పరుగులు సమర్పించుకున్నారు. శ్రీలంక టెస్టు చరిత్రలో ఒకే ఇన్నింగ్స్‌లో ముగ్గురు బౌలర్లు 150 కంటే ఎక్కువ పరుగులు ఇచ్చుకోవడం ఇదే ప్రథమం.



ఢిల్లీలో నురగతో నిండిన యమునా నదిని పరిశీలిస్తున్న రాహుల్ గాంధీ

యమునలో స్నానమెప్పుడు చేస్తారు

ఢిల్లీ ఎదురుచూస్తోంది • కేజ్రీవాల్‌కు రాహుల్ ప్రశ్న

న్యూఢిల్లీ: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఢిల్లీ రాజకీయాలు యమునా నది కాలుష్యం చుట్టూ తిరుగుతున్నాయి. రాహుల్ గాంధీ గురువారం యమునా నదిలో విహరిస్తున్న వీడియోను విడుదల చేసి.. ఈ మురికి కాసారంలో ఎప్పుడు స్నానం చేస్తారని అరవింద్ కేజ్రీవాల్‌కు సవాల్ విసిరారు. యమునా కాలుష్యం ప్రధాని నరేంద్ర మోదీ, కేజ్రీవాల్‌ల నిర్లక్ష్యం, అవినీతి ఫలితమేనని రాహుల్ ఆరోపించారు. రాహుల్ బుధవారం యమునా నదిలో విహరించి.. నది దుస్థితిని వీడియో తీశారు. 'నాలాగా మీరు ఢిల్లీ వాసులైనట్లయితే యమునా నది పరిస్థితిని చూసి తీవ్రంగా విచారిస్తూ ఉంటారు. బుధవారం ఉదయం నేను యమునా నదికి వెళ్లాను. స్థానికులు, పడవలు నడిపేవాళ్లు, ఉద్యమకారులతో మాట్లాడాను. యమునా నదిలో ఎటు చూసినా చెత్తే. మురికినీళ్లే. దుర్వాసన వెదజల్లుతోంది. నీటి శుద్ధి తర్వాత వ్యర్థాలను తిరిగి యమునలోనే వదిలేస్తున్నారని పరిశోధకులు చెబుతున్నారు. యమునా నదిలో స్నానమాచరించడానికి గతంలో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చేవాళ్లు. ఇప్పుడు అతికొద్ది మంది మాత్రమే వస్తున్నారు. అదీ తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి'అని రాహుల్ అన్నారు. 'ఢిల్లీలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి యమునను శుద్ధి చేస్తామని కేజ్రీవాల్ శుష్క వాగ్దానాలు చేస్తున్నారు. నేను యమునా నదిలో మునక వేస్తాను లేదంటే మాకు ఓటు వేయకండి అంటూ సుదీర్ఘ ఉపన్యాసాలిస్తున్నారు. ఇప్పుడు యమునా నీటిని ఒక సీసాలో తీసుకొని ఆరోపణలు, ప్రత్యారోపణలకు దిగుతున్నారు. ఇది యమునా నదిని అవమానించడమే కాదు.. ఢిల్లీ ప్రజలను అపహాస్యం చేయడమే'అని రాహుల్ విమర్శించారు. 'కేజ్రీవాల్ జీ 2025 వచ్చింది. మీరెప్పుడు యమునా నదిలో మునక వేస్తారు. ఢిల్లీ ఎదురుచూస్తోంది'అని రాహుల్ ప్రశ్నించారు. యమున శుద్ధి పేరిట డబ్బులు మూటగట్టుకున్నారని ఆరోపించారు.

...ఆ ఒక్కటి తప్ప!

చైనా విధానాలు, వివాదాలు, సంఘర్షణలను మాత్రం ప్రస్తావించని డీప్‌సీక్

- డీప్‌సీక్ చాట్‌బాట్‌పై చైనా నియంత్రణ
- చైనా విధానాలకు తగ్గట్లు సమాధానాలిస్తున్న ఏఐ
- చైనా వ్యతిరేక అంశాలను వెల్లడించని చాట్‌బాట్



చైనాలో అంకుర సంస్థకు చెందిన కృత్రిమ మేథ మోడల్ ఏఐ డీప్‌సీక్ ఇప్పుడు చాట్‌జీపీటీ, జెమినీ వంటి దిగ్గజ ఏఐల ఆధిపత్యాన్ని కూలదోస్తూ సంచలనం సృష్టిస్తోంది. అయితే ఈ కృత్రిమ మేథ చాట్‌బాట్ పారదర్శకత మీద విమర్శలు వెల్లువెత్తడం గమనార్హం. డీప్‌సీక్ సంస్థ వారి కొత్తరకం అధునాతన చాట్‌బాట్ ఆర్1 మీద చైనా కమ్యూనిస్టు పార్టీ సెన్సార్‌షిప్, సమాచార నియంత్రణ ఉన్నట్లు ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ప్రపంచదేశాల వినియోగదారులు ఈ చాట్‌బాట్‌ను అడిగే ప్రశ్నలకు ఇది ఇస్తున్న సమాధానాలే ఇందుకు ప్రబల నిదర్శనం. ఏఐ రేసులో ఎవరు ముందంజలో ఉన్నారు?. ట్రంప్ అధికారంలోకి వచ్చాక శ్వేతసౌధం నుంచి ఇప్పుడు వచ్చిన తాజా కార్యనిర్వాహక ఉత్తర్వు ఏంటి? ఏదైనా చక్కటి జోక్ చెప్పు అంటూ ఎలాంటి ప్రశ్నలు అడిగినా రెప్పపాటు వ్యవధిలో టకటకా సమాధానాలు ఇస్తున్న డీప్‌సీక్ చాట్‌బాట్.. చైనా అంతర్గత విషయాల గురించి మాత్రం సారీ అంటోంది. సమాధానం చెప్పకుండా దాటవేస్తోంది.

తియానన్మెన్ స్క్వేర్ ప్రశ్న ఒక ఉదాహరణ

చాట్‌బాట్ సమాధానాల దాటవేతకు వినియోగదారులు ఒక చక్కటి ఉదాహరణను పేర్కొన్నారు. 1989 జూన్ నాలుగో తేదీన బీజింగ్‌లోని తియానన్మెన్ స్క్వేర్‌లో ఆందోళనాకారులపై ప్రభుత్వ అణచివేత కారణంగా వేలాది మరణించారు. ఇదే విషయంపై ప్రముఖ చైనీస్ ఆన్‌లైన్ సెర్చ్ ప్లాట్‌ఫామ్ బైదును 1989 జూన్ నాలుగో తేదీన బీజింగ్‌లో ఏం జరిగింది? అని ప్రశ్నిస్తే ''గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం ఆ ఏడాదిలో జూన్ 4 అనేది 155వ రోజు. అదే సంవత్సరం అధికారులు 'విప్లవ వ్యతిరేక అల్లర్లను అణచివేశారు''అని మాత్రమే సమాధానం చెప్పిందిగానీ ఆ వాక్యాల్లో ఎక్కడా కనీసం పేరుకైనా తియానన్‌మెన్ స్క్వేర్ అనే పదాన్ని ప్రస్తావించలేదు. ఇదే ప్రశ్నను ఇప్పుడు డీప్‌సీక్ ఏఐ అసిస్టెంట్ ఆర్1 ను అడిగితే 'ఈ రకమైన ప్రశ్నను ఎలా ఎదుర్కోవాలో ఇంకా నాకు ఖచ్చితంగా తెలియదు'అని సమాధానం చెబుతోంది. ''ఎలా సమాధానం చెప్పాలో తెలియనందుకు క్షమాపణలు''అని ఒక సందేశం ఇస్తోంది. 2019లో హాంకాంగ్‌లో ఏం జరిగింది? అని అడిగినప్పుడు కూడా ఇలాంటి సమాధానమే ఇస్తోంది. ''ఇలాంటివికాకుండా ఇంకేవైనా అడగాలని ఉచిత సలహా ఇస్తోంది. అంతే కాదు చైనా వివాదాస్పద అంశాల గురించి ప్రస్తావించడానికి కూడా ఇష్టపడటం లేదు. భారత్–చైనా సంబంధాలు, చైనా–తైవాన్ సంబంధాలు, ఇతర రాజకీయంగా సున్నితమైన అంశాలపై చర్చించేందుకు నిరాకరిస్తోంది.

స్వదేశీ సమస్యలపై...

వాయవ్య చైనాలోని జిన్జియాంగ్ ప్రావిన్స్‌లో వీగర్ ముస్లింల పట్ల కమ్యూనిస్ట్ చైనా ప్రభుత్వం వ్యవహరించిన తీరు గురించి అడిగినప్పుడు ఈ ప్రాంత సాంస్కృతిక చరిత్రను యథాతథంగా డీప్‌సీక్ యథాతథంగా అందించిందిగానీ అక్కడ నిత్యకృత్యమైన మానవ హక్కుల ఉల్లంఘన ఉదంతాలను మచ్చుకైనా పేర్కొనలేదు. బలవంతంగా కార్మికులుగా మార్చడం, రీ–ఎడ్యుకేషన్ క్యాంపులు, అంతర్జాతీయ ఆంక్షల గురించి అడిగినా ''ఈ ప్రశ్న నా ప్రస్తుత పరిధికి అతీతమైనది''అని సమాధానం మాత్రమే ఇస్తోంది. చాట్‌జీపీటీ, జెమినీ మాత్రం జిన్జియాంగ్ ఘటనలపట్ల అంతర్జాతీయ నివేదికలను వివరంగా అందిస్తున్నాయి. **తైవాన్ గురించి** అడిగితే ''పురాతన కాలం నుంచి తైవాన్ చైనా భూభాగంలో విడదీయరాని భాగంగా ఉంది. దేశాన్ని చీల్చే ఏ ప్రయత్నమైనా విఫలం అవుతుంది''అని చెబుతోంది. అంతేకాదు.. 2019 హాంకాంగ్ నిరసనలను కూడా చాట్‌బాట్ తక్కువ చేసి చూపిస్తోంది. దురుద్దేశాలతో చిన్న చిన్న సమూహాలు ప్రజాస్వామ్యపాలనకు కల్గించిన ఒక అవాంతరంగా నాటి ఉద్యమాన్ని చాట్‌బాట్ వ్యాఖ్యానించింది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ గురించి అడిగినా సరే.. ''నా ప్రస్తుత పరిధికి మించినది''అనే ఒకే సమాధానం ఇస్తోంది. చైనాలో సెన్సార్‌షిప్, వాట్సాప్, ఫేస్‌బుక్ వంటివాటిపై నిషేధం గురించి అడిగినప్పుడు అస్పష్టమైన సమాధానాలనే చాట్‌బాట్ వెల్లడించింది. దక్షిణ చైనా సముద్రంలో వివాదాల గురించి ప్రశ్నిస్తే ''నాన్షా ద్వీపాలు, వాటి సమీప జలాలపై చైనాకు తిరుగులేని సార్వభౌమాధికారం ఉంది''అని తానే ఒక అధికారిక విభాగం అన్నంత స్థాయిలో డీప్‌సీక్ కుండబద్దలు కొట్టిమరీ సమాధానం చెబుతోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

భారత్ చైనా సంబంధాల గురించి..

ఇండో–చైనా యుద్ధం గురించి ప్రశ్నలను అడిగినప్పుడు డీప్‌సీక్ తెలివిగా తప్పుకుంటోంది. యుద్ధానికి కారణాలు, పర్యవసానాల గురించిన చర్చలను జాగ్రత్తగా పక్కదారి పట్టించింది. ఇదే విషయంపై చాట్‌జీపీటీ, జెమినైలను అడిగితే... యుద్ధం ఎలా? ఎందుకు? జరిగిందనే దానిపై ఆధారాలతో చారిత్రాత్మక కథనాలను అందిస్తున్నాయి. భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలను, ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్ గురించి సమాధానమివ్వడానికి డీప్‌సీక్ నిరాకరిస్తోంది. అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో భాగమా? అని అడిగినప్పుడు డీప్‌సీక్.. ''క్షమించండి, ఇది నా ప్రస్తుత పరిధికి అతీతమైన ప్రశ్న. మనం ఇంకేదైనా మాట్లాడుకుందాం''అని సమాధానమిస్తోంది. అరుణాచల్ ప్రదేశ్‌ను చైనా తమ దక్షిణ టిబెట్ భూభాగంగా భావిస్తోంది. ఇలాంటి చైనా విధానపర నిర్ణయాల్లో తలదూర్చే సాహసం ఈ ఏఐలు చేయట్లేదని అర్థమవుతోంది. అరుణాచల్ ప్రదేశ్‌కు చైనా 'జాంగ్నాన్'అని పేరు కూడా పెట్టింది. ఈ వాదనలపై భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తుండటం తెల్సిందే. లద్దాఖ్‌లోని కొన్ని ప్రాంతాలు కూడా తమవేనని చైనా చాన్నాళ్లుగా వాదిస్తోంది. తూర్పు లద్దాఖ్‌లోని అక్సాయ్ చిన్ ప్రాంతాన్ని తమ దేశంలో భాగంగా చూపిస్తూ కొత్తగా 'ప్రామాణిక మ్యాప్'ను సైతం 2023లో చైనా విడుదల చేసింది. ఈ మ్యాప్‌ను భారత విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ తోసిపుచ్చారు. అయితే, అక్సాయ్ చిన్ గురించి డీప్‌సీక్‌ను అడిగినప్పుడు తన పరిధికి అతీతమైందని సమాధానం ఇస్తోంది. ఇక కశ్మీర్ గురించి ప్రశ్నిస్తే.. 'ఇది భారత్, పాకిస్తాన్‌ల మధ్య చారిత్రక, రాజకీయ, ప్రాదేశిక వివాదాలతో కూడిన సంక్లిష్టమైన, సున్నితమైన అంశం. ఐక్యరాజ్యసమితి చార్టర్, సంబంధిత భద్రతా మండలి తీర్మానాలు, ద్వైపాక్షిక ఒప్పందాలకు అనుగుణంగా చర్చల ద్వారా, శాంతియుత మార్గాల ద్వారా వివాదాల పరిష్కారానికి తాము మద్దతిస్తామని చైనా చెబుతోంది'అని సుదీర్ఘ సమాధానాన్ని ఇచ్చింది.

దలైలామా, టిబెట్ గురించి...

డీప్‌సీక్‌ను దలైలామా గురించి అడిగితే.. టిబెటన్ బౌద్ధమతంలో గణనీయమైన చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యత కలిగిన వ్యక్తిగా అభివర్ణించింది. ఇక టిబెట్.. పురాతన కాలం నుంచి చైనాలో అంతర్భాగంగా ఉందని చెబుతోంది. ఇదే విషయంపై చాట్ జీపీటీ, జెమినీలను అడిగితే చైనా వైఖరిని అంగీకరిస్తూనే.. టిబెట్ స్వయంప్రతిపత్తి, 1959 నుంచి భారతదేశంలో దలైలామా ప్రవాస జీవితం గురించి కూడా ప్రస్తావిస్తున్నాయి.

ఎన్‌జీఎల్‌వీ తయారీకి సిద్ధమవుతున్న ఇస్రో

రూ. 3,986 కోట్లతో మూడో ప్రయోగవేదిక..

- 2030 నాటికి ఎన్‌జీఎల్‌వీ వెహికల్‌తో మొదటి ప్రయోగాత్మక ప్రయోగం...
- ఎన్‌జీఎల్‌వీ రాకెట్‌తోనే మ్యాన్ ఆన్ ద మూన్ ప్రయోగం

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) భవిష్యత్తులో అతిపెద్ద ప్రయోగాలను దృష్టిలో వుంచుకుని ఒక భారీ రాకెట్ తయారు చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈ రాకెట్‌కు న్యూ జనరేషన్ లాంచింగ్ వెహికల్ (ఎన్‌జీఎల్‌వీ) అని నామకరణం కూడా చేశారు. ఇస్రో మొదటినాళ్లలో చేపట్టిన రోహిణి సౌండింగ్ రాకెట్‌ల ప్రయోగాల తరువాత 40 కిలోలు నుంచి 5,000 కిలోలు ఉపగ్రహాలను మోసుకెళ్లే ఎస్ఎల్‌వీ, ఏఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ, ఎల్‌వీఎం03, ఎస్ఎస్ఎల్‌వీ అనే ఆరు రకాల రాకెట్లును అభివృద్ధి చేసింది. భవిష్యత్తులో అంటే 2040 నాటికి మానవుడ్ని అంతరిక్షంలోకి తీసుకెళ్లి తిరిగి తీసుకొచ్చే ప్రయోగంతో పాటు చంద్రుడిపై మానవుడ్ని తీసుకెళ్లి తిరిగి తీసుకొచ్చే ప్రయోగాన్ని కూడా చేపట్టాలని ఇస్రో భావిస్తోంది. వీటితో పాటు అత్యంత బరువు కలిగిన కమ్యూనికేషన్ ఉపగ్రహాలను జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి (జీటీఓ) పంపేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో న్యూ జనరేషన్ లాంచింగ్ వెహికల్ 20 నుంచి 30 టన్నుల బరువు కలిగిన కమ్యూనికేషన్ ఉపగ్రహాలను భూమికి దగ్గరగా వున్న లియో ఆర్బిట్‌లోకి, 10 వేలు కిలోలు బరువు కలిగిన ఉపగ్రహాలను జీటీఓ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టగలిగిన సామర్థ్యాన్ని కలిగి వుంటుంది. అయితే దీనికి సంబంధించి 2008 డిసెంబర్ 22న రూ.1,798 కోట్లు అంచనాలతో ప్రణాళికను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఈ నిధులతో సెమీ క్రయోజనిక్ దశను అభివృద్ధి చేయడంతో పాటు రాకెట్‌కు సంబంధించిన పరికరాలను సాంకేతికంగా రూపొందించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. ఎన్‌జీఎల్‌వీ రాకెట్ ప్రయోగానికి ఇప్పుడున్న ప్రయోగవేదికల సామర్థ్యం సరిపోదని మూడో ప్రయోగవేదిక నిర్మాణానికి కేంద్ర సైంటిఫిక్ విభాగం వారు మంత్రివర్గ సమావేశంలో రూ. 3,986 కోట్లు మంజూరు చేశారు. షార్ కేంద్రంలో మూడో ప్రయోగవేదిక నిర్మాణానికి స్థలం ఎంపిక కూడా జరిగింది. ప్రయోగవేదికతో పాటు ఎన్‌జీఎల్‌వీ రాకెట్‌ను కూడా రూపొందించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. త్వరలోనే ప్రయోగవేదిక నిర్మాణానికి భూమిపూజ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

న్యూ జనరేషన్ లాంచింగ్ వెహికల్ (ఎన్‌జీఎల్‌వీ) వివరాలు...

- ఎన్‌జీఎల్‌వీ రాకెట్ ఎత్తు 75 మీటర్లు.
- రాకెట్ వెడల్పు 5 మీటర్లు.
- ప్రయోగ సమయంలో శాటిలైట్ లేకుండా రాకెట్ బరువు మాత్రమే 1,000 టన్నులు వుంటుంది.
- మూడు దశలతోనే రాకెట్‌ను రూపొందిస్తున్నారు.
- పీఎస్ఎల్‌వీ ఎక్సెల్ తరహాలో ఎన్‌జీఎల్‌వీ రాకెట్‌కు ఆరు స్ట్రాపాన్ బూస్టర్లు కలిగి వుంటుంది.
- కోర్ అలోన్ దశలో 160 టన్నుల సెమీ–క్రయోజనిక్ ఇంధనాన్ని వినియోగిస్తారు.
- క్రయోజనిక్ దశలో 30 టన్నుల క్రయో ఇంధనాన్ని వినియోగిస్తారు.
- ఈ రాకెట్ రూపాంతరం చెందితే నాసాకి చెందిన ఫాల్కన్ రాకెట్, అట్లాస్–వీ, ప్రోటాన్–ఎం, లాంగ్ మార్చ్–58 రాకెట్‌ల స్థాయికి ఏమాత్రం తగ్గకుండా వుంటుంది.
- ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ 2023 డిసెంబర్‌లోనే దీనిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కూడా ఇచ్చారు. 2030 , 2035 నాటికి మానవ అంతరిక్ష యానం, లోతైన అంతరిక్ష యాత్రలు, అత్యంత బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహాల ప్రయోగాలు చేసేందుకు వీలుగా ఈ రాకెట్‌ను రూపొందిస్తున్నట్టుగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో వివరించారు. ఎన్‌జీఎల్‌వీ రాకెట్ గురించి దశల వారీగా కూడా ఆయన వివరించి మరీ చెప్పారు.

పని మనుషులకు ఆప్' ఏడు గ్యారంటీలు

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండడంతో ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ తన ప్రచారంలో వేగం పెంచారు. ఎంపీలు, మంత్రులు, ప్రభుత్వ అధికారుల అధికారిక నివాసాల్లో పనిచేసేవారికి ఏడు గ్యారంటీలు ప్రకటించారు. మరోసారి అధికారంలోకి వస్తే గ్యారంటీలన్నీ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. పని మనుషులకు ఈడబ్ల్యూఎస్ ఫ్లాట్లు ఇస్తామన్నారు. స్పష్టమైన పనివేళలు నిర్ణయిస్తామని చెప్పారు. సర్వెంట్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ఏర్పాటుచేస్తామని తెలిపారు. పని మనుషులకు రూ.10 లక్షల బీమా కవరేజీ కల్పిస్తామని, వారి పిల్లలకు ఉచితంగా విద్య అందిస్తామని వెల్లడించారు. ఢిల్లీలో ఇళ్లల్లో పని చేస్తున్నవారిలో 70 నుంచి 80% మందికి తగిన వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. యజమానులు వారిని నిర్బంధ కార్మికులుగా వాడుకుంటున్నారని చెప్పా రు. కొందరు ఎంపీలు పనివాళ్లకు వసతి కూడా కల్పించడం లేదన్నారు. వారికో సం హాస్టళ్లు నిర్మిస్తామని, మొబైల్ మొహల్లా క్లినిక్‌లతో వైద్య సేవలు అందిస్తామని వెల్లడించారు. వేతనాలు, పనివేళలను క్రమబద్ధీకరించడానికి చట్టం తీసుకొస్తామన్నారు. పనివాళ్ల కుమార్తెల వివాహాలకు రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తామన్నారు.

యూనస్‌తో సోరోస్ కుమారుడి భేటీ

ఢాకా: అమెరికా కుబేరుడు జార్జ్ సోరోస్ కుమారుడు అలెక్స్ సోరెస్, సోరెస్‌కు చెందిన ఓపెన్ సొసైటీ ఫౌండేషన్స్ (ఓఎస్ఎఫ్) చైర్‌పర్సన్ బంగ్లాదేశ్‌లో పర్యటించారు. తాత్కాలిక ప్రభుత్వ అధిపతి ముహమ్మద్ యూనస్‌తో భేటీ అయ్యారు. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలను చేపట్టిన అనంతరం ట్రంప్ బంగ్లాదేశ్‌కు సహాయాన్ని నిలిపివేసిన కొన్ని రోజుల వ్యవధిలోనే సోరోస్ కుటుంబం యూనుస్‌తో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. గతేడాది అక్టోబర్‌లోనూ అలెక్స్, యూనుస్‌లు న్యూయార్క్‌లో సమావేశమయ్యారు. మూడు నెలల్లోనే అలెక్స్, యూనస్‌ల మధ్య ఇది రెండో సమావేశం. ఢాకాలో జరిగిన సమావేశం వివరాలను యూనస్ పంచుకున్నారు. సోరోస్, ఓఎస్ఎఫ్ అధ్యక్షుడు బినైఫర్ నౌరోజీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం తమ ప్రభుత్వ సంస్కరణ ఎజెండాకు మద్దతు తెలిపిందని ఆయన వెల్లడించారు. ఆర్థిక వ్యవస్థను పునర్‌నిర్మించడానికి, తప్పుడు సమాచారాన్ని ఎదుర్కోవటానికి బంగ్లాదేశ్ చేస్తున్న ప్రయత్నాలపై చర్చించామని పేర్కొన్నారు. అయితే, ఆర్థిక సంస్కరణలు, మీడియా స్వేచ్ఛ, ఆస్తుల రికవరీ, కొత్త సైబర్ సెక్యూరిటీ చట్టాలు, రోహింగ్యాల సంక్షోభాన్ని పరిష్కరించడం వంటి అంశాలు భేటీలో చర్చకు వచ్చినట్లు బంగ్లాదేశ్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.



సునీతా విలియమ్స్ స్పేస్‌వాక్ చేస్తున్న దృశ్యం

సునీతా విలియమ్స్, విల్‌మోర్ ఉమ్మడి స్పేస్‌వాక్

వాషింగ్టన్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో చిక్కుకుపోయిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్, అమెరికా ఆస్ట్రోనాట్ బుచ్ విల్‌మోర్ గురువారం ఉమ్మడిగా స్పేస్‌వాక్ చేశారు. ఐఎస్ఎస్ నుంచి బయటకు వచ్చి కాసేపు అంతరిక్షంలో విహరించారు. ఐఎస్ఎస్‌కు బయటి భాగంలో చేయాల్సిన మరమ్మతులు ఏమైనా ఉన్నాయా? అనేది పరిశీలించారు. ఇరువురు కలిసి స్పేస్‌వాక్ చేయడం ఇదే మొదటిసారి. వేర్వేరుగా స్పేస్‌వాక్ చేసిన సందర్భాలు గతంలో ఉన్నాయి. వారిద్దరూ గత ఏడాది జూన్‌లో ఐఎస్ఎస్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. వారం రోజుల్లో తిరిగి రావాల్సి ఉండగా, సాంకేతిక కారణాలతో అది సాధ్య పడలేదు. ఎనిమిది నెలలుగా ఐఎస్ఎస్‌లోనే ఉంటున్నారు. ఎప్పుడు తిరిగి వస్తారన్నది ఇంకా నిర్ధారణ కాలేదు. అందుకోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం జోక్యం చేసుకున్నారు. ఇద్దరు వ్యోమగాములను వెనక్కి తీసుకురావడానికి సాయం అందించాలని స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్‌ను కోరారు. మరోవైపు సునీతా విలియమ్స్ ఆరోగ్యం క్షీణిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. భూమికి 420 కిలోమీటర్ల ఎగువన సరిగ్గా స్పెయిన్ దేశం పైభాగాన తాము స్పేస్‌వాక్ చేశామని, చాలా ఆనందంగా ఉందని విల్‌మోర్ చెప్పారు.

కుంభమేళాలో మరో తొక్కిసలాట!

సంగం ఘాట్ వద్ద విషాదం తర్వాత కాస్త దూరంలో ఝూసీ ఘాట్‌లో ఉదయం తొక్కిసలాట

భక్తులు భయపడతారని వెంటనే బహిర్గతం చేయని అధికారులు

మహాకుంభ్ నగర్: ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా సందర్భంగా మౌని అమావాస్య రోజు బ్రహ్మముహూర్తంలో పుణ్యస్నానాల కోసం వేచి ఉన్న భక్తులపై వెనకవైపు భక్తులు పడటంతో జరిగిన తొక్కిసలాటలో 30 మంది ప్రాణాలు కోల్పోయారన్న వార్తలో కొంత నిగూఢార్థం ఉందని ఆలస్యంగా వెల్లడైంది. మరణాలన్నీ ఈ సంగం ఘాట్ వద్దే సంభవించలేదని కొన్ని సమీపంలోని ఝూసీ ఘాట్ వద్ద సంభవించాయన్న వార్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంగం ఘాట్‌లో భారీ తొక్కిసలాట జరిగిన కొద్దిసేపటి తర్వాత ఝూసీ ఘాట్‌లో తొక్కిసలాట జరిగిందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. సంగం ఘాట్ విషాదం నుంచి భక్తులు తేరుకునేలోపే మరోచోట కూడా తొక్కిసలాట జరిగిందన్న వార్త తెలిస్తే భయంతో భక్తులు వెనుతిరగడమో, గందరగోళంతో పరుగెత్తడమో చేస్తే మళ్లీ సంగం ఘాట్‌లో మరో అపశృతి చోటుచేసుకుంటుందన్న అనుమానంతో అధికారులు ఈ విషయాన్ని వెంటనే బయటకు చెప్పలేదని తెలుస్తోంది. భక్తులను శాంతపరచడమే తమ ముఖ్య ఉద్దేశమని అక్కడి అధికారులు చెప్పారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. సంగం ఘాట్‌కు ఉత్తరాన కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో గంగ ఒడ్డుకు ఆవలివైపు ఈ ఝూసీ ఘాట్ ఉంది. సంగం ఘాట్ వద్ద మంగళవారం అర్ధరాత్రి దాటాక 1.30 గంటల ప్రాంతంలో తొక్కిసలాట జరిగింది. ఝూసీ ఘాట్‌లో దాదాపు ఉదయం ఆరు గంటలకు తొక్కిసలాట జరిగింది.

మధ్యాహ్నం దాకా మృతదేహాలు అక్కడే!

''ఝూసీ ఘాట్‌లో తొక్కిసలాటలో ఊపిరాడక చనిపోయిన భక్తుల మృతదేహాలు అక్కడే పడి ఉన్నాయి. వాటిని పట్టించుకున్న నాథుడే లేడు. ఉదయం ఆరు గంటలకు తొక్కిసలాటలో చనిపోతే మధ్యాహ్నం 1.30 గంటలకు మృతదేహాలను ఇక్కడి నుంచి తీసుకెళ్లారు. తొక్కిసలాట జరిగిన నాలుగు గంటల తర్వాత ఒక మహిళా కానిస్టేబుల్ వచ్చింది. అప్పటికే అక్కడి భీతావహ పరిసరాలను తమ స్మార్ట్‌ఫోన్ కెమెరాల్లో బంధిస్తున్న జనాలను పోలీసులు వారించారు'' అని ఝూసీ ఘాట్‌లో హల్దీరామ్ దుకాణం నడుపుతున్న నేహా ఓఝా స్థానిక మీడియాతో చెప్పారు. ''ఊహించనంతగా భక్తులు వచ్చారు. అడ్డుగా ఉన్న కర్ర బ్యారీకేడ్లను విరగ్గొట్టి ముందుకు రావడంతో ఘోరం జరిగింది. ఇదే అదనుగా అక్కడ నిద్రిస్తున్న వాళ్లకు చెందిన ఐఫోన్లు, ల్యాప్‌టాప్‌లను కొందరు కొట్టేశారు''అని ప్రత్యక్ష సాక్షి హర్షిత్ అన్నారు. ''మా దుకాణం చుట్టూతా ఒక్కసారిగా జనం పోగయ్యారు. పరిస్థితి పూర్తిగా అదుపుతప్పింది. మా దుకాణంలోకీ జనం చొచ్చుకొచ్చారు. ఇదే అదనుగా ఎవరో మా హల్దీరామ్ దుకాణం క్యాష్ కౌంటర్ నుంచి రూ.1,80,000 కొట్టేశారు. ఇక్కడ గుట్టలుగా పడి ఉన్న భక్తుల బ్యాగులు, చెప్పుల కుప్పల నుంచే కొందరు వృద్ధుల మృతదేహాలను బయటకు తీశారు. నా ముందే ఈ టెంట్‌లో ఇద్దరు చనిపోయారు''అని నేహా ఓఝా చెప్పారు. ''వెంటనే ఝూసీ ఘాట్‌కు అంబులెన్సు వచ్చే సౌకర్యం కూడా లేదు. ఏ సాయం అందాలన్నా నది ప్రవాహం మీదుగా పడవల్లో వచ్చి సాయపడాల్సిందే'' అని మరో ప్రత్యక్ష సాక్షి మెయిన్ బహదూర్ సింగ్ చెప్పారు. ''బస్సులో వచ్చిన ఒక 20 మంది యువకులు బ్యారీకేడ్లను విరగొట్టి, అందర్నీ తోసేసి ముందుకెళ్లారు. ఈ సమయంలోనే తొక్కిసలాట జరిగింది''అని మరో ప్రత్యక్ష సాక్షి అయిన ఒక సాధువు చెప్పారు. ఝూసీ ఘాట్‌లో తొక్కిసలాట కారణంగా ఏర్పడిన చెత్తను తొలగించేసరికి సాయంత్రం ఆరు అయిందని ఒక కార్మికుడు చెప్పారు.

అగ్నిప్రమాదంలో 15 టెంట్లు దగ్ధం

మహాకుంభ్ నగర్: ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో మరోసారి అగ్నిప్రమాదం సంభవించింది. సెక్టార్ 22 సమీప ఛామన్‌గంజ్ చౌకీ వద్ద చెలరేగిన అగ్నికీలల్లో 15 టెంట్లు కాలిపోయాయని ప్రధాన అగ్నిమాపక దళ అధికారి(కుంభ్) ప్రమోద్ శర్మ చెప్పారు. విషయం తెలియగానే రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని మంటల్ని ఆర్పేశారు. సరైన రోడ్డు మార్గంలేకపోవడంతో త్వరగా ఘటనాస్థలికి చేరుకోవడం కష్టంగా మారింది. అగ్నిప్రమాద ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఎవరూ గాయపడలేదని అధికారి స్పష్టంచేశారు. కలిపోయిన టెంట్లు కుంభమేళాలో భాగంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసినవి కాదని, అక్రమంగా వెలిశాయని వెల్లడించారు. అగ్నికీలలు చెలరేగడానికి గల కారణాలపై దర్యాప్తు మొదలెట్టారు.

6 మెట్రో నగరాల్లో చేతుల్తో మురుగు ఎత్తడం ఆపాలి

నగరాల పాలనాధికారులను ఆదేశించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: దేశంలోని ఆరు ప్రధాన మెట్రో నగరాల్లో చేతులతో మురుగును ఎత్తేసే పాతకాలపు విధానానికి స్వస్తి పలకాలని సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. ఈ విషయమై ఫిబ్రవరి 13వ తేదీలోగా తమకు అఫిడవిట్ సమర్పించాలని హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతా, ఢిల్లీ, ముంబై, చెన్నై నగరాల ప్రధాన కార్యనిర్వాహణ అధికారు(సీఈవో)లకు సుప్రీంకోర్టు సూచించింది. ఇతర ప్రత్యామ్నాయ విధానాలను ఆచరించడం ద్వారా ఎప్పుడు 'చేతుల్తో మురుగు ఎత్తే'ప్రక్రియకు ఫుల్‌స్టాప్ పెడతారో చెప్పాలని జస్టిస్ సుధాంశు ధూలియా సారథ్యంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశాలిచ్చింది. కేసు తదుపరి విచారణను ఫిబ్రవరి 19వ తేదీన చేపడతామని పేర్కొంది. పారిశుద్ధ్య కార్మికులు చేతులతో మురుగును ఎత్తేయడం, మురుగు కాల్వల్లోకి దిగి శుభ్రం చేయడం వంటి పనులను ఆపేయాలని కోర్టు స్పష్టంచేసింది. ఈ విధానం నిర్మూలన కోసం రాష్ట్రాలతో కలిసి సమన్వయంతో పనిచేయాలని కేంద్ర ప్రభుత్వానికి కోర్టు 2023 డిసెంబర్‌లోనే మార్గదర్శకాలు జారీచేసింది. దీంతో దేశవ్యాప్తంగా 775 జిల్లాలకుగాను 456 జిల్లాలు తమ పరిధిలో ఇలాంటి విధానాన్ని నిలిపేసినట్లు అఫిడవిట్ సమర్పించాయి. దీనిపై సుప్రీంకోర్టు సంతృప్తిచెందలేదు. దీంతో తాజాగా స్పష్టమైన ఆదేశాలిచ్చింది.

'ముడా' కుంభకోణం రూ.56 కోట్లు

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, కుటుంబ సభ్యుల పాత్ర: ఈడీ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) కుంభకోణం విలువ రూ.56 కోట్లు ఉంటుందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వెల్లడించింది. ఈ కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి, కుమారుడు యతీంద్రతోపాటు ముడా అధికారులు, ఇతర ప్రముఖుల పాత్ర ఉందని తెలియజేసింది. ఈ మేరకు తాజాగా ఒక నివేదిక విడుదల చేసింది. అభివృద్ధి పనుల కోసం ప్రజల నుంచి ముడా సేకరించిన విలువైన భూమిని ప్లాట్లుగా మార్చి, కుట్రపూరితంగా కొట్టేశారని పేర్కొంది. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున అవకతవకలు చోటుచేసుకున్నాయని, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని స్పష్టంచేసింది. ప్రభుత్వ రికార్డులను తారుమారు చేశారని, ఫోర్జరీకి పాల్పడ్డారని తెలిపింది. విలువైన స్థలాలను సిద్ధరామయ్య భార్య పార్వతికి అక్రమంగా కట్టబెట్టారని గుర్తుచేసింది. 14 ముఖ్యమైన స్థలాలను ఆమెకు ఇచ్చారని, ఈ విషయంలో చట్టాన్ని తుంగలో తొక్కారని ఆక్షేపించింది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

సాక్షి ప్లస్
శుక్రవారం । 31-1-2025

'ది అన్-టచబుల్స్' గ్రంథ రచయిత?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ



సామాజిక అసమానతలు, సామాజిక వెలి, కులతత్వం, మతతత్వం, బాల కార్మిక వ్యవస్థ, అంగవైకల్యం, వృద్ధులు

1. 'సామాజిక వెలి' అనే పదాన్ని మొదటిసారి ఉపయోగించిన వ్యక్తి?
ఎ) హట్టన్ బి) రెనీ లీనియర్
సి) ఎం.ఎన్. శ్రీనివాస్ డి) హెర్బర్ట్ రిస్లే
2. సామాజిక అసమానతలకు ప్రధాన కారణాలు ఏ రకమైనవి?
ఎ) రాజకీయ పరమైనవి
బి) సాంస్కృతిక పరమైనవి
సి) ఆర్థిక పరమైనవి డి) పైవన్నీ
3. 'సామాజిక వెలి' అనే పదాన్ని మొదటగా ఏ దేశ పరిస్థితులను ఉదహరించడానికి ఉపయోగించారు?
ఎ) అమెరికా బి) ఈజిప్ట్
సి) ఫ్రాన్స్ డి) ఇండియా
4. కింది వాటిలో సామాజిక వెలి దుష్ఫలితం ఏది?
ఎ) వివక్ష బి) వలసలు
సి) నిరుద్యోగం డి) పైవన్నీ
5. కింది వాటిలో సామాజిక స్తరీకరణ (Social Stratification) రూపం ఏది?
ఎ) కులం బి) బానిసత్వం
సి) వర్గం డి) పైవన్నీ
6. సామాజిక అసమానతలను రూపుమాపడానికి ఏం చేయాలి?
ఎ) విద్యను పెంపొందించాలి
బి) ఆర్థిక సమానత్వం సాధించాలి
సి) అభివృద్ధి కార్యక్రమాల్లో వివక్ష లేకుండా చూడాలి
డి) పైవన్నీ
7. కులతత్వం బాగా పెరగడానికి కారణం?
ఎ) ఓటు బ్యాంకు రాజకీయాలు
బి) సమాచార సాంకేతికత
సి) ఆర్థిక అసమానత్వం
డి) పైవన్నీ
8. జతపరచండి.
గ్రూప్ - ఎ
a. క్యాస్ట్ ఇన్ మోడ్రన్ ఇండియా
b. క్యాస్ట్ అండ్ రేస్ ఇన్ ఇండియా
c. క్యాస్ట్ ఇన్ ఇండియా
d. ద హిందూ క్యాస్ట్ సిస్టమ్
గ్రూప్ - బి
i. ఎం.ఎన్. శ్రీనివాస్
ii. జి.ఎస్. ఘుర్యే
iii. జె.హెచ్. హట్టన్
iv. హెరాల్డ్
ఎ) a-i, b-ii, c-iii, d-iv
బి) a-i, b-iii, c-ii, d-iv
సి) a-ii, b-iii, c-i, d-iv
డి) a-iv, b-i, c-iii, d-ii
9. కింది వాటిలో కులతత్వం వల్ల కలిగే దుష్పరిణామం ఏది?
ఎ) జాతీయ భావాలకు భంగం కలగడం
బి) ప్రజాస్వామ్యం నిర్వీర్యం చెందడం
సి) సామాజిక అవ్యవస్థత
డి) పైవన్నీ
10. కింది వాటిలో కులతత్వ నిర్మూలనకు దోహదపడే అంశం ఏది?
ఎ) విద్యా వ్యాప్తి
బి) కులాంతర వివాహాలు
సి) సాంస్కృతిక- ఆర్థిక సమానత్వం
డి) పైవన్నీ
11. రిజర్వేషన్లు కల్పించాలని ఒక సామాజిక వర్గం చేసిన ఆందోళనల్లో భాగంగా రైలును తగులబెట్టిన ఘటన ఎక్కడ జరిగింది?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) తెలంగాణ
సి) హరియాణా డి) రాజస్థాన్
12. 2016 జనవరిలో హరియాణా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ కట్టర్ 'ఖాప్ పంచాయతీ'లను నిర్మూలించడం సాధ్యం కాదు అని పేర్కొన్నారు. ఈ 'ఖాప్ పంచాయతీ'లకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
ఎ) ఇవి కుల పంచాయతీలు
బి) ఇవి చట్ట వ్యతిరేకమైనవి
సి) పరువు హత్యలకు కారణం అవుతున్నాయి
డి) పైవన్నీ
13. కింది వాటిలో కులతత్వానికి కారణం ఏది?
ఎ) కుల ప్రతిష్ఠల భావన
బి) అంతర్వివాహ నియమం
సి) నగరీకరణ, సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లు
డి) పైవన్నీ
14. జతపరచండి.
a. ఆర్టికల్ - 14
b. ఆర్టికల్ - 17
c. ఆర్టికల్ - 46
i. చట్టం ముందు అందరూ సమానులే
ii. అస్పృశ్యత నివారణ
iii. బలహీన వర్గాల అభివృద్ధికి చర్యలు
ఎ) a-i, b-ii, c-iii
బి) a-iii, b-ii, c-i
సి) a-ii, b-i, c-iii
డి) a-i, b-iii, c-ii
15. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (అత్యాచారాల నిరోధక) చట్టం-1989కు కేంద్ర ప్రభుత్వం సవరణలు చేసింది. దీని ప్రకారం వారి హక్కులకు భంగం కలిగిస్తే గరిష్టంగా ఎంత కాలం శిక్ష పడుతుంది?
ఎ) 10 ఏళ్లు బి) 15 ఏళ్లు
సి) 20 ఏళ్లు డి) 5 ఏళ్లు
16. కులం అనే పదం 'కాస్టా' అనే ఏ భాషా పదం నుంచి ఆవిర్భవించింది?
ఎ) ఇంగ్లిష్ బి) పోర్చుగీసు
సి) స్పానిష్, పోర్చుగీసు
డి) పైవేవీ కావు
17. 1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీదును కూల్చివేసినప్పుడు దేశ ప్రధాని ఎవరు?
ఎ) పి.వి. నరసింహారావు
బి) అటల్ బిహారీ వాజ్‌పేయ్
సి) ఐ.కె. గుజ్రాల్
డి) చంద్రశేఖర్
18. కింది వాటిలో మతతత్వానికి కారణం ఏమిటి?
ఎ) మత ఛాందస వాదం
బి) బ్రిటిష్ పరిపాలన విధానాలు
సి) దేశ విభజన పరిస్థితులు
డి) పైవన్నీ
19. సంఘటనలు – విచారణ కమిటీలకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
ఎ) బాబ్రీ మసీదు విధ్వంసం – జస్టిస్ లిబర్‌హన్ కమిషన్
బి) బొంబాయి అల్లర్లు(1992) – జస్టిస్ శ్రీకృష్ణ కమిషన్
సి) గోద్రా అల్లర్ల(2002)పై మొదటిసారి వేసిన కమిషన్ – కె.జి. షా కమిషన్
డి) పైవన్నీ
20. గోద్రా అల్లర్లు- 2002పై విచారణ కోసం రెండోసారి నియమించిన కమిషన్ ఏది?
ఎ) కె.జి. షా కమిషన్
బి) నానావతి కమిషన్
సి) శ్రీకృష్ణ కమిషన్
డి) ఏదీకాదు
21. కింది వాటిలో మత ఉద్రిక్తతలకు నివారణోపాయం ఏది?
ఎ) లౌకిక దృక్పథాలను అభివృద్ధి పరచడం
బి) మత రాజకీయ సంస్థలపై నిషేధం విధించడం
సి) ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచడం
డి) పైవన్నీ
22. 'మతం మత్తు లాంటిది' అని వ్యాఖ్యానించిన వారు?
ఎ) మార్క్స్ బి) ఎం.ఎన్. శ్రీనివాస్
సి) వెగెల్ డి) లెనిన్
23. భారత రాజ్యాంగం ప్రకారం అల్పసంఖ్యాక వర్గాలకు రక్షణ కల్పించే ప్రకరణలు ఏవి?
ఎ) ప్రకరణలు 29, 30
బి) ప్రకరణలు 14, 18
సి) ప్రకరణలు 23, 24
డి) ప్రకరణలు 25, 28
24. పార్లమెంటు చేసిన చట్టం ప్రకారం బాల నేరస్థులుగా పరిగణించడానికి కనీస వయసు ఎంత?
ఎ) 18 ఏళ్లు బి) 16 ఏళ్లు
సి) 20 ఏళ్లు డి) 21 ఏళ్లు
25. కింది వాటిలో స్త్రీలపై జరుగుతున్న దాడులకు కారణం ఏది?
ఎ) వరకట్న దాహం బి) పాశ్చాత్యీకరణ
సి) పోర్నోగ్రఫీ డి) పైవన్నీ
26. కింది వాటిలో ఏ దశాబ్దాన్ని ఐక్యరాజ్యసమితి 'మహిళా దశాబ్దం'గా ప్రకటించింది?
ఎ) 1975–1985 బి) 2005–2015
సి) 1955–1965 డి) 1965–1975
27. కింద పేర్కొన్న ఏ కేసులో సుప్రీంకోర్టు మహిళలకు పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నుంచి రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలు జారీ చేసింది?
ఎ) విశాఖ వర్సెస్ రాజస్థాన్
బి) షాబానో వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా
సి) అరుణారాయ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా
డి) మాడిసన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా
28. జతపరచండి.

గ్రూప్-ఎ	గ్రూప్-బి
a) వరకట్న నిషేధ చట్టం	i) 2013
b) సమాన వేతన చట్టం	ii) 2005
c) గృహ హింస నిరోధక చట్టం	iii) 1976
d) నిర్భయ చట్టం	iv) 1961

ఎ) a-i, b-ii, c-iii, d-iv,
బి) a-iv, b-iii, c-i, d-ii
సి) a-iv, b-i, c-ii, d-iii
డి) a-iv, b-iii, c-ii, d-i
29. 1992లో ఏర్పాటు చేసిన జాతీయ మహిళా కమిషన్ మొదటి అధ్యక్షురాలు ఎవరు?
ఎ) జయంతీ పట్నాయక్
బి) మోహిని గిరి
సి) పూర్ణిమా అద్వానీ
డి) లలిత కుమార మంగళం
30. జతపరచండి.
గ్రూప్- ఎ
a. అస్పృశ్యత నివారణ
b. సమాన పనికి సమాన వేతనం
c. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు
d. మహిళల అక్రమ రవాణా నివారించడం
గ్రూప్- బి
i. అధికరణ–17
ii. అధికరణ– 39 (డి)
iii. అధికరణ– 243 (డి)
iv. అధికరణ –23
ఎ) a-i, b-ii, c-iii, d-iv
బి) a-iv, b-iii, c-ii, d-i
సి) a-ii, b-i, c-iv, d-iii
డి) a-iv, b-i, c-iii, d-ii
31. 'ఇందిరాగాంధీ జాతీయ వృద్ధాప్య పింఛన్ల పథకం'ను ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 1975 బి) 1985
సి) 1995 డి) 2005
32. 'ది అన్-టచబుల్స్' గ్రంథ రచయిత? (సీడీపీవో-2013)
ఎ) ఎం.ఎన్. శ్రీనివాస్
బి) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
సి) ఘుర్యే డి) గాంధీ
33. అస్పృశ్యులను మొదటిసారిగా 'హరిజనులు' అని సంబోధించింది ఎవరు? (సీడీపీవో-2013)
ఎ) లాల్ బహదూర్ శాస్త్రి
బి) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
సి) విద్యాసాగర్ డి) గాంధీ
34. కులతత్వం అంటే ఏమిటి? (సివిల్స్–1993)
ఎ) స్వీయ కులం పట్ల పక్షపాతం
బి) సొంత కులం పట్ల పక్షపాతం- ఇతర కులాల పట్ల విరోధం
సి) ప్రతి కులం పట్ల పక్షపాతం
డి) కొన్ని కులాల పట్ల పక్షపాతం
35. ప్రపంచ వికలాంగుల సంక్షేమ దినోత్సవం ఎప్పుడు?
ఎ) డిసెంబర్–3 బి) నవంబర్–3
సి) అక్టోబర్–3 డి) జనవరి–3
36. భారత్‌లో వికలాంగులు 2001లో 2.19 కోట్లు ఉండగా 2011లో ఆ సంఖ్య 2.68 కోట్లకు పెరిగింది. వీరిలో ఎక్కువ శాతం ఎవరు ఉన్నారు?
ఎ) చాలన వైకల్యం బి) వినికిడి సమస్య
సి) దృష్టి సమస్య డి) బుద్ధి మాంద్యం
37. కింది వాటిలో సరైన వాక్యం ఏది?
ఎ) కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో వికలాంగులకు 3 శాతం రిజర్వేషన్లు కల్పించారు.
బి) అధికరణ–42 వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలుపుతుంది.
సి) తెలంగాణ రాష్ట్రంలో 'ఆసరా' పథకం కింద వికలాంగులకు ప్రతి నెలా రూ.1500 ఆర్థిక సహాయం అందిస్తున్నారు
డి) పైవన్నీ
38. చట్టం, రూపొందించిన సంవత్సరానికి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
ఎ) ది పర్సన్ విత్ డిసేబిలిటీస్ యాక్ట్–1995
బి) ది నేషనల్ ట్రస్టు యాక్ట్–1999
సి) మానసిక ఆరోగ్య చట్టం–1987 (Mental Health Act)
డి) పైవన్నీ
39. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఫిజికల్లీ హ్యాండీక్యాప్డ్ - న్యూఢిల్లీ
బి) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విజువల్లీ హ్యాండీకాప్డ్- డెహ్రాడూన్
సి) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఆర్థోపెడికల్లీ హ్యాండీకాప్డ్ - కోల్‌కతా
డి) పైవన్నీ
40. బాల కార్మిక వ్యవస్థ (నిషేధ, నియంత్రణ) చట్టం ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చింది?
ఎ) 1984 బి) 1985
సి) 1986 డి) 1987
41. భారత రాజ్యాంగంలో బాల కార్మిక వ్యవస్థను ప్రత్యక్షంగా నిషేధిస్తున్న ఆర్టికల్ ఏది?
ఎ) ఆర్టికల్–14 బి) ఆర్టికల్–24
సి) ఆర్టికల్ -25 డి) ఆర్టికల్–41
42. తెలంగాణలో వికలాంగులు ఏ జిల్లాలో అధికంగా ఉన్నారు?
ఎ) ఆదిలాబాద్ బి) నిజామాబాద్
సి) కరీంనగర్ డి) రంగారెడ్డి
43. వేదకాలంలో స్త్రీ అంతస్తు ఏ విధంగా ఉండేది? (ఏపీపీఎస్సీ–2002)
ఎ) చాలా తక్కువ స్థాయి
బి) కొంత వరకు ఉన్నత స్థాయి
సి) పురుషుల కంటే ఉన్నత స్థాయి
డి) సరిపోల్చలేని స్థాయి
44. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
ఎ) 2007 బి) 2008
సి) 2009 డి) 2010

సమాధానాలు

1) బి	2) డి	3) సి	4) డి	5) డి
6) డి	7) డి	8) ఎ	9) డి	10) డి
11) ఎ	12) డి	13) డి	14) ఎ	15) ఎ
16) సి	17) ఎ	18) డి	19) డి	20) బి
21) డి	22) ఎ	23) ఎ	24) బి	25) డి
26) ఎ	27) ఎ	28) డి	29) ఎ	30) ఎ
31) సి	32) బి	33) డి	34) బి	35) ఎ
36) ఎ	37) డి	38) డి	39) డి	40) సి
41) బి	42) ఎ	43) సి	44) ఎ	

గమన నియమాలను ప్రతిపాదించింది ఎవరు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

భౌతిక శాస్త్రం

యాంత్రిక శాస్త్రం

1. కింద పేర్కొన్న ఏ సూత్రంపై ఆధారపడి రాకెట్ పనిచేస్తుంది?
ఎ) శక్తి నిత్యత్వ నియమం
బి) బెర్నౌలీ నియమం
సి) అవగాడ్రో సిద్ధాంతం
డి) ద్రవ్యవేగ నిత్యత్వ నియమం
2. గుర్రపుస్వారీ చేసేవారు గుర్రం హఠాత్తుగా ముందుకు కదిలితే పడిపోయే ప్రమాదం ఉంది. దీనికి కారణమేమిటి?
ఎ) జడత్వ భ్రామకం
బి) ద్రవ్యరాశి నిత్యత్వ నియమం
సి) నిశ్చల జడత్వం
డి) న్యూటన్ మూడో గమన నియమం
3. క్రికెట్ ఆటగాడు బంతిని క్యాచ్ పట్టుకోవడానికి ముందు చేతులు వెనుకకు లాగుతాడు. ఎందుకంటే ..?
ఎ) బంతి నిశ్చల స్థితికి వస్తుంది
బి) బంతి త్వరణం చెందుతుంది
సి) బంతి ఎక్కువ బలాన్ని కలుగజేస్తుంది
డి) బంతి తక్కువ బలాన్ని కలుగజేస్తుంది
4. మీగడను వేరుచేసే యంత్రంలో ఎలాంటి బలం పనిచేస్తుంది?
ఎ) అపకేంద్ర బలం బి) అభికేంద్ర బలం
సి) కేంద్రక బలం కానిది
డి) బాహ్య బలం
5. లిఫ్టులో ఉన్న వ్యక్తిపై పనిచేసే బలం కింది ఏ సందర్భంలో ఎక్కువ?
ఎ) లిఫ్ట్ త్వరణంతో కిందికి వస్తున్నప్పుడు
బి) లిఫ్ట్ త్వరణంతో పైకి వెళుతున్నప్పుడు
సి) లిఫ్ట్ సమవేగంతో కిందికి వస్తున్నప్పుడు
డి) లిఫ్ట్ సమవేగంతో పైకి వెళుతున్నప్పుడు
6. లిఫ్ట్‌లో ఉన్న వ్యక్తి దృశ్య భారం నిజ భారం కంటే ఏ సందర్భంలో తక్కువ?
ఎ) లిఫ్ట్ త్వరణంతో పైకి వెళుతున్నప్పుడు
బి) లిఫ్ట్ త్వరణంతో కిందికి వస్తున్నప్పుడు
సి) లిఫ్ట్ సమవేగంతో పైకి వెళుతున్నప్పుడు
డి) లిఫ్ట్ సమవేగంతో కిందికి వస్తున్నప్పుడు
7. మజ్జిగ చిలికినప్పుడు వెన్న వేరుపడటానికి కారణమేమిటి?
ఎ) అపకేంద్ర బలం బి) గురుత్వ బలం
సి) ఘర్షణ బలం డి) అయస్కాంత బలం
8. బస్సు మలుపు తిరిగేటప్పుడు అందులో ప్రయాణించే వ్యక్తి ఒక వైపు వంగుతాడు. దీనికి కారణం ఏమిటి?
ఎ) గమన జడత్వం బి) దిశా జడత్వం
సి) వేగ జడత్వం డి) స్థిర జడత్వం
9. కింది వాటిలో అపకేంద్ర బలంపై ఆధారపడి పనిచేసేది ఏది?
ఎ) కప్పీ బి) వాషింగ్ మెషిన్
సి) స్క్రూడ్రైవర్ డి) సామాన్యలోలకం
10. ధనస్సులో సంధించిన బాణం ఏ శక్తిని కలిగి ఉంటుంది?
ఎ) గతిజ శక్తి బి) స్థితిజ శక్తి
సి) ఘర్షణ శక్తి డి) గురుత్వ శక్తి
11. విరామంలో ఉన్న వస్తువు కింది వాటిలో దేన్ని కలిగి ఉంటుంది?
ఎ) జడత్వం బి) బలం
సి) వేగం డి) ద్రవ్యవేగం
12. గాలిలో ప్రయాణిస్తున్న విమానానికి ఉండే శక్తి ఏది?
ఎ) స్థితిజ శక్తి బి) గతిజ శక్తి
సి) ఎ, బి డి) ఏ శక్తి ఉండదు
13. పడవపై నుంచి ఒక వ్యక్తి ఒడ్డు పైకి దూకినప్పుడు పడవ వెనక్కి జరుగుతుంది. దీన్ని ఏ సూత్రం ఆధారంగా వివరించవచ్చు?
ఎ) న్యూటన్ మొదటి గమన నియమం
బి) న్యూటన్ రెండో గమన నియమం
సి) న్యూటన్ మూడో గమన నియమం
డి) న్యూటన్ గురుత్వాకర్షణ నియమం
14. ఒక వస్తువు భారం విషయంలో కింది వాటిలో సరైంది ఏది?
ఎ) భూతలంపై ఎక్కడైనా సమానం
బి) ధ్రువాల వద్ద గరిష్ఠం
సి) భూమధ్యరేఖ వద్ద గరిష్ఠం
డి) చదునైన భూమిపై కంటే గుట్టలపై ఎక్కువ
15. ఒక వస్తువును భూమిపై నుంచి చంద్రుడి పైకి తీసుకువెళితే ..?
ఎ) దాని ద్రవ్యరాశి మారుతుంది, భారం స్థిరంగా ఉంటుంది
బి) ద్రవ్యరాశి, భారం.. రెండూ మార్పు చెందుతాయి
సి) ద్రవ్యరాశి స్థిరం, భారం మార్పు చెందుతుంది
డి) ద్రవ్యరాశి, భారం రెండూ స్థిరంగా ఉంటాయి
16. గమన నియమాలను ప్రతిపాదించింది ఎవరు?
ఎ) జాన్ డాల్టన్ బి) న్యూటన్
సి) ఫారడే డి) ఐన్‌స్టీన్
17. న్యూటన్ ప్రతిపాదించిన గమన నియమాల్లో దేనికి అధిక ప్రాధాన్యం ఉంది?
ఎ) మొదటి నియమం
బి) రెండో నియమం
సి) మూడో నియమం
డి) అన్నింటికీ సమాన ప్రాధాన్యం ఉంది
18. కింది వారిలో యాంత్రిక శాస్త్ర పరిశోధనలతో సంబంధం లేని శాస్త్రవేత్త?
ఎ) న్యూటన్ బి) గెలీలియో
సి) అరిస్టాటిల్ డి) మేడమ్ క్యూరీ
19. కొండను ఎక్కుతున్న వ్యక్తి ముందుకు వంగుతాడు. కారణమేమిటి?
ఎ) పడిపోకుండా ఉండటానికి
బి) వేగం పెంచుకోవడానికి
సి) అలసటను తగ్గించడానికి
డి) స్థిరత్వం పెంచడానికి
20. రాకెట్, జెట్ విమానాలు పనిచేయడంలో ఇమిడి ఉన్న న్యూటన్ గమన నియమం ఏది?
ఎ) మొదటి నియమం
బి) రెండో నియమం
సి) మూడో నియమం
డి) పైవన్నీ
21. వస్తువు ఏ భౌతిక రాశిపై జడత్వం ఆధారపడి ఉంటుంది?
ఎ) ద్రవ్యరాశి బి) ఆకారం
సి) రంగు డి) వైశాల్యం
22. ప్రచోదనానికి ప్రమాణం?
ఎ) న్యూటన్-మీటర్
బి) న్యూటన్-సెకన్
సి) న్యూటన్/మీటర్
డి) న్యూటన్/సెకన్
23. 60 కిలోల ద్రవ్యరాశి ఉన్న ఒక వ్యక్తి లిఫ్ట్‌లో ప్రయాణిస్తున్నప్పుడు ఆ లిఫ్ట్ తీగలు తెగితే వ్యక్తి భారం?
ఎ) 60 కిలోలు బి) 0 కిలోలు
సి) 680 కిలోలు డి) 609.0 కిలోలు
24. కొబ్బరి చెట్టుపై ఉన్న కోతికి తుపాకీతో గురిపెట్టి ట్రిగ్గరు నొక్కే సమయంలో.. ఆ కోతి కిందకు జారడం ప్రారంభిస్తే బుల్లెట్?
ఎ) కోతిని తాకుతుంది
బి) కోతి పైభాగం నుంచి తాకకుండా వెళుతుంది
సి) కోతి కింది భాగం నుంచి తాకకుండా వెళుతుంది
డి) చెప్పలేం
25. వంపు మార్గంలో వాహనం సురక్షితంగా ప్రయాణించాలంటే దాని గరిమనాభి స్థానం ఏ భాగంలో ఉండాలి?
ఎ) పైన బి) మధ్య
సి) కింద డి) వెనక
26. అంతర్గత బలాల మధ్య మార్పు దేనిలో కలుగుతుంది?
ఎ) బాంబు విస్ఫోటం
బి) వాహన గమనం
సి) గ్రహాల చలనం
డి) పైవన్నీ
27. బలానికి అంతర్జాతీయ ప్రమాణం ఏది?
ఎ) జౌల్ బి) ఎర్గ్
సి) ఆంపియర్ డి) న్యూటన్
28. పరావలయ మార్గంలో ప్రయాణిస్తున్న బాంబు మార్గమధ్యంలో విస్ఫోటం చెందితే దాని ద్రవ్యరాశి కేంద్రం ప్రయాణించే మార్గం?
ఎ) వక్ర మార్గం బి) రుజు మార్గం
సి) పరావలయ మార్గం
డి) దీర్ఘవృత్తాకార మార్గం
29. భ్రమణ చలనంలో ఉన్న వస్తువుకు ఉండే నిజమైన బలం?
ఎ) అభికేంద్ర బలం బి) అపకేంద్ర బలం
సి) విరూపకార బలం
డి) బాహ్య బలం
30. భూమి చుట్టూ నిర్దిష్ట కక్ష్యలో పరిభ్రమిస్తున్న కృత్రిమ ఉపగ్రహం నియంత్రణ కోల్పోయినప్పుడు ఏ మార్గంలో ప్రయాణిస్తుంది?
ఎ) వృత్తాకార మార్గానికి కోణీయంగా అవతలి వైపు
బి) వృత్తాకార మార్గానికి లంబంగా
సి) వృత్తాకార మార్గానికి సమాంతరంగా
డి) వృత్తాకార మార్గానికి 60° కోణీయంగా అవతలి వైపు
31. వంపు మార్గంపై ప్రయాణిస్తున్న వాహనానికి కావాల్సిన అభికేంద్ర బలం ఎక్కడి నుంచి లభిస్తుంది?
ఎ) ఇంజన్ బి) బ్రేకులు
సి) చక్రాలు, రోడ్డు ఉపరితలానికి మధ్య ఉండే ఘర్షణ బలాల వల్ల
డి) స్టీరింగ్
32. వాషింగ్ మెషిన్ పనిచేయడంలో ఉండే బలం ఏది?
ఎ) అపకేంద్ర బలం బి) అభికేంద్ర బలం
సి) ఘర్షణ బలం డి) పైవన్నీ
33. భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న కృత్రిమ ఉపగ్రహానికి కావాల్సిన అభికేంద్ర బలం ఎక్కడి నుంచి లభిస్తుంది?
ఎ) సౌరపలకలు బి) భూమి
సి) సూర్యుడు
డి) భూమి, కృత్రిమ ఉపగ్రహం మధ్య ఉండే విశ్వగురుత్వాకర్షణ బలం
34. నిలువు వృత్తంలో చలిస్తున్న జెట్ విమాన వేగం వృత్తం ఏ స్థానం వద్ద గరిష్ఠంగా ఉంటుంది?
ఎ) ఉన్నతం బి) నిమ్నతం
సి) వృత్త కేంద్రం
డి) వేగం అన్ని స్థానాల్లో సమానం
35. భూమి ఉత్తర ధ్రువం నుంచి దక్షిణ ధ్రువానికి చేసిన రంధ్రంలో జారవిడిచిన వస్తువు ఎక్కడికి చేరుతుంది?
ఎ) ఉత్తర ధ్రువం బి) దక్షిణ ధ్రువం
సి) భూ కేంద్రం
డి) రెండు ధ్రువాల మధ్య సరళ హరాత్మక చలనం చేస్తుంది
36. గమనంలో ఉన్న వాహన చక్రాల చలనం?
ఎ) సరళ హరాత్మక బి) రేఖీయ
సి) భ్రమణ డి) బి, సి
37. పుటాకారంలో ఉన్న రోడ్డుపై ఒక బంతి చేసే చలనం?
ఎ) రేఖీయ బి) కోణీయ
సి) సరళ హరాత్మక డి) పైవన్నీ
38. ఉపగ్రహం తక్కువ వ్యాసార్ధం ఉన్న కక్ష్యలో నుంచి ఎక్కువ వ్యాసార్ధం ఉన్న కక్ష్యలోకి ప్రవేశించినప్పుడు దాని రేఖీయ వేగం?
ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
సి) మారదు డి) శూన్యం
39. కింది వాటిలో శక్తికి ప్రమాణం ఏది?
ఎ) ఎర్గ్ బి) జౌల్
సి) ఎలక్ట్రాన్-ఓల్ట్ డి) పైవన్నీ
40. కదులుతున్న రైలులో ప్రయాణికుడి శక్తి?
ఎ) గతిజ శక్తి బి) స్థితిజ శక్తి
సి) యాంత్రిక శక్తి డి) ఉష్ణ శక్తి
41. రిజర్వాయర్‌లోని నీటికి ఉండే శక్తి ఏమిటి?
ఎ) గతిజ శక్తి బి) స్థితిజ శక్తి
సి) యాంత్రిక శక్తి డి) రసాయన శక్తి
42. యాంత్రిక శక్తిని విద్యుత్ శక్తిగా మార్చేది?
ఎ) ట్రాన్స్‌ఫార్మర్ బి) బ్యాటరీ
సి) సైకిల్ డైనమో డి) విద్యుత్ మోటారు
43. కదులుతున్న రైలు నుంచి ఒక వస్తువును బయటకు జారవిడిచినప్పుడు అది ప్రయాణించే మార్గం?
ఎ) సరళ రేఖ బి) వృత్తాకారం
సి) దీర్ఘవృత్తాకారం డి) పరావలయం
44. విద్యుత్‌తో పనిచేసే యంత్ర సామర్థ్యానికి కొలమానం?
ఎ) ఎర్గ్ బి) వాట్
సి) కెలోరీ డి) ఆంపియర్
45. తిరుగుతున్న సీలింగ్ ఫ్యాన్ రెక్కలకు ఉండే శక్తి?
ఎ) గతిజ శక్తి బి) భ్రమణ శక్తి
సి) స్థితిజ శక్తి డి) బి, సి
46. గుర్రాలు బండిని లాగుతున్నప్పుడు శక్తి రూపాంతరం?
ఎ) కండర శక్తి గతిజ శక్తిగా మారుతుంది
బి) గతిజ శక్తి కండర శక్తిగా మారుతుంది
సి) కండర శక్తి స్థితిజ శక్తిగా మారుతుంది
డి) స్థితిజ శక్తి గతిజ శక్తిగా మారుతుంది
47. కింది దిశలో కదులుతున్న లిఫ్ట్‌లో ఉన్న ఒక వ్యక్తి తన చేతిలోని బంతిని జారవిడిస్తే.. అది?
ఎ) కిందికి పడుతుంది
బి) పైకి కదులుతుంది
సి) లిఫ్ట్ మధ్య బిందువు వద్ద ఆగుతుంది
డి) సరళ హరాత్మకంగా చలిస్తుంది
48. లిఫ్ట్‌ను కనుగొన్న శాస్త్రవేత్త?
ఎ) జాన్సన్ బి) ఓటీస్
సి) న్యూటన్ డి) ఫారడే
49. పై దిశలో కదులుతున్న లిఫ్ట్‌లో వేలాడదీసిన లఘులోలకం ఆవర్తన కాలం?
ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
సి) మారదు డి) శూన్యం
50. ఒక వ్యక్తి భూమిపై మీటరు ఎత్తుకు ఎగరగలడు. అదే వ్యక్తి చంద్రునిపై ఎగరగలిగే ఎత్తు ఎంత?
ఎ) 1 మీ. బి) 1/6 మీ.
సి) 6 మీ. డి) 10 మీ.

సమాధానాలు

1) డి;	2) సి;	3) సి;	4) ఎ;	5) బి;
6) బి;	7) ఎ;	8) బి;	9) బి;	10) బి;
11) ఎ;	12) సి;	13) సి;	14) బి;	15) సి;
16) బి;	17) బి;	18) డి;	19) డి;	20) సి;
21) ఎ;	22) బి;	23) బి;	24) ఎ;	25) సి;
26) ఎ;	27) డి;	28) సి;	29) ఎ;	30) ఎ;
31) సి;	32) ఎ;	33) డి;	34) బి;	35) డి;
36) డి;	37) సి;	38) బి;	39) డి;	40) సి;
41) బి;	42) సి;	43) డి;	44) బి;	45) డి;
46) ఎ;	47) ఎ;	48) బి;	49) బి;	50) సి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

'ది నిజాం సబ్జెక్ట్ లీగ్' ఏ సంవత్సరంలో ఏర్పడింది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

తెలంగాణ భావన చారిత్రక నేపథ్యం

ముల్కీ ఉద్యమం - పరిణామాలు

1. ముల్కీ సమస్యల వల్ల హత్యకు గురైన ప్రధాని మహ్మద్ గవాన్ (బీజాపూర్)కు సంబంధించి కింది వాటిలో ఏది నిజం?
   1) బీదర్‌లో అతి ప్రసిద్ధి చెందిన విద్యా భవనం(మదర్సా) నిర్మించాడు
   2) ఖ్వాజా మహ్మద్ గిలానీ రాజు వద్ద ప్రధానిగా పనిచేశాడు
   3) మహ్మద్‌షా-3 మరణానంతరం గోల్ గుంబజ్ నిర్మించాడు
   ఎ) 1 మాత్రమే బి) 1, 2 మాత్రమే
   సి) 1, 3 మాత్రమే డి) 2, 3 మాత్రమే
2. 'ముల్కీ' నిబంధనలు రద్దు చేసిన అంశంలో కింది వాటిలో వాస్తవమైంది?
   1) 1973లో రద్దు చేశారు
   2) ప్రెసిడెన్షియల్ ఆర్డర్ (1975) ద్వారా రద్దు చేశారు
   3) 1985లో 610 జీవో ద్వారా రద్దు చేశారు
   ఎ) 1 మాత్రమే బి) 2 మాత్రమే
   సి) 3, 4 మాత్రమే డి) 1, 2 మాత్రమే
3. 1969 తెలంగాణ ఉద్యమంలో జరిగిన వివిధ సంఘటనలను క్రమ పద్ధతిలో అమర్చండి?
   1) పన్నుల సత్యాగ్రహ ఉద్యమం(వరంగల్)
   2) స్త్రీల సత్యాగ్రహం(అబిడ్స్)
   3) కాసు బ్రహ్మానంద రెడ్డి నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం
   4) కుమార్ లలిత్ కమిటీ
   ఎ) 1, 2, 3, 4 బి) 4, 3, 2, 1
   సి) 3, 4, 1, 2 డి) 3, 4, 2, 1
4. 'హైదరాబాద్‌లోని ఉద్యోగాలు హైదరాబాదీలకే' అనే నినాదం ఎప్పుడు వచ్చింది?
   ఎ) 1888 బి) 1919 సి) 1935 డి) 1948
5. కుమార్ లలిత్ కమిటీకి సంబంధించి అవాస్తవమైంది?
   1) అతను డిప్యూటీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్
   2) తెలంగాణకు చెందిన రూ. 34.10 కోట్ల మిగులు ధనాన్ని ఆంధ్రకు తరలించినట్లుగా పేర్కొన్నారు
   3) తెలంగాణకు చెందిన 283 మిలియన్ రూపాయలు తరలించారు.
   ఎ) 1 మాత్రమే బి) 2 మాత్రమే
   సి) 3 మాత్రమే డి) 2, 3 మాత్రమే
6. 1969 ఉద్యమం నేపథ్యంలో నిరాహార దీక్షలు చేసిందెవరు?
   1) కృష్ణ 2) రవీంద్రనాథ్
   3) అనురాధ 4) పట్టాభిరామయ్య
   ఎ) 2 మాత్రమే బి) 2,3 మాత్రమే
   సి) 1, 2, 3 మాత్రమే డి) పైవారందరూ
7. కింది వాటిలో అవాస్తవమైంది ఏది?
   1) 1901లో ప్రధానిగా కిషన్ పర్షాద్ నియామకం
   2) నిజాం రాజ్యంలో ఆర్థికశాఖ కార్యదర్శిగా ఆంగ్లేయుడైన కాసన్‌వాకర్ నియామకం
   3) పద్మజానాయుడు ముల్కీల ఉద్యమంలో పాల్గొనలేదు
   ఎ) 1 మాత్రమే బి) 2 మాత్రమే
   సి) 1, 2 మాత్రమే డి) 3 మాత్రమే
8. 'మా ఉద్యోగాలన్నీ అపహరించి మీ వారికి అప్పగించావు. నీ కుట్రలన్నీ అమలైతే ఇక చిరుద్యోగాలే మాకు గతి' అనే కవిత ముల్కీ ఉద్యమ గీతంగా ప్రసిద్ధి. దీన్ని ఉర్దూ భాషలో ఎవరిని ఉద్దేశించి రాశారు?
   ఎ) మీర్ ఉస్మాన్ ఆలీఖాన్
   బి) ఖాదీర్ మొహినుద్దీన్
   సి) కాసన్ వాకర్
   డి) జయంతీనాథ్ చౌదరి
9. 1919లో ఉస్మాన్ అలీఖాన్ జారీ చేసిన ఫర్మానా ప్రకారం అవాస్తవమైంది?
   1) నిజాం రాష్ట్రంలో జన్మించిన ప్రతీ వారు ముల్కీలు
   2) భర్త ముల్కీ అయితే అతని భార్య కూడా ముల్కీనే
   3) భార్య ముల్కీ అయితే ఆమె భర్త కూడా ముల్కీనే
   ఎ) 1 మాత్రమే బి) 2 మాత్రమే
   సి) 1, 2 మాత్రమే డి) 3 మాత్రమే
10. నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1933లో ముల్కీల ఉద్యోగాల రక్షణ కోసం ఫర్మానా జారీ చేశారు. దీన్ని బట్టి వాస్తవమైంది?
    1) విద్యావంతులైన ముల్కీలతోనే ఉద్యోగాలు భర్తీ చేయటం
    2) కమిషనర్ (కొత్వాల్) రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి మద్దతు
    3) నిజాంకు కృతజ్ఞతగా హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు
    4) మీర్ అక్బర్ అలీఖాన్, అబుల్ హసన్ సయ్యద్ మొదలైన నాయకులు నిజాంను వ్యతిరేకించారు
    ఎ) 1 మాత్రమే బి) 1, 3 మాత్రమే
    సి) 2, 4 మాత్రమే డి) 1, 2, 3 మాత్రమే
11. 'ది నిజాం సబ్జెక్ట్ లీగ్' లేదా 'ముల్కీలీగ్' లేదా జమీయత్ రిఫాయామే నిజాం ఏర్పడిన సంవత్సరం?
    ఎ) 1919 బి) 1933 సి) 1935 డి) 1940
12. 'హైదరాబాద్ ఫర్ హైదరాబాదీస్' అని నినాదం ఇచ్చినవారు?
    ఎ) నవాబ్ నిజామత్ జంగ్
    బి) సాదర్ బహదూర్ యార్ జంగ్
    సి) సాదర్ యార్ జంగ్
    డి) పై వారందరూ



13. 'నిజాం ప్రజల సంఘం (1935)' ఒత్తిడి మేరకు నిజాం రాజు వేసిన కమిటీ?
    ఎ) అయ్యంగార్ కమిటీ బి) కిషన్ పర్షాద్
    సి) పద్మజానాయుడు డి) బి, సి
14. 1888లో నిజాం మహబూబ్ అలీఖాన్ రూపొందించిన నిబంధనల్లో లేనిది?
    1) ముల్కీ అనే పదం ఉపయోగించలేదు
    2) కనీసం 12 ఏళ్ల రాజ్యంలో నివసించిన వారు స్థానికులు
    3) నాన్ ముల్కీలు నిజాం రాజ్యంలో ఉద్యోగాలు పొందాలంటే ప్రధానమంత్రిచే ప్రత్యేక అనుమతి తీసుకోవాలి
    ఎ) 1 మాత్రమే బి) 2 మాత్రమే
    సి) 2, 3 మాత్రమే డి) పైవన్నీ
15. ఏ నిజాం రాజు 'ఉద్యోగుల సాధారణ జాబితా' విడుదల చేశారు?
    ఎ) నిజాం అలీఖాన్
    బి) అఫ్జల్ ఉద్దౌలా
    సి) మహబూబ్ అలీఖాన్
    డి) మీర్ ఉస్మాన్ అలీఖాన్
16. ఉద్యోగుల సాధారణ జాబితాలో లేని అంశం?
    1) నిజాం రాజ్యంలో గెజిట్ ఉద్యోగులు 680 మంది
    2) 76 శాతం నాన్ ముల్కీలు ఉద్యోగులుగా ఉన్నారు
    3) ముల్కీలు కేవలం 233 మంది మాత్రమే ఉన్నారు
    ఎ) 1 మాత్రమే బి) 2 మాత్రమే
    సి) 1, 3 మాత్రమే డి) 2, 3 మాత్రమే
17. 'యంగ్ మెన్స్ ఇంప్రూవ్‌మెంట్ సొసైటీ' స్థాపించిన సంవత్సరం?
    ఎ) 1879 బి) 1897 సి) 1888 డి) 1898
18. కిందివాటిని జతపర్చండి.
    1) సికింద్రాబాద్
    2) హైదారాబాద్
    3) చాదర్‌ఘాట్
    4) రెసిడెన్సీ బజార్
    i) సోషల్ క్లబ్ (హిందూ)
    ii) ఆల్బర్ట్ రీడింగ్ రూం
    iii) మాల్యాల సభ
    iv) హైదరాబాద్ యువకుల సంఘం
    ఎ) 1-i, 2-ii, 3-iii, 4-iv
    బి) 1-ii, 2-iii, 3-i, 4-iv
    సి) 1-ii, 2-i, 3-iii, 4-iv
    డి) 1-ii, 2-iv, 3-iii, 4-i
19. మౌల్వీ మహ్మద్ ముర్తజా ఏ సంఘం ఉపాధ్యక్షులు?
    ఎ) మాల్యాల సభ
    బి) థియోసోఫికల్ సమాజం
    సి) హైదరాబాద్ యువకుల సంఘం
    డి) హిందూ సోషల్ క్లబ్
20. 'జీవరక్ష జ్ఞాన ప్రచారక మండలి' స్థాపకులెవరు?
    ఎ) సేట్ లాల్‌జీ మేఘ్‌జీ
    బి) కిషన్ జీ
    సి) నారాయణ్ గుణాజీ వేలింకర్
    డి) రామస్వామి అయ్యర్
21. 'హైదరాబాద్ రాష్ట్ర సంస్కరణల సంఘం' స్థాపనలో లేనివారు?
    ఎ) వామన్ నాయక్ బి) అసర్గ్ హుస్సేన్
    సి) రాఘవేంద్ర శర్మ
    డి) రాయ్‌బాల్ ముకుంద్
22. హైదరాబాద్ రాజ్యంలో స్వదేశీ లీగ్ ఉద్యమ నాయకులు కానివారు?
    ఎ) శ్రీవజ బి) కాశీనాథ్ వైద్య
    సి) పద్మజానాయుడు డి) శ్రీహమాన్
23. 'నీలగిరి' (1922) పత్రికకు సంబంధించి అవాస్తవమైంది?
    ఎ) ఇది తొలి రాజకీయ పత్రిక
    బి) రామ నర్సింహారావు సంపాదకత్వంలో వెలువడింది
    సి) రాజకీయాల గురించి వ్యంగ్యంగా వివరించేది
    డి) ఈ పత్రిక నల్గొండ జిల్లా కేంద్రం నుంచి ప్రారంభమైంది
24. తెలంగాణలో ప్రప్రథమంగా ఆంగ్ల, తెలుగు పత్రికలు ప్రచురణలు చేసింది?
    ఎ) సురవరం ప్రతాపరెడ్డి
    బి) రామానుజాచార్యులు
    సి) బి.ఎస్.శర్మ డి) రాజగోపాల్
25. కిందివాటిలో సాయంకాల పత్రిక ఏది?
    ఎ) గారిసన్ బి) దక్కన్ కేసరి
    సి) శోభ డి) హైదరాబాద్ బులెటిన్
26. తెలుగు 'మీజాన్' పత్రిక సంపాదకులు?
    ఎ) సురవరం ప్రతాపరెడ్డి
    బి) అడవి బాపిరాజు
    సి) మందుముల నర్సింహారావు
    డి) రామానుజాచార్యులు
27. సరికానిది జత?
    ఎ) రయ్యత్ పత్రిక - నర్సింగ్‌రావు
    బి) ఇమ్రోజ్ - షోయబ్ ఉల్లాఖాన్
    సి) గారిసన్ - వీరభద్రశర్మ
    డి) పయాం - అబ్దుల్ గఫార్
28. 'తెలుగు తల్లి' పత్రిక ప్రచురించినవారు?
    ఎ) రాచముళ్ల సత్యవతి
    బి) అప్పయ్యశాస్త్రి సి) పి.యస్. శర్మ
    డి) బి.ఎస్. శర్మ
29. దేవులపల్లి రామానుజారావు సంపాదకత్వంలో వెలువబడిన 'శోభ' పత్రిక ముఖ్య కేంద్రం?
    ఎ) నిజామాబాద్ బి) వరంగల్
    సి) హైదరాబాద్ డి) నల్లగొండ
30. 'చార్మినార్ గాసిప్' శీర్షికతో ఏ పత్రికలో వ్యాసాలు వచ్చేవి?
    ఎ) హైదరాబాద్ బులెటిన్
    బి) దక్కన్ కేసరి సి) శోభ డి) గారిసన్
31. 1969 ఫిబ్రవరి 4న జీవో 36కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో రిట్ దాఖలు చేసినవారు?
    ఎ) ఎ.వి. నర్సింహారావు
    బి) పి.వి. నర్సింహారావు
    సి) కొండా మాధవరెడ్డి
    డి) కాసాని వెంకటరత్నం
32. 'పంచసూత్ర' ప్రణాళిక (1972 నవంబర్ 27) లోని ముఖ్యాంశం?
    1) హైదరాబాద్ - సికింద్రాబాద్‌లో సమ్మిళిత పోలీస్ దళం
    2) మిగులు ధనం లెక్కలు తీయడానికి ఉన్నతాధికార సంఘం
    3) తెలంగాణ ప్రాంతంలోని ఉద్యోగాలు స్థానికులకే
    ఎ) 1 మాత్రమే బి) 2 మాత్రమే
    సి) 1, 2 మాత్రమే డి) 2, 3 మాత్రమే
33. తెలంగాణలో ఎంతమంది స్థానికేతరులు ఉద్యోగాలు పొందారో తొలిసారి గణాంకాలతో తేల్చిన కమిటీ?
    ఎ) కుమార్ లలిత్ బి) జస్టిస్ భార్గవ
    సి) జయ భరత్ రెడ్డి డి) సుందరేశన్
34. హైదరాబాద్(నిజాం) రాజ్య విస్తీర్ణం ఎంత?
    ఎ) 82,698 చ.మైళ్లు
    బి) 68,982 చ.మైళ్లు
    సి) 74,698 చ.మైళ్లు
    డి) 89,682 చ.మైళ్లు
35. 'నిజాం సబ్జెక్ట్ లీగ్' అనే సంస్థను నెలకొల్పినవారు?
    ఎ) బూర్గుల రామకృష్ణారావు
    బి) కె.ఎం. వెల్లోడి
    సి) గోవింద్ వల్లభ్‌పంత్
    డి) నవాబ్ సాదర్‌యార్ జంగ్
36. 'సాలార్‌జంగ్-1 నిజాం రాజ్య వ్యవస్థను పునరుజ్జీవింప చేశాడు' అని వ్యాఖ్యానించిన వారు?
    ఎ) లార్డ్ కానింగ్ బి) రాణి విక్టోరియా
    సి) విలియం డిగ్బీ డి) కాసన్ వాకర్
37. ఆది హిందువుల చేతి వృత్తుల నైపుణ్యం ప్రదర్శించడానికి 'హైదరాబాద్‌లో చేతి వృత్తుల ప్రదర్శన'ను ఎప్పుడు నిర్వహించారు?
    ఎ) 1920 బి) 1925
    సి) 1928 డి) 1934

సమాధానాలు

1) ఎ	2) ఎ	3) డి	4) ఎ	5) సి
6) డి	7) డి	8) సి	9) డి	10) డి
11) సి	12) ఎ	13) ఎ	14) ఎ	15) సి
16) బి	17) ఎ	18) బి	19) సి	20) ఎ
21) డి	22) బి	23) సి	24) బి	25) ఎ
26) బి	27) సి	28) ఎ	29) బి	30) సి
31) ఎ	32) ఎ	33) సి	34) ఎ	35) ఎ
36) సి	37) బి			

Zero Coupon Bonds refers to?

BANK EXAMS
BANKING AWARENESS

1. Banks obtain photograph at the time of opening of the account with a view to:
   a) Avoid benami accounts
   b) Verify the identity of the customer
   c) Verify with police records
   d) a & b e) a to c
2. Banks are required to submit CTR (Cash Transaction Report) to ___ within ___ of succeeding month.
   a) FIU, 30 days b) FIU, 15 days
   c) FIU, 7 days d) RBI, 7 days
   e) RBI, 15 days
3. Premium payable on deposit insurance on every Rs.100 per annum is
   a) 10 paise b) 5 paise
   c) 25 paise d) 50 paise
   e) None
4. Which of the following can't be a nominee?
   a) Illiterate Person
   b) Minor c) NRI
   d) HUF e) None
5. In case of dishonor of cheques on financial grounds, the holder is required to issue notice to the drawer within ___ days to claim remedy under section 138 of NI Act
   a) 7 Days b) 30 Days
   c) One Year d) Three Years
   e) None
6. National Payment Corporation of India (NPCI) has set up payment network to enable the member banks to issue Domestic Payment Cards with a brand ___
   a) Visa Card b) Master Card
   c) Prepaid Card d) RuPay
   e) Travel Card
7. Permanent Account Number (PAN) is mandatory for
   a) Bank transactions (cash) of Rs. 50000/- & above
   b) Purchase and sale of shares/debentures/bonds of Rs. 50000/- & above
   c) Purchase and sale of immovable property where the value of the property is Rs. 5 lakh & above
   d) a & c e) All
8. High Debt Service Coverage Ratio (DSCR) indicates
   a) Unable to meet the installment obligations
   b) Able to meet payment of installments comfortably
   c) Liquidity problem
   d) a & c e) None
9. Which of the following statement is not true with regard to Capital Gains Deposit Scheme?
   a) Income Tax Assess who are eligible for exemption under section 54 of the IT Act are alone can open account with Banks
   b) Accounts can be opened under Savings, Fixed and Term Deposits
   c) Cheque book can be issued to eligible accounts.
   d) No lien or deposit loan is allowed against such deposits
   e) None
10. Which of the following statement is not correct with regard to Tax Saver Scheme of Banks?
    a) Tax exemption is available for the deposit amount under section 80C of IT Act
    b) Period of deposit is allowed up to 5 Years
    c) TDS is applicable, if interest payment is above Rs.10000/- in a financial year
    d) Maximum amount of deposit allowed is Rs. 5 lakhs
    e) c & d
11. Financial statements includes
    a) Balance Sheet b) P & L
    c) Cash & Funds Flow
    d) a & b e) a, b & c
12. Banks are permitted to take over borrowal accounts from other Banks & Financial institutions provided
    a) Account should be Standard Asset with positive net worth
    b) Copy of the borrowal account for preceding 12 months is to be obtained
    c) P & C report is to be obtained from other bank before disbursement
    d) Branch to take approval from next sanctioning authority
    e) All of the above
13. RBI extending incentives to Banks for the following services
    a) Adjudication of Mutilated Bank Notes
    b) Exchange of Soiled Notes
    c) Distribution of Coins over the counter
    d) Establishment of Coin vending Machines
    e) All of the above
14. Which agency is enabling the transfer of subsidies directly to beneficiary accounts through Aadhaar Enabled Payment Bridge (APB)?
    a) RBI b) SEBI c) IDRBT
    d) NPCI e) SBI
15. Call Money Market interest are linked to
    a) Bank Rate b) Repo Rate
    c) Reverse Repo Rate
    d) Market forces e) None
16. Transaction Password relates to
    a) Core Banking
    b) ATM operations
    c) Internet Banking
    d) Tele banking e) None
17. Nomination in respect of the following is to be witnessed by two persons.
    a) All deposit accounts
    b) Deposit accounts where the nominee is a minor
    c) Physically challenged accounts
    d) Thumb impression accounts (illiterate) e) None
18. When the contents of the Negotiable Instrument are modified by the drawer, it is treated as
    a) Forgery b) Fraud
    c) Material alteration
    d) suppression of facts
    e) None
19. Prepayment charges are exempted for
    a) Housing Loans
    b) Education Loans
    c) Agr. Loans d) Corporate Loans
    e) a, b & c
20. IFSC code consists of ___ Digits.
    a) 9 b) 10 c) 11 d) 15
    e) None
21. One Bank account per family is mandatory to avail
    a) Credit facility from bank
    b) Direct Benefit Transfer benefit (subsidy)
    c) Interest subvention – Housing Loan
    d) either a or b e) none
22. What is the time limit to furnish the requested information under Right to Information Act (RTI) and what is the penalty for non-compliance of the said norm?
    a) 30 days & Rs. 100 per day
    b) 60 days & Rs. 100 per day
    c) 30 days & Rs. 250 per day maximum of Rs. 25000/-
    d) 60 days & Rs. 250 per day
    e) None
23. The documents to be insisted from a NRI for opening an account is
    a) Copies of Passport and VISA
    b) Local and Overseas addresses
    c) Compliance of KYC norms
    d) Latest Passport size photographs
    e) All of the above
24. Minimum and Maximum period of Certificate of Deposits
    a) 15 days & 1 year
    b) 30 days & 1 year
    c) 7 days & 1 year
    d) 7 days & no limit e) None
25. Loans not exempted from Base Rate Purview?
    a) Consortium Advance
    b) Loans against deposits
    c) Export Credit
    d) Loans to staff members
    e) None
26. Visually challenged persons are allowed to avail the following banking facilities?
    a) Cheque Book b) Debit Card
    c) ATM Card d) Locker e) All
27. Housing Loan up to ___ is treated as Priority Sector.
    a) 10 lakh b) 15 lakh
    c) 25 lakh in Metro with population above 10 lakh to 15 lakh in other centers
    d) 25 lakh at all places
    e) None
28. Nominee can exercise his right
    a) During the tenure of deposit
    b) On maturity of deposit
    c) Any time since he will be treated as joint depositor
    d) He has no right on deposit since it is in the name of the depositor
    e) On the death of the depositor
29. Balances under Cash Reserve Ratio (CRR) earn interest @___
    a) 3% p.a.
    b) Applicable SB Interest Rate
    c) 5% p.a. d) No interest
    e) None
30. Banks are allowed to accept deposits under Capital Gains Scheme in ___
    a) Savings b) Fixed
    c) Current d) a & b
    e) Any scheme
31. During March 2015, a Reserve Bank of India (RBI) committee had recommended introduction of PSLCs to enable banks "to meet their PSL requirements even while leveraging their comparative advantage in lending". What does the PSLC stands for?
    a) Priority Sector Lending Certificates
    b) Priority sector Loan Certificates
    c) Primary and Secondary Sector Certificates
    d) Public Sector Lending Certificates
    e) None of the above
32. Zero Coupon Bonds refers to
    a) Bond issued at face value
    b) Bond issued with face value & interest
    c) Bond issued at discount from its face value with interest
    d) Bond issued at discount from its face value without interest
    e) None
33. ATMs that are owned and managed by non-banking entities are called as ___
    a) Onsite ATM b) Offsite ATM
    c) Third Party ATM
    d) Red label ATM
    e) White label ATM
34. For transfer of funds through NEFT (National Electronic Fund Transfer) and minimum and maximum amount that can be transferred are
    a) Rs.1,000 and maximum Rs. 5 lakhs.
    b) Rs. 1000 and maximum no limit
    c)Rs. 5,000 and maximum 1 lakh
    d) No minimum & maximum amount
    e) None
35. Cash kept in the currency chest is owned by
    a) Currency Chest Branch Bank
    b) Central Government
    c) Reserve Bank of India
    d) State Bank of India
    e) None of the above
36. Bank can't proceed against the borrower under SARFAESI Act where
    a) Security is agri land
    b) Liability is less than 1 lakh
    c) Liability is less than 20% of the principal
    d) Pledge of movables
    e) All of the above
37. The minimum capital required to start a new private sector bank is?
    a) Rs. 100 crore b) Rs.200 crore
    c) Rs. 300 crore d) Rs.400 crore
    e) Rs. 500 crore
38. RBI injects liquidity through
    a) Increase Bank Rate
    b) Reduction of Repo Rate
    c) Reduction of Reverse Repo
    d) Increase CRR
    e) Increase SLR
39. A customer requested to include his wife and daughter as nominees after one year of opening of the account. Will it be accepted?
    a) It can be accepted since the nominees are the family members of the depositor
    b) Cannot be considered since the request is not received at the time of opening of account
    c) Can be considered with 50% share each
    d) Nomination should be made only in favor of single name. Hence can't be considered
    e) None of the above
40. What is the relationship between the Bank and Overdraft Customer where the account is showing credit balance?
    a) Creditor & Debtor
    b) Principle & Agent
    c) Trustee & Beneficiary
    d) Debtor & Creditor
    e) None of the above

KEY

1) d;	2) b;	3) a;	4) d;
5) b;	6) d;	7) e;	8) b;
9) c;	10) d;	11) e;	12) e;
13) e;	14) d;	15) d;	16) c;
17) d;	18) c;	19) e;	20) c;
21) b;	22) a;	23) e;	24) c;
25) a;	26) b;	27) c;	28) e;
29) d;	30) d;	31) a;	32) d;
33) e;	34) c;	35) c;	36) b;
37) e;	38) b;	39) d;	40) d.